
'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 258

శుక్రవారం 2-6-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ధోని మోకాలికి శస్త్ర చికిత్స

ముంబైలోని కోకిలాబెన్ హాస్పిటల్‌లో ఎడమ మోకాలికి సర్జరీ - 13లో



ఆటుపోట్ల మధ్య నష్టాలు

సెన్సెక్స్ 194 పాయింట్లు డౌన్

నిఫ్టీ 47 పాయింట్ల క్షీణత - 13లో



అనర్హత వేటు ఓ పెద్ద అవకాశం

ప్రజాసేవ చేయడానికి అనర్హత రూపంలో తనకు గొప్ప అవకాశం లభించిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు.


వివరాలు 6లో ▸



హింసపై న్యాయవిచారణ

మణిపూర్ అల్లర్లపై హైకోర్టు రిటైర్డ్ జడ్జి సారథ్యంలో న్యాయ విచారణ జరిపిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చెప్పారు.

వివరాలు 6లో ▸



ఆవర్తన పట్టిక మాయం

పీరియాడిక్ టేబుల్‌పై కీలకమైన అంశాలను పదో తరగతి పాఠ్య పుస్తకాల నుంచి ఎన్‌సీఈఆర్‌టీ తొలగించింది.

వివరాలు 6లో ▸



కూలిన ఐఏఎఫ్ శిక్షణ విమానం

కర్ణాటకలో భారత వైమానిక దళానికి చెందిన విమానం కుప్పకూలిన ఘటనలో ఇద్దరు పైలట్లు గాయపడ్డారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

పోలవరం పూర్తవుతున్నందుకా..

ఈనాడు రంకెలు



కుక్కతోకలా తన బుద్ధి వంకరే అని ఎప్పటికప్పుడు ఈనాడు రామోజీరావు చాటిచెప్పుకుంటున్నారనడానికి మరో నిదర్శనం గురువారం 'ఈనాడు'లో 'అంకెల రంకెలు' శీర్షికతో ప్రచురించిన కథనం. బాబుకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా.. పోలవరంపై పూటకో అవాస్తవాన్ని వల్లెవేస్తూ.. రోజుకో కథనాన్ని అచ్చేయడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించడమే పనిగా పెట్టుకున్నారు.

వివరాలు 14లో ▸

వైద్య విద్యలో నూతన అధ్యాయం



సీఎం జగన్ రాష్ట్ర వైద్య విద్యలో నూతన అధ్యాయాన్ని ఆవిష్కరించారు. 2019 ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నెరవేరుస్తూ ప్రస్తుతం ఉన్న 11 వైద్య కళాశాలలకు అదనంగా 17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. మచిలీపట్నం, ఏలూరు, నంద్యాల, రాజమండ్రి, విజయనగరం కళాశాలల్లో ఈ ఏడాది నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి.

వివరాలు 5లో ▸



కర్నూలు జిల్లా పత్తికొండలో జరిగిన సభకు భారీగా హాజరైన జనసందోహంలో ఓ భాగం

రైతు రాజ్యమిది

అన్నదాతల బాగోగులపై రాజీలేదు: పత్తికొండ సభలో సీఎం జగన్

- రైతన్నలకు ఇచ్చిన ప్రతీ మాటను మీ బిడ్డ ప్రభుత్వం నిలబెట్టుకుంది
- చెప్పిన దానికంటే మిన్నగా ఐదో ఏడాదీ పెట్టుబడి సాయాన్ని అందిస్తున్నాం
- వైఎస్సార్ రైతు భరోసాతో 52,30,939 మంది రైతుల ఖాతాల్లోకి రూ.3,923 కోట్లు
- 51 వేల మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.54 కోట్ల జమ



సాక్షి ప్రతినిధి కర్నూలు: రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని దృఢంగా విశ్వసిస్తూ అన్నదాతలకు నాలుగేళ్లలో రూ.1.61 లక్షల కోట్లకుపైగా నేరుగా ప్రయోజనం చేకూర్చినట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం కర్నూలు జిల్లా పత్తికొండలో 'వైఎస్సార్ రైతు భరోసా' ద్వారా 52,30,939 మంది రైతుల ఖాతాల్లో రూ.3,923 కోట్లను బటన్ నొక్కి జమ చేసిన అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాంతో పాటు

మిగతా 2వ పేజీలో ▸

> రైతుభరోసా నాలుగు విడతలు ఇస్తామని మేనిఫెస్టోలో చెప్పినా రైతన్నలు అప్పుల పాలు కాకూడదనే ఉద్దేశంతో అదనంగా ఐదో విడత కూడా ఇస్తున్నాం. పంట నష్టపోతే వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించేలా మార్పులు తెచ్చాం. అదే సీజన్ ముగిసేలోగా పరిహారం చెల్లించి ఆదుకుంటున్నాం. రైతన్నలు బాగుండాలని మీబిడ్డ రాజీ పడకుండా పని చేస్తున్నాడు. రాష్ట్రంలో వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తుల దిగుబడులు పెరిగాయి. నిషేధిత జాబితాలోని చుక్కల భూములకు మోక్షం కల్పించాం. రైతుల పాలిట శత్రువు, వ్యవసాయం అంటే గిట్టని చంద్రబాబు మాయ మాటలతో మళ్లీ మోసం చేసేందుకు వస్తున్నాడు. మీరంతా జాగ్రత్తగా ఉండాలని, మంచి - చెడుకు తేడాను ఆలోచించాలని కోరుతున్నా.
>
> - పత్తికొండ సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

పూతన వేషాలు!

చంద్రబాబు మేనిఫెస్టోపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ధ్వజం

- కొత్త వేషంలో మాయదారి మళ్లీ బయల్దేరాడు
- ప్రజల కష్టాల నుంచి మన మేనిఫెస్టో.. కర్ణాటక నుంచి టీడీపీ మేనిఫెస్టో
- బాబుకు బిసిబేళె బాత్ సరిపోక పులిహోర కూడా వండేశారు
- మహానాడు పేరుతో రాజమండ్రిలో మహాడ్రామా

2 లో

2025 జూన్‌కు పోలవరం పూర్తి

అప్పటికి ఆయకట్టుకు నీరందించాలి.. ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచండి

- ప్రాజెక్టు పనుల ప్రగతిని వివరించిన రాష్ట్ర అధికారులు
- తొలి దశ నీటి నిల్వ, ఆయకట్టుకు నీరివ్వడానికి రూ.17,144 కోట్లు అవసరమని వెల్లడి
- 45.72 మీటర్ల స్థాయికి పూర్తి చేయాలంటే రూ. 55,548.87 కోట్లు అవసరమని స్పష్టీకరణ..
- నిర్వాసితుల పునరావాసం బాధ్యత కేంద్రానిదేనన్న మంత్రి
- తొలి దశ నిధులపై నివేదిక ఇవ్వాలని ఆదేశం.. ఆ నివేదికకు మంత్రి మండలి ఆమోదం తీసుకుంటామని వెల్లడి



సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలని, 2025 జూన్‌కు ప్రాజెక్టును పూర్తి చేసి ఆయకట్టుకు నీరందించి, రైతులకు ఫలాలను అందించాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ), రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులను కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు పనులపై గురువారం ఢిల్లీలో కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్, కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ కుశ్వీందర్‌సింగ్ వోరా, సలహాదారు వెదిరె శ్రీరాంలతో కలిసి మంత్రి షెకావత్ సమీక్షించారు. రాష్ట్ర జలవనరుల శాఖ కార్యదర్శి (ఇన్‌చార్జి) శ్యామలరావు, ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి, పోలవరం సీఈ సుధాకర్‌బాబు, పీపీఏ సీఈవో శివ్‌నందన్‌కుమార్, సభ్య కార్యదర్శి రఘురాం తదితరులు

మిగతా 14వ పేజీలో ▸

ఐటీఐలు.. ఉపాధి కేంద్రాలు

ఏలూరు జిల్లాలో 19 ఐటీఐ, పశ్చిమలో 18 కళాశాలలు

- అప్రెంటిస్‌కు ఎంపికైతే విద్యార్థి ఖాతాలో రూ.9,550 జమ
- ప్రతిభ చూపితే 18 ఏళ్లలోపే ఉద్యోగాలు



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉన్నత విద్య చదివే అవకాశం లేకపోవడమో.. కుటుంబ బాధ్యతల వల్లో చాలామంది పదో తరగతి, ఇంటర్‌తో చదువు ఆపేస్తుంటారు. వారికి ఉద్యోగం చేయాలని ఉన్నా వారి చదువుకు సరైన ఉద్యోగాలు లేక ఆర్థికంగా ఇబ్బందిపడుతుంటారు. అలాంటి వారికి వరం ఐటీఐలు.. ఐటీఐ పూర్తి చేసి కేవలం 18 ఏళ్ల వయసులో కూడా మంచి ఉద్యోగాల్లో స్థిరపడే అవకాశం ఉందని విద్యారంగ నిపుణులు చెబుతున్నారు. పెరుగుతున్న ప్రజావసరాల కోసం దేశంలో భారీగా పరిశ్రమలు నెలకొల్పుతూనే ఉన్నారు. ఆయా పరిశ్రమల్లో పని చేయడానికి పారిశ్రామిక శిక్షణ పొందిన వారు అత్యధిక సంఖ్యలో అవసరం. ఈ మేరకు ఐటీఐలో వివిధ కోర్సులు పూర్తి చేసిన వారికి సులభంగా, త్వరితగతిన ఉద్యోగావకాశాలు లభించే అవకాశం ఉంది.

ఐటీఐల్లో అందుబాటులో ఉండే కోర్సులు

ఐటీఐ కళాశాలల్లో పరిశ్రమలకు అవసరమైన వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తారు. వాటిలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, మోటార్ వెహికల్ మెకానిక్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, మెషినిస్ట్, టర్నర్, రిఫ్రిజిరేటర్, ఎయిర్ కండీషనింగ్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, వెల్డర్, కోపా వంటి కోర్సులకు పరిశ్రమల్లో ప్రాధాన్యత లభిస్తుంది. ఆయా కోర్సులు పూర్తి చేసి వాటిలో ప్రావీణ్యం చూపితే.. యువతకు వెంటనే ఉద్యోగాలు లభించే అవకాశం ఉంటుంది. రెండేళ్ల కాలపరిమితితో ఎలక్ట్రీషియన్ కోర్సు పూర్తి చేస్తే గ్రామ సచివాలయం, ట్రాన్స్‌కో, జెన్‌కో, ఈపీడీసీఎల్ వంటి ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంటుంది.

నిత్యనూతనం ఫిట్టర్ కోర్సు

ఐటీఐలో ఫిట్టర్ కోర్సు నిత్యనూతనంగా ఉంటుంది. ఈ కోర్సుకు విద్యార్థుల్లో మంచి డిమాండ్ ఉంది. ఐటీఐ కళాశాలల్లో తొలుత సీట్లన్నీ భర్తీ అయ్యేది ఈ కోర్సులోనే. రెండేళ్ల కోర్సు పూర్తి చేస్తే అటు ప్రైవేట్ పరిశ్రమలతో పాటు ప్రభుత్వ రంగ సంస్థల్లో కూడా మంచి ఉద్యోగాలు వస్తాయి. డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్ కోర్సు రెండేళ్లు.. నిర్మాణ రంగంలో ఈ కోర్సు చేసిన వారికి అవకాశాలు ఎక్కువ. గ్రామ, వార్డు సచివాలయల్లో భర్తీ చేసే సర్వేయర్ పోస్టులకు ఈ కోర్సు చేసిన వారు అర్హత పొందుతారు. మోటార్ వెహికల్ మెకానిక్ కోర్సు రెండేళ్లు చేయాలి. ఉత్తీర్ణులైన వారికి రైల్వే, ఆర్టీసీలతో పాటు వివిధ మోటార్ సైకిల్, కార్ల తయారీ సంస్థల్లో ఉద్యోగావకాశాలతో పాటు సొంతంగా మోటారు వాహనాల సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేసుకోవచ్చు. ఎలక్ట్రానిక్స్ మెకానిక్ కోర్సు చేసిన వారికి టీవీలు, వాషింగ్ మెషీన్లు, ఏసీలు వంటి ఉత్పత్తి సంస్థల్లో ఉద్యోగాలు పొందవచ్చు.

ఉమ్మడి జిల్లాలో 37 ఐటీఐ కళాశాలలు

ఐటీఐలో చేరి వివిధ కోర్సులు చేయాలనుకునే విద్యార్థులకు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మొత్తం 37 కళాశాలలు అందుబాటులో ఉన్నాయి. వాటిలో ఏలూరు జిల్లాలో ప్రభుత్వ ఐటీఐలు 5 ఉండగా వివిధ ట్రేడుల్లో 828 సీట్లు, 14 ప్రైవేట్ ఐటీఐలు ఉండగా వాటిలో 1712 సీట్లు అందుబాటులో ఉన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో 2 ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో 308 సీట్లు, 16 ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో 2976 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

అప్రెంటిస్‌కు ఎంపికైతే ఖాతాలోకి రూ.9,550

ఐటీఐ పూర్తి చేసి అప్రెంటీస్‌గా ఎంపికైతే అతని ఖాతాలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నేరుగా రూ.9,550 జమ చేస్తాయి. వాటిలో రాష్ట్ర ప్రభుత్వం రూ.8,050, కేంద్ర ప్రభుత్వం రూ.1,500 జమ చేస్తాయి. ఆయా కోర్సులతో పాటు ఐటీఐ ఉత్తీర్ణులైన వారు ఉన్నత చదువులకు వెళ్లాలన్నా డిప్లమో అర్హత పొందేందుకు బ్రిడ్జి కోర్సు అందుబాటులో ఉంటుంది. బ్రిడ్జి కోర్సు పూర్తి చేసిన విద్యార్థి నేరుగా డిప్లొమా 2వ సంవత్సరం చదవడానికి అర్హత పొందుతాడు. వీటితో పాటు కోపా అనే కోర్సు 10వ తరగతి విద్యార్హతతో చేయవచ్చు. ఈ కోర్సు చేసిన వారికి కంప్యూటర్ ఆపరేటర్లుగా, హార్డ్‌వేర్‌లో ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయి. 8వ తరగతి ఉత్తీర్ణులైన వారు కూడా ఏడాది మాత్రమే చదివే వెల్డర్ కోర్సులో చేరవచ్చు. ఇందులో ఉత్తీర్ణులైన వారికి రైల్వేతో పాటు ఓఎన్‌జీసీ, ఆర్టీసీల్లో, పరిశ్రమల్లో ఉద్యోగాలు లభిస్తాయి.

వెల్డర్ గ్రూపుతో రూ.25 వేల జీతం

మాది చాగల్లు మండలం ఊనగట్ల.. ఏలూరు ఐటీఐలో వెల్డర్ ట్రేడ్ పూర్తి చేశాను. ఉపాధ్యాయులు ఇచ్చిన శిక్షణ నాకు ఎంతగానో ఉపయోగపడింది. చిన్న వయసులోనే ఉద్యోగం సాధించగలిగాను. ప్రస్తుతం అల్‌స్టోమ్ అనే సంస్థలో ఉద్యోగం చేస్తున్నాను. నెలకు రూ. 25 వేలు జీతం లభిస్తోంది.

– కే.సురేష్, ఐటీఐ విద్యార్థి

ఈసీఐఎల్‌లో ఉద్యోగం

ఏలూరు ఐటీఐలో ఫిట్టర్ ట్రేడ్ పూర్తి చేశాను. అనంతరం డీఆర్‌డీఓలో అప్రెంటిస్‌షిప్ అవకాశం లభించింది. అది పూర్తయిన వెంటనే ఈసీఐల్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలో ఉద్యోగం లభించింది. 2021లో ఉద్యోగంలో చేరాను. రూ. 20 వేల జీతం వస్తోంది. ఇంజనీరింగ్‌లో మాత్రమే కాదు ఐటీఐతో కూడా పెద్ద సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తాయనడానికి నేనే ఉదాహరణ.

– ఎస్‌ఏ శంకర్, ఐటీఐ విద్యార్థి

ఈనెల 6 వరకూ దరఖాస్తుకు అవకాశం

ఐటీఐ కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు ప్రభుత్వం ఈ నెల 6 వరకూ గడువు ఇచ్చింది. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఐఎన్ లింకులో తమ వివరాలతో దరఖాస్తు చేసుకోవచ్చు. కోర్సుల్లో ప్రవేశించిన వారికి శిక్షణ కాలంలో జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలకు అర్హులవుతారు.

– పి.రజిత, ఏలూరు పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రధానాధికారి



శిఖరాల ఎత్తులో సత్సంబంధాలు

నేపాల్, భారత్ బంధంపై ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటన

నేపాల్‌తో భారత సత్సంబంధం హిమాలయ పర్వతాలంత ఎత్తులో సమున్నత స్థాయికి చేరుకుందని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. భారత పర్యటనలో భాగంగా ఢిల్లీకి చేరుకున్న నేపాల్ ప్రధాని పుష్పకమల్ దహాల్ (ప్రచండ)తో ప్రధాని నరేంద్ర మోదీ గురువారం ద్వైపాక్షిక చర్చలు జరిపారు.

2 లో

వైఎస్సార్ బీమా నమోదు ప్రారంభం

- ఈనెల 7లోగా నమోదు పూర్తి చేయాలని కలెక్టర్లకు సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశం
- 'కుటుంబ పెద్ద' సహజ మరణమైతే రూ.లక్ష పరిహారం
- ప్రమాదవశాత్తు మరణించినా, శాశ్వత వైకల్యం చెందినా రూ.5 లక్షలు
- గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పథకం అమలు.. దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న కుటుంబాలకు వర్తింపు

3 లో





ఒంగోలు హౌసింగ్ బోర్డుకాలనీలో ట్రై సైకిల్‌పై ఇంటికి వెళ్లి సుశీలకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న దివ్యాంగుడైన వలంటీర్ నారాయణ

1నే రూ.1,440.77 కోట్ల

పింఛన్ల పంపిణీ

మండుటెండల్లోనూ తొలిరోజే 82.86 శాతం మందికి అందిన సొమ్ము

- వివరాలు 3లో

క్లుప్తంగా...

బాణసంచా ప్రమాద మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా

- రూ.5 లక్షల చొప్పున ఇవ్వాలని అధికారులకు సీఎం జగన్ ఆదేశం

సాక్షి, అమరావతి: బాణసంచా గోడౌన్ ప్రమాదంలో మరణించిన ముగ్గురి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాళెం మండలం ఎల్లకటవ గ్రామంలోని బాణసంచా గోడౌన్‌లో ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. మరణించిన వారంతా నిరుపేదలని, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారని సమాచారం తెలుసుకున్న సీఎం జగన్.. వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించాలని అధికారులను ఆదేశించారు.

13 మంది ఏపీపీలు, సీనియర్ ఏపీపీల బదిలీ

- ఉత్తర్వులు జారీచేసిన డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ సుదర్శన్‌రెడ్డి

గుంటూరు లీగల్: రాష్ట్రవ్యాప్తంగా 13 మంది అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు (ఏపీపీలు), సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లను బదిలీ చేస్తూ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ జె.సుదర్శన్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. గూడూరు కోర్టు సీనియర్ ఏపీపీ ఎస్.ఎస్.ఎ స్.సుకుమార్‌ను గుంటూరు నాలుగో ఏజేఎఫ్ సీఎం కోర్టుకు, గుంటూరు నాలుగో ఏజేఎఫ్‌సీఎం కోర్టు సీనియర్ ఏపీపీ కె.కళావతిని ఒంగోలు రెండో ఏజేఎఫ్‌సీఎం కోర్టుకు, తెనాలి రెండో ఏజేఎఫ్‌సీఎం కోర్టు ఏపీపీ కె.శివలీలను గుంటూరు ఎక్సైజ్ కోర్టుకు, చిలకలూరిపేట కోర్టు ఏపీపీ ఎ.ఆర్.పవన్‌కుమార్‌ను తెనాలి రెండో ఏజేఎఫ్‌సీఎం కోర్టుకు, బాపట్ల కోర్టు ఏపీపీ సీహెచ్ పద్మను చీరాల కోర్టుకు బదిలీ చేశారు. సత్తెనపల్లి ఒకటో ఏజేఎఫ్‌సీఎం కోర్టు ఏపీపీ పి.మురళీకృష్ణను గుంటూరు ఆరో ఏజేఎఫ్‌సీఎం కోర్టుకు, ఒంగోలు రెండో ఏజేఎఫ్‌సీఎం కోర్టు సీనియర్ ఏపీపీ వి.లక్ష్మీనారాయణను గూడూరు కోర్టుకు, వెంకటగిరి కోర్టు ఏపీపీ ఎస్.మహేంద్రనాథ్‌ను బాపట్ల కోర్టుకు, నెల్లూరు స్పెషల్ మొబైల్ కోర్టు ఏపీపీ కె.మృదులను కావలి కోర్టుకు, నెల్లూరు ఐదో ఏజేఎఫ్‌సీఎం కోర్టు ఏపీపీ కె.ప్రకృతికుమార్‌ను సూళ్లూరుపేట కోర్టుకు, కొవ్వూరు కోర్టు ఏపీపీ సీహెచ్.మాల్యాద్రిని నెల్లూరు నాలుగో ఏజేఎఫ్‌సీఎం కోర్టుకు, కనిగిరి కోర్టు ఏపీపీ కె.జ్యోతిని చిలకలూరిపేట కోర్టుకు, పర్చూరు కోర్టు ఏపీపీ టి.ప్రతిమను నెల్లూరు స్పెషల్ మొబైల్ కోర్టుకు బదిలీ చేశారు.

పూతన వేషాలు!

చంద్రబాబు మేనిఫెస్టోపై సీఎం వైఎస్ జగన్ ధ్వజం

సాక్షి ప్రతినిధి, కర్నూలు: సాక్షి ప్రతినిధి, కర్నూలు: కొత్త వేషాలు, మోసాలతో చంద్రబాబు మళ్లీ ఎన్నికలకు సిద్ధం అవుతున్నాడని, అయన మాయ మాటలను నమ్మవద్దని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం కర్నూలు జిల్లా పత్తికొండలో నిర్వహించిన సభలో మహానాడు, చంద్రబాబు రాజకీయ డ్రామాలపై సీఎం జగన్ ధ్వజమెత్తారు. 'ఇటీవల రాజమండ్రిలో డ్రామా కంపెనీలా ఒక షో జరిగింది. ఆ డ్రామాకు మహానాడు అని పేరు పెట్టుకున్నారు. ఆ డ్రామా చూస్తుంటే ఆశ్చర్యమనిపించింది. 27 ఏళ్ల కిందట తానే వెన్నుపోటు పొడిచి చంపేసిన మనిషిని యుగ పురుషుడని, శక పురుషుడని, రాముడని, కృష్ణుడని కీర్తిస్తూ ఫొటోకు చంద్రబాబు దండ వేశారు. ఆకర్షణీయమైన మేనిఫెస్టోను ప్రకటించారు. దీన్ని చూస్తుంటే కొన్ని పాత్రలు, పురాణ గాథలు గుర్తుకొస్తాయి. పసిపిల్లాడైన శ్రీకృష్ణుడిని హతమార్చేందుకు పూతన అనే రాక్షసి అందమైన స్త్రీ వేషంలో బయలుదేరినట్లుగా చంద్రబాబు ఆ మేనిఫెస్టోతో సిద్ధమయ్యారు! సీతమ్మ వద్దకు అందమైన మాయలేడి రూపంలో వచ్చిన మారీచుడు కూడా గుర్తొచ్చాడు. సీతమ్మను అపహరించేందుకు వేషం, గెటప్ మార్చుకుని 'భవతీ భిక్షాందేహీ' అని యాచించిన రావణుడూ గుర్తొచ్చాడు! ఈ మూడు ఆత్మలు, క్యారెక్టర్లు కలిపి మన రాష్ట్రంలో ఓ మనిషి జన్మించాడు. ఆయనే నారా చంద్రబాబునాయుడు. ఆయన వ్యక్తిత్వం ఏమిటంటే.. మేనిఫెస్టో పేరిట ప్రతి ఎన్నికకూ ఒక వేషం వేస్తాడు! వాగ్దానానికో మోసం చేస్తాడు! ఈ పెద్ద మనిషి సత్యం పలకడు! ధర్మానికి కట్టుబడడు! మాట మీద నిలబడడు! విలువలు, విశ్వసనీయత అసలే లేవు! పిల్లనిచ్చిన మామకే వెన్నుపోటు పొడుస్తాడు. ఎన్నికలు అయిపోయాక ప్రజలను వంచిస్తాడు. అధికారం కోసం ఎవరికైనా వెన్నుపోటు పొడిచేందుకు వెనుకాడడు! అదీ చంద్రబాబు క్యారెక్టర్! ఎన్నికలకు ముందు ఆకర్షణీయమైన మేనిఫెస్టో.. ఆపై ప్రజలను వెన్నుపోటు పొడవటం! ఇదీ ఆ పెద్దమనిషి పొలిటికల్ ఫిలాసఫీ..!' అని సీఎం జగన్ దుయ్యబట్టారు.

కర్ణాటక నుంచి బాబు మేనిఫెస్టో

మన పార్టీ మేనిఫెస్టో పుట్టింది.. నా ఓదార్పు యాత్ర వల్ల! నా పాదయాత్ర వల్ల! ప్రజల కష్టాల నడుమ వాటి పరిష్కారం దిశగా, ప్రజల ఆకాంక్షలు, అవసరాల నుంచి వారి గుండె చప్పుడుగా పుట్టింది మన పార్టీ మేనిఫెస్టో! రైతన్నలు, అక్కచెల్లెమ్మలు, పేదలు, సామాజిక వర్గాల కష్టాలు, అవసరాల నడుమ ఉజ్వల భవిష్యత్తు కోసం మన మట్టి నుంచి మన మేనిఫెస్టో పుట్టింది. చంద్రబాబు నాయుడు మేనిఫెస్టో మాత్రం మన ఏపీలో పుట్టలేదు. కారణం ఆ పెద్దమనిషి జనంలో తిరగడు కాబట్టి! ఆయన మేనిఫెస్టో పుట్టింది కర్ణాటకలో. అక్కడి ఎన్నికల్లో రెండు పార్టీలు ఇచ్చిన హామీలన్నీ కలిపేసి బిసిబేళ బాత్ వండేశాడు! ఇంకా సరిపోలేదు! రుచికరంగా, ఆకర్షణీయంగా లేదని గుర్తించి.. మన అమ్మఒడి, మన చేయూత, మన రైతు భరోసా ఇలా మన పథకాలన్నీ కాపీ కొట్టి ఇంకో పులిహోర వండేశాడు! వైఎస్సార్ పథకాలన్నీ కాపీ.... జగన్ పథకాలన్నీ కాపీ.. బీజేపీ, కాంగ్రెస్ పథకాలూ కాపీ! చివరికి బాబు బతుకే కాపీ, మోసం!!



పత్తికొండలో సభా ప్రాంగణం వెలుపల కూడా భారీ ఎత్తున జన సమూహం



రైతులు బహూకరించిన నాగలితో సీఎం జగన్

నా నమ్మకం, ధైర్యం మీరే..!

కురుక్షేత్ర యుద్ధం జరగబోతోంది! పేదలు నావైపు ఉన్నారు! పెత్తందారులు చంద్రబాబు వైపున్నారు! యుద్ధం జరిగేది పేదల భవిష్యత్తుకు - పెత్తందారులకు మధ్య! సామాజిక న్యాయం - సామాజిక అన్యాయానికి మధ్యన! ఎల్లో మీడియా విష ప్రచారాలకు, మీ కళ్ల ముందు కనిపించే మంచికి మధ్య యుద్ధం జరుగుతోంది. దోచుకో, పంచుకో, తినుకో అనే డీపీటీ చంద్రబాబు కావాలా? అందరికీ మేలు జరిగే డీబీటీ (డైరెక్ట్ బెనిఫిషర్ ట్రాన్స్‌ఫర్) కావాలో తేల్చుకోవాలి! మోసం చేసేందుకు చంద్రబాబు కొత్త వేషంతో వస్తున్నారు. మోసపోవద్దు! ఆలోచించండి! నా నమ్మకం, ధైర్యం మీరే!

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్

ఏ గడ్డి అయినా తినేందుకు చంద్రబాబు వెనుకాడరు!

చంద్రబాబుకు ఒరిజినాలిటీ లేదు! పర్సనాలిటీ లేదు! క్యారెక్టర్, క్రెడిబులిటీ అంతకంటే లేదు! పోటీ చేసేందుకు 175 నియోజకవర్గాల్లో 175 మంది అభ్యర్థులు కూడా లేని పార్టీ అది! బహిరంగ ప్రదేశాల్లో మీటింగ్ పెడితే జనం రారని ఇరుకు సందులు చూసుకునే పార్టీ అది! పొత్తుల కోసం ఏ గడ్డినా తినేందుకు వెనుకాడని పార్టీ అది! విలువలు, విశ్వసనీయత లేని పార్టీ చంద్రబాబుది. ఆ పార్టీకి కావాల్సింది పొత్తులు, ఎత్తులు, చిత్తులు, కుయుక్తులు! ఇదీ ఆ పార్టీ ఫిలాసఫీ..!

కొత్త వాగ్దానాలు.. కొంగ జపం!

ఆయన 1995లో సీఎం అయ్యాడు. 2024లో మళ్లీ ఎన్నికలు వస్తుంటే ఇంకో చాన్స్ ఇవ్వమంటున్నాడు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ చెప్పుకునేందుకు ఒక్క మంచి పని కూడా లేని చరిత్ర ఆయనది! 2014లో తనను నమ్మిన రైతులు, పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలు, యువకులు, అవ్వాతాతలను మోసం చేశాడు. వారిని అప్పుల పాలుచేసి నట్టేట ముంచాడు. మొదటి సంతకం చేస్తున్నామంటే దానికి ఒక క్రెడిబులిటీ ఉంటుంది. చంద్రబాబు మొదటి సంతకాన్నే ఓ మోసం, వంచన, దగాగా మార్చాడు. ఇప్పుడు మళ్లీ కొత్త వాగ్దానాలతో జనం ముందుకు వస్తున్నాడు. కొంగ జపం మొదలు పెట్టాడు. విశ్వసనీయత అనేది చంద్రబాబు డిక్షనరీలోనే లేదు. ధర్మంగా రాజకీయాల్లో పోరాటం చేయడం, విలువలు, విశ్వసనీయతతో, ధైర్యంగా ఒంటరిగా పోటీ చేసి ఓటేయాలని అడిగే సత్తా ఆయనకు లేదు. చంద్రబాబుకు తోడుగా ఓ గజదొంగల ముఠా! ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5, దత్తపుత్రుడు వీరంతా చేస్తోంది రాజకీయ పోరాటం కాదు. అధికారం కోసం ఆరాటం! ఆ అధికారం కూడా దోచుకోవడానికి, పంచుకుని తినడానికే! చంద్రబాబు పెత్తందారీతనానికి, పేదల భవిష్యత్తుకు మధ్య యుద్ధం జరుగుతోంది. దుష్ప్రచారాలను నమ్మొద్దు. మీ ఇంట్లో మంచి జరిగిందా? లేదా? అనేది కొలమానంగా తీసుకోండి. మంచి జరిగితే మీ బిడ్డకు మీరే సైనికుడిగా తోడుగా నిలవాలని కోరుతున్నా.

జగనన్న ఉన్నాడనే భరోసా



నాకు ఐదెకరాల పొలం ఉంది. మరో ఐదెకరాలు కౌలుకు చేస్తా. నాలుగేళ్లుగా రైతు భరోసా కింద రూ.54 వేలు వచ్చింది. ఇప్పుడిస్తున్న మొత్తంతో కలిపితే రూ.61,500 లబ్ధి చేకూరుతోంది. ఉచిత పంటల బీమా ద్వారా రూ.21,800 బీమా పరిహారం పొందాం. ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే జగనన్న ఉన్నాడన్న భరోసా ఉంది. పప్పుశనగకు రేటు లేకపోతే ఆర్బీకేల ద్వారా మద్దతు ధర రూ.5,330 ప్రకారం అమ్ముకుంటే అదనంగా రూ.30 వేలు వచ్చాయి. నా కుమారుడికి విద్యా దీవెన కింద రూ.34 వేలు జమయ్యాయి. అలాగే వసతి దీవెన డబ్బులు కూడా జమ అయ్యాయి. వైఎస్సార్ చేయూత ద్వారా రెండేళ్లలో రూ.37,500 వచ్చాయి. మా కుటుంబం నాలుగేళ్లలో రూ.1.99 లక్షల మేర లబ్ధి పొందింది. రైతాంగానికి వైఎస్సార్ కుటుంబమంటే ఇష్టం.

– ఈశ్వరప్ప, పెద్దహుల్తి, పత్తికొండ మండలం

నాలుగేళ్లలో రూ.10,28,525 లబ్ధి



నాకు 4.12 ఎకరాల భూమి ఉంది. జగనన్న నాలుగేళ్ల పాలనలో వైఎస్సార్ రైతుభరోసా, ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ, ఆసరా, చేయూత, ఆరోగ్యశ్రీ పథకాల ద్వారా రూ.10,28,525 మేర లబ్ధి పొందాం. ఒక్క మా కుటుంబమే ఇంత లబ్ధి పొందితే రాష్ట్ర ప్రజలు ఎంత ప్రయోజనం పొందారో అర్థం చేసుకోవచ్చు. మా అమ్మానాన్న బతికి ఉన్నారంటే అది జగనన్న చలువే. మా అమ్మకు క్యాన్సర్ వస్తే ఆరోగ్యశ్రీ ద్వారా రూ.4.80 లక్షలు ఖరీదైన ఆపరేషన్ ఉచితంగా చేశారు. నాన్నకు రెండు సార్లు గుండెపోటు వస్తే ఆరోగ్యశ్రీ కింద రూ.66 వేలు విలువైన యాంజియోగ్రామ్ ఉచితంగా చేశారు. మళ్లీ పోటు రావడంతో రూ.87 వేలతో స్టంట్ వేసి బతికించారు. మీకంటే దేవుడు మాకు ఎవరుంటారన్నా!

–బోయ వెంకటేశ్వర్లు, పోతుగల్లు, కృష్ణగిరి మండలం, కర్నూలు

రైతు రాజ్యమిది..

▶ మొదటి పేజీ తరువాయి

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే..

చెప్పిన దానికి కంటే మిన్నగా..

'మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన ప్రతీ మాటను మీబిడ్డ ప్రభుత్వం నిలబెట్టుకుంది. వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ యోజన కింద ఐదో ఏడాది తొలి విడత సాయాన్ని విడుదల చేస్తున్నాం. ప్రతీ రైతుకు మంచి జరగాలనే తాపత్రయంతో ఏటా రూ.12,500 చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని మేనిఫెస్టోలో చెప్పాం. చెప్పిన దానికి కంటే మిన్నగా రూ.13,500 చొప్పున ఇస్తున్నాం. మేనిఫెస్టోలో నాలుగేళ్లు మాత్రమే అని చెప్పినా రైతన్నలు ఇబ్బందులు పడకూడదని ఐదో ఏడాది కూడా ఇస్తున్నాం. మొత్తంగా రూ.67,500 ఇస్తున్నాం. మీ బిడ్డ ప్రభుత్వం చెప్పిన దాని కంటే రూ.17,500 ఎక్కువ ఇస్తోంది. ఇప్పటికే 50 లక్షల పైచిలుకు రైతులకు రూ.54 వేలు చొప్పున వైఎస్సార్ రైతు భరోసా డబ్బులు అందించాం. ఈదఫా ఇస్తున్న రూ.7,500 కలిపితే రూ.61,500 నేరుగా రైతన్నల ఖాతాల్లో చేరినట్లవుతుంది. ప్రతీ రైతన్న ఖాతాల్లోకి రూ.5,500 వెళ్తాయి. మిగిలిన రూ.2 వేలు పీఎం కిసాన్ కింద కేంద్ర ప్రభుత్వం నుంచి నేరుగా జమ అవుతుంది. వారు ఇచ్చేది ఆలస్యమైనా రైతన్నలు ఇబ్బంది పడకూడదని ఈరోజే బటన్ నొక్కి రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన డబ్బులను ఇచ్చేస్తున్నాం. ఈరోజు వరకూ మీ బిడ్డ ప్రభుత్వం ఒక్క రైతుభరోసా ద్వారా రైతన్నల ఖాతాల్లో జమ చేసిన సొమ్ము అక్షరాలా రూ.31 వేల కోట్లు.

వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు

■ **దండిగా దిగుబడులు..**

చంద్రబాబు హయాంలో ఆర్బీకేలు, ఈ-క్రాప్, సోషల్ ఆడిట్ ఊసే లేదు. 10,778 ఆర్బీకేలను నెలకొల్పి రైతన్నలకు నిరంతరం తోడుగా ఉంటున్నాం. 2014-19లో ఆహార ధాన్యాల ఉత్పత్తి ఏటా 153 లక్షల టన్నులు కాగా మన ప్రభుత్వంలో 2019-23 మధ్య ఏటా సగటున 165 లక్షల టన్నులకు చేరింది. ఉద్యాన పంటల దిగుబడి చంద్రబాబు హయాంలో ఏటా సగటున 228 లక్షల టన్నులు ఉండగా మన హయాంలో 332 లక్షల టన్నులకు పెరిగింది.

■ **బాబు హయాం మొత్తం కరువే**

చంద్రబాబు హయాంలో ఏ ఏడాది చూసినా కరువే కరువు. ఏటా కనీసం సగం మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించిన దుస్థితి. అప్పట్లో 1,623 కరువు మండలాలు ప్రకటించారు. ఇప్పుడు గత నాలుగేళ్లలో ఒక్కటంటే ఒక్క కరువు మండలం కూడా ప్రకటించాల్సిన పరిస్థితి రాలేదు. చంద్రబాబు పాలనలో సున్నా వడ్డీ కింద 40,60,000 మంది రైతన్నలకు రూ.685 కోట్లు విదల్చగా మీ బిడ్డ ప్రభుత్వం రూ.1,835 కోట్లు ఇచ్చింది. 74 లక్షల మంది రైతులకు సున్నా వడ్డీ ద్వారా మంచి చేయగలిగాం. చంద్రబాబు హయాంలోని సున్నా వడ్డీ పెండింగ్ బకాయిలను చిరునవ్వుతో ఇచ్చాం. ఇక చంద్రబాబు హయాంలో 30,85,000 మంది రైతులకు రూ.3,411 కోట్లు పంటల బీమా కింద ఇవ్వగా ఇప్పుడు నాలుగేళ్లలో వైఎస్సార్ ఉచిత పంటల బీమా ద్వారా 44 లక్షల మంది రైతులకు రూ.6,685 కోట్లు అందించాం. నిరుడు ఖరీఫ్‌కు సంబంధించిన ఇన్సూరెన్స్‌ను నాన్న జయంతి రోజైన జూలై 8వ తేదీన జమ చేస్తాం. రైతన్నల నుంచి ఒక్క రూపాయి కూడా బీమా ప్రీమియం తీసుకోకుండా పూర్తి బీమా తానే భరిస్తున్న ఏకైక రాష్ట్ర ప్రభుత్వం మనదే.

■ **ధాన్యం సేకరణ..**

గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో 2.65 కోట్ల టన్నుల ధాన్యం సేకరించగా మనందరి ప్రభుత్వం నాలుగేళ్లలోనే 3.09 కోట్ల టన్నుల ధాన్యం సేకరించింది. ఇంకా రబీలో సేకరణ జరుగుతోంది. మరో ఏడాదీ సేకరణ జరుగుతుంది. గతంలో సగటున ఏటా 53 లక్షల టన్నులే సేకరిస్తున్న పరిస్థితి నుంచి ఈరోజు 75 లక్షల టన్నుల ధాన్యం సేకరణ జరుగుతోంది. గత ప్రభుత్వం ఐదేళ్లలో ధాన్యం సేకరణకు చేసిన వ్యయం రూ.40,237 కోట్లు. మీ బిడ్డ ప్రభుత్వం నాలుగేళ్లలోనే ఇప్పటికే రూ.60 వేల కోట్లు సేకరణకు వెచ్చించింది. ఇంకా రబీ పూర్తి కాలేదు. మరో ఏడాదీ ఉంది. ఈ ఏడాది కూడా కలిపితే కనీసం రూ.77 వేల కోట్లు అవుతుంది. ఎక్కడ రూ.40 వేలకోట్లు? ఎక్కడ రూ.77 వేల కోట్లు? తేడా గమనించాలని కోరుతున్నా. గత ప్రభుత్వం ఎగ్గొట్టిన రూ.960 కోట్ల ధాన్యం సేకరణ బకాయిలను సైతం మీబిడ్డ ప్రభుత్వం చెల్లించింది. చంద్రబాబు బకాయి పెట్టిన రూ.384 కోట్ల విత్తన బకాయిలూ మనమే చెల్లించాం. చంద్రబాబు ఎగ్గొట్టిన కరెంట్ బకాయిలు రూ.8,845 కోట్లనూ రైతన్నల కోసం మీబిడ్డ ప్రభుత్వమే భరిస్తోంది.

■ **గ్రామాల్లోనే రిజిస్ట్రేషన్లు..**

మీబిడ్డ ప్రభుత్వంలో 70 నియోజకవర్గ స్థాయిలో 70 ఆర్గానిక్ టెస్టింగ్ ల్యాబ్స్ కళ్లెదుటే కనిపిస్తున్నాయి. రెండు జిల్లాస్థాయి ల్యాబ్స్, మరో నాలుగు రీజనల్ కోడింగ్ సెంటర్లు కూడా ఏర్పాటయ్యాయి. మరో 77 నియోజకవర్గాల్లో అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు నిర్మిస్తున్నాం. మరో 11 జిల్లా స్థాయి ల్యాబ్స్ కూడా నిర్మాణాలు మొదలయ్యాయి. ఆర్బీకేల స్థాయిలో సీడ్ టెస్టింగ్, సాయిల్ టెస్టింగ్ దిశగా అడుగులు పడుతున్నాయి. ఆర్బీకేలు రానున్న రోజుల్లో వ్యవసాయం చేసే విధానాన్ని పూర్తిగా మార్చబోతున్నాయి. వందేళ్ల తర్వాత సమగ్ర భూసర్వే ద్వారా వివాదాలకు తావు లేకుండా రైతన్నల చేతుల్లో భూహక్కు పత్రాలను పెట్టే కార్యక్రమం మీబిడ్డ హయాంలో జరుగుతోంది. గ్రామస్థాయిలో సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు తీసుకున్నాం.

■ **చుక్కల భూములకు మోక్షం..**

టీడీపీ హయాంలో నిషేధిత జాబితాలో చేర్చిన లక్షల ఎకరాల చుక్కల భూములకు విముక్తి కల్పించింది మీబిడ్డ ప్రభుత్వమే అని చెప్పేందుకు గర్వపడుతున్నా. రైతులకు ఏ ఇబ్బందీ రాకూడదని పగటి పూటే 9 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. రూ.1,700 కోట్లతో ఫీడర్లను బలోపేతం చేశాం. ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్తు రూపాయిన్నరకే అందిస్తున్న ఏకైక రాష్ట్రం మనదే. ఆక్వా రైతులకు రూ.2,967 కోట్లు సబ్సిడీ రూపంలో ఇచ్చాం. కరువు సీమగా పేరున్న రాయలసీమ ఈరోజు కళకళలాడుతోంది. అమూల్ రాకతో హెరిటేజ్ లాంటి సంస్థలు తప్పని పరిస్థితుల్లో పాల సేకరణ ధర పెంచాయి. కేంద్రం ఎంఎస్‌పీ ప్రకటించని ఆరు పంటలకు కూడా మీబిడ్డ ప్రభుత్వం మద్దతు ధరలను ప్రకటించింది. పశు నష్టపరిహారం కింద రూ.667 కోట్లు చెల్లించాం. ఆయిల్‌పామ్ రైతులను ఆదుకునేందుకు రూ.85 కోట్లు ఇచ్చాం. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత ద్వారా ఐదు లక్షల మంది అక్కచెల్లెమ్మలు పశుసంపద కొనుగోలు చేసి పాడి వ్యాపారాలను నిర్వహించుకునేలా తోడుగా నిలబడ్డాం. పశువులకు సైతం 340 అంబులెన్స్‌లు ఈరోజు అందుబాటులో రాష్ట్రంలో ఉన్నాయి. ప్రతి నియోజకవర్గంలో పశువ్యాధుల కోసం డయాగ్నోస్టిక్ ల్యాబ్స్ ఏర్పాటయ్యాయి. రూ.1,052 కోట్ల విలువైన యంత్ర పరికరాలను ఆర్బీకేల స్థాయిలో అందుబాటులోకి తెస్తున్నాం. వ్యవసాయంలో తొలిసారిగా డ్రోన్లు తెస్తున్నాం. ప్రతీ ఆర్బీకేలో మన రైతన్నలే డ్రోన్ల ద్వారా వ్యవసాయం చేసే రోజు త్వరలోనే రానుంది.



వైఎస్సార్ రైతు భరోసా చెక్కుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

ఇన్‌పుట్ సబ్సిడీగా మరో రూ.54 కోట్లు

రైతు భరోసాతో పాటు ఇవాళ ఇంకో మంచి కార్యక్రమం జరుగుతోంది. ఇన్‌పుట్ సబ్సిడీ విషయంలో మీబిడ్డ ప్రభుత్వం ఇప్పటికే ఒక విప్లవాత్మక మార్పు తెచ్చింది. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఏ సీజన్‌లో జరిగిన నష్టానికి అదే సీజన్‌లోనే పరిహారాన్ని చెల్లిస్తున్నాం. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్, మే నెలల్లో కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన 51 వేల మంది రైతన్నల ఖాతాల్లోకి నేరుగా మరో రూ.54 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీగా ఈరోజే జమ చేస్తున్నాం. గత నాలుగేళ్లుగా 22,77,000 మంది రైతన్నలకు ఏ సీజన్‌లో పంట నష్టం జరిగితే అదే సీజన్‌లో ఆదుకుంటూ రూ.1,965 కోట్లు నేరుగా ఖాతాల్లో జమ చేశాం.



వైఎస్సార్ రైతు భరోసా లబ్ధిదారులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

శిఖరాల ఎత్తులో సత్సంబంధాలు

న్యూఢిల్లీ: నేపాల్‌తో భారత సత్సంబంధం హిమాలయ పర్వతాలంత ఎత్తులో సమున్నత స్థాయికి చేరుకుందని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. భారత పర్యటనలో భాగంగా ఢిల్లీకి చేరుకున్న నేపాల్ ప్రధాని పుష్పకమల్ దహాల్(ప్రచండ)తో గురువారం ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. రెండు దేశాల సరిహద్దు సమస్యలను ఇరు దేశాల మధ్య మరింత ముడిపడిన మైత్రీబంధం స్ఫూర్తితో పరిష్కరించుకుంటామని మోదీ అన్నారు. ద్వైపాక్షిక చర్చల తర్వాత మోదీ మీడియాతో మాట్లాడారు. 'నేడు రెండు దేశాల మధ్య ఒప్పందం సూపర్‌హిట్ అయ్యేలా మేమిద్దరం ఎన్నో కీలకమైన నిర్ణయాలు తీసుకున్నాం. తొలిసారి ప్రధాని అయిన మూడునెలల్లోపే నేపాల్‌లో పర్యటించా. రెండు దేశాలకు 'హిట్- హెచ్(హైవేలు), ఐ(వేస్), టీ(ట్రాన్స్-వేస్) ఫార్ములా అందించా. ఇలాంటి సత్సంబంధం నెలకొంటే అదే మన రెండు దేశాలకు వారధిలా మారుతుంది. ఈ తొమ్మిదేళ్లలో మన బంధం నిజంగా హిట్ అయింది. సాంస్కృతిక, ప్రాంతీయ ఒప్పందాలు బలపడాలంటే రామాయణ సర్క్యూట్ సంబంధ ప్రాజెక్టులను విస్తరించాలని నిర్ణయించాం'అని మోదీ అన్నారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు పలు ప్రాజెక్టులను వర్చువల్ విధానంలో ప్రారంభించడంతోపాటు మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. సీమాంతర పెట్రోలియం పైప్‌లైన్, సమీకృత చెక్‌పోస్టుల అభివృద్ధి, హైడ్రో ఎలక్ట్రిక్ విద్యుత్‌సహా వివిధ రంగాల్లో పరస్పర సహకారం కోసం ఏడు ఒప్పందాలు కుదుర్చుకున్నారు.

రాష్ట్రంలో డేటావివ్ టెక్నాలజీస్ ఏఐ ల్యాబ్

- డేటావివ్ ఎండీ వేదాంత్ అహ్లువాలియా
- నైపుణ్యాభివృద్ధి, శిక్షణశాఖ ముఖ్య కార్యదర్శి, ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీలతో కంపెనీ ప్రతినిధుల సమావేశం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)కి సంబంధించిన ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు డేటావివ్ టెక్నాలజీస్ ప్రకటించింది. భవిష్యత్తులో అపార అవకాశాలున్న ఏఐలో కంప్యూటర్ విజన్, ఇమేజ్ ప్రాసెసింగ్, మెటావెర్స్ సిమ్యులేషన్స్, గ్రేడింగ్, అసెస్‌మెంట్ వంటి అత్యాధునిక సదుపాయాలతో ల్యాబ్‌ను ఏర్పాటు చేయడానికి ఆసక్తిగా ఉన్నట్లు ఏఐ కంపెనీ డేటావివ్ ఎండీ వేదాంత్ అహ్లువాలియా తెలిపారు. తాడేపల్లిలోని ఏపీ నైపుణ్యాభివృద్ధిసంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) కార్యాలయంలో గురువారం నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్, సంస్థ ఎండీ వినోద్‌లతో డేటావివ్ ప్రతినిధులు సమావేశమయ్యారు. అహ్లువాలియా మాట్లాడుతూ ఈ ల్యాబ్ ద్వారా భావోద్వేగాలను ఇంటెలిజెన్స్ కెమెరాలతో పసిగట్టవచ్చని చెప్పారు. కృత్రిమ మేధ ద్వారా టెక్స్, ఆడియో, వీడియో, ఫొటోల ద్వారా అర్థం చేసుకునేలా యువతకు టెక్నాలజీ ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను ప్రశంసించారు. ల్యాబ్ ఏర్పాటుకు సహకారాలందిస్తామని సురేష్‌కుమార్ చెప్పారు.

మైనార్టీ విద్యార్థులకు శిక్షణ కోసం ఉర్దూ అకాడమీతో ఒప్పందం

మైనారిటీవర్గ నిరుద్యోగులకు సమాచార, సాంకేతిక రంగంలో శిక్షణ, ఉపాధి కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ఉర్దూ అకాడమీతో ఏపీఎస్ఎస్‌డీసీ ఒప్పందం కుదుర్చుకుంది. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ సమక్షంలో ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ వినోద్, ఉర్దూ అకాడమీ సెక్రటరీ అయ్యూబ్ హుసేన్ సంతకాలు చేసి ఒప్పందపత్రాలను మార్చుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉర్దూ అకాడమీకి సంబంధించిన 36 శిక్షణ కేంద్రాలను స్కిల్‌హబ్‌లుగా మార్చి యువతకు శిక్షణ కార్యక్రమాలను అందించే దిశగా ఒప్పందం కుదిరిందని సురేష్‌కుమార్ చెప్పారు.

బ్రోచర్ ఆవిష్కరణ

అనంతరం రాష్ట్రంలో ఏర్పాటవుతున్న ఐటీ కంపెనీలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించే విధంగా ఐటీ, పరిశ్రమలతో ఏపీఎస్ఎస్‌డీసీ భాగస్వామ్యానికి సంబంధించిన బ్రోచర్‌ను సురేష్‌కుమార్, వినోద్ ఆవిష్కరించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి, నైపుణ్యాభివృద్ధి సంస్థ మధ్య గతంలో కుదిరిన ఒప్పందం ప్రకారం త్వరలోనే యువతకు శిక్షణ కార్యక్రమాలు జరగనున్నట్లు సురేష్‌కుమార్ చెప్పారు. ఎండీ వినోద్ మాట్లాడుతూ పైథాన్ ప్రోగ్రామింగ్, డేటా అనాలిసిస్, ఆండ్రాయిడ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, బిల్డ్ బాక్స్, 3డీ ఆధారిత గేమ్ డిజైన్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, క్లౌడ్ కంప్యూటింగ్, ఆటోక్యాడ్ ఆధారిత బిల్డింగ్ డ్రాఫ్టింగ్, పీఎల్‌సీతో ఇండస్ట్రియల్ ఆటోమేషన్, వెబ్‌డెవలప్‌మెంట్ తదితర కోర్సుల్లో శిక్షణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు వివరించారు.

వధూవరులకు సీఎం జగన్ ఆశీస్సులు



సాక్షి, అమరావతి/మంగళగిరి: గుంటూరు జిల్లా మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం వైఎస్సార్‌సీపీ నేత పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి సోదరుడు పేర్నాటి రామలింగారెడ్డి కుమారుడు కౌశిక్ వివాహం జరిగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హాజరై వధూవరులు మనస్విని, కౌశిక్‌కు ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, జేసీ రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్య తెలియడమే ఆలస్యం..

- సత్వర పరిష్కారానికి సీఎం జగన్ ఆదేశాలు

వివిధ సమస్యలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. గురువారం పత్తికొండకు వచ్చిన ఆయనకు చాలా మంది తమ సమస్యలపై హెలిప్యాడ్‌లో వినతిపత్రాలు అందజేయగా.. సానుకూలంగా స్పందించి సత్వరమే న్యాయం చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజనను ఆదేశించారు. – కర్నూలు(సెంట్రల్)

వైద్యానికి సాయం చేయరూ..

నా పేరు తలమారి నరసింహులు. మాది కర్నూలు జిల్లా తోవి గ్రామం. నాకు నలుగురు సంతానం. అందులో మొదటి కుమారుడు వీరేష్ 2014లో పుట్టాడు. పుట్టుకతోనే అంగవైకల్యం. కళ్లు కూడా సరిగా కనిపించవు. కుమారుడి వైద్య ఖర్చుల కోసం దాదాపు రూ.15 లక్షలు ఖర్చు చేశాను. నేను కడు పేదవాడిని.. నా బిడ్డ వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం చేయరూ..

ఆదుకోండి..

నా పేరు కురువ సావిత్రి. మాది దేవనకొండ మండలం చెల్లచెలిమల. నాకు ఊపిరితిత్తులు, గుండె సంబంధిత వ్యాధి ఉంది. వైద్యం కోసం రూ.3 లక్షల వరకు ఖర్చు చేశాం. ఇంకా రూ.20-30 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. పేద వాళ్లం, అంత ఖర్చు భరించలేం. మమ్మల్ని ఆదుకోరూ..

మా పాపకు అనారోగ్యం

నా పేరు మెహరీన్నీసా. నేను కర్నూలులోని కృష్ణానగర్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్లో టీచర్‌ని. నా కుమార్తె అలిజాకు కిడ్నీ సమస్య ఉంది. అందువల్ల రెండు నెలలకోసారి పాపను పరీక్షల కోసం ఆస్పత్రికి తీసుకెళ్లాలి. ఇలా ప్రతి సారీ దాదాపు రూ.10 వేల వరకూ ఖర్చు అవుతోంది. నేను చేసే ఉద్యోగంతో పాప ఆరోగ్యం కోసం ఖర్చు చేయలేని దుస్థితి. ఆర్థిక సాయం చేసి ఆదుకోరూ..



శ్రీకాకుళంలోని చల్ల వీధిలో పాపారావుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నీలవేణి



కడపలోని బోరెడ్డి వీధిలో వెంకట్రామయ్యకు దివ్యాంగ పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రెడ్డిరోజా



తిరుపతి నెహ్రూ వీధిలో లబ్ధిదారు నవనీత కృష్ణకు పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ వరలక్ష్మి



నెల్లూరు రూరల్‌లోని చింతారెడ్డిపాలెంలో అమ్మణ్ణమ్మకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ ఆమని



విశాఖలోని 20వ డివిజన్‌లో పి.నరసయ్యమ్మకు వృద్ధాప్య పింఛన్ ఇస్తున్న వలంటీర్ కె.విహారిక



బాపట్ల జిల్లా చెరుకుపల్లిలో భారతమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ప్రియదర్శిని



కాకినాడ జిల్లా సిరిగలపల్లిలంకలో పుల్లమ్మకు పింఛన్ అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ సత్య



విజయనగరం జిల్లా ధర్మపురిలో వృద్ధురాలు రాములమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ పార్వతి

తొలిరోజే రూ.1,440.77 కోట్ల పింఛన్ల పంపిణీ

సాక్షి, అమరావతి: రాష్ట్రమంతటా ఎండలు మండుతున్నా.. అవ్వాతాతలెవ్వరికీ చిన్న కష్టం కూడ తెలియకుండా ఒకటో తేదీ ఠంచన్‌గా పింఛను డబ్బులు వాళ్ల చేతికి అందాయి. వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి గురువారం ఒక్క రోజే రాష్ట్రవ్యాప్తంగా 52,31,984 మందికి రూ.1,440.77 కోట్లు పంపిణీ చేశారు. జూన్ ఒకటో తేదీ నుంచి 63.14 లక్షల మందికి పింఛన్లు పంపిణీ చేసేందుకు రూ.1,739.75 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిన విషయం తెలిసిందే. మొదటిరోజు ఒకటో తేదీనే 82.86 శాతం మంది లబ్ధిదారులకు పంపిణీ పూర్తయింది. మిగిలిన లబ్ధిదారులకు ఐదోతేదీ వరకు వలంటీర్ల ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ కొనసాగుతుందని సెర్ప్ అధికారులు తెలిపారు.



ఏలూరులో జయకాంతమ్మకు వృద్ధాప్య పింఛన్ ఇస్తున్న వలంటీర్ యశ్వంత్



విజయవాడలోని లబ్బీపేటలో ఫజులున్నీసాకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ మహిత



అనంతపురం ఆదర్శనగర్‌లో రామలక్ష్మమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ చిట్టెమ్మ

నేడు మెగా యంత్ర సేవా మేళా

గుంటూరులో జెండా ఊపి ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్

- ఇప్పటికే 6,525 ఆర్బీకే, 391 క్లస్టర్ స్థాయి సీహెచ్‌సీల ఏర్పాటు
- కొత్తగా రూ.361.29 కోట్లతో మరో 3,919 ఆర్బీకే, 100 క్లస్టర్ స్థాయి సీహెచ్‌సీలు
- ఆర్బీకే స్థాయిలో మరో 2,562 ట్రాక్టర్లు, 100 హార్వెస్టర్లు పంపిణీకి చర్యలు



పంపిణీకి సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు

సాక్షి, అమరావతి: చిన్న, సన్నకారు రైతులు ఎదుర్కొంటున్న కూలీల వెతలు తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'వైఎస్సార్ యంత్ర సేవ' పథకం కింద శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న మెగామేళాకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గుంటూరు చుట్టుగుంట సెంటర్ వద్ద ట్రాక్టర్లు, కంబైన్డ్ హార్వెస్టర్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభిస్తారు. వంద శాతం యంత్ర సేవా కేంద్రాల ఏర్పాటులో భాగంగా రూ.361.29 కోట్ల అంచనాతో 3,919 ఆర్బీకే, 100 క్లస్టర్ స్థాయి కేంద్రాలను ఏర్పాటుచేస్తుండగా.. ఎంపిక చేసిన రైతు గ్రూపుల బ్యాంకు ఖాతాల్లో రూ.125.48 కోట్ల సబ్సిడీ మొత్తాన్ని సీఎం బటన్ నొక్కి నేరుగా జమచేయనున్నారు. అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, ఇతర యంత్ర పరికరాల పంపిణీ చేస్తారు.

40 శాతం సబ్సిడీ.. 50 శాతం రుణం

ఈ ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలను తక్కువ అద్దెకే సన్న, చిన్న కారు రైతులకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా వారికి సాగు వ్యయం తగ్గించి నికర ఆదాయం పెంచాలన్న సీఎం వైఎస్ జగన్ ఆలోచనలకను గుణంగా వైఎస్సార్ యంత్ర సేవా పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ పథకం కింద రూ.15లక్షల విలువైన యంత్ర పరికరాలను ఆర్బీకే స్థాయిలోనూ, రూ.25లక్షల విలువైన కంబైన్డ్ హార్వెస్టర్‌తో కూడిన యంత్ర పరికరాలను క్లస్టర్ స్థాయిలోనూ ఏర్పాటు చేస్తోంది. ఎంపికైన రైతు గ్రూపులు కోరుకున్న యంత్ర పరికరాల కొనుగోలు కోసం 40 శాతం రాయితీనందించడమే కాదు.. యంత్ర విలువలో 50 శాతం బ్యాంకు రుణాన్ని కూడా ప్రభుత్వం సమకూరుస్తోంది. ఇందుకోసం ఇప్పటికే రూ.690.87 కోట్ల అంచనాతో 6,525 ఆర్బీకే, 391 క్లస్టర్ స్థాయి కేంద్రాలను ఏర్పాటుచేసింది. ఈ కేంద్రాల్లో 3,800 ట్రాక్టర్లు, 391 హార్వెస్టర్లు, 22580 వివిధ రకాల యంత్ర పనిముట్లను సమకూర్చారు. సబ్సిడీ రూపంలో రూ.240.67 కోట్లు రైతు గ్రూపుల ఖాతాలకు నేరుగా జమచేసింది.

నూరు శాతం ఆర్బీకేల్లో ఏర్పాటు లక్ష్యంగా..

ప్రతి ఆర్బీకే పరిధిలో యంత్ర సేవా కేంద్రాలు ఏర్పాటు లక్ష్యంతో తాజాగా 3,919 ఆర్బీకే, 100 క్లస్టర్ స్థాయిలో యంత్ర సేవా కేంద్రాలను ఏర్పాటుచేస్తోంది. గతేడాది 3,800 ఆర్బీకేల పరిధిలో ట్రాక్టర్లతో కూడిన యంత్ర పరకరాలను అందించగా.. తాజాగా 2,562 ఆర్బీకేల్లో ఏర్పాటుచేస్తున్నారు. రూ.361.29 కోట్ల అంచనా వ్యయంతో ఈ కేంద్రాలను ఏర్పాటుచేస్తుండగా, సబ్సిడీ రూపంలో రూ.125.48 కోట్లు ప్రభుత్వం నేరుగా రైతు గ్రూపుల ఖాతాలకు జమచేయనుంది. తాజాగా ఏర్పాటు చేస్తున్న కేంద్రాల్లో 2562 ట్రాక్టర్లు, 100 హార్వెస్టర్లు, 13,573 యంత్ర పనిముట్లు సమకూరుస్తున్నారు. కృష్ణా, ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలో రైతు గ్రూపులకు అందిస్తున్న ట్రాక్టర్లు, కంబైన్డ్ హార్వెస్టర్లను గుంటూరులో శుక్రవారం సీఎం జగన్ ప్రారంభించడమే కాదు సబ్సిడీ మొత్తాన్ని ఆయా ఖాతాల్లో జమ చేస్తారు. అదే సమయంలో నియోజకవర్గ కేంద్రాల్లో యంత్ర సేవా కేంద్రాలను ప్రారంభిస్తారు.

జూలైలో కిసాన్ డ్రోన్లు అందుబాటులోకి..

ఇక కిసాన్ డ్రోన్ సేవలను సైతం ఆర్బీకే స్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. తొలి విడతలో మండలానికి మూడు చొప్పున ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. జూలైలో 500 డ్రోన్ సీహెచ్‌సీలు ఏర్పాటుచేస్తున్నారు. మరోవైపు.. రైతుల కోరిక మేరకు 50 శాతం సబ్సిడీపై ఏడు లక్షల స్ప్రేయర్లు, టార్పాలిన్లను అక్టోబర్‌లో పంపిణీకి ఏర్పాట్లుచేస్తున్నారు.

కొనుగోలు.. నిర్వహణ బాధ్యత రైతు గ్రూపులదే..

- పంటల సరళి, స్థానిక డిమాండ్‌కు అనుగుణంగా కావాల్సిన యంత్ర పరికరాల ఎంపిక, కొనుగోలుతో పాటు వాటి నిర్వహణ బాధ్యతలను కూడా రైతు గ్రూపులకే రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది.
- యంత్ర పరికరాలు, వాటి అద్దె వివరాలను ఆర్బీకేల్లో ప్రదర్శిస్తున్నారు. కనీసం 15 రోజుల ముందుగా మండల పరిధిలో ఏ ఆర్బీకే నుంచైనా బుక్ చేసుకునేందుకు వీలుగా 'వైఎస్సార్ సీహెచ్‌సీ' యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.
- ఈ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలు, గ్రూపులకు వచ్చే ఆదాయం, రుణాల చెల్లింపు వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ వీటి నిర్వహణ తీరును పర్యవేక్షించేందుకు రాష్ట్రస్థాయిలో డాష్ బోర్డునూ ఏర్పాటుచేశారు.
- సీహెచ్‌సీల్లోని సభ్యులు సొంతంగా వినియోగించుకోవడమే కాదు.. మండల పరిధిలోని చిన్న, సన్న కారు రైతులకు అద్దెకిస్తూ స్వయం ఉపాధి పొందుతున్నారు.

నేడు గుంటూరుకు సీఎం జగన్

సీఎం వైఎస్ జగన్ ఈనెల 2న (నేడు) గుంటూరు జిల్లాలో పర్యటించనున్నారు. గుంటూరులో వైఎస్సార్ యంత్రసేవా పథకం మెగామేళా–2లో భాగంగా రైతులకు ట్రాక్టర్లు, హార్వెస్టర్ల రాష్ట్రస్థాయి పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. ఉ.9.30 గంటలకు సీఎం తాడేపల్లి నివాసం నుంచి బయల్దేరి గుంటూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి చుట్టుగుంట వెళ్తారు. చుట్టుగుంటలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద వైఎస్సార్ యంత్రసేవా పథకం మెగామేళా–2లో భాగంగా రైతులుకు ట్రాక్టర్లు, హార్వెస్టర్ల రాష్ట్రస్థాయి పంపిణీ కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా జెండా ఊపి ప్రారంభిస్తారు. అనంతరం సీఎం తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

వైఎస్సార్ బీమా నమోదు ప్రారంభం

సాక్షి, అమరావతి: ఈ ఆర్థిక సంవత్సరానికి గాను వైఎస్సార్ బీమా పథకం నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. కుటుంబాన్ని పోషించే వ్యక్తి సహజంగా లేదా ప్రమాదవశాత్తు మరణిస్తే.. ఆ కుటుంబాలకు ప్రభుత్వం వైఎస్సార్ బీమా అందజేస్తోంది. గత నెల 29న నమోదు ప్రక్రియ ప్రారంభమవ్వగా.. గ్రామ, వార్డు సచివాలయాల్లో వలంటీర్లు వివరాలను నమోదు చేస్తున్నారు. ఈ నెల 7లోగా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్‌రెడ్డి ఆదేశించారు. వైఎస్సార్ బీమా పథకాన్ని 2021 జూలై 1న సీఎం వైఎస్ జగన్ ప్రారంభించారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. కాగా, 2023–24కు సంబంధించి జూలై 1 నుంచి వైఎస్సార్ బీమా పథకం అమలుకు కార్మిక శాఖ ఉత్తర్వులిచ్చింది. 18–50 ఏళ్లలోపు వయసున్న కుటుంబ పెద్ద సహజంగా మరణిస్తే వైఎస్సార్ బీమా కింద రూ.లక్ష పరిహారంగా అందజేస్తారు. అలాగే 18–70 ఏళ్లలోపు వయసున్న కుటుంబ పెద్ద ప్రమాదవశాత్తూ మరణించినా లేదా శాశ్వత వైకల్యం కలిగినా ఆ కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం చెల్లిస్తారు. బీమా కంపెనీలు, బ్యాంకులతో సంబంధం లేకుండా నేరుగా గ్రామ, వార్డు సచివాలయాల ద్వారానే పరిహారం చెల్లింపును ప్రభుత్వం చేపట్టింది. ఈ పథకానికి బడ్జెట్‌లో రూ.372 కోట్లను ప్రభుత్వం కేటాయించింది.

మారుమూల ప్రాంతాలకూ మొబైల్ కనెక్టివిటీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నక్సల్ ప్రభావిత గ్రామాలు, ఆకాంక్ష జిల్లాలకు మొబైల్ కనెక్టివిటీ కల్పించడంతో పాటు 4జీ సేవలను సంతృప్త స్థాయిలో అన్ని గ్రామాలకు అందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. ఈ మూడు ప్రాజెక్టులకు రూ.3,811.11 కోట్లతో ఇప్పటికే పనులను ప్రారంభమయ్యాయి. టవర్లు ఏర్పాటుకు అవసరమైన భూమితోపాటు అనుమతులను త్వరగా మంజూరు చేయాల్సిందిగా సీఎస్ జవహర్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. గురువారం కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మొబైల్ కనెక్టివిటీ టవర్ల ఏర్పాటుకు అవసరమైన స్థలాల అప్పగింత పురోగతిపై సీఎస్ సమీక్ష నిర్వహించారు. ఎక్కడైనా అటవీ ప్రాంతాల్లో స్థలాలు అవసరమైతే తమకు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు.

నల్లపూసల దండ మింగిన ఘనుడు

- 3 నెలల పాటు కడుపులో ఉండిపోయిన వైనం
- అనారోగ్యం సంభవించడంతో వైద్యుల దగ్గరకు పరుగు
- ఆపరేషన్ లేకుండానే బయటకు తీసిన ప్రభుత్వ వైద్యులు

అనంతపురం క్రైం: క్షణికావేశంలో ఓ వ్యక్తి తన భార్య నల్లపూసల దండ మింగేశాడు. 3 నెలల పాటు ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఉండిపోయాడు. ఇటీవల కడుపునొప్పి తీవ్రం కావడంతో వైద్యులను సంప్రదించగా, అనంతపురం సర్వజనాస్పత్రి ఈఎన్‌టీ విభాగం వైద్యులు ఎలాంటి ఆపరేషన్ లేకుండానే నల్లపూసల దండను నేర్పుగా బయటకు తీసి అతడికి పునర్జన్మ ప్రసాదించారు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన రామాంజనేయులు (45) మూడు నెలల క్రితం తన భార్య నల్లపూసల దండను(బంగారం కాదు)మింగేశాడు. ఇటీవల కడుపు నొప్పి తీవ్రం కావడంతో విషయం కుటుంబీకులకు చెప్పాడు. దీంతో వారు అతడిని అనంతపురంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చూపించారు. రూ.వేలల్లో ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో మే 29న ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తీసుకురాగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుకుమార్ రామాంజనేయులును పరీక్షించారు. వివరాలు ఆరా తీయగా, తాను చైన్‌ను మింగానని, ఏదైనా ఆహారం తీసుకోవడానికి ఇబ్బందిగా ఉందని చెప్పడంతో వైద్యుడు ఎక్స్‌రేకి రిఫర్ చేశాడు. రామాంజనేయులు అన్నవాహిక వద్ద నల్లపూసల దండ డాలర్ ఇరుక్కుని, దండ కడుపులోని ఈసోఫాగస్ (ఫుడ్‌పైప్) వరకు వెళ్లినట్లు కనిపించింది. దీంతో వైద్యులు అతడిని అడ్మిట్ చేసుకుని ఆపరేషన్ లేకుండానే కడుపులో ఉండిపోయిన నల్లపూసల దండ బయటకు తీయాలని నిర్ణయించారు. మే 30న అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సుకుమార్, డాక్టర్ కృష్ణ సౌమ్య, స్టాఫ్‌నర్సులు, అనస్తీషియా వైద్యుడు డాక్టర్ వేమానాయక్, ఓటీ టెక్నీషియన్ రాజేష్‌లు రామాంజనేయులు అన్నవాహికకు మత్తు మందు ఇచ్చారు. ఫ్లెక్సిబుల్ గ్యాస్ట్రో ఎండోస్కోపీ ద్వారా నల్లపూసల దండను తొలగించారు. రామాంజనేయులు ఆరోగ్యంగా ఉన్నట్లు అసిస్టెంట్ ప్రొఫెసర్ సుకుమార్ తెలిపారు. శస్త్ర చికిత్స లేకుండా కడుపు లోపల ఉన్న నల్లపూసల దండను బయటకు తీసిన వైద్యులను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ అభినందించారు.

బాణసంచా పేలి ముగ్గురి దుర్మరణం

తమిళనాడు సేలం జిల్లాలో ప్రమాదం

సాక్షి, చెన్నై: తమిళనాడులో గురువారం నాటు టపాసుల తయారీ గోడౌన్‌లో జరిగిన ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందారు. ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. సేలం జిల్లా ఇరుంబాలై సమీపంలోని సర్కారు కొల్లపట్టి గ్రామంలో ప్రభుత్వ అనుమతితో జరుగుతున్న నాటు టపాసుల తయారీ కేంద్రంలో పేలుడు సంభవించింది. సతీష్‌కు చెందిన గోడౌన్‌లో బాణసంచా వ్యాపారి, పదిమంది కార్మికులతో కలిసి పనుల్లో నిమగ్నమయ్యారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో హఠాత్తుగా పేలుడు జరిగింది. అక్కడున్న బాణసంచాలన్నీ పేలడంతో గోడౌన్ నామరూపాలు లేకుండా ధ్వంసమైంది. గోడౌన్ నిర్వాహకుడు సతీష్, కార్మికులు నటేషన్, ఒక మహిళ దుర్మరణం చెందారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడినవారిని సేలం ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ మేనిఫెస్టో టిష్యూ పేపర్‌లాంటిది: కారుమూరి

రాజమహేంద్రవరం సిటీ: చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో.. టిష్యూ పేపరులాంటిందని రాష్ట్ర పౌర సరఫరాల మంత్రి డా.కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజలు చంద్రబాబును, ఆయన మేనిఫెస్టోను నమ్మే స్థితిలో లేరన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. వెన్నుపోటు పొడిచే వ్యక్తిగా.. మాటమీద నిలబడని, మాయ మాటలు చెప్పే వ్యక్తిగా చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు గుర్తుండిపోయారని చెప్పారు. సుజనా చౌదరికి దొంగ కంపెనీలు మాత్రమే తెలుసని, ఢిల్లీలో ఉండే ఆయనకు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కనిపించదన్నారు. కర్నూలు, శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో గురువారం నుంచి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పైలెట్ ప్రాజెక్టుగా రాగులను పంపిణీచేస్తున్నట్టు తెలిపారు. గరిష్టంగా 3 కేజీల బియ్యానికి బదులుగా 3 కేజీల రాగులను తీసుకోవచ్చని, ఇది రేషన్ కార్డుదారులకు ఆప్షన్ అని స్పష్టం చేశారు. రాగులు వద్దనుకుంటే బియ్యాన్ని యథావిధిగా పొందొచ్చన్నారు. జూలై నుంచి ఇతర రాయలసీమ జిల్లాల్లో కూడా రాగులను ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేస్తామన్నారు. రక్తహీనతను అధిగమించేలా ఉత్తరాంధ్ర జిల్లాలో నాణ్యమైన గోధుమపిండిని త్వరలో అందిస్తామని మంత్రి కారుమూరి తెలిపారు. సీఎం జగన్ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సార్టెక్స్ బియ్యాన్ని అందిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలో సుమారు 1.50 లక్షల మంది రైతుల నుంచి రూ.2,763 కోట్ల విలువైన 13,53,700 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు తెలిపారు. ఇప్పటివరకు రూ.1,955 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని, మిగిలిన సొమ్ము వారం రోజుల్లో జమ చేస్తామని మంత్రి కారుమూరి వివరించారు.

డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్‌గా డాక్టర్ వై.శ్రీనివాసరావు



సాక్షి, విశాఖపట్నం: రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో)కు చెందిన నేవల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్ డైరెక్టర్ జనరల్‌గా డాక్టర్ వై.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం విశాఖలోని నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లేబొరేటరీ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. అండర్ వాటర్ వెపన్స్ తయారీ, అనుబంధ వ్యవస్థల రూపకల్పనలో భాగంగా ఎన్ఎస్‌టీఎల్‌లో 2021 జూన్ 1 నుంచి నాయకత్వ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. డాక్టర్ వై.శ్రీనివాసరావు హైదరాబాద్ జేఎన్‌టీయూ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన తర్వాత ఉస్మానియా యూనివర్సిటీ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ పొందారు. బీహెచ్‌ఈఎల్‌లో స్టీమ్ టర్బైన్ల తయారీ, సెంట్రిఫ్యూగల్ కంప్రెసర్లు, గ్యాస్ టర్బైన్ల తయారీ రంగాల్లో నిపుణుడిగా వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. 2000లో డీఆర్‌డీవోలో చేరిన ఆయన.. మిస్సైల్ డిఫెన్స్ ప్రోగ్రాంలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించారు. 2020 జనవరి 26న రిపబ్లిక్ పరేడ్‌లో ఏ-శాట్ శక్తి మిషన్ కంటింజెంట్ కమాండ్‌కు నాయకత్వం వహించిన మొదటి శాస్త్రవేత్తగా డాక్టర్ శ్రీనివాసరావు నిలిచారు. డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్‌గా గురుతర బాధ్యతలను నెరవేరుస్తానని డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు.

ఉద్యోగులు ఆర్టీసీ ఆదాయాన్ని పెంచాలి

నూతన వైద్యశాల కోసం స్థలాన్ని పరిశీలించిన ఎండీ ద్వారకా తిరుమలరావు

నరసరావుపేట: ఆర్టీసీ ఉద్యోగులు బాగా పని చేస్తూ ప్రజల మన్ననలు పొందుతూ సంస్థకు అధిక ఆదాయం లభించేలా కృషి చేయాలని ఆ సంస్థ ఎండీ ద్వారకా తిరుమలరావు సూచించారు. సంస్థకు చెందిన ఉద్యోగుల కోసం నూతన డిస్పెన్సరీ(వైద్యశాల) నిర్మించేందుకు కావాల్సిన స్థలాన్ని పరిశీలించేందుకు గురువారం నరసరావుపేటకు వచ్చారు. డిపోకు దక్షిణం వైపున ఉన్న స్థలం, గ్యారేజ్ ఆవరణలో ఖాళీగా ఉన్న 2 స్థలాలను పరిశీలించి గ్యారేజ్ ఆవరణలోని స్థలమే వైద్యశాలకు అనుకూలంగా ఉంటుందని నిర్ణయించారు. జిల్లా ప్రజారవాణా అధికారి ఎస్.శ్రీనివాసరావు అధ్యక్షతన గ్యారేజ్ ఆవరణలో యూనియన్ నాయకులు, ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అవసరమైన చోట నూతన డిస్పెన్సరీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. నరసరావుపేటలో ఆర్నెల్లలో ఉద్యోగులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అనంతరం అత్యధిక మైలేజ్ సాధించిన డ్రైవర్లు, ఆదాయం తీసుకొచ్చిన మహిళా కండక్టర్లకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఇళ్లస్థలాల గురించి సీఎం జగన్‌తో చర్చించా

మాజీ మంత్రి బాలినేని



సాక్షి, అమరావతి: తన నియోజకవర్గం ఒంగోలులోని ఇళ్లస్థలాల విషయం గురించి సీఎం వైఎస్ జగన్‌తో చర్చించినట్లు మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చెప్పారు. ఆయన గురువారం ముఖ్యమంత్రిని కలిసిన అనంతరం సీఎం క్యాంపు కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. 'జిల్లాలో పార్టీ పరిస్థితి, నా నియోజకవర్గం గురించి సీఎం అడిగారు. సమాచారం తెలిపాను. రీజనల్ కోఆర్డినేటర్ పదవి వద్దని అప్పుడే చెప్పాను. ఇప్పుడు అది అంశమే కాదు. మంత్రి పదవినే వదులుకున్నవాడిని.. ప్రొటోకాల్ గురించి కూడా ఎప్పుడూ ఫీలవలేదు. పదవినే వదులుకుని వచ్చాను... ఇక ప్రొటోకాల్ గురించి చర్చ ఏముంది? పార్టీలోని వారు కొందరు కావాలనే మీడియాకు లీకులిచ్చి దుష్ప్రచారం చేశారు. పార్టీలోని వారే కొంత ఇబ్బందులు పెట్టారు. దానిగురించే ఫైట్ చేశాను. టీడీపీ వారు కోర్టులో వేసినందున ఇళ్లస్థలాలు ఆగాయి. మళ్లీ మేం ఇస్తున్నాం. దీనికి సంబంధించిన నిధులు రిలీజ్ అయ్యాయి. ముఖ్యంగా మా నియోజకవర్గంలో రూ.200 కోట్లతో ఇళ్లస్థలాలు రెడీ చేస్తున్నాం. దానిగురించే సీఎం జగన్‌తో చర్చించాను. అంతేగానీ అలక ఎప్పుడూ లేదు. వారానికి ఒకసారి సీఎం జగన్‌ను కలుస్తూనే ఉన్నా. ఇప్పుడూ కలుస్తున్నా. ఇది రొటీన్. నియోజకవర్గంపై దృష్టి పెట్టాలని సీఎం జగన్ సూచించారు. సీఎంతో భేటీతో సంతృప్తిగానే ఉన్నాను..' అని ఆయన పేర్కొన్నారు.

టీడీపీ మేనిఫెస్టోను మేమెందుకు చూస్తాం?

- మాట ఇస్తే ఎవరు నెరవేర్చుతారో ప్రజలకు తెలుసు
- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



బొబ్బిలి: ఇతర రాష్ట్రాల్లోని పార్టీల నుంచి టీడీపీ పట్టుకొచ్చిన మేనిఫెస్టోను తామెందుకు చూస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. విజయనగరం జిల్లా బొబ్బిలి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన రైతు భరోసా–పీఎం కిసాన్ పెట్టుబడి నిధుల విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను కలిసిన మీడియాతో మంత్రి మాట్లాడుతూ ఎవరి మేనిఫెస్టో వారిది! ఆయా మేనిఫెస్టోలు.. అమలుచేసే తీరుపై నమ్మకం కలిగిన వారినే ప్రజలు ఎన్నుకుంటారు. ఎవరు మాట ఇస్తే నెరవేర్చుతారో ప్రజలకు తెలుసు. అలాంటప్పుడు ఆ మేనిఫెస్టోపై మేం మాట్లాడేందుకేముంది.. అంటూ విలేకరులను తిరిగి ప్రశ్నించారు. సంక్షేమ, అభివృద్ధి పాలన అందిస్తున్నదెవరో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు. తమ మనసును గెలుచుకున్నవారికే ప్రజలు ఓటేస్తారు.. అని మంత్రి బొత్స స్పష్టం చేశారు.

సత్తెనపల్లి నుంచే పోటీ చేస్తా.. గెలుస్తా!

- పదవుల కోసం పార్టీ మారే వాళ్లకు పెద్దపీట వేస్తారా?
- టీడీపీ నాయకుడు కోడెల శివరామ్




సత్తెనపల్లి: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తాను సత్తెనపల్లి నియోజకవర్గం నుంచే పోటీ చేసి.. గెలుస్తానని టీడీపీ నాయకుడు కోడెల శివరామ్ పేర్కొన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా కన్నా లక్ష్మీనారాయణ పేరును అధికారికంగా ప్రకటించడంతో శివరామ్ సత్తెనపల్లిలో తన అనుచరులతో గురువారం సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తన తండ్రి కోడెల శివప్రసాద్ టీడీపీ కోసం ప్రాణాలిచ్చారని, అలాంటి కుటుంబానికి టీడీపీ ఎందుకు అన్యాయం చేస్తోందో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్నే టీడీపీ అధినేత చంద్రబాబును అడగాలని, తమ బాధను చెప్పుకోవాలని అనేక రకాలుగా ప్రయత్నాలు చేశామన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జిని ప్రకటించే ముందు కనీసం కోడెల శివప్రసాద్ కుటుంబానికి చెప్పాల్సిన పనిలేదా, ఆయన మరణానంతరం టీడీపీ అభివృద్ధి కోసం శ్రమించిన కుటుంబ సభ్యులకు గౌరవం ఇవ్వక్కర్లేదా అని నిలదీశారు. తమ కుటుంబం విషయంలో టీడీపీ ఎందుకు వివక్ష చూపిస్తోందన్నదే తమ ఆవేదనకు కారణమన్నారు. మహానాడులో కూడా రూ.5 లక్షలు ఇస్తే భోజనం చేస్తామన్న టీడీపీ నాయకులు.. పార్టీ కోసం ప్రాణాలిచ్చిన తమ తండ్రి, తమ కుటుంబం కోసం 5 నిమిషాలు కూడా చంద్రబాబు కేటాయించకపోవడం తమకు బాధ కలిగిస్తోందన్నారు. పదవి కోసం మూడు పార్టీలు మారిన నాయకుడికి, కోడెల కుటుంబానికి పోలిక ఏమిటని కన్నా లక్ష్మీనారాయణను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. గతంలో కన్నా లక్ష్మీనారాయణ టీడీపీ నేతలు, కార్యకర్తలపై కేసులు పెట్టించి ఇబ్బందులకు గురి చేస్తుంటే కోడెల శివప్రసాద్ కాపాడి పార్టీ కార్యకర్తలకు అండగా నిలబడ్డారన్నారు. ఇదే కన్నా లక్ష్మీనారాయణ చంద్రబాబును దుర్భాషలాడి, ఆయనపై కేసులు వేశారని గుర్తు చేశారు.

అభిమానుల నిర్ణయమే.. నా నిర్ణయం

కోడెల శివప్రసాదరావు అభిమానులు ఏ నిర్ణయం తీసుకుంటారో అదే తన నిర్ణయమని, వారి ఆలోచనలనే తాను పాటిస్తానని శివరామ్ స్పష్టం చేశారు. ఇతర పార్టీల నుంచి తనకు ఆహ్వానాలు అందటం అపోహ మాత్రమేనన్నారు. కోడెల శివప్రసాద్ ఆశయాల కోసం సత్తెనపల్లి నియోజకవర్గంలో తాను పోటీ చేయడం ఖాయమన్నారు. గెలిచి ఆయన రుణం తీర్చుకుంటానన్నారు. తమ కోరిక, ఆశ, ఆలోచన చంద్రబాబు దృష్టిలో లేకుండా ఇవన్నీ జరుగుతున్నాయని, వీటన్నింటికి ఆయనే పరిష్కారం చూపుతారని భావిస్తున్నామన్నారు.

4న జేఈఈ అడ్వాన్స్‌డ్



సాక్షి, హైదరాబాద్: ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)ల్లో ప్రవేశానికి ఈ నెల 4న జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష జరగనుంది. ఐఐటీ గౌహతి ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇప్పటికే హాల్‌టికెట్ల డౌన్‌లోడ్‌కు ఆప్షన్లు కూడా ఇచ్చింది. గత నెలలో జేఈఈ మెయిన్స్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు దాదాపు 11 లక్షల మంది దేశవ్యాప్తంగా హాజరయ్యారు. వారిలో 2.5 లక్షల మందిని అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక చేశారు. ఏటా ఇదే విధంగా ఎంపిక చేస్తున్నా 1.50 లక్షల మంది మాత్రమే అడ్వాన్స్‌డ్‌కు వెళ్తున్నారు. అడ్వాన్స్‌డ్‌లో వచ్చే ర్యాంకుల ఆధారంగానే ఐఐటీలలో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక కౌన్సిలింగ్ నిర్వహిస్తారు. పరీక్ష మొత్తం ఆన్‌లైన్ విధానంలోనే జరుగుతుంది.

తెలంగాణ

పదో వసంతంలోకి తెలంగాణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. రాష్ట్రం పదో వసంతంలో అడుగిడుతున్న సందర్భంగా జూన్ 2 నుంచి మూడు వారాలపాటు దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వేడుకల్లో భాగంగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు రాష్ట్ర సచివాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. అన్ని శాఖల పరిధిలోని విభాగాధిపతుల కార్యాలయాల్లో ఉదయం 7.30గంటలకే జాతీయ జెండా ఆవిష్కరించాలని.. తర్వాత సచివాలయంలో జరిగే ఉత్సవాల్లో పాల్గొనాలని హెచ్ఓడీల అధికారులు, సిబ్బందిని ప్రభుత్వం ఆదేశించింది. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గత తొమ్మిదేళ్లలో రాష్ట్రం సాధించిన ప్రగతిపై విస్తృత ప్రచారం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఒక్కో రోజు ఒక్కో రంగం చొప్పున 21 రోజులపాటు ఆయా రంగాల్లో సాధించిన ప్రగతిని ప్రజలకు వివరిస్తూ కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించనున్నారు.

సూపర్‌ఫాస్ట్ రైల్వే లైన్లకు పచ్చ జెండా



- ఆరు నెలల్లో సర్వే పూర్తిచేయాలని రైల్వేబోర్డు నిర్ణయం
- విశాఖపట్నం–విజయవాడ–శంషాబాద్, విశాఖపట్నం–విజయవాడ–కర్నూలు మార్గాల సర్వేకు గ్రీన్ సిగ్నల్

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో మరో కీలక రైల్వే ప్రాజెక్టుకు బీజం పడింది. ఇరు రాష్ట్రాల అనుసంధానతను మరింత బలోపేతం చేసేందుకు రెండు కొత్త సూపర్ ఫాస్ట్ రైల్వే లైన్ల సర్వేకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం – విజయవాడ – తెలంగాణలోని శంషాబాద్ మధ్య మొదటిది, విశాఖపట్నం – విజయవాడ – కర్నూలు మార్గంలో రెండో రైల్వే లైన్ కోసం సర్వేకు రైల్వే బోర్డు అంగీకారం తెలుపుతూ.. దక్షిణ మధ్య రైల్వేకు లేఖ రాసింది. ఈ మార్గాల్లో సూపర్ ఫాస్ట్ రైల్వే ప్రాజెక్టు చేపట్టేందుకు అవసరమైన టెక్నికల్ ఫీజిబిలిటీని ఈ సర్వే ద్వారా నిర్ణయిస్తారు. సర్వే అయిన తర్వాత ప్రాజెక్టుపై ముందుడుగు పడనుంది. ఈ రెండు రైల్వే లైన్లు కలిసి 942 కిలోమీటర్ల మార్గంలో (గరిష్టంగా 220 కేఎంపీహెచ్ వేగంతో ప్రయాణించేలా) రైల్వే లైన్ నిర్మాణానికి అవసరమైన సర్వే నిర్వహించనున్నారు. ఈ సర్వేను 6 నెలల్లో పూర్తిచేయనున్నారు. ఈ సూపర్‌ఫాస్ట్ రైల్వేలైన్ ద్వారా తెలుగు రాష్ట్రాలకు చేకూరే లబ్ధి గురించి వివరించారు. ఈ నేపథ్యంలో రైల్వే బోర్డు తాజాగా ఈ రెండు రూట్లలో సూపర్ ఫాస్ట్ రైల్వే లైన్ల సర్వేకు నిర్ణయం తీసుకుంది.

నిశ్చయంగా, మేమే జీవనమిచ్చేవారం మరియు మేమే మరణింపజేసేవారం.
మీ అందరి మరలింపు మా వైపునకే జరుగుతుంది.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 2 జూన్ 2023

నేపాల్‌తో పటిష్ఠ బంధం

అనుభవాన్ని మించిన ఉపాధ్యాయుడు లేడంటారు. నేపాల్ ప్రధాని పుష్ప కమల్ దహల్ (ప్రచండ) ఆ పదవి చేపట్టాక విదేశీ పర్యటనకు మన దేశాన్ని ఎంచుకుని, బుధవారం నాలుగు రోజుల పర్యటన కోసం రావటం ఈ సంగతినే మరోసారి తెలియజెబుతోంది. ఆయనకు వామపక్ష నేపథ్యం ఉంది. రాచరికాన్ని కూలదోసి ప్రజాతంత్ర రిపబ్లిక్‌కు పట్టంగట్టిన సాయుధ పోరాటానికి నాయకత్వం వహించింది ఆయన నేతృత్వంలోని మావోయిస్టు పార్టీయే. అందువల్లే తొలి దఫా 2008లోనూ, ఆ తర్వాత 2016లోనూ అధికారంలోకొచ్చినప్పుడు ఆయన సహజంగానే చైనా వైపు మొగ్గు చూపారు. కానీ ఈసారి ఆయన ఆలోచనలో మార్పు వచ్చిన దాఖలా కనబడుతోంది. ఎందుకంటే మొన్న మార్చి నెలాఖరున చైనా నిర్వహించిన కీలకమైన బావ్ ఫోరం ఫర్ ఆసియా సమావేశానికి రారమ్మని ఆ దేశం పిలిచినా, అక్కడి అగ్ర నాయకత్వంతో సమావేశమయ్యే అవకాశం ఉన్నా వెళ్లకుండా ప్రతినిధి బృందాన్ని మాత్రమే పంపారు. నేపాల్ ప్రధాని పీఠాన్ని ఎవరు అధిరోహించినా తొలి విదేశీ పర్యటన కోసం భారత్ రావటం సంప్రదాయంగా వస్తోంది. కొత్త అధినేత రాగానే ఆహ్వానించటం భారత్‌కు కూడా రివాజైంది. కానీ ఈసారి మన దేశం ప్రచండను పిలిచేందుకు ఆర్నెల్ల సమయం తీసుకుంది. ఆయన పర్యటన మూడుసార్లు వాయిదాలు పడి ప్రస్తుత కార్యక్రమం ఖరారైంది. వాస్తవానికి నేపాల్‌లో ప్రచండకు మునుపటంత ఆకర్షణ లేదు. 275 స్థానాలుండే నేపాల్ పార్లమెంటుకు తొలిసారి జరిగిన ఎన్నికల్లో ఏకంగా 227 స్థానాలు గెల్చుకున్న ఆయన నేతృత్వంలోని కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (మావోయిస్టు సెంటర్) ఇప్పుడు రెండంకెల స్థాయికి పడిపోయింది. ఆమాటకొస్తే నేపాల్‌లో ప్రస్తుతం ఎవరికీ చెప్పుకోదగ్గ బలం లేదు. నేపాలీ కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (యూనిఫైడ్ మార్క్సిస్టు–లెనినిస్టు) తర్వాత మూడో స్థానంలో ప్రచండ పార్టీ ఉండగా... ప్రస్తుతం ఎనిమిది పార్టీల కూటమి ప్రభుత్వానికి ఆయన సారథ్యం వహిస్తున్నారు. సహజంగానే ఈ పరిస్థితి ఆయన వైఖరిలో మార్పు తెచ్చిందనుకోవాలి.

భారత్ – నేపాల్ సంబంధాల్లో అడపా దడపా ఒడిదుడుకులు ఎదురవుతున్న సంగతి నిజమే అయినా అవి నిలకడగానే ఉన్నాయి. నేపాల్‌తో మనకు 1,850 కిలోమీటర్ల నిడివి సరిహద్దు ఉంది. ఆ రీత్యా వ్యూహాత్మకంగా మన దేశానికి నేపాల్ అత్యంత ముఖ్యమైన దేశం. సముద్ర తీరం లేకపోవటం వల్ల సరుకు రవాణా, సర్వీసుల రంగాల్లో దాదాపుగా అది మన దేశంపైనే ఆధారపడుతుంది. నేపాల్ దిగుమతులన్నీ మన రేవుల ద్వారానే సాగుతాయి. ఇంధన రంగంలోనూ ఈ సహకారం కొనసాగుతోంది. ఆ దేశంలో భారత్ పలు జలవిద్యుత్ ప్రాజెక్టులు నిర్మించింది. మన దేశానికి నేపాల్ 450 మెగావాట్ల విద్యుత్‌ను ఎగుమతి చేస్తోంది. ఈ రంగంలో మన సహకారంతో మరిన్ని ప్రాజెక్టులు నిర్మించేందుకు ఆసక్తి కనబరుస్తోంది. అలాగే నేపాల్‌లో రైల్వే ప్రాజెక్టులకు భారత్ సాయం అందిస్తోంది. గురువారం ఇరుదేశాల ప్రధానులూ ఆన్‌లైన్‌లో రెండు చెక్‌పోస్టులనూ, బిహార్ నుంచి సరుకు రవాణా రైలును ప్రారంభించారు. ఇవిగాక రెండు దేశాల ప్రధానుల సమక్షంలో ఏడు ద్వైపాక్షిక ఒప్పందాలు కుదిరాయి. నేపాల్‌ను ఎప్పటికప్పుడు మంచి చేసుకునేందుకు చైనా శతవిధాల ప్రయత్నిస్తోంది. ఆ విషయంలో కొన్నిసార్లు సఫలీకృతమైంది కూడా. ఒక్క ప్రచండ అనేమిటి... భారత్ అనుకూలుడిగా ముద్రపడిన ఓలి శర్మ సైతం చైనా వ్యామోహంలో పడి మన దేశంపై నిప్పులు చెరిగిన సందర్భాలున్నాయి. కనుకనే చైనా పెట్టుబడుల శాతం గణనీయంగా పెరిగింది. కేంద్రంలో ఎవరు అధికారంలోవున్నా నేపాల్‌పై మన దేశం పెద్దన్న పాత్ర పోషించాలనుకోవటం అప్పుడప్పుడు సమస్యలకు కారణమవుతున్న సంగతి కాదనలేనిది. ఉదాహరణకు 2016లో రాజ్యాంగానికి ఆమోదముద్ర వేసే దశలో నేపాల్‌లోని తెరై ప్రాంతంలో ఉన్న మాధేసి, తారూ వంటి మైనారిటీ జాతులు ఉద్యమించాయి. వారి ఆందోళనలను పరిగణనలోకి తీసుకోవాలని, వారితో చర్చించి రాజ్యాంగంలో తగిన మార్పులు చేయాలని మన దేశం సూచించింది. కానీ దీన్ని నేపాల్ పట్టించుకోలేదు. ఆ తర్వాత తెరై ప్రాంతంలో భారీయెత్తున ఉద్యమాలు సాగాయి. దాంతో మన దేశంనుంచి వంటగ్యాస్ రవాణా నెలల తరబడి నిలిచిపోయింది. ఉద్యమాల వెనక భారత్ ప్రమేయం ఉన్నదనీ, తమను లొంగదీసుకునేందుకే ఇవన్నీ చేస్తున్నారనీ నేపాల్ ఆరోపించింది. ఈ పరిస్థితిని అప్పట్లో చైనా చక్కగా వినియోగించుకుంది.

వాస్తవానికి ఇప్పుడు సరిహద్దుల విషయంలో ప్రచండపై ఒత్తిళ్లు ఎక్కువే ఉన్నాయి. ఉత్తరాఖండ్‌లోని లింపియాధుర, కాలాపానీ, లిపులేఖ్ ప్రాంతాలు తమవేనని నేపాల్ చాన్నాళ్లుగా వాదిస్తోంది. వాటిని తమ దేశంలో భాగంగా చూపుతూ మూడేళ్ల క్రితం మ్యాప్‌లు కూడా ముద్రించింది. వాటికి సంబంధించిన బిల్లుల్ని కూడా అక్కడి పార్లమెంటులో ప్రవేశపెట్టారు. అయితే అనంతర కాలంలో ఈ వివాదం సద్దుమణిగింది. చర్చల ద్వారా ఈ సమస్యను పరిష్కరించుకోవాలని అంగీకారం కుదిరింది. దీన్ని ద్వైపాక్షిక చర్చల ద్వారా పరిష్కరించుకుందామని మోదీకి ప్రచండ సూచించారు. ఇరుగుపొరుగు అన్నాక సమస్యలు సహజం. వాటిని ఒడుపుగా పరిష్కరించుకోవటంలోనే ఆ దేశాల పరిణతి కనబడుతుంది. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలనూ 'సూపర్ హిట్' చేస్తామనీ, వాటిని హిమాలయ శిఖరాల ఎత్తుకు తీసుకెళ్తామనీ ప్రచండకు నరేంద్ర మోదీ వాగ్దానం చేశారు. ఇదొక మంచి పరిణామం. తదుపరి కార్యాచరణ ఆ దిశగా చురుగ్గా కదిలితే శతాబ్దాలనాటి ఇరు దేశాల సంబంధాలూ మరింత ఉన్నత స్థాయికి చేరతాయనడంలో అతిశయోక్తి లేదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.త్రయోదశి ఉ.10.57 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** విశాఖ తె.5.34 వరకు, తదుపరి అనూరాధ, **వర్జ్యం:** ఉ.10.58 నుండి 12.35 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.04 నుండి 8.54 వరకు, తదుపరి ప.12.22 నుండి 3.50 వరకు, **అమృతఘడియలు:** రా.8.40 నుండి 10.16 వరకు.

సూర్యోదయం : 5.28
సూర్యాస్తమయం: 6.27
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

కష్టాలు తీరుస్తూ కన్నీళ్లు తుడుస్తూ...

ఎన్నికల్లో గెలవడం కోసం నోటికొచ్చిన వాగ్దానాలు చేయడం, తర్వాత వాటిని మరిచిపోవడం మామూలే అనే అభిప్రాయం ప్రజానీకంలో పాతుకుపోయింది. కానీ అటువంటి అభిప్రాయాన్ని తారుమారు చేస్తూ మేనిఫెస్టోలో చేసిన వాగ్దానాల్లో 98 శాతం నెరవేర్చింది ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలోని వైసీపీ ప్రభుత్వం. ఇక ముందెవరైనా హామీ ఇవ్వాలంటే జగన్ నెలకొల్పిన ఈ ప్రమాణం అందుకోవాలి. అందుకే దేశం మొత్తం ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తోంది.

నైతికతకు నిలువుటద్దం

సందర్భం



డా॥ మేరుగు నాగార్జున

ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయపార్టీలు ఎన్నికల్లో గెలవడం కోసం అనేక హామీలు ఇస్తూ ఉంటాయి. వాటిని తమ మేనిఫెస్టోలో చేర్చి ప్రచారం చేసుకోవడం కూడా సహజం. అయితే గెలిచిన తర్వాత ఆ హామీలను అమలు చేయడంలోనే ఆయా పార్టీలు, లేదా నాయకుల మనుగడ ఆధారపడి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే నారా చంద్రబాబు నాయుడు, వైఎస్ జగన్ మోహన్ రెడ్డిలు నేతృత్వం వహిస్తున్న టీడీపీ, వైసీపీల పనితీరును అంచనా వేయాలి.

2014 ఎన్నికల్లో చంద్రబాబు అమలు చేయలేని వాగ్దానాలెన్నో చేశారు. ఏకంగా 650 వాగ్దానాలు చేస్తూ వాటిని తమ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి ఎన్నికల్లో గెలిచారు. అయితే సీఎం అయ్యాక ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలలో కనీసం 10 శాతం కూడా నెర వేర్చలేదు. సీఎంగా కొనసాగిన ఐదేళ్ల కాలంలో మేనిఫెస్టోను ఏ మేరకు అమలు చేశాననే విషయాన్ని కనీసం సమీక్షించుకోవడానికి కూడా ఆయనకు తీరిక దొరకలేదు. అంతకుముందు సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చంద్రబాబు 1994, 1999లలో కూడా రెండు సార్లు సీఎంగా పని చేశారు. ఆ సమయాల్లో కూడా తన పార్టీ మేనిఫెస్టోను అమలు చేయడంగానీ, ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం గానీ చంద్రబాబు చేయలేదు.

రాష్ట్ర విభజన తర్వాత నవ్యాంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు తాను సీఎంగా కొనసాగిన 2014–19 మధ్య కాలంలో ఉద్యోగాల విషయంలో రాష్ట్రంలోని యువతకు, రుణమాఫీ విషయంలో మహిళలకు, రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేశారు. పైగా బాబు ప్రభుత్వం అమలు చేసిన కొన్ని పథకాల్లో కూడా అర్హులైన వారందరికీ లబ్ధి కలిగించకుండా పైరవీలకు, అక్రమాలకు పెద్దపీట వేస్తూ 'జన్మభూమి కమిటీ'ల పేరుతో ప్రజలను దోచుకోవడానికి టీడీపీ శ్రేణులను ప్రజల మీదికి వదిలారు. అలా ఐదేళ్లు గడిచి పోతుండగా 2019 నాటి ఎన్నికలు సమీపిస్తున్న వేళ మహిళలకు 'పసుపు కుంకుమ' లాంటి పథకాల ద్వారా ప్రజలను మభ్యపెట్టి మరోసారి అధికారంలోకి రావాలనే ప్రయత్నం చేశారు. కానీ చంద్రబాబు నైజమేమిటో అప్పటికే బాగా అర్థమైన రాష్ట్ర ప్రజలు ఆయనను ఓడించి ఇంటికి పంపారు.

జగన్‌మోహన్ రెడ్డి తన 'నవరత్నాల' పథకాలతో పాటుగా ప్రజలకు చేసే ఇతర మేళ్లని గురించి రూపొందించిన మేనిఫెస్టోను ఇంటింటికీ పంచారు. మేనిఫెస్టోను బైబిల్, ఖురాన్, భగవద్గీతలతో పోల్చారు. అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచే మేనిఫెస్టోను అమలు చేయడం ప్రారంభించారు. జగన్ మూడేళ్ల పరిపాలనలోనే తన మేని ఫెస్టోలో 98 శాతం హామీలను నెరవేర్చారు. అంతటితో ఆగిపోకుండా మేనిఫెస్టోలో హామీ ఇవ్వని కొత్త పథకాలను కూడా అమలు చేయడం మొదలు పెట్టారు. డీబీటీ, నాన్– డీబీటీ పథకాల ద్వారా గత నాలుగేళ్ల కాలంలో ప్రజలకు సుమారుగా రూ. 2.82 లక్షల కోట్ల రూపాయలను అందించినా అందులో ఎక్కడా ఒక్క పైసా అవినీతి కూడా జరిగిందని ఎవరూ చెప్పలేని విధంగా పూర్తి నీతివంతమైన పరిపాలనను అందించడం జగన్ సృష్టించిన మరో చరిత్ర. అంతేకాదు దేశ చరిత్రలోనే మొదటి సారిగా ఒకేసారి 1.26 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేశారు. 30 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయడం ఇవాళ దేశమే అబ్బురపడు తున్న అభివృద్ధి. పథకాలను అందించడంలో అర్హతే ప్రామాణికంగా తీసుకొని కుల, మత, ప్రాంతీయ, వర్గ, వర్ణ, రాజకీయ పార్టీ విబేధాలకు తావివ్వకుండా చూడటం జగన్ నైతికతకు నిలువుటద్దం.

2014 ఎన్నికల్లో వాడుకొని మోసం చేసిన పవన్ కల్యాణ్‌తో మళ్లీ పొత్తుకోసం వెంపర్లాడటం, గతంలో తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించిన నరేంద్ర మోదీ చెలిమి కోసం ఇప్పుడు తహతహలాడటం చంద్రబాబు అనైతిక విధానానికి నిదర్శనమైతే, అప్పుడూ ఇప్పుడూ కూడా కేవలం ప్రజలనే నమ్ముకొని ఒంటరిగా బరిలో నిలబడటానికి సిద్ధపడటం జగన్ నైతికతకు తార్కాణం.

ఈ నేపథ్యంలోనే 2024లో రాబోయే ఎన్నికల కోసం చంద్రబాబు అప్పుడే తన మేనిఫెస్టోను ప్రకటించేశారు. షరా మామూలుగా తాను గతంలో ప్రజలకు ఏం చేసింది చెప్పకుండా ఇక ఇప్పుడేదో చేసేస్తాననే రీతిలో రాజమండ్రిలో టీడీపీ మేనిఫెస్టోను ప్రకటించారు. పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చిన మేనిఫెస్టోలోని అంశాలకే పేర్లు మార్చి తన మేని ఫెస్టోగా ప్రకటించడం గమనార్హం. ఆయన భావ దారిద్ర్యం ఏ స్థాయికి చేరిందంటే జగన్ పరిపాలనలో తల్లులందరి మన్ననలు పొందిన 'అమ్మఒడి' పథకానికి 'అమ్మకు వందనం' అని పేరుమార్చి తన మేనిఫెస్టోలో పెట్టేసుకున్నారు. అసలు ఎన్నడూ తన హామీలను నెరవేర్చని చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోకి విలువేముంటుంది? అయినా చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోపైన, జగన్ పరిపాలనపై చేస్తున్న ఆరోపణల మీద బహిరంగ చర్చకు రావాలని మేము చేసిన సవాల్‌కు ఇప్పటివరకూ బాబు నుంచి ఎలాంటి సమాధానం లేదు. ఇదివరకు అధికారమిచ్చి అందలం ఎక్కిస్తే చంద్రబాబు, ఆయన అనుచరగణం చేసిందేమిటో బాగా తెలిసిన రాష్ట్ర ప్రజలు ఇప్పుడు చంద్రబాబు మేని ఫెస్టో పేరిట కొత్తగా ఇస్తున్న హామీలను నమ్మే అవకాశం ఏ మాత్రం లేదు.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామాత్యులు



నిజంగా నవశకమే...

సందర్భం



డా॥ కారుమూరి వెంకట నాగేశ్వరరావు

ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన నాటి నుంచి 2019 వరకూ రెండే పార్టీల పాలన సాగింది. దీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా, ఆ తర్వాత కాంగ్రెస్ అధిష్టానం చేసిన అపరాధాల వల్ల నందమూరి తారక రామారావు ఆధ్వర్యంలో ఏర్పాటైన తెలుగుదేశం పార్టీ అధికారాన్ని చేజిక్కించుకుంది. ప్రజల నమ్మకాన్ని ఎన్టీఆర్ వమ్ము చేయలేదు. ప్రతి మనిషికి కూడు, గూడు, గుడ్డ అవసరమని భావించి ఆ దిశగా కొత్త సంక్షేమానికి తెర తీశారు. సమాజంలో అట్టడుగు వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు సంక్షేమ ఫలాలు దక్కేలా చేశారు. ఆ తర్వాత ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి చంద్రబాబు నాయుడు తెలుగు దేశం పార్టీని లాక్కొని అధికారంలోకి వచ్చారు. అక్రమంగా అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూశారు. ప్రజల ప్రాథమిక అవసరాలను పక్కన పెట్టి నేల విడిచి సాము చేశారు. హైటెక్ అంటూ కొన్ని వర్గాలకు రాష్ట్ర సంపదను దోచిపెట్టి పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచారు. విజన్ 2020 అంటూ త్రిశంకు స్వర్గంలో తేలియాడుతూ ప్రజలను గాలికొదిలేశారు.

సరిగ్గా ఇదే సమయంలో వైఎస్ రాజశేఖరరెడ్డి 'నేనున్నా' అంటూ తెలుగు ప్రజలకు భరోసా ఇచ్చారు. మండు వేసవిలో కాళ్లకు బొబ్బలు వచ్చినా ఆంధ్రప్రదేశ్‌లోని మూడు ప్రాంతాలలో తన ప్రజా ప్రస్థానాన్ని పూర్తి చేసి అధికారంలోకి వచ్చారు. వచ్చీ రాగానే ప్రజలను తమ అగచాట్ల నుంచి విముక్తి కలిగించేలా పదుల సంఖ్యలో సంక్షేమ పథకాలు అమలు చేశారు. కరవు కాటకాలతో అల్లాడుతున్న ప్రజలకు ఊపిరి పోశారు. వైఎస్ఆర్ పాలించిన ఐదేళ్ల మూడు నెలల్లో ప్రజలు హాయిగా, సంతోషంగా గుండెలో మీద చేతులు వేసుకుని బతికారు. ఆయన ఆకస్మిక మరణం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల ప్రజలను బాధించింది.

వైఎస్ఆర్ స్ఫూర్తితోనే నేను రాజకీయాల్లోకి అడుగు పెట్టాను. జడ్పీటీసీ సభ్యుడి స్థాయి నుంచి జడ్పీ ఛైర్మన్, ఎమ్మెల్యేగా ఎదిగాను. వైఎస్ మరణం తర్వాత ఆంధ్రప్రదేశ్ పరిస్థితి కుక్కలు చింపిన విస్తరి మాదిరిగా తయారైంది. సామాజిక, ఆర్థిక, రాజకీయ సమతుల్యత దెబ్బతింది. ప్రాంతీయ వాదాలతో అట్టుడికి పోయింది. అనంతరం ఆంధ్రప్రదేశ్ విభజన, మళ్లీ టీడీపీ అధికారంలోకి రావడం జరిగి పోయాయి. ఎప్పుడూ ఎవరో ఒకరి సహాయంతో లేదా అడ్డదారుల్లో అధికారంలోకి వచ్చే చంద్రబాబు చేతుల్లో ఆంధ్రప్రదేశ్ మరోసారి దోపిడీకి గురైంది. 40 ఏళ్ల పొలిటికల్ ఇండస్ట్రీ, గొప్ప విజనరీ అని డప్పాలు కొట్టుకునే చంద్రబాబు పాలనలో ఆంధ్రప్రదేశ్ ప్రజలు మరోసారి ఓడిపోయారు.

ఇదే సమయంలో దిక్సూచిలా వైఎస్ఆర్ తనయుడు జగన్ మోహన్ రెడ్డి ప్రజలకు కనిపించారు. నేను విన్నా... నేను కన్నా... నేను ఉన్నా అంటూ ప్రజల ఆదరాభిమానాలతో బంపర్ మెజారిటీతో అధికారంలోకి వచ్చారు. ఎన్టీఆర్‌కు కూడా ఇవ్వని భారీ మెజారిటీని ప్రజలు జగన్‌కు ఇచ్చారు. తన పాదయాత్రలో కనిపించిన, వినిపించిన ప్రజల కష్టాలను, అవస్థలను మేనిఫెస్టోగా రూపొందించారు. మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాను, బైబిలు మాదిరిగా భావించి అందులో పొందుపరిచిన ప్రతి అంశాన్ని తు.చ. తప్పకుండా అమలు చేస్తున్నారు. నాలుగేళ్లలో 98.5 శాతం హామీలను అమలు చేయడం చాలా గొప్ప విషయం. ఓ వైపు చంద్రబాబు ఖజానా ఖాళీ చేసినా... మరో వైపు కరోనాతో ఆర్థిక వ్యవస్థ కుదేలైనా... ఏ మాత్రం బెదరకుండా మొక్కవోని ధైర్యంతో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముందుకే వెళ్లారు. కేంద్రం నుంచి రావాల్సినవి రాబట్టుకుంటూ, పొదుపు మంత్రం పాటిస్తూ చంద్రబాబు హయాంలో చెల్లాచెదురైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి ఓ వైపు సంక్షేమం, మరో వైపు అభివృద్ధిని రెండు కళ్లుగా అడుగులు ముందుకు వేస్తున్నారు. విద్యా, వైద్య రంగాలలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. చదువు ఒక్కటే భావితరాలకు తరగని ఆస్తి అని చెప్పి విద్యార్థుల పాలిట మేనమామగా మారారు. ప్రతి పేద వాడి ఆరోగ్యం బాగుంటేనే కుటుంబం చక్కగా ఉంటుందని భావించారు. రైతు సంక్షేమమే ప్రధానంగా భావించి గత టీడీపీ హయాంలో పడకేసిన వ్యవసాయాన్ని పండుగ చేశారు.

జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల పేర్లు వరుసగా టకటకా చెబితే పది లక్షల బహుమతి ప్రకటించా! ఇంతవరకూ నా వద్దకు వచ్చి ఎవరూ చెప్పలేక పోయారు. అంటే అన్ని పథకాలను ఆయన ప్రజలకు అందిస్తున్నారు. అన్ని ప్రాంతాలకూ, అన్ని వర్గాలకూ సమన్యాయం చేయడం సాధ్యమని ఈ నాలుగేళ్లలో జగన్ నిరూపించారు. పరిపాలనలో పారదర్శకత, ప్రజల గుమ్మం ముందుకు ప్రభుత్వం వెళ్లడం, అవినీతికి అవకాశం లేకుండా నేరుగా లబ్ధిదారుల అకౌంట్లలో నగదు బదిలీ, వాలంటీర్ల సేవలు తదితరాలు గతంలో ఎన్నడూ లేనివి. ఇవన్నీ కొత్తగా ప్రవేశపెట్టిన జగన్ పెద్ద విజనరీ. ప్రతిపక్షాల విమర్శలు, పచ్చ మీడియా దాడులకు అదరని, బెదరని గొప్ప ధైర్యశాలి. నాలుగేళ్ల పాలనతో 42 ఏళ్ల రాజకీయ సీనియర్ అని చెప్పుకొనే చంద్రబాబుకు ముచ్చెమటలు పట్టించారు. జగన్ పాలన నిజంగా నవ శకమే!

వ్యాసకర్త రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి
(వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా)

చెడు ఊహించకు...

చెడు వినకు, చెడు కనకు, చెడు మాట్లాడకు – అనే మూడు నియమాలు స్వీయ నియంత్రణ సూత్రాలుగా ప్రసిద్ధమై ఉన్నాయి. ఎవరి గురించైనా చెడుగా మాట్లాడుతుంటే వినడం, చెడు జరుగుతుండగా చూడడం, వేరే ఎవరి గురించైనా పనిగట్టుకుని చెడుగా మాట్లాడటం అన్నవి మనిషికి హాని చేసేవి కనుక, ప్రయత్నపూర్వకంగా నియంత్రించుకోవడానికి మించిన ఉత్తమమైన ధర్మం మరొకటి ఉండదని పెద్దలు చెప్పారు.

అయితే, ఈ మూడు మాత్రమే కాకుండా మనిషి తన నియంత్రణలో పెట్టుకోవాల్సినదీ... నిజానికి ఈ మూడింటినీ మించినదీ... మరొకటి ఉంది. ఈ విషయాన్ని

జ్యోతిర్మయం

సంస్కృత భారతంలో వ్యాసుల వారు చెప్పగా, దాన్ని అంతే చక్కగా తెలుగులో తిక్కన మహాకవి చెప్పారు. ఆ నాలుగవ నియమం 'చెడును ఊహించకు' అన్నది.

''విచ్చలవిడి నింద్రియముల/ నెచ్చటికైనను జనంగ నిచ్చిన నరకం/ బచ్చుపడుచు, గడియించిన/ దెచ్చు సుగతి నరున కది.'' (అనుశాసనిక పర్వం, పంచమాశ్వాసం, 234వ పద్యం) విచ్చలవిడిగా కన్ను, చెవి, ముక్కు మొదలుగాగల పంచేంద్రియాలనూ, వాటికి నియంత్రణ స్థానమైన మనసు చేసే ఊహలనూ ఎటుపడితే అటుగా వెళ్ళనిస్తే, అది పోను పోను నరకం అంటే ఎలా ఉంటుందో రుచి చూపిస్తుంది అని చెబుతూ, ఊహలను అదుపులో ఉంచుకోవడాన్ని ముందుకు తెచ్చి 'చెడును ఊహించకు' అని చెబుతుంది పై పద్యం. అలా కాకుండా, బుద్ధిగా ఆలోచనలను అదుపులో ఉంచుకొనడాన్ని అవలంబిస్తే, దానికదే మంచి గతికి మార్గమవుతుందన్నది తాత్పర్యం. పై మూడు నియమాలతో పాటుగా, 'చెడును ఊహించకు' అన్నది కూడా ఎంతగానో అవసరం అన్నది గుర్తించాలి. అది తప్పనిసరిగా అనుసరించవలసిన స్వీయ నియంత్రణ సూత్రం అవుతుంది.

– వెంకట్ భట్టు

భాషను శ్వాసించిన... కలం, గళం!

సందర్భం



తోట భావనారాయణ

తమిళనాడుకు ఐదు విడతలు ముఖ్యమంత్రిగా ఉన్నా, జీవితాంతం మనసంతా సాహిత్యం చుట్టూ తిరుగుతూ ఉండటం ముత్తువేల్ కరుణానిధికే చెల్లింది. ద్రావిడ ఉద్యమంలో తొలి విద్యార్థి సంఘం నాయకుడై ఉద్యమంతో బాటే రచనకూ శ్రీకారం చుట్టారాయన. 13 ఏళ్ల వయసులోనే 'సెల్వచంద్ర' చారిత్రక నవల రాశారు. చదువు హైస్కూల్ స్థాయి దాటకపోయినా చారిత్రక నవలలు, జీవిత చరిత్రలు, కవితలు, కథలు, వ్యాసాలు, నాటకాలతో బాటు సినిమాలకు కథ, మాటలు, స్క్రీన్‌ప్లే అందించడం ఆయన అద్భుతమైన రచనాశక్తికి నిదర్శనం.

ఆలయాలలో, గ్రామ వేడుకల సమయంలో మేళం వాయించే 'ఇసై వేళాళర్' సామాజిక వర్గానికి చెందిన కరుణానిధి చిన్నప్పుడు సంగీతం నేర్చుకోవటానికి వెళ్ళినప్పుడు అక్కడి కుల వివక్ష ఆయన మీద బలమైన ముద్ర వేసింది. సంగీతం నేర్పేవారు చులకన భావం చూపటం సహించలేకపోయారు. తన అభ్యుదయ భావాలను వెల్లడించటానికి రచనల బాట పట్టారు.

చారిత్రక చిత్రాలలో కట్టిపడేసే సంభాషణలు రాయటంలో, ప్రేక్షకులలో ఉద్వేగం నింపి ఆసక్తి పెంచే స్క్రీన్ ప్లే సిద్ధం చేయటంలో కరుణానిధి దిట్ట. తరువాతి కాలంలో తనకు రాజకీయ ప్రత్యర్థిగా మారిన ఎంజీ రామచంద్రన్ కథానాయకుడిగా నటించిన మొదటి సినిమా 'రాజకుమారి' (1950)కి కథ, మాటలు సమకూర్చినవారు కరుణానిధి. శివాజీ గణేశన్‌కు ఎంతో పేరు తెచ్చిపెట్టి, సినిమా పరిశ్రమలో నెలబెట్టిన ఆయన మొదటి చిత్రం 'పరాశక్తి' (1952)లో శక్తిమంతమైన మాటలు రాసింది కూడా కరుణానిధి. దాదాపు 40 సినిమాలకు రాయటమే కాదు, ఆయన నవలలు కూడా సినిమాలుగా మారాయి.

పెరియార్ నాయకత్వంలో హిందీ వ్యతిరేక ఆందోళన జరుగుతున్న రోజుల్లో కరుణానిధిలోని అసలైన నాయకుడు బైట పడ్డాడు. దాల్మియాపురం స్టేషన్ దగ్గర రైలుపట్టాల మీద పడుకొని ఆయన ఇచ్చిన నినాదం 'ఉడల్ మన్నుక్కు.... ఉయిర్ తమి ళుక్కు' (దేహం మట్టికి, ప్రాణం తమిళా నికి) ఇప్పటికీ తమిళనాట ప్రతిధ్వనిస్తూనే ఉంది. 1965లో హిందీ ఉద్యమంలోనే శివలింగం అనే యువకుడు ఆత్మాహుతి చేసుకుంటూ రాసిన లేఖలోని ఇవే మాటలను... మణిరత్నం 'ఇరువర్' (1997–తెలుగులో 'ఇద్దరు'గా రిలీజ్) సినిమాలో వైరముత్తు వాడటం, ఆ తరువాత అదే పేరుగా సాయి కుమార్, రంజిత జంటగా ఒక సినిమా రావటం... అలా అదే ఉద్విగ్నత తమిళ ప్రజల్లో కొనసాగుస్తూ వస్తోంది. 70 ఏళ్ళు గడిచినా, తమిళ ప్రసంగాలలో వినిపించే శక్తిమంతమైన నినాదమిది.

అధికారంలో ఉన్నా, లేకపోయినా సాహితీ వ్యాసంగానికి ఆయన విరామం ఇవ్వలేదు. డీఎంకే ప్రచార పత్రిక 'మురసొలి' (తెలుగు అర్థం: శంఖారావం)లో ఆయన రాయని రోజంటూ లేదు. కథో, కవితో, వ్యాసమో లేదా కార్యకర్తలకు ఒక లేఖ అయినా రాయాల్సిందే. నాగపట్టణం జిల్లాలోని ఆయన సొంత ఊరు తిరుక్కువలైలో ఉన్న పూర్వీకుల ఇంటిని గ్రంథాలయం కోసం ఇచ్చారు. చెన్నైలోని పార్టీ కార్యాలయ భవనం అన్నా అరివాలయంలో మ్యూజియం, లైబ్రరీ ఆయన అభిరుచికి అద్దం పడతాయి.

కరుణానిధి ప్రసంగాలు ఎంతో ఆకట్టుకుంటాయి. అడుగడుగునా మెరుపులు, విరుపులు ఆయన ప్రత్యేకం. ఒకసారి తమిళనాడు తెలుగు సంఘాలు ఆయన ముఖ్యమంత్రి పదవి చేపట్టిన సందర్భంగా సత్కరించి వాటి సమ



స్యలు ఏకరవు పెట్టాయి. అందులో కొన్ని ప్రభుత్వం మీద ఆర్థిక భారం వేసేవి, ఇంకొన్ని విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాల్సినవి. తెలుగు సంఘాలు ఆయనను పొగడ్తలలో ముంచెత్తి ఆయన వరాల కోసం ఎదురుచూశాయి. కరుణానిధి తన సత్కారానికి ధన్యవాదాలు చెబుతూ, ''కరుణ ఎంత కావాలన్నా తీసుకోండి, నిధి మాత్రం అడక్కండి'' అని తన మనసులో మాట చమత్కారంగా చెప్పారు.

ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లోనే ఒకసారి ఆయన సెక్యూరిటీని వదిలేసి అజ్ఞాత ప్రదేశానికి వెళ్ళిపోయారు. ఇంటలిజెన్స్ అధికారులకు ముచ్చెమటలు పట్టాయి. రాత్రి 10 గంటలకు అదృశ్యమైన ముఖ్యమంత్రి తెల్లవారు జామున నాలుగు గంటలకు ఇంటికి చేరారు. ఎక్కడికి వెళ్ళారన్నది రహస్యం. రెండు రోజుల తరువాత ఆయన 'మురసొలి'లో రాసిన సుదీర్ఘ సాహిత్య వ్యాసం చదివిన తరువాతగానీ అసలు విషయం తెలియలేదు. ఆ ముందురోజు రాత్రి ఆయన వైరముత్తును వెంటబెట్టుకొని మహాబలిపురం రోడ్డులో సముద్రతీరానికి వెళ్ళి సాహిత్య చర్చలు జరిపారు. ఆ సంభాషణ సారాంశాన్ని ఆ వ్యాసంలో రాశారు.

తమిళ భాష మీద కరుణానిధికి ఉన్న అభిమానం అంతా ఇంతా కాదు. తిరువళ్ళువర్ మీద అభిమానంతో ఆయన స్మారక చిహ్నంగా చెన్నై నగరం నడిబొడ్డున 'వళ్ళువర్ కొట్టం' నిర్మించారు. ప్రారంభానికి కొద్ది వారాల ముందు అకస్మాత్తుగా ప్రభుత్వం రద్దవటంతో 13 సంవత్సరాల తరువాత ప్రారంభించటమే కాదు, అక్కడే ప్రమాణ స్వీకారోత్సవం జరిపారు. కన్యాకుమారిలో 133 అడుగుల తిరువళ్ళువర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. తమిళానికి శాస్త్రీయ భాష హోదా కల్పించటంలో విజయం సాధించారు. పారిస్, కౌలాలంపూర్ మొదలు కోయంబత్తూరు, మదురై దాకా జరిగిన ప్రపంచ తమిళ సదస్సులలో పాల్గొనటంతో బాటు స్వయంగా థీమ్ సాంగ్ రాశారు.

1924 జూన్ 3న పుట్టిన కరుణానిధికి ఇది శతజయంతి సంవత్సరం. ఈ జూన్ 3 నుంచి వచ్చే జూన్ 3 వరకు అనేక కార్యక్రమాలు జరపాలని తమిళనాడు ప్రభుత్వం నిర్ణయించింది. అన్నిటికంటే ముఖ్యంగా ఆయన సాహిత్యాభిలాషకు చిహ్నంగా చెన్నై మెరీనా తీరంలో 42 మీటర్ల ఎత్తుండే ఒక కలాన్ని పంచలోహ విగ్రహంగా నెలకొల్పుతున్నారు. తీరానికి 360 మీటర్ల దూరంలో సముద్రంలో ఏర్పాటు చేస్తున్న ఈ కలం విగ్రహం, ఇప్పటికే ఉన్న కరుణానిధి సమాధికి చేరువలోనే ఉంది. గ్లాస్ ఫ్లోరింగ్‌తో నిర్మించే ల్యాటిస్ బ్రిడ్జ్ మీదుగా సందర్శకులు వెళ్ళే విధంగా మొత్తం 80 కోట్లతో ఈ ప్రాజెక్ట్ పనులు జరుగుతున్నాయి.

స్వీయ ప్రసంగాలలోనూ, లేఖలలోనూ 'ఎన్ ఉయిరినుమ్ మేలాన అన్బు ఉడన్ పిరప్పుగళే' (నా ప్రాణం కంటే మిన్నయైన ప్రియమైన తోబుట్టువులారా) అని సంబోధించే కరుణానిధిని కార్యకర్తలు స్మరించుకోవటానికి ఇది తగిన ప్రదేశంగా మారుతుంది. వందకు పైగా రచనలు చేసిన కరుణానిధికి ఇది సరైన నివాళి.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయుడు
(జూన్ 3 నుంచి కరుణానిధి శతజయంతి వేడుకలు ప్రారంభం)

నేల బావిలో పడి ముగ్గురి మృతి

- మృతులందరూ ఒకే కుటుంబానికి చెందిన వారు



మృతి చెందిన నాగులు, అంజినేయులు, నాగార్జున

మాచవరం: ప్రమాదవశాత్తు నేల బావిలో పడి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. ఈ ఘటన పల్నాడు జిల్లా మాచవరం మండలంలో జరిగింది. మోర్జంపాడు గ్రామానికి చెందిన ఎనుముల నాగులు (40), అతడి కుమారుడు ఎనుముల నాగార్జున (16), సోదరుడు ఎనుముల అంజినేయులు ఉరఫ్ అంజియ్య (60) గొర్రెల కాపరులు. వీరు గురువారం మధ్యాహ్నం కొత్తపాలెం గ్రామ శివారు పొలాల్లో గొర్రెలు మేపుకుంటూ, వాటికి నీళ్ల తాగించేందుకు నేల బావి వద్దకు వచ్చారు. కొన్ని గొర్రెలు బావిలోకి దూకడంతో వాటిని బయటకు పంపే ప్రయత్నంలో బావిలోకి దిగారు. లోతు ఎక్కువగా ఉండటంతో ఒకరి తర్వాత ఒకరు మృత్యు ఒడిలోకి చేరారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్లతో మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టానికి తరలించారు.

పెట్రోలు పోసుకుని ఆర్మీ జవాన్ ఆత్మహత్య

- కుటుంబ కలహాలే కారణం

రాచర్ల: ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆర్మీ జవాన్ ఆత్మహత్య చేసుకున్న ఘటన ప్రకాశం జిల్లా రాచర్ల మండలంలోని కాలువపల్లె పంచాయతీ పరిధిలోని గంగంపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. రాచర్ల మండలం సోమిదేవిపల్లె గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ కొప్పెట సుధాకర్‌రెడ్డి (38) గంగంపల్లె గ్రామానికి చెందిన కల్పన అనే మహిళను వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె సంతానం. గంగంపల్లె గ్రామంలోనే సొంతిల్లు నిర్మించుకుని 11 సంవత్సరాలుగా అక్కడే నివాసం ఉంటున్నారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో విధులు నిర్వర్తిస్తున్న సుధాకర్‌రెడ్డి.. ఇటీవల నెల రోజుల సెలవుపై గంగంపల్లె గ్రామానికి వచ్చాడు. తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు వస్తుండడంతో ఇటీవల రాచర్ల పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం కేసులు పెట్టుకున్నారు. భార్యాభర్తలకు పోలీసులు నచ్చజెప్పి పంపించారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి 12 గంటలకు అందరూ నిద్రిస్తున్న సమయంలో సుధాకర్‌రెడ్డి ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్నాడు. కుటుంబ సభ్యులతో పాటు చుట్టుపక్కల ప్రజలు మంటలను అదుపుచేసి వెంటనే గిద్దలూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మార్కాపురం తీసుకెళ్లగా చికిత్స పొందుతూ సుధాకర్‌రెడ్డి మరణించాడు. రాచర్ల ఎస్‌ఐ వి.మహేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే వస్తారు.. ఇళ్లకు తాళాలు వేసుకోండి!

- చిత్తూరు జిల్లాలో ఓ టీడీపీ నాయకుడి చోద్యం

బంగారుపాళెం(చిత్తూరు జిల్లా) : గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే వస్తున్నారని ఇళ్లకు తాళాలు వేసుకోండంటూ టీడీపీకి చెందిన ఓ సర్పంచ్ ప్రజలకు ఆదేశాలిచ్చారు. దీంతో కొందరు టీడీపీ సానుభూతిపరులు ఇళ్లకు తాళాలు వేసుకున్నారు. ఈ ఘటన చిత్తూరు జిల్లా బంగారుపాళెం మండలంలోని 170 గొల్లపల్లెలో గురువారం చోటుచేసుకుంది. అర్హులకు ప్రభుత్వ పథకాలు సకాలంలో అందుతున్నాయా, లేదా, స్థానికంగా ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు గురువారం పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు 170 గొల్లపల్లె పంచాయతీ పరిధిలోని జయరామపురం, ఎర్రాండ్లపల్లె, 170 గొల్లపల్లె, దళితవాడ, బంగిడిమిట్ట గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో కొందరు టీడీపీ సానుభూతిపరులు ఇళ్లకు తాళాలు వేసుకున్నారు. అయితే ఇళ్లల్లో ఉన్న వారి వద్దకు ఎమ్మెల్యే వెళ్లి ప్రభుత్వం ద్వారా అర్హులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.

సర్పంచ్‌కు ఎమ్మెల్యే ఫోన్

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బాబు స్థానిక సర్పంచ్ ప్రకాష్‌నాయుడు ఇంటి వద్దకు వెళ్లారు. సర్పంచ్ ఇంటి గేటుకు తాళాలు వేసుకున్నారు. దాంతో ఎమ్మెల్యే సర్పంచ్‌కు ఫోన్‌చేశారు. సర్పంచ్ ఫోన్ లిఫ్ట్ చేయలేదు. మండల సర్వసభ్య సమావేశాల్లో తమ పంచాయతీలో సమస్యలున్నాయంటూ ధ్వజమెత్తే సర్పంచ్.. మరి ఆ సమస్యలను తెలియజేయకుండా ఇంటికి తాళాలు వేసుకుంటే ఎలాగని ప్రశ్నించారు. కాగా, పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్న సమాచారం తెలుసుకుని సర్పంచ్ ప్రకాష్ బుధవారం రాత్రే గ్రామాల్లోని వీధుల్లో టీడీపీ జెండాలను ఏర్పాటు చేయించారు. సర్పంచ్, ఎంపీటీసీ టీడీపీ వారే కావడంతో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంపై బురదచల్లే ప్రయత్నాలు సాగించారు.

వైద్య విద్యలో నూతన అధ్యాయం

ఈ సంవత్సరం ఏకంగా 5 ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రారంభం

- మచిలీపట్నం, ఏలూరు, నంద్యాల, రాజమండ్రి, విజయనగరం కాలేజీలకు ఎన్‌ఎంసీ అనుమతి
- ఒకేసారి 750 ఎంబీబీఎస్ సీట్లు పెరుగుదల
- రాష్ట్రంలో 17 కొత్త మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తున్న వైఎస్ జగన్ ప్రభుత్వం
- వైద్య రంగం అభివృద్ధికి రూ. 16 వేల కోట్లకు పైగా ఖర్చు
- వైద్య కళశాలల నిర్మాణానికే రూ. 8,480 కోట్లు

ఒకే ఏడాది 5 ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రారంభం రాష్ట్ర చరిత్రలోనే ప్రథమం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వైద్య విద్యలో నూతన అధ్యాయాన్ని ఆవిష్కరించారు. 2019 ఎన్నికలకు ముందు రాష్ట్రంలో పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక వైద్య కళాశాల ఉండేలా చర్యలు తీసుకుంటామన్న హామీని నెరవేరుస్తూ ప్రస్తుతం ఉన్న 11 వైద్య కళాశాలలకు అదనంగా 17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. వీటిలో ఈ విద్యా సంవత్సరం (2023–24) ఐదు కళాశాలల్లో 750 ఎంబీబీఎస్ సీట్లలో ప్రవేశాలకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) అనుమతి ఇచ్చింది. మచిలీపట్నం, ఏలూరు, నంద్యాల, రాజమండ్రి, విజయనగరం కళాశాలల్లో ఈ ఏడాది నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి.

రాష్ట్ర చరిత్రలో ఇదే ప్రథమం

ప్రభుత్వ రంగంలో ఒకే ఏడాది ఐదు వైద్య కళాశాలలు ప్రారంభం అవడం రాష్ట్ర చరిత్రలో ఇదే ప్రథమం. రాష్ట్రంలో మొట్ట మొదటగా 1923లో ఆంధ్ర వైద్య కళాశాల ఏర్పాటైంది. అప్పటి నుంచి 2019కి అంటే 96 ఏళ్లలో 11 ప్రభుత్వ వైద్య కళాశాలలు మాత్రమే ఏర్పాటయ్యాయి. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత వైద్య విద్యా రంగం అభివృద్ధికి వేగంగా చర్యలు చేపట్టారు. నాడు – నేడు పథకం కింద రూ.16 వేల కోట్లకు పైగా ఖర్చుతో ప్రభుత్వ వైద్య రంగం బలోపేతానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా రూ.8,480 కోట్లతో 17 కొత్త వైద్య కళాశాలల నిర్మాణం చేపట్టారు. కరోనా వ్యాప్తి, లాక్ డౌన్ వంటి ఒడిదుడుకులను కూడా అధిగమించి వైద్య కళాశాలలు నిర్మిస్తున్నారు. వీటిలో ఐదు కాలేజీలు ఈ ఏడాది ప్రారంభమవుతున్నాయి. ప్రస్తుతం ఉన్న 11 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 2,185 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. కొత్త కళాశాలలతో మరో 750 సీట్లు పెరుగుతాయి. దీంతో ప్రభుత్వ రంగంలోనే రాష్ట్రంలో 2,935 సీట్లు ఉంటాయి. వీటిలో 15 శాతం ఆల్ ఇండియా కోటాలో భర్తీ చేస్తారు. మిగిలిన సీట్లను రాష్ట్ర కోటాలో భర్తీ చేస్తారు. వచ్చే ఏడాది పులివెందుల, పాడేరు, ఆదోని కళాశాలలు, ఆ తర్వాతి ఏడాది మిగిలిన తొమ్మిది కళాశాలలు ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మరోవైపు ఇప్పటికే ఉన్న కళాశాలలు, ఆస్పత్రులను రూ.3,820 కోట్లతో బలోపేతం చేస్తోంది. అంతేకాకుండా ఎన్‌ఎంసీ నిబంధనలకు అనుగుణంగా వైద్య కళాశాలల్లో మానవ వనరులు, ఇతర సదుపాయాలను సమకూర్చింది. వీటన్నింటి ఫలితంగా 627 పీజీ సీట్లు పెరిగాయి. తద్వారా భవిష్యత్‌లో రాష్ట్రంలో స్పెషలిస్ట్ వైద్యుల సంఖ్య పెరగనుంది.



మచిలీపట్నంలో తుది దశకు చేరిన మెడికల్ కాలేజీ భవనం

ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేస్తున్న 17 కొత్త వైద్య కళాశాలలు

కళాశాల	నిధులు (రూ.కోట్లలో)		
		మదనపల్లె	475
		పులివెందుల	500
విజయనగరం	500	ఆదోని	475
మచిలీపట్నం	550	పిడుగురాళ్ల	500
రాజమండ్రి	475	పెనుకొండ	475
ఏలూరు	525	పాలకొల్లు	475
నంద్యాల	475	నర్సీపట్నం	500
పాడేరు	500	పార్వతీపురం	600
మార్కాపురం	475	బాపట్ల	505
		అమలాపురం	475
మొత్తం			8,480

ఆగస్టులో అడ్మిషన్లు.. సెప్టెంబర్‌లో తరగతులు

రాష్ట్ర వైద్య శాఖ మంత్రి విడదల రజిని



గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రంలో కొత్తగా నిర్మించిన 5 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో తరగతుల ప్రారంభానికి ఎన్‌ఎంసీ అనుమతులివ్వడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్తశుద్ధికి నిదర్శనమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. మంత్రి గురువారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 17 కాలేజీలు నిర్మిస్తున్నారని తెలిపారు. తొలి విడతలో విజయనగరం, నంద్యాల, ఏలూరు, రాజమండ్రి, మచిలీపట్నం కాలేజీల నిర్మాణం పూర్తయిందని, వీటిలో అడ్మిషన్లకు ఎన్‌ఎంసీ అనుమతిచ్చిందని చెప్పారు. ఈ కళాశాలల్లో ఆగస్టులో అడ్మిషన్లు చేపట్టి, సెప్టెంబర్‌లో తరగతులు ప్రారంభిస్తామన్నారు. మెడికల్ సీట్ల కోసం రాష్ట్ర విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఏపీలోనే అవకాశాలను కల్పిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ కాలేజీల్లో 2019కి ముందు 1,926 పీజీ సీట్లు ఉండగా, గత నాలుగేళ్లలో కొత్తగా 462 పీజీ సీట్లను మంజూరు చేయించినట్లు చెప్పారు. గత నాలుగేళ్లలో వైద్య, ఆరోగ్య శాఖలో వైద్యులతో పాటు కొత్తగా 49 వేల పోస్టులను భర్తీ చేయడం చరిత్రాత్మకమన్నారు.

విజనరీ అని చెప్పుకునే చంద్రబాబు ఏం చేశారు?

విజనరీ అని చెప్పుకునే చంద్రబాబు 14 ఏళ్ల సీఎంగా ఉన్న సమయంలో ప్రభుత్వ రంగంలో ఒక్క మెడికల్ కళాశాల అయినా నిర్మించారా అని మంత్రి ప్రశ్నించారు. బాబు హయాంలో ఒక్క గవర్నమెంట్ హాస్పటల్లో కూడా సరైన డాక్టర్లు, వైద్యం, మందులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, సెల్‌ఫోన్ల వెలుతురులో ఆపరేషన్లు చేశారని అన్నారు.

చంద్రబాబు చేసింది శూన్యం

‘40 ఏళ్ల రాజకీయ అనుభవం.. 14 ఏళ్ల సీఎం.. 13 ఏళ్ల ప్రతిపక్ష నాయకుడిగా పనిచేశా.. నాకంటే సీనియర్ ఎవరున్నారు.’ అంటూ గొప్పలు చెప్పుకొనే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో వైద్య కళాశాలలు ఏర్పాటు చేసి ప్రజలకు ఉచితంగా సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలందించేందుకు చూపిన చొరవ మాత్రం శూన్యం. అధికారంలో ఉన్నన్ని రోజులూ ప్రైవేటు రంగంలో వైద్య కళాశాలల ఏర్పాటును మాత్రమే ప్రోత్సహించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న ప్రైవేటు మెడికల్ కళాశాలల్లో 13 టీడీపీ అధికారంలో ఉండగా ఏర్పడినవే కావడం ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం.


‘నాడు–నేడు’లో రైతుబజార్ల ఆధునికీకరణ

రాష్ట్ర మార్కెటింగ్ శాఖ సీఈవో నందకిశోర్ వెల్లడి

ఆరిలోవ(విశాఖ తూర్పు): నాడు–నేడు పథకంలో భాగంగా రైతుబజార్లను ఆధునికీకరించనున్నట్లు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ సీఈవో నందకిశోర్ తెలిపారు. విశాఖపట్నంలోని ఎంవీపీ రైతుబజార్‌ను గురువారం ఆయన పరిశీలించారు. రైతుబజార్‌లో సమస్యలు, సౌకర్యాల గురించి రైతులు, వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నందకిశోర్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం 102 రైతు బజార్లు ఉన్నాయని, మరో 54 కొత్తగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. వాటిలో 14 రైతుబజార్ల నిర్మాణం పూర్తయిందని, త్వరలో వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. ‘నాడు–నేడు’లో భాగంగా విశాఖ, విజయవాడ, గుంటూరులోని రైతు బజార్లను రూ.4 కోట్లతో ఆధునికీకరిస్తామని చెప్పారు. ఈ–క్రాప్ డేటా ఆధారంగా రైతు బజార్లలో నిర్వహణ ఉంటుందన్నారు. రైతులు తమ పొలంలో ఏయే పంటలు పండిస్తారో వాటిని మాత్రమే వారు తీసుకువచ్చి రైతుబజార్‌లో విక్రయించే పద్ధతి అమలవుతుందన్నారు. కొందరు రైతులు పదేళ్లకు పైగా రైతుబజార్లలో ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయని, దానిని నిరోధించడానికి ఇక నుంచి ఒకరు రెండేళ్లు మాత్రమే స్టాల్ నిర్వహించే విధంగా చర్యలు చేపడతామన్నారు. మార్కెటింగ్ శాఖ డీడీ ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

‘ఖబరస్థాన్’లో కొల్లు డ్రామా

- శ్మశానవాటిక స్థలం వివాదంపై టీడీపీ నేత కొల్లు రవీంద్ర రాజకీయం
- బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుల అరెస్టుకు పోలీసుల సన్నద్ధం
- విషయం తెలుసుకుని నిందితులను అరెస్ట్ చేయాలంటూ హైడ్రామా



కొల్లు రవీంద్ర ఇంటి ముందు పోలీసు పికెట్

కోనేరుసెంటర్: కృష్ణా జిల్లా బందరు నియోజకవర్గంలో రాజకీయ లబ్ధి కోసం టీడీపీ నాయకులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇటీవల మచిలీపట్నంలో రెండు ముస్లిం వర్గాల మధ్య జరిగిన గొడవకు రాజకీయ రంగు పులిమేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ గొడవపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేసేందుకు సిద్ధమవుతుండగా, అదే నిందితులను అరెస్టు చేయాలంటూ మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర హడావుడి చేయడం ప్రారంభించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆయన్ను హౌస్ అరెస్ట్ చేశారు. మచిలీపట్నం ఇంగ్లీషుపాలెంలోని ఖబరస్థాన్ విషయంలో ఆ ప్రాంతానికి చెందిన రెండు ముస్లిం వర్గాల మధ్య గత నెల 28న వివాదం చోటుచేసుకుంది. ఈ వివాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు చిలకలపూడి పోలీసులు అదే రోజు కేసు నమోదు చేశారు. విజయవాడలో చికిత్స పొందుతున్న ఇద్దరు బాధితుల నుంచి మరింత సమాచారం సేకరించే క్రమంలో కేసు దర్యాప్తు కొంత ఆలస్యం అయింది. దర్యాప్తు పూర్తి చేసుకున్న పోలీసులు గురువారం దాడికి పాల్పడిన నిందితులను అరెస్ట్ చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న కొల్లు రవీంద్ర నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలంటూ చిలకలపూడి పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా చేసే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు ముందుజాగ్రత్తగా ఆయన ఇంటి ముందు పికెట్ ఏర్పాటు చేశారు. విధులకు ఆటంకం కలిగించేందుకు ప్రయత్నిస్తున్న రవీంద్రకు సర్దిజెప్పేందుకు ప్రయత్నించారు. ఆయన వినకుండా బయటికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. కాగా ఈ కేసులో నిందితులు కర్మతుల్లా, రోషన్, మోజీస్‌ను అరెస్ట్‌చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు చిలకలపూడి పోలీసులు తెలిపారు.

కారు బస్సును ఢీకొని నలుగురి దుర్మరణం

- దైవదర్శనానికి శ్రీకాళహస్తి వెళుతుండగా ప్రమాదం
- తల్లి, ఇద్దరు కొడుకులు, మనుమరాలు మృతి
- మరో ఇద్దరికి గాయాలు.. వారిలో ఒకరి పరిస్థితి విషమం
- తెలంగాణలోని దంతాలపల్లి నుంచి దైవదర్శనానికి వచ్చిన కుటుంబం



ఘటన స్థలంలో మృతదేహాలు (ఇన్‌సెట్‌లో) ప్రమాదంలో ధ్వంసమైన కారు

ఏర్పేడు: తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం మేర్లపాక చెరువు కట్ట వద్ద గురువారం కారు ఆర్టీసీ బస్సును ఢీకొన్న ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం పాలయ్యారు. ఈ ప్రమాదంలో గాయపడిన మరో ఇద్దరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల్లో తల్లి, ఇద్దరు కొడుకులు, మనుమరాలు ఉన్నారు. తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లికి చెందిన వారు తిరుమల శ్రీవారిని దర్శించుకుని, శ్రీకాళహస్తి ఆలయానికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఏర్పేడు సీఐ శ్రీహరి కథనం మేరకు.. దంతాలపల్లికి చెందిన వెంకటమ్మ (65)కు అశోక్ (45), దినేష్ (42), రాంబాబు (40) కుమారులు. రెండో కుమారుడు దినేష్‌కు కుమార్తెలు భాన్వితాక్షరి (10), శాన్వితాక్షరి (4) ఉన్నారు. వెంకటమ్మ కుమారులు, కోడళ్లు, మనుమరాళ్లతో కలిసి మూడురోజుల కిందట రెండుకార్లలో తిరుమలకు బయలుదేరారు. బుధవారం రాత్రి తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు. గురువారం ఉదయం శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకునేందుకు వెంకటమ్మ, కుమారులు అశోక్, దినేష్, రాంబాబు, మనుమరాళ్లు శాన్వితాక్షరి, భాన్వితాక్షరి ఒక కారులోను, కోడళ్లు మిగిలిన కుటుంబసభ్యులు మరో కారులోను శ్రీకాళహస్తి బయలుదేరారు. రాంబాబు నడుపుతున్న కారు ఉదయం ఏడుగంటల సమయంలో ఏర్పేడు మండలంలోని మేర్లపాక చెరువు కట్ట వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటమ్మ, అశోక్, శాన్వితాక్షరి అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో గాయపడిన దినేష్, రాంబాబు, భాన్వితాక్షరిలను 108 వాహనంలో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వారిలో దినేష్, భాన్వితాక్షరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దినేష్ మరణించాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మూడు రోజులుగా కారు నడుపుతున్న రాంబాబు నిద్రమత్తే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు చెబుతున్నారు. ప్రమాదంలో కారు ముందుభాగం ధ్వంసమైంది.

సిబిల్ స్కోరు పెంచుతామంటూ యాప్ వల

- రూ.1,450 రిజిస్ట్రేషన్ ఫీజు
- తర్వాత ఎన్‌వోసీ కోసం రూ.10 వేలు కట్టాలంటూ డిమాండ్
- లబోదిబోమంటున్న బాధితులు

తణుకు టౌన్: రుణాలు పొందేందుకు అవసరమైన సిబిల్ స్కోర్ పెంచుతామని చెబుతూ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ ఫీజు వసూలు చేస్తున్న యాప్ ఉదంతం పశ్చిమగోదావరి జిల్లాలో వెలుగుచూసింది. క్రెడిట్ మంత్రి పేరుతో ఉన్న యాప్ నిర్వాహకులకు డబ్బులు చెల్లించి మోసపోయామని తణుకు ప్రాంతానికి చెందిన పలువురు లబోదిబోమంటున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సిబిల్ స్కోర్ తగ్గిన వారికి పెంచుతామని, తిరిగి రుణాలు పొందేలా చేస్తామని ఈ యాప్‌లో పేర్కొనడంతో పలువురు ఆకర్షితులవుతున్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించడం ద్వారా అప్పు ఇచ్చిన బ్యాంకుతో మాట్లాడి సెటిల్‌చేసి సిబిల్ స్కోర్ పెంచేలా చేస్తామని యాప్ మోసం చేస్తున్నట్టు చెబుతున్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు యాప్ ఖాతాలో జమచేసిన 10 నుంచి 35 రోజుల్లోపు సిబిల్ స్కోరు పెంచుతామని నమ్మిస్తున్నారు. రిజిస్ట్రేషన్ ఫీజుగా రూ.1,450 చెల్లించిన తర్వాత యాప్‌కు చెందిన వ్యక్తులు ఫోన్‌చేసి మీ బ్యాంకు వారితో మాట్లాడి సెటిల్ చేశాం, మీకు నోడ్యూస్ సర్టిఫికెట్ వస్తుంది.. మరో రూ.10 వేలు చెల్లించమని అడుగుతున్నారు. దీనికోసం యాప్ కంపెనీ ప్రతినిధులు ఫోన్‌చేసి యాప్‌ను ఎలా ఓపెన్ చేయాలో కూడా నేర్పిస్తున్నారు. అడిగిన ప్రశ్నలకు సమాధానం దాటవేస్తూ ఫైనల్‌గా పేమెంట్ వరకు తీసుకొస్తారు. మీ సమస్య తీరిపోయింది. రూ.10 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇలా చెల్లించిన వారు మోసపోతున్నారు.

రిజిస్ట్రేషన్ ఫీజు 1,450 చెల్లించా..

సిబిల్ స్కోరు పెరిగే యాప్ ఉందని ఒకరు చెప్తే ఆన్‌లైన్‌లో ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నా. ముందుగా రూ.1,450 రిజిస్ట్రేషన్ ఫీజుగా చెల్లించమన్నారు. చిన్న మొత్తమే కదాని చెల్లించా. తర్వాత గంటకే ఫోన్‌చేసి మీ సిబిల్ స్కోర్ సెటిల్ చేశాం. మరో రూ.10 వేలు బ్యాంక్ ఖాతాలో జమచేస్తే ఎన్‌వోసీ వస్తుందన్నారు. ఇదేదో తేడాగా ఉందని అడిగితే మీరు ముందు రూ.1,450 చెల్లించినప్పుడు తెలియదా? అని ఎదురు ప్రశ్న వేశారు.

– ఎంఎస్ సాయిబాబా, బాధితుడు, తణుకు

సక్రమ రుణాలు చెల్లించడం ద్వారానే సిబిల్ స్కోర్‌లో మార్పు

బ్యాంక్‌ల నుంచి తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించడం తప్ప మరో మార్గంలో సిబిల్ స్కోర్ పెరగదు, మారదు. బ్యాంకులకు నిరర్థక ఆస్తులు పెరగకుండా ఉండేందుకు రుణాలు ఇచ్చే ముందు సిబిల్ స్కోర్ పరిశీలించడం తప్పనిసరి. ప్రజలు బ్యాంక్‌లు, ఇతర ఆర్థికసంస్థల నుంచి తీసుకున్న రుణాల చెల్లింపు వివరాలు ఎప్పటికప్పుడు ఆయా బ్యాంకు సర్వర్‌ల నుంచి ఆన్‌లైన్ అయిపోతాయి. దీన్ని ఎవరూ మార్చలేరు. సక్రమంగా బ్యాంక్ అప్పులను తిరిగి చెల్లించడం ద్వారానే సిబిల్ స్కోరు పెరుగుతుంది. సిబిల్ స్కోర్ పెంచేందుకు ఎలాంటి దగ్గరి దారులు లేవు. సిబిల్ స్కోర్ పెంచే యాప్‌లు అంటూ ఏమీ లేవు. ఆన్‌లైన్‌లో వచ్చే వాటిని చూసి మోసపోవద్దు. సాధారణంగా 650 కన్నా తక్కువగా సిబిల్ స్కోర్ ఉన్న వారి రుణ దరఖాస్తులను బ్యాంకులు పరిగణనలోకి తీసుకోవు. 700కు పైగా సిబిల్ స్కోరు ఉన్న వారి దరఖాస్తులనే పరిశీలిస్తాయి. 800కు పైగా సిబిల్ స్కోరు ఉన్న దరఖాస్తులను వెంటనే పరిశీలించడంతోపాటు కొన్ని బ్యాంకులు వడ్డీ రాయితీ కూడా ఇస్తున్నాయి. రుణం పొందిన వారు బ్యాంకుకు ఎలా చెల్లించారో తెలిపేదే సిబిల్ స్కోరు. వాయిదాలు ఆలస్యమైనా, వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేసుకున్నా సిబిల్ స్కోర్‌లో వివరాలు స్పష్టంగా ఉంటాయి. బ్యాంక్ రుణం తీరిపోయిన 36 నెలల వరకు సిబిల్ స్కోరు మారదు.

– బి.ఎం.శ్రీనివాస్, చీఫ్ మేనేజర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తణుకు

అప్పన్న సేవలో హైకోర్టు సీజే



జస్టిస్ శేషసాయికి స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం/తుని రూరల్: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి సతీసమేతంగా దర్శించుకున్నారు. ధ్వజస్తంభం వద్ద ఆయనకు ఆలయ ఈవో త్రినాథరావు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. న్యాయమూర్తి దంపతులు ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. న్యాయమూర్తి పేరిట అంతరాలయంలో స్వామికి అర్చకులు పూజలు నిర్వహించి వేదాశీర్వచనాన్ని అందజేశారు. స్వామివారి జ్ఞాపికను, శేషవస్త్రాలను, ప్రసాదాన్ని జస్టిస్ దంపతులకు ఈవో అందజేశారు. అలాగే, జస్టిస్ ఏవీ శేషసాయి దంపతులు కాకినాడ జిల్లా లోవ తలుపులమ్మ అమ్మవారిని కూడా దర్శించుకున్నారు.

రావిచెట్టు కూలి ఒకరు మృతి

గోవిందరాజస్వామి ఆలయంలో ఘటన



ఆలయంలో కూలిన రావి చెట్టు

తిరుపతి కల్చరల్: తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో 300 ఏళ్ల నాటి రావి చెట్టు గురువారం సాయంత్రం భీకర గాలికి కూలడంతో డాక్టర్ గుర్రప్ప అనే వ్యక్తి మృతి చెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. ప్రమాద విషయం తెలుసుకున్న టీటీడీ అధికారులు ఘటనా స్థలికి చేరుకుని గాయపడిన వారిని వైద్యం కోసం బర్డ్ ఆస్పత్రికి తరలించారు. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి, బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్ ఘటనాస్థలిని పరిశీలించి.. ప్రమాద కారణాలను అడిగి తెలుసుకున్నారు. భక్తుడు మృతి పట్ల సానుభూతి వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. అనంతరం బర్డ్‌లో చికిత్స పొందుతున్న వారిని టీటీడీ అధికారులు పరామర్శించారు. భక్తులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఘటన అనంతరం ఆలయ సంప్రోక్షణ చేసి స్వామివారి వాహన సేవను కొనసాగించారు.

కవలలను కడతేర్చిన కసాయి తండ్రి

కర్ణాటకలో ఘటన • కుటుంబ కలహాలే కారణం

సాక్షి బెంగళూరు: కుటుంబ కలహాల కారణంగా ఇద్దరు కవల పిల్లలను గాలి ఆడకుండా చంపేశాడో కసాయి తండ్రి.. ఈ ఘటన కర్ణాటకలో దావణగెరె నగరం ఆంజనేయ మిల్ లేఔట్‌లో జరిగింది. ఎస్పీ అరుణ్ తెలిపిన వివరాల మేరకు.. బెళగావి జిల్లా గోకాక్‌కు చెందిన అమర్‌కిత్తూరు (35) హరిహరలోని కార్గిల్ ఫ్యాక్టరీలో కెమికల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. భార్య జయలక్ష్మి తన బంధువుల ఇంటికి విజయపురకు వెళ్లిన సమయంలో బుధవారం తన ఇద్దరు కవల పిల్లలు అద్వైత్ (04), అన్విత్ (04)ను కారులో హావేరి జిల్లా రాణిబెన్నూరు తాలూకా చళగెరె టోల్‌గేట్ వద్దకు తీసుకెళ్లాడు. అనంతరం పిల్లల నోరు, ముక్కుకి టిక్సో టేప్ అంటించి గాలి ఆడకుండా చేసి చంపేశాడు. కారులోనే మృతదేహాలను ఉంచాడు. ఆ తర్వాత ఇంటికి వచ్చిన జయలక్ష్మికి పిల్లలు కనిపించకపోవడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. పిల్లల తండ్రి అమర్‌పై అనుమానంతో తమదైన కోణంలో విచారణ చేపట్టారు. దీంతో అమర్ నేరాన్ని అంగీకరించాడు. ప్రస్తుతం విద్యానగర పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయింది. కాగా, కుటుంబ కలహాలే ఘటనకు కారణంగా పోలీసులు భావిస్తున్నారు.

సముద్రం నుంచి 7 కేజీల బంగారం వెలికితీత!

- ఐదుగురు స్మగ్లర్ల అరెస్టు



గాలిస్తున్న గజ ఈతగాళ్లు

సాక్షి, చెన్నై : గజ ఈతగాళ్ల తీవ్ర గాలింపుతో సముద్రంలో స్మగ్లర్లు పడేసిన 7 కేజీల బంగారాన్ని డీఆర్‌ఐ అధికారులు ఎట్టకేలకు వెలికి తీశారు. శ్రీలంక నుంచి తమిళనాడులోకి పెద్ద ఎత్తున బంగారం ఇటీవల తరలిస్తున్న విషయం తెలిసిందే. తమకు అందిన సమాచారం మేరకు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్‌ఐ), కోస్టు గార్డ్, సముద్ర తీర భద్రతా విభాగం వర్గాలు తరచూ తీవ్ర వేటలో నిమగ్నం కావడం, బంగారం సీజ్ చేయడం జరుగుతోంది. ఆ దిశగా మంగళ, బుధవారాల్లో రామనాథపురం జిల్లా మండపం, రామేశ్వరం సముద్రతీరంలో తీవ్ర నిఘా ఉంచారు. రెండు పడవల్లో వచ్చిన ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఓ పడవలో ఉన్న రూ. 4 కోట్లు విలువ గల బంగారం సీజ్ చేశారు. అయితే, మరో పడవలో వచ్చిన స్మగ్లర్లు కీలకర్రై దీవుల వద్ద సముద్రంలో బంగారు బిస్కెట్ ప్యాకెట్లను పడేసినట్లు తేలింది. దీంతో వేదాలై తీరం నుంచి కీలకర్రై వరకు గజ ఈతగాళ్లు, కోస్టు గార్డు, క్యూబా ట్రైనర్ల సహకారంతో బుధ, గురువారాల్లో తీవ్రంగా గాలించారు. ఎట్టకేలకు ఏడు కేజీల బంగారం సముద్రం నుంచి బయట పడింది. వీటిని సీజ్ చేసి, పట్టుబడిన వారిని విచారిస్తున్నారు. కాగా, ఈ ఆపరేషన్‌కు సంబంధించి డీఆర్‌ఐ, కోస్టుగార్డ్ వర్గాలు ఓ ప్రకటన విడుదల చేశాయి. తాజాగా జరిపిన ఆపరేషన్‌తో పాటుగా మొత్తం రూ. 20.20 కోట్ల విలువజేసే 32.869 కేజీల బంగారం సీజ్ చేసినట్లు వివరించారు.

కులోన్మాదంతో హక్కులను హరించాలని చూస్తే సహించం

- 977వ రోజు రిలే నిరాహార దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతల హెచ్చరిక



తాడికొండ: కులోన్మాదం తలకెత్తుకొని తమ హక్కులను హరించాలని చూస్తే కులవాదులను సహించబోమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. పేదల హక్కులను గౌరవించని వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 977వ రోజు గురువారం కొనసాగిన రిలే నిరాహార దీక్షల్లో పలువురు ప్రసంగించారు. రాష్ట్రంలో ఓ సామాజికవర్గమే తరతరాల ఆధిపత్యం చేయాలనే దురాలోచనతో పేదలను అణగదొక్కేందుకు రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేయాలని చూడటం దుర్మార్గమని చెప్పారు. రాజ్యాంగం ప్రకారం ప్రతి ఒక్కరికి సమాన హక్కులు ఉంటాయన్నారు. అందులో భాగంగానే బహుజనులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే.. దాన్ని కొందరు వ్యతిరేకించడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. అంబేడ్కర్ సూచించిన సమసమాజ నిర్మాణమే లక్ష్యంగా నేడు రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతోందని చెప్పారు. పేదలకు కూడు, గూడు కల్పించి అన్ని రకాలుగా వారికి ఆర్థికభరోసా కల్పించే దిశగా ఏపీ దేశానికే ఆదర్శంగా ముందుకెళుతోందని తెలిపారు. అందరికీ సమాన హక్కులు, ఆర్థిక ఎదుగుదల వస్తే.. తమ సామాజిక వర్గం చెప్పుచేతల్లో లేకుండా ఎక్కడ ఎదుగుతారో అనే భయం కులవాదుల్లో ఉన్నందునే మూడు రాజధానులకు అడుగడుగునా అడ్డుతగులుతున్నారని చెప్పారు. పేదవాడికి జానెడు జాగా, పట్టెడన్నం పెట్టే దిశగా జగనన్న ఇంటి స్థలం ఇచ్చి, ఇంటి నిర్మాణం చేస్తుంటే.. తమ ఉనికి ఎక్కడ కోల్పోతామోననే భయం బాబు అండ్ కోలో పట్టుకుందన్నారు. అంబేడ్కర్ సూచించిన రాజ్యాంగ ఫలాలు పేదలకు అందకుండా హక్కులను హరించేందుకు యత్నిస్తున్న కులవాదులపై తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నాయకులు నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పులి దాసు, పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జీఆర్‌ఈ పరీక్ష ఇకపై 1.58 గంటల్లోనే

10 రోజుల్లోగా స్కోర్ తెలుసుకోవచ్చు

న్యూఢిల్లీ: విదేశీ విద్యాసంస్థల్లో గ్రాడ్యుయేట్, ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే గ్రాడ్యుయేట్ రికార్డు ఎగ్జామినేషన్స్(జీఆర్‌ఈ)లో మార్పులకు ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీసు(ఈటీఎస్) శ్రీకారం చుట్టింది. పరీక్ష కాల వ్యవధిని తగ్గిస్తున్నట్లు గురువారం ప్రకటించింది. ప్రస్తుతం జీఈఆర్ జనరల్ టెస్టు వ్యవధి 3.45 గంటలు. ఇకపై 1.58 గంటల్లోనే పరీక్ష పూర్తి చేయొచ్చు. అధికారిక స్కోర్ తెలుసుకోవానికి 15 రోజుల సమయం పడుతోంది. ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి రెండు గంటల్లోపే జీఆర్‌ఈ జనరల్ టెస్టు పూర్తి కానుంది. అంటే ఇప్పుడున్న వ్యవధితో పోలిస్తే సగం తగ్గింది. అలాగే పరీక్ష పూర్తయిన తర్వాత 10 రోజుల్లోగానే అభ్యర్థులు తమ అధికారిక స్కోర్‌ను తెలుసుకోవచ్చని ఈటీఎస్ వెల్లడించింది. అనలైటికల్ రైటింగ్ సెక్షన్‌లో 'అనాలిసిస్ యాన్ ఆర్గ్యుమెంట్' టాస్క్‌ను తొలగిస్తున్నట్లు తెలియజేసింది. క్వాంటిటేటివ్, వెర్బల్ రీజనింగ్‌లో ప్రశ్నల సంఖ్యను తగ్గిస్తున్నట్లు వివరించింది. ఇదిలా ఉండగా, సెప్టెంబర్ 22 నుంచి జీఆర్‌ఈ పరీక్ష ప్రారంభం కానుంది. ఇందుకోసం రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. జీఆర్‌ఈ పరీక్ష రాసే అభ్యర్థుల సంఖ్యలో అమెరికా మొదటి స్థానంలో ఉండగా, భారత్ రెండో స్థానంలో ఉంది. 2021–22లో అమెరికాలో 1.24 లక్షల మంది, భారత్‌లో 1.14 లక్షల మంది ఈ పరీక్షకు హాజరయ్యారు. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లోని ఉన్నత విద్యాసంస్థలు జీఆర్‌ఈ స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్నాయి.

ఎన్‌సీఈఆర్‌టీ టెక్ట్స్ బుక్స్ నుంచి... కీలకాంశాలు తొలగింపు


న్యూఢిల్లీ: ఆవర్తన పట్టిక (పీరియాడిక్ టేబుల్)పై అధ్యాయాలు, దేశ ఆర్థిక రంగంలో వ్యవసాయ రంగం పాత్ర, ప్రజాస్వామ్యానికి ఎదురవుతున్న సవాళ్లు, సహజ వనరుల సమర్థ నిర్వహణ.. ఇలాంటి కీలకమైన అంశాలను పదో తరగతి పాఠ్య పుస్తకాల నుంచి జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ (ఎన్‌సీఈఆర్‌టీ) తొలగించింది. కొత్త పాఠ్యపుస్తకాలు మార్కెట్‌లోకి వచ్చాయి. పదో తరగతి రసాయనశాస్త్ర పుస్తకంలో ఆవర్తన పట్టిక చాప్టర్‌ను పూర్తిగా తొలగించారు. ఈ చాప్టర్‌ను పదకొండో తరగతి పుస్తకంలో చదువుకోవాల్సి ఉంటుంది. 9, 10, 11, 12 తరగతులకు సంబంధించిన పాఠ్యాంశాల్లో కొన్నింటిని ఎన్‌సీఈఆర్‌టీ ఇటీవలే తొలగించడం తెలిసిందే. విద్యార్థులపై భారాన్ని తగ్గించడమే దీని ఉద్దేశమని ఎన్‌సీఈఆర్‌టీ వివరణ ఇచ్చింది. ఇవన్నీ చిన్నచిన్న మార్పులేనని వెల్లడించింది. అయితే, ముఖ్యమైన అధ్యాయాలను తొలగించడం పట్ల విద్యారంగ నిపుణులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

భూమికి డేంజర్ బెల్స్

- 8 భద్రతా సూచీల్లో 7 ఇప్పటికే ప్రమాద స్థాయిని దాటేశాయి
- ఆఫ్రికా నుంచి అమెరికా దాకా అతి సమస్యాత్మక 'హాట్‌స్పాట్స్'
- వెంటనే మేల్కొనకుంటే త్వరలో భూమిపై జీవమే కనుమరుగు
- ఎర్త్ కమిషన్ అధ్యయనంలో విస్మయకర అంశాలు

మితిమీరిన వనరుల దోపిడీ. లెక్కలేని నిర్లక్ష్యం. ఇంకా అనేకానేక స్వయంకృతాపరాధాలతో భూమిని చేజేతులారా నాశనం చేసుకుంటున్నాం. పుట్టింది మొదలు గిట్టి మట్టిలో కలిసేదాకా నిత్యం సకలం సమకూర్చే ఆధారాన్నే మొదలంటా నరికేసుకుంటున్నాం. భావి తరాలనే గాక భూమిపై ఉన్న సకల జీవరాశులనూ పెను ప్రమాదపుటంచుల్లోకి నెడుతున్నాం. గ్లోబల్ వార్మింగ్, కరువు, పెను వరదల వంటి ఉత్పాతాల రూపంలో భూమి చేస్తున్న ఆక్రందనను ఇకనైనా చెవిన పెట్టకపోతే పరిస్థితి పూర్తిగా చేయి దాటిపోయేందుకు ఇంకెంతో కాలం పట్టదని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నా పట్టించుకునే తీరిక ఎవరికీ లేదు. ఫలితంగా భూమికి డేంజర్ బెల్స్ చెవులు బద్దలయ్యే స్థాయిలో మోగుతున్నాయని సైంటిస్టులు తాజాగా తేల్చారు. భూమి తాలూకు ఎనిమిది రకాల భద్రతా పరిమితుల్లో ఏకంగా ఏడింటిని ఎప్పుడో దాటేశామని వారు వెల్లడించారు...

భూమి ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, వాటికి కారణాలు తదితరాలపై 40 మంది ప్రముఖ అంతర్జాతీయ ప్రకృతి, సామాజిక శాస్త్రవేత్తలతో కూడిన ఎర్త్ కమిషన్ బృందం తాజాగా అధ్యయనం నిర్వహించింది. అందులో తేలిన ఆందోళనకర అంశాలతో కూడిన నివేదిక జర్నల్ నేచర్‌లో పబ్లిషైంది. మానవ ఆధిపత్య యుగం (ఆంత్రోపాసీన్) క్రమంగా భూమి తాలూకు కీలక వ్యవస్థల స్థిరత్వాన్ని సమూలంగా కదిలించి వేస్తోందని హెచ్చరించింది. నివేదికలో వెల్లడించిన అంశాలు ఒళ్లు జలదరించేలా ఉన్నాయి...



"భూ స్థిరత్వాన్ని ఆమోదనీయ స్థాయికి తీసుకొచ్చేందుకు దేశాలన్నీ కలసికట్టుగా తక్షణం ఓ భారీ ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం చాలా ఉంది. లేదంటే భూమి ఏమాత్రమూ ఆవాసయోగ్యం కాకుండా పోయేందుకు ఇంకెంతో కాలం పట్టదు!"
- ప్రొఫెసర్ జొయితా గుప్తా, అధ్యయనంలో కీలక భాగస్వామి

ప్రతి ఖండంలోనూ..

సమతుల్యత పూర్తిగా దెబ్బ తిని అతి సమస్యాత్మకంగా మారిన పలు ప్రాంతాలను అధ్యయనంలో భాగంగా పరిశోధక బృందం గుర్తించింది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఖండంలోనూ ఎక్కడపడితే అక్కడ ఇలాంటి హాట్‌స్పాట్లు ఉండటం కలవరపరిచే అంశమేనని సైంటిస్టులు చెబుతున్నారు. వీటిలో చాలా ప్రాంతాల్లో వాతావరణ మార్పులే సమస్యకు ప్రధాన కారణమని తేలింది. "ముఖ్యంగా ఆసియాలో పర్వత ప్రాంతాలతో సమాహారమైన హై మౌంటేన్ క్రయోస్ఫియర్ శరవేగంగా మార్పుచేర్పులకు లోనవుతోంది. హిమానీ నదాల కరుగుదల మొదలుకుని జరగకూడని ప్రతికూల పరిణామాలన్నీ భయపెట్టే వేగంతో చోటు చేసుకుంటున్నాయి. ఫలితంగా అతి త్వరగా ఆ ప్రాంతమంతా సామాజికంగా, ఆర్థికంగా పెను కుదుపులకు లోనవడం ఖాయం" అని సహ అధ్యయనకర్త ప్రొఫెసర్ క్రిస్టీ ఎబి హెచ్చరించారు.

ఎటు చూసినా రెడ్ సిగ్నళ్లే...

భూమి భద్రతకు సంబంధించి స్థూలంగా 8 రకాల సూచీలను కీలకంగా పర్యావరణవేత్తలు పరిగణిస్తారు. వీటిలో మూడు కంటే ఎక్కువ సూచీలు ఆమోదిత పరిమితి దాటితే భూమికి ముప్పు తప్పదని భావిస్తారు. కానీ ఇప్పుడు ఏకంగా 7 సూచీలు ఆమోదిత పరిమితిని ఎప్పుడో దాటేసి ప్రమాదకర స్థాయికి చేరుతున్నట్టు ఎర్త్ కమిషన్ అధ్యయనం తేల్చడం అందరినీ భయపెడుతోంది...

కీలక సూచీ పరిమితులు	ప్రస్తుత పరిస్థితి
వాతావరణం	ప్రమాదకరం
రసాయన ఎరువుల అతి వాడకం కారణంగా నీళ్లలో పాస్ఫరస్, నైట్రోజన్ మితిమీరి కలవడం	ప్రమాదకరం
భూగర్భ జల సరఫరాలు	ప్రమాదకరం
స్వచ్ఛమైన ఉపరితల జలాలు	ప్రమాదకరం
సహజ పర్యావరణం	ప్రమాదకరం
మానవ నిర్మిత పర్యావరణం	ప్రమాదకరం
వాయు కాలుష్యం	ఇబ్బందికరం

డేంజర్ హాట్ స్పాట్స్‌కు నిలయాలు
తూర్పు యూరప్, దక్షిణాసియా, మధ్యప్రాచ్యం
ఆగ్నేయాసియా, ఆఫ్రికాలో పలు ప్రాంతాలు
బ్రెజిల్‌లో చాలా ప్రాంతాలు
అమెరికాలో పలు ప్రాంతాలు, మెక్సికో, చైనా

ఏం చేయాలి?

- పర్యావరణపరంగా సురక్షిత స్థాయిని భూమి ఎప్పుడో దాటేసింది. రోజురోజుకూ మరింత ప్రమాదం దిశగా వెళ్తోంది.
- భూమిపై వాసయోగ్యతను నిర్ధారించే జీవ భౌతిక వ్యవస్థలన్నింటినీ చక్కదిద్దే పని తక్షణం మొదలు పెట్టాలి.
- అప్పుడు బొగ్గు, చమురు, సహజ వాయువు వంటి కీలక వనరుల లోటును భూమి తనంత తానుగా భర్తీ చేసుకోగలదు.

"భూమికి గనక మనిషికి చేసినట్టే ఇప్పటికిప్పుడు వార్షిక హెల్త్ చెకప్ చేయిస్తే ఆరోగ్యం పూర్తిగా దిగజారి పోయిందంటూ రిపోర్టు వస్తుంది. కీలక అవయవాలన్నీ దాదాపుగా మూలకు పడుతున్నాయని తేలుతుంది"
- క్రిస్టీ ఎబి, సహ అధ్యయనకర్త, యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్‌లో క్లైమేట్ అండ్ పబ్లిక్ హెల్త్ ప్రొఫెసర్

కొసమెరుపు:

సూచనల మాటెలా ఉన్నా కీలకమైన అన్ని మౌలిక సూచికలూ పూర్తిగా నేల చూపులు చూస్తున్నాయి. కనుక ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే వనరుల భర్తీ దేవుడెరుగు, భూమి తాలూకు వాసయోగ్యతకే, మరోలా చెప్పాలంటే జీవరాశుల ఉనికికే ఎసరొచ్చే ప్రమాదం చాలా ఎక్కువగా ఉందన్నది సైంటిస్టులు ముక్త కంఠంతో చెబుతున్న మాట!

- సాక్షి, నేషనల్ డెస్క్

మణిపూర్ హింసపై న్యాయవిచారణ

- సమస్య పరిష్కారానికి గవర్నర్ సారథ్యంలో శాంతి కమిటీ
- పలు చర్యలు ప్రకటించిన హోం మంత్రి అమిత్ షా



ఇంఫాల్: మణిపూర్‌లో తెగల సంక్షోభ పరిష్కారానికి చర్చలే మార్గమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. రాష్ట్రంలో ఇటీవలి అల్లర్లపై హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి సారథ్యంలో విచారణ జరిపిస్తామని ప్రకటించారు. వివాద పరిష్కారానికి గవర్నర్ సారథ్యంలో శాంతి కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. ఇందులో పార్టీలతోపాటు కుకీ, మెయిటీ తెగలు, సామాజిక సంస్థల ప్రతినిధులకు భాగస్వామ్యం కల్పిస్తామన్నారు. అమిత్ షా గురువారం ఇంఫాల్‌లో మీడియాతో మాట్లాడారు. "హింస తాత్కాలికం. అపార్థాలు సమసిపోతాయి. పరిస్థితులు త్వరలో సాధారణ స్థితికి చేరుకుంటాయి" అని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతకు ముందు ఆయన హింసాత్మక ఘటనల బాధితుల సహాయక శిబిరాలను సందర్శించి వారితో మాట్లాడారు. కుకీల ప్రత్యేక పాలనా విభాగం డిమాండ్‌పై స్పందించేందుకు నిరాకరించారు. "కాల్పుల విరమణను ఉల్లంఘించిన పక్షంలో తీవ్ర చర్యలుంటాయి. లైసెన్సు లేని ఆయుధాలను వెంటనే అప్పగించాలి. లేకుంటే శుక్రవారం నుంచి తగు చర్యలు తీసుకుంటాం" అంటూ మిలిటెంట్లను హెచ్చరించారు. అల్లర్ల బాధితులకు సత్వరమే నేరుగా పరిహారం అందిస్తామన్నారుజీ. వదంతులను నమ్మొద్దని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణలో మెరుగ్గా వ్యవహరించేందుకు రాష్ట్ర పోలీసులతోపాటు ఆర్మీ, అస్సాం రైఫిల్స్, సీఆర్‌పీఎఫ్ బలగాల మధ్య సమన్వయానికి ఇంటర్ ఏజెన్సీ యూనిఫైడ్ కమాండ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇండో–మయన్మార్ సరిహద్దు సమస్య శాశ్వత పరిష్కారానికి రెండుదేశాల సరిహద్దుల్లో కంచె ఏర్పాటును పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

మణిపూర్ డీజీపీగా రాజీవ్ సింగ్

1993 బ్యాచ్ సీనియర్ ఐపీఎస్ అధికారి రాజీవ్ సింగ్ గురువారం మణిపూర్ డీజీపీగా నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన ఢిల్లీలోని సీఆర్‌పీఎఫ్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా ఉన్నారు. ప్రస్తుతం మణిపూర్ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (హోం)గా ఉన్న పి.డొంగెల్ ఈ నెలాఖరుకు పదవీ విరమణ చేయనున్నారు.

రూ.2 వేల నోటు రద్దుపై అత్యవసర విచారణకు సుప్రీం నో

సాక్షి, న్యూఢిల్లీ: ఎలాంటి గుర్తింపు కార్డు లేకుండానే రూ.2 వేల నోట్లు మార్పిడికి అనుమతించడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌పై అత్యవసర విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఆర్‌బీఐ నిర్ణయాన్ని సమర్థిస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై బీజేపీ నేత, న్యాయవాది అశ్వినీకుమార్ ఉపాధ్యాయ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ తరహా పిటిషన్లను వెకేషన్ బెంచ్ విచారించబోదని ధర్మాసనం గురువారం స్పష్టం చేసింది. నోటిఫికేషన్ ఏకపక్షంగా ఉందని, నల్లధనం మార్పిడికి వీలు కల్పిస్తుందని అశ్వినీకుమార్ వాదించారు. కేవలం మూడు రోజుల్లోనే రూ.50 వేల కోట్ల మార్పిడి ప్రపంచంలోనే తొలిసారని పేర్కొన్నారు. "ఈ తరహా పిటిషన్లను సెలవుల సమయంలో స్వీకరించడం లేదు. సెలవుల తర్వాత సీజేఐ ఎదుట ఈ అంశాన్ని ప్రస్తావించండి" అని ధర్మాసనం సూచించగా ఆలోగా నల్లధనం మార్పిడి మొత్తం పూర్తయిపోతుందని అశ్వినీకుమార్ పేర్కొన్నారు.

రాష్ట్రపతి ముర్ముతో ప్రచండ భేటీ

న్యూఢిల్లీ: నేపాల్‌ను ప్రాధాన్యత గల దేశంగా భారత్ పరిగణిస్తుందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము స్పష్టం చేశారు. కీలక ప్రాజెక్టులను నిర్ణీత కాలంలోగా పూర్తి చేయడం సహా రెండు దేశాల మధ్య అభివృద్ధి భాగస్వామ్యాన్ని విస్తృతం చేసుకునేందుకు కట్టుబడి ఉంటుందని హామీ ఇచ్చారు. భారత్ పర్యటిస్తున్న నేపాల్ ప్రధాని పుష్పకుమార్ దహల్ 'ప్రచండ'గురువారం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో భేటీ అయ్యారు. ఇటీవలి సంవత్సరాల్లో నేపాల్–భారత్ ద్వైపాక్షిక సంబంధాలు క్రమేపీ వృద్ధి చెందుతున్నాయని ముర్ము అన్నారు. ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలను, పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్‌ను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. తరాలుగా కొనసాగుతున్న సంబంధాలు మరింతగా బలపడాలని రాష్ట్రపతి ముర్ము ఆకాంక్షించారని రాష్ట్రపతి భవన్ తెలిపింది. అనంతరం నేపాల్ ప్రధాని ప్రచండ ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్‌ను ఆయన నివాసంలో కలుసుకున్నారు.



ఉత్తరాఖండ్‌లో కొండచరియల బీభత్సం

చార్‌ధామ్ యాత్రలో చిక్కుకుపోయిన 300 మంది భక్తులు

జోషిమఠ్: ఉత్తరాఖండ్‌లో కొండచరియల బీభత్సంతో భక్తులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పిత్రోగఢ్ జిల్లాలో కొండచరియలు విరిగిపడడంతో దాదాపుగా 300 మంది చిక్కుకుపోయారు. లిపులేఖ్–తవాఘాట్ రోడ్డులో అతి పెద్ద కొండ చరియ విరిగి పడడంతో దాదాపుగా 100 మీటర్ల రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో ధరాచులా, గంజి ప్రాంతంలో 300 మంది ప్రయాణికులు చిక్కుకుపోయినట్టు జిల్లా అధికారులు వెల్లడించారు. ఈ రోడ్డుకి మరమ్మతులు నిర్వహించి తిరిగి రాకపోకలు సాగించడానికి మరో రెండు రోజులు సమయం పట్టే అవకాశం ఉంది. ఉత్తరాఖండ్‌లోని పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. అల్మోరా, బాగేశ్వర్, చమోలి, చంపావత్, డెహ్రాడూన్, గర్వాల్, హరిద్వార్, నైనిటాల్, పిత్రోగఢ్, రుద్రప్రయాగ, తెహ్రిగర్వాల్, ఉధామ్‌సింగ్ నగర్, ఉత్తర కాశీ జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. చార్‌ధామ్ యాత్రలో ఉన్న భక్తులు సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని మరో రెండు మూడు రోజుల పాటు ప్రయాణాలు చేయొద్దని అధికారులు హెచ్చరించారు.



శ్రీలంక నుంచి రెండు పడవల్లో స్మగ్లర్లు తీసుకొస్తున్న 32 కేజీల బంగారమిది. తీర దళం, రెవిన్యూ నిఘా, కస్టమ్స్ విభాగాలు దీన్ని స్వాధీనం చేసుకున్నాయి. వీటి విలువ రూ.20 కోట్లు ఉంటుందని అంచనా.

జరుగుబాటు అంతంతే

అసెంబ్లీ సమావేశాల సగటు కాలం 21 రోజులే

- మేధోసంస్థ పీఆర్‌ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ వెల్లడి



న్యూఢిల్లీ: కీలకమైన అసెంబ్లీ సమావేశాలను రాష్ట్రాలు తక్కువ రోజుల్లోనే మమ అనిపిస్తున్నాయని మేధో సంస్థ పీఆర్‌ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ తాజా గణాంకాలు చాటుతున్నాయి. దేశవ్యాప్తంగా 2016 ఏడాది నుంచి అసెంబ్లీ సమావేశమైన రోజులు ఏటా తగ్గుతూ వస్తున్నాయని అధ్యయనం ఆందోళన వ్యక్తంచేసింది. అధ్యయనం ప్రకారం..

- 2022లో 28 రాష్ట్రాల అసెంబ్లీ సమావేశాలు సగటున కేవలం 21 రోజులే జరిగాయి.
- కర్ణాటకలో అత్యంత ఎక్కువగా 45 రోజులపాటు అసెంబ్లీ సమావేశాలు జరిగాయి. తర్వాతి స్థానాల్లో పశ్చిమబెంగాల్(42 రోజులు), కేరళ(41 రోజులు) నిలిచాయి.
- ఎక్కువ రాష్ట్రాల్లో ఏడాదిలో రెండు లేదా మూడుసార్లు సెషన్స్ పెడుతున్నారు. జనవరి–మార్చి మధ్య బడ్జెట్ పద్దు సందర్భంగా ఒక సెషన్. వర్షాకాల, శీతాకాల సమావేశాల కోసం మరో రెండు.
- ఈశాన్య రాష్ట్రాల్లోని ఐదు రాష్ట్రాలు కలుపుకుని 12 రాష్ట్రాల్లో గత ఏడాది కేవలం రెండు సెషన్స్‌యే జరిగాయి.
- మొత్తంగా సమావేశ రోజుల్లో బడ్జెట్ కోసమే 61 శాతం రోజులను కేటాయిస్తున్నారు. తమిళనాడులో ఏకంగా 90 శాతం సిట్టింగ్స్ ఒక్క బడ్జెట్ సెషన్స్‌తోనే గడిచిపోయింది. 80శాతానికి మించి సెషన్స్‌తో గుజరాత్, రాజస్తాన్ అదే బాటలో పయనించాయి.
- 20 రాష్ట్రాల్లో సగటు సమావేశాల కాలం కేవలం ఐదు గంటలు. మహారాష్ట్రలో మాత్రమే ఈ సగటు ఎనిమిది గంటలుగా నమోదైంది. సిక్కింలో అత్యల్పంగా రెండు గంటలే సెషన్ నడిచింది.
- 2016–2022 కాలంలో 24 రాష్ట్రాల్లో సగటు సమావేశాల కాలం కేవలం పాతిక రోజులు. కేరళలో ఏడాదికి గరిష్ఠంగా 48 రోజులు అసెంబ్లీ నడిచింది. ఒడిశా(41 రోజులు), కర్ణాటక(35 రోజులు) తర్వాతి స్థానాల్లో నిలిచాయి.
- 2016 ఏడాది నుంచి సెషన్ రోజులు తగ్గుతూ వస్తున్నాయి. కోవిడ్ ఆంక్షల ధాటికి 2020లో ఈ సంఖ్య దారుణంగా పడిపోయింది.
- 2016లో 24 రాష్ట్రాల్లో సగటున 31 రోజులు, 2017లో 30 రోజులు, 2018లో 27 రోజులు, 2019లో 25 రోజులు, 2020లో 17 రోజులు, 2021లో 22 రోజులు సమావేశాలు నిర్వహించారు.
- అసెంబ్లీ సభ్యులను ప్రాతిపదికగా తీసుకుని సమావేశాల సంఖ్యపై కనీస పరిమితిని విధించుకుంటే మంచిదని రాజ్యాంగ పనితీరుపై సమీక్షకు జాతీయ కమిషన్(ఎన్‌సీఆర్‌డబ్ల్యూసీ) గతంలో రాష్ట్రాలను సూచనలు పంపడం గమనార్హం.
- కర్ణాటక, రాజస్తాన్, యూపీ వంటి రాష్ట్రాలు సంబంధిత లక్ష్యాలు నిర్దేశించుకున్నా అవి నెరవేరలేదు.
- రాజ్యాంగం నిర్దేశిన ప్రకారం ప్రతీ రాష్ట్రం తమ పద్దును అసెంబ్లీలో ప్రవేశపెట్టి చర్చించాలి. 2022లో 20 రాష్ట్రాల్లో బడ్జెట్‌పై చర్చకాలం సగటు కేవలం ఎనిమిది రోజులే. ఒక్క తమిళనాడు మాత్రమే 26 రోజులపాటు బడ్జెట్‌పై చర్చించింది. కర్ణాటక(15 రోజులు), కేరళ(14 రోజులు), ఒడిశా(14 రోజులు) తర్వాతి స్థానాల్లో నిలిచాయి.
- ఢిల్లీ, మధ్యప్రదేశ్, పంజాబ్ రెండ్రోజుల్లో ముగించగా, నాగాలాండ్ ఒక్కరోజుతో సరిపెట్టింది.
- 2022లో 28 రాష్ట్రాల్లో సగటున 21 బిల్లులు ఆమోదం పొందాయి. అస్సాంలో గరిష్ఠంగా 85 బిల్లులకు ఆమోదముద్ర పడింది. తమిళనాడు(51), గోవా(38) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.
- విశ్లేషణాత్మక చర్చలేకుండానే ప్రభుత్వాలు బిల్లులను పాస్ చేస్తున్నాయి

12న విపక్ష కూటమి సమావేశానికి కాంగ్రెస్ హాజరు

న్యూఢిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అధికార బీజేపీని ఎదుర్కోవడానికి ఈ నెల 12న పాట్నాలో జరగనున్న ప్రతిపక్ష పార్టీల సమావేశానికి తాము హాజరవుతున్నట్టుగా కాంగ్రెస్ పార్టీ వెల్లడించింది. బీహార్ ముఖ్యమంత్రి , జేడీయూ నాయకుడు నితీశ్ కుమార్ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరవుతుందని అయితే ఆ పార్టీ తరఫున ఎవరు హాజరవుతారో ఇంకా నిర్ణయించుకోలేదని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ చెప్పారు. బీజేపీని ఎదుర్కోవడానికి విపక్ష పార్టీలను ఒకే తాటిపైకి తీసుకురావడానికి నితీశ్ కుమార్ గత కొద్ది రోజులుగా అన్ని రాష్ట్రాలు తిరుగుతూ ప్రతిపక్ష నాయకుల్ని కలుసుకున్నారు. గత నెలలో రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలను కూడా కలుసుకున్నారు.

ఆ ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తాం: స్టాలిన్



చెన్నైలో కేజ్రీవాల్, స్టాలిన్, భగవంత్ మాన్

సాక్షి, చెన్నై: ఢిల్లీలో అధికార యంత్రాంగంపై నియంత్రణ కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌ను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ చెప్పారు. బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కేంద్రం కావాలనే సంక్షోభం సృష్టిస్తోందని ఆరోపించారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను పని చెయ్యనివ్వకుండా అడ్డుకుంటోందని ఆరోపించారు. ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా వివిధ పార్టీల మద్దతు కూడగడుతున్న ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్ మన్‌తో కలిసి గురువారం స్టాలిన్‌ను కలుసుకున్నారు. అనంతరం స్టాలిన్ మీడియాతో మాట్లాడుతూ ఆప్ ప్రభుత్వానికి అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు వచ్చినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఇబ్బందులకి గురి చేస్తోందని, ఆ ఆర్డినెన్స్‌ను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలన్నీ కేజ్రీవాల్ సర్కార్‌కు మద్దతుగా నిలబడాలని పిలుపునిచ్చారు. అప్రజాస్వామికంగా, సమాఖ్య స్ఫూర్తికి వ్యతిరేకంగా తీసుకువచ్చిన ఈ ఆర్డినెన్స్‌ను పార్లమెంటులో తిరస్కరిస్తామని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ చెప్పారు. పార్లమెంటులో ఆర్డినెన్స్ పాస్ అవకుండా నిరోధించడం వచ్చే లోక్‌సభ ఎన్నికలకు సెమీఫైనల్ వంటిదని కేజ్రీవాల్ అన్నారు.

గుజరాత్ బీజేపీ ఎమ్మెల్యే సాహసం



స్థానికులతో ఎమ్మెల్యే హీరా సోలంకి

అహ్మదాబాద్: గుజరాత్ బీజేపీ ఎమ్మెల్యే హీరా సోలంకి పెద్ద సాహసమే చేశారు. పాట్వా గ్రామానికి చెందిన నలుగురు యువకులు సముద్రంలో ఈత కొట్టడానికి వెళ్లి అందులో మునిగిపోతూ ఉండడం చూసిన ఆయన ప్రాణాలకు తెగించి తాను కూడా దూకారు. ఎమ్మెల్యే సోలంకి స్వయంగా సముద్రంలో దూకడంతో మరికొందరు కూడా ఆయనకు సాయంగా వెళ్లారు. సముద్రంలో మునిగిపోతున్న నలుగురిలో ముగ్గురి ప్రాణాలు కాపాడారు. మరో యువకుడి ప్రాణాలు దక్కలేదు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ఎమ్మెల్యేపై ప్రశంసలు కురుస్తున్నాయి. హీరా కాదు హీరో అంటూ నెటిజన్లు ఆకాశానికెత్తేస్తున్నారు.

కూలిన ఐఏఎఫ్ శిక్షణ విమానం.. పైలట్లకు గాయాలు

సాక్షి, బెంగళూరు: భారత వైమానిక దళాని (ఐఏఎఫ్)కి చెందిన విమానం కుప్పకూలిన ఘటనలో ఇద్దరు పైలట్లు గాయపడ్డారు. కర్ణాటకలోని చామరాజనగర జిల్లా భోగాపుర వద్ద గురువారం ఈ ఘటన జరిగింది. వింగ్ కమాండర్ తేజ్‌పాల్, కో పైలట్ భూమిక బెంగళూరు ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి సూర్యకిరణ్ రకం చిన్న శిక్షణ విమానంలో బయలుదేరారు. తిరిగి వస్తుండగా సాంకేతిక సమస్య తలెత్తి విమానం కుప్పకూలింది. ఇంధనం అంటుకుని కాలిపోయింది. తేజ్‌పాల్, భూమిక ప్యారాచూట్‌ల సాయంతో దూకి ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. తేజ్‌పాల్ వెన్నెముకకు గాయమైంది. విమానం బహిరంగ ప్రదేశంలో కూలడంతో ఎటువంటి ఆస్తి, ప్రాణనష్టం సంభవించలేదని అధికారులు తెలిపారు. సంఘటన ప్రాంతానికి పెద్ద సంఖ్యలో చేరుకున్న ప్రజలను నియంత్రించేందుకు పోలీసులు శ్రమించాల్సి వచ్చింది. రెండు రోజుల క్రితం బెళగావి జిల్లా సాంబ్రా ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరిన రెడ్‌బర్డ్ శిక్షణ విమానం వ్యవసాయ క్షేత్రంలో అత్యవసరంగా ల్యాండ్ అయింది. అందులోని ఇద్దరు పైలట్లు గాయాలతో బయటపడ్డారు.

అనర్హత వేటు.. పెద్ద అవకాశం

రాహుల్ గాంధీ స్పష్టీకరణ

- స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో భారత విద్యార్థులతో భేటీ

స్టాన్‌ఫోర్డ్/సన్నీవేల్: లోక్‌సభ సభ్యుడిగా తనపై అనర్హత వేటు పడుతుందని రాజకీయాల్లోకి వచ్చిన కొత్తలో ఏమాత్రం ఊహించలేదని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. అయినప్పటికీ ప్రజలకు సేవ చేయడానికి వేటు రూపంలో గొప్ప అవకాశం లభించిందని చెప్పారు. అమెరికాలో పర్యటనలో ఉన్న రాహుల్ బుధవారం కాలిఫోర్నియాలోని ప్రతిష్టాత్మక స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ క్యాంపస్‌లో భారతీయ విద్యార్థులతో, భారత సంతతి విద్యావేత్తలతో సమావేశమయ్యారు. వారి ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. తనకు దక్కాల్సిన దానికంటే పెద్ద అవకాశమే దక్కిందని చెప్పారు. రాజకీయాలు ఇలాగే ఉంటాయన్నారు. వాస్తవానికి ఆరు నెలల క్రితమే డ్రామా మొదలైందని, భారత్‌లో విపక్షాలన్నీ ఒత్తిడికి లోనయ్యాయని వివరించారు. తీవ్రంగా పోరాడాల్సి వచ్చిందన్నారు. పాలకులకు ఆర్థిక బలం ఉందని, వ్యవస్థలను గుప్పిట బంధించారని ఆరోపించారు. దేశంలో 'ప్రజాస్వామిక పోరాటం' కోసం చాలా కష్టాలు పడాల్సి వచ్చిందన్నారు. "అలాంటి సమయంలో భారత్ జోడో యాత్ర చేపట్టాలని నిర్ణయించుకున్నా. ఈ పోరాటం మనందరి పోరాటం. విదేశాల్లోని భారతీయ విద్యార్థులతో సంబంధాలు మెరుగుపర్చుకోవాలని భావిస్తున్నా. అది నా హక్కు" అని రాహుల్ చెప్పారు. ఎవరి మద్దతు కోసమో తాను విదేశీ పర్యటనలు చేయడం లేదన్నారు. భారత ప్రధానమంత్రి ఇక్కడికి ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు.

డేటా భద్రతపై నియంత్రణ ఉండాలి

ఆధునిక యుగంలో డేటా అనేది కొత్త బంగారమని(న్యూ గోల్డ్) రాహుల్ గాంధీ అభివర్ణించారు. డేటా భద్రత, రక్షణపై తగిన నియంత్రణలు అవసరమని అభిప్రాయపడ్డారు. పెగాసస్ స్పైవేర్ లాంటి టెక్నాలజీపై తనకు ఎలాంటి ఆందోళన లేదన్నారు. ఒకానొక సమయంలో తన ఐఫోన్‌ను ట్యాప్ చేశారని తాను గుర్తించానని, అప్పుడు 'హలో! మిస్టర్ మోదీ' అని ఫోన్‌లో అన్నానని రాహుల్ చమత్కరించారు. ఆయన బుధవారం అమెరికాలో సిలికాన్ వ్యాలీకి చెందిన స్టార్టప్ కంపెనీల ఔత్సాహిక వ్యాపారవేత్తలతో సమావేశమయ్యారు. డేటా ఇన్ఫర్మేషన్ గోప్యతపై నిబంధనలు విధించాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భారత్‌లో మారుమూల పల్లెలోని సామాన్యుడికి కూడా మేలు జరగాలని చెప్పారు. భారత్‌లో ఏదైనా టెక్నాలజీని విస్తరించాలంటే అధికార వికేంద్రీకరణ వ్యవస్థ ఉండాలని అన్నారు. డ్రోన్ టెక్నాలజీ, దాని నియంత్రణ విషయంలో తనకు ఎదురైన అనుభవాన్ని రాహుల్ గాంధీ వివరించారు. భారత్‌లో డ్రోన్ టెక్నాలజీని ప్రవేశపెట్టడానికి అధికార యంత్రాంగం నుంచి ఎన్నో అవరోధాలు ఎదుర్కోవాల్సి వచ్చిందని పలువురు తనతో చెప్పారని గుర్తుచేశారు. ఈ సమావేశంలో ప్లగ్ అండ్ ప్లే టెక్ సెంటర్ సీఈఓ సయీద్ అమిదీ, ఫిక్స్‌నిక్స్ స్టార్టప్ వ్యవస్థాపకుడు షాన్ శంకరన్ తదితరులు పాల్గొన్నారు.



స్టాన్‌ఫోర్డ్ వర్సిటీలో ప్రసంగిస్తున్న రాహుల్

4, 5 తేదీల్లో స్పెషల్ రైళ్లు

గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా నరసాపూర్ - యశ్వంతపూర్‌ల మధ్య ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు గురువారం తెలిపారు. ఈ నెల 4వ తేదీన నరసాపూర్ జంక్షన్ నుంచి రైలు (నంబరు 07687) మధ్యాహ్నం 3.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు 5వ తేదీ ఉదయం 10.50 గంటలకు యశ్వంతపూర్ చేరుతుందని చెప్పారు. 5వ తేదీ యశ్వంతపూర్ జంక్షన్ నుంచి రైలు (నంబరు 07688) మధ్యాహ్నం 3.50 గంటలకు బయలుదేరి 6వ తేదీ ఉదయం 8.30 గంటలకు నరసాపూర్ చేరుతుంది. ఈ రైళ్లు పాలకొల్లు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, దొనకొండ, మార్కాపూర్, గిద్దలూరు, నంద్యాల, డోన్, అనంతపురం, ధర్మవరం, పెనుగొండ, హిందూపూర్, యలహంక మీదుగా ప్రయాణిస్తాయని చెప్పారు.

న్యూస్‌రీల్

ఏపీ సీఎం జగన్‌తో ఎమ్మెల్యే విశ్వనాథ్ భేటీ



ముఖ్యమంత్రి జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే విశ్వనాథ్

బనశంకరి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బెంగళూరు యలహంక ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు అయిన ఎస్ఆర్ విశ్వనాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. టీటీడీకి సంబంధించిన విషయాలు, తిరుమలలో నిర్మిస్తున్న కర్ణాటక భవన్ గురించి ఈ సందర్భంగా చర్చించారు.

6.5 కేజీల అంబర్‌గ్రిస్ సీజ్



ప్యాక్ చేసిన అంబర్‌గ్రిస్

బనశంకరి: కోట్లాది రూపాయల విలువచేసే అంబర్‌గ్రిస్ విక్రయానికి పాల్పడుతున్న తమిళనాడుకు చెందిన ఇద్దరిని గురువారం బెంగళూరు సీసీబీ పోలీసులు అరెస్ట్‌చేశారు. వీరి వద్ద నుంచి 6.5 కేజీల అంబర్‌గ్రిస్‌ను సీజ్ చేసినట్లు జాయింట్ పోలీస్ కమిషనర్ శరణప్ప తెలిపారు. తమిళనాడు నుంచి దీనికి బెంగళూరుకు తీసుకొచ్చి అమ్ముతున్నట్లు తెలిసి పోలీసులు దాడిచేశారు. నిందితులను అరెస్టు చేసి వీవీ పురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

దేవనహళ్లిలో ఐఫోన్ల ఫ్యాక్టరీ

దొడ్డబళ్లాపురం: ఐఫోన్‌ల తయారీ కంపెనీ ఫాక్స్‌కాన్ 2024 ఏప్రిల్ ఒకటి నాటికి దేవనహళ్లిలో ఫ్యాక్టరీని స్థాపించి ఉత్పత్తిని చేపట్టనున్నట్లు భారీ పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ చెప్పారు. జూలై 1 నాటికి సంస్థకు భూమిని అప్పగిస్తామన్నారు. గురువారం నాడు కంపెనీ ప్రతినిధులు మంత్రితో భేటీ అయ్యారు. సుమారు 50వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించేలా రూ.13,600 కోట్ల ఖర్చుతో ఫ్యాక్టరీని నిర్మిస్తుందన్నారు. ఇందుకు దేవనహళ్లి వద్ద పారిశ్రామికవాడలో 300 ఎకరాలు గుర్తించామన్నారు.

మేకెదాటుపై అసూయ వద్దు: డీకే

బనశంకరి: తాగు సాగు నీటి కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న మేకెదాటు పథకంతో తమిళనాడుకు ఎలాంటి ఇబ్బంది కలగదని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అన్నారు. మేకెదాటుపై తమిళనాడు సీఎం అభ్యంతరం వ్యక్తంచేసిన నేపథ్యంలో గురువారం నగరంలో డీకే విలేకరులతో మాట్లాడారు. రైతుల అనుకూలం కోసం మేకెదాటు పథకాన్ని చేపడుతున్నామని, ఇందులో అసూయ వద్దు, సామరస్యంగా సహకరించాలని తమిళనాడును కోరారు. ఇప్పటికే కావేరి నదీ జలాల విషయంలో రెండు రాష్ట్రాలు చాలా ఇబ్బంది పడ్డాయని, సముద్రంలో కలిసే నీటిని తాగునీరు, రైతులకు అనుకూలం కల్పించడం మేకెదాటు ఉద్దేశమన్నారు.

బోనులో పడ్డ చిరుతపులి



దొడ్డబళ్లాపురం: దొడ్డ తాలూకా హొరేముద్దేనహళ్లి, కల్లుకోట అటవీ ప్రాంతంలో గత కొన్ని రోజులుగా సంచరిస్తూ ఆవులు, మేకలను బలిగొంటున్న చిరుతపులి ఎట్టకేలకు బోనులో పడింది. హిరేముద్దేనహళ్లి, కెళగినజోగానహళ్లి గ్రామాల్లో గత నెలరోజులుగా చిరుత దాడులు చేయడంతో గ్రామస్తులు బితుకు బితుకుమంటున్నారు. అటవీ అధికారులు బోను ఏర్పాటు చేయగా బుధవారం రాత్రి చిక్కింది.

బంగ్లా ఖాళీ చేసిన యడ్డి

యశవంతపుర: బీజేపీ ప్రభుత్వం ముగియడంతో కావేరి అధికార నివాసాన్ని మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప గురువారం ఖాళీ చేశారు. నగరంలో కుమార పార్క్ రోడ్డులో కావేరి బంగ్లా ఉండేది. ఆయన సీఎం అయినప్పటి నుంచి అందులోనే ఉండేవారు. సీఎం పదవి నుంచి తప్పుకున్నా బంగ్లాను వీడలేదు. ఇప్పుడు సర్కారు కూడా పోవడంతో ఖాళీ చేయడం అనివార్యంగా మారింది. డాలర్స్ కాలనీలోని సొంతింటికి మకాం మార్చారు. 2019 కాంగ్రెస్, జేడీఎస్ పొత్తు ప్రభుత్వం పతనం కావటంతో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి యడియూరప్ప సీఎం అయ్యారు. కాగా, డాలర్స్ కాలనీలోని నివాసంలో యడియూరప్పను డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు.

సైబర్ కేటుగాళ్ల కొత్త దందా

- టెలిగ్రాం యాప్ ద్వారా ప్రలోభాలు
- ఓ వ్యాపారవేత్తకు రూ.కోటికి పైగా మస్కా
- సినిమా రివ్యూలు, టాస్కల పేరుతో మోసాలు



టెలిగ్రామ్ ద్వారా సైబర్ నేరగాళ్లు మరింతగా పేట్రేగుతున్నారు

బనశంకరి: దేశంలోనే అత్యధిక సైబర్ నేరాలు నమోదు అవుతున్న జాబితాలో మూడో స్థానం దక్కించుకున్న కన్నడనాట టెలిగ్రాం యాప్‌ను అస్త్రంగా చేసుకుని వంచకులు నిత్యం వందలాది మంది ప్రజల నుంచి సొమ్ము కాజేస్తున్నారు. వర్క్ ఫ్రం హోం, షేరు మార్కెట్‌లో పెట్టుబడి, క్రిప్టో కరెన్సీ లాభం పేరుతో సైబర్ కేటుగాళ్ల ముఠాలు చురుగ్గా పనిచేస్తున్నాయి. సులభంగా దండిగా డబ్బు సంపాదించవచ్చునని ఆశ చూపించి డబ్బు పెట్టుబడిగా పెట్టించుకుని మోసగిస్తారు. బెంగళూరు నగర కమిషనరేట్ పరిధిలోని 8 సైబర్ పోలీస్ స్టేషన్లలో నిత్యం 15 వరకూ ఫిర్యాదులు వస్తుండగా ఇందులో టెలిగ్రాం యాప్ ముఠాల బాధితులు ఎక్కువగా ఉన్నారు. విద్యార్థులు, ప్రైవేటు ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు కూడా ఈ ముఠాల వలలో పడి డబ్బు కోల్పోయారని పోలీసులు తెలిపారు.

వ్యాపారవేత్తకు నిండా మోసం

ఒక వ్యాపారవేత్త మొబైల్‌ఫోన్‌కి టెలిగ్రాం యాప్ ద్వారా దీపా అనే మహిళ నేను ఇ-వన్ కస్టమర్ కేర్ ఉద్యోగినని పరిచయం చేసుకుంది. ఆన్‌లైన్లో సినిమా రివ్యూలు, రేటింగ్‌లు ఇవ్వడం ద్వారా ఇంట్లోనే కూర్చుని డబ్బు సంపాదించవచ్చునని నమ్మించింది. మేము ఇచ్చే టార్గెట్‌లను దశలవారీగా చేరుకోవాలని, ఇందుకుగాను మొదట రూ.9,900 చెల్లించాలని తెలిపింది. బాధితుడు అలాగే చెల్లించాడు. టాస్కల పేరుతో పదే పదే అతడి నుంచి నగదు జమచేయించుకుంది. ప్రీమియర్ టాస్క్ బోనస్ పేరుతో విడతల వారీగా రూ.1.26 కోట్లు అతని నుంచి వసూలు చేశారు. ఇదంతా 4 నెలల కాలంలో జరిగింది. వంచక ముఠా మరింత పెట్టుబడుని డిమాండ్ చేయగా మోసపోయినట్లు గుర్తించి బాధితుడు బెంగళూరు సీఐడీ సైబర్ పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. ఇ-వన్ కస్టమర్ కేర్ ఉద్యోగులు దీపా, సుర్జీత్, స్నేహరాయ్ తదితరులపై కేసు నమోదు చేసుకుని వారి కోసం గాలింపు చేపట్టారు. మరో టాస్క్ పూర్తి చేయకపోతే మీరు ఇప్పటివరకు గెలిచిన నగదులో కోత పడుతుందని తరచూ బెదిరించడంతో అతడు వారు చెప్పినట్లు నడుచుకున్నాడని పోలీసులు తెలిపారు.

టెలిగ్రాంలో జోరుగా నకిలీ గ్రూప్‌లు

టెలిగ్రాం అనేది వాట్సాప్‌స్థాయిలో పేరుపొందిన మెసేజింగ్ యాప్‌లో ఒకటి. ప్రపంచంలోని మూలమూలల్లో కూడా వినియోగదారులు ఉన్నారు. కానీ మోసగాళ్లు టెలిగ్రాం యాప్‌ను తీవ్రంగా దుర్వినియోగం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నకిలీ అకౌంట్, నకిలీ గ్రూప్‌లు సృష్టించి అమాయకులకు పెట్టుబడులు, ఉద్యోగాల పేరుతో వల వేస్తారు. మోసగించాక అకౌంట్‌ను డిలిట్ చేసేస్తారు. దీంతో ఆచూకీ కనుగొనడం కష్టమవుతుందని ఓ పోలీస్ అధికారి తెలిపారు.

మోసగాళ్ల ప్రలోభాలకు గురి కావద్దు

ప్రస్తుత రోజుల్లో టెలిగ్రాంతో పాటు అన్ని సామాజిక మాధ్యమాల్లో సైబర్ వంచనలు హెచ్చుమీరుతున్నాయి. కాబట్టి ప్రతి ఒక్కరూ సైబర్ సురక్షత చర్యలు పాటించాల్సిన ఆవశ్యకత ఉంది. గుర్తు తెలియని నంబర్ నుంచి మెసేజ్, లింక్‌లు వస్తే క్లిక్ చేయరాదు. గుర్తు తెలియని గ్రూప్‌లలో చేరరాదు, కొద్దిరోజుల్లోనే భారీ లాభాలు పొందవచ్చునని ప్రలోభాలకు ఆశ పడరాదని సీఐడీ సైబర్ పరిశోధన శిక్షణ విభాగం ఎస్పీ ఎంఎల్ మధురవీణా తెలిపారు.



ఆదమరిస్తే దోచేస్తారు

పన్నుల భారం తప్పదా?

- కాసుల కోసం సర్కారు అన్వేషణ
- ట్యాక్సులపైనే దృష్టి



శివాజీనగర: రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఉదారంగా హామీల వర్షం కురిపించింది. ఐదు గ్యారంటీ పథకాలను తక్షణం అమలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ హామీలను అమలు చేయాలంటే ఏడాదికి రూ. 52 వేల కోట్లు అవసరమని అంచనా. అలాగే ఇతర వాగ్దానాలను తీర్చాలంటే మరో రూ. 10 వేల కోట్లు ఏటేటా కావాలని అంచనా వేశారు.

రిజిస్ట్రేషన్లు, స్టాంపు డ్యూటీ పెంపు?

సరాసరి రాష్ట్ర వార్షిక బడ్జెట్ రూ. 2 లక్షల కోట్లుగా ఉంటోంది, ఇందులో రూ. 62 వేల కోట్లను హామీల కోసం ఉపయోగిస్తే మిగతా ఆర్థిక నిర్వహణ కుంటుపడుతుందనే ఆందోళన ఉంది. మరోవైపు కర్ణాటకకు రుణభారం అధికమైంది. గ్యారంటీల వల్ల మరింతగా ఆర్థికభారం సర్కారుపై పడుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రాష్ట్ర ఖజానాకు వచ్చే ఆదాయం పెంచడంపై దృష్టి సారించింది. ఏయే రంగాల నుంచి ఆదాయాన్ని పెంచుకోవచ్చో ప్రణాళికలు వేస్తోంది. ఆర్థికశాఖ కూడా సీఎం సిద్దరామయ్య చెంతన ఉండగా, ఆదాయార్జనపై అధిక శ్రద్ధ పెట్టారు.

ముఖ్యంగా రెవెన్యూ శాఖను ఎంచుకుంది. భూములు, కట్టడాల రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీలను పెంచడంపై పెద్దస్థాయిలో చర్చ జరుగుతోంది. అంతేకాకుండా ఆస్తుల గైడెన్స్ వ్యాల్యూ పెంచడం, రెవెన్యూ, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్ శాఖల్లో అక్రమాలను అరికట్టి అధిక సొమ్ము ఖజానాను చేరేలా చర్యలు తీసుకోవాలని సిద్దరామయ్య రెడీ అయ్యారు. అక్రమ-సక్రమను మళ్లీ ప్రారంభించి ఆస్తులకు అనుమతులు ఇవ్వాలని, తద్వారా భారీగా ఖజానాను నింపుకోవాలని భావిస్తోంది.

మూడు గ్యారంటీలకే ఆమోదం!

- నేడు తుది ప్రకటన చేసే అవకాశం

సాక్షి, బెంగళూరు: ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఐదు గ్యారెంటీ పథకాల అమలుపై సీఎం సిద్దరామయ్య నేడు శుక్రవారం తుది నిర్ణయం ప్రకటించే అవకాశముంది. మంత్రులు, అధికారులతో పలు దఫాలుగా గత నాలుగు రోజులుగా చర్చోపచర్చలు జరిపారు. కాగా, ఒకేసారి ఐదు గ్యారెంటీ పథకాలను కాకుండా, మూడు హామీలను అమలు చేసి ఆ తర్వాత దశలవారీగా మిగిలిన పథకాలను అమల్లోకి తీసుకురావాలని నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. విధానసౌధలో ముఖ్య భేటీ నిర్వహించి ప్రకటన చేయనున్నారు.

వీటికే ఆమోదం?

- మొదటి దశలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, కుటుంబానికి 10 కేజీల ఉచిత బియ్యం పథకాలను ఓకే చేయవచ్చు.

ఇవి వాయిదా

ప్రతి ఇంటి మహిళకు నెలకు రూ. 2 వేలు (గృహలక్ష్మి), నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల పంపిణీ (యువనిధి)ని పక్కన పెట్టవచ్చని తెలుస్తోంది. ఈ పథకాలకు నిధుల అవసరం ఎక్కువగా ఉండడం వల్ల వాయిదా వేయవచ్చు.



ఓటర్లకు పంపిణీ చేసిన గ్యారంటీ కార్డులు

మిగతా రంగాల సంగతేమిటి: బొమ్మై

బనశంకరి: ఐదు గ్యారంటీల అమలు వల్ల విద్య, వైద్యం, వ్యవసాయం వంటి ముఖ్యమైన రంగాలు దెబ్బతినకుండా చూడాలని సీఎం సిద్దుకు బీజేపీ మాజీ సీఎం బసవరాజ బొమ్మై సుదీర్ఘ లేఖ రాశారు. ఐదు గ్యారంటీలను అమలు చేయడానికి సుమారు రూ. 50 వేల కోట్లు అవసరమని మీరు ప్రజలకు తెలిపారు, ఈ పథకాల అమలు సమయంలో ప్రముఖ రంగాలైన విద్య, ఆరోగ్యం, మహిళాభివృద్ధి, మౌలిక సౌకర్యాలు, రైతులు, దళితులు, బీసీల శ్రేయస్సును కాపాడాలన్నారు.

తల- మొండెం వేరుచేసి..

- బన్నేరుఘట్టలో మహిళ హత్య



ఘటనా స్థలిలో పోలీసులు

బొమ్మనహళ్లి: మహిళను హత్య చేసి తల, మొండేన్ని వేరుచేసి ఇంటి వద్ద పడేశారు. ఈ దారుణ సంఘటన బెంగళూరు శివార్లలోని బన్నేరుఘట్టలో ఉన్న జనతా కాలనీలో ఆలస్యంగా వెలుగు చూసింది. హతురాలు బన్నేరుఘట్టలోని జనతా కాలనీలో నివాసం ఉంటున్న గీతమ్మ (53)గా గుర్తించారు. హత్య చేసి, తల మొండెం నరికివేసి ఇంటి వద్ద నగ్నంగా పడేశారు. ఈ హత్య జరిగి సుమారు మూడు నాలుగు రోజులు కావడంతో మృతదేహం కుళ్లిపోయింది. కాగా, గీతమ్మ ఇంటి మరో భాగంలో ఉత్తరాదికి చెందిన ఐదుమంది వలస కార్మికులు బాడుగకు ఉండేవారు. నాలుగు రోజుల నుంచి వారు కనపడడం లేదని స్థానికులు తెలిపారు. ఈ హత్యోదంతంతో చుట్టుపక్కల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. బన్నేరుఘట్ట పోలీసులు పరిశీలించి కేసు విచారణ చేపట్టారు.

దుందుడుకు పోలీస్ సస్పెండ్



ఆటోడ్రైవర్‌ను కొడుతున్న కానిస్టేబుల్

మండ్య: ఆటోడ్రైవర్‌ను ఇష్టానుసారం దూషించి కొట్టిన దుందుడుకు ట్రాఫిక్ కానిస్టేబుల్ మహేంద్రను మండ్య జిల్లా ఎస్పీ ఎన్.యతీష్ సస్పెండ్ చేశారు. ఇటీవల మండ్యలో జనం అందరూ చూస్తుండగా కానిస్టేబుల్ ఆటో డ్రైవర్‌పై రెచ్చిపోయాడు. తిడుతూ మెడ పట్టుకుని కొట్టాడు. కొందరు ఈ దాష్టీకాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయగా పోలీస్ తీరుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో ఎస్పీ అతనిపై చర్యలు తీసుకున్నారు. దీనిపై ఏడీజీపీ అలోక్ కుమార్ మాట్లాడుతూ పోలీసులు ప్రజలపై చేయి చేసుకోరాదని, కానీ అతడు రోడ్డుపైనే ఒకరిని కొట్టాడని, అందుకే సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

వేధింపులపై నిరసన గళం



మైసూరులో ధర్నా చేస్తున్న ప్రజాసంఘాలు



బెంగళూరు ఫ్రీడంపార్క్‌లో మహిళా సంఘాల ఆందోళన

మైసూరు: ఢిల్లీలో కుస్తీ క్రీడాకారిణులు సాగిస్తున్న ఆందోళనకు మద్దతుగా గురువారం రాష్ట్రంలో మైసూరు, బెంగళూరు తదితర చోట్ల ప్రజాసంఘాలు వామపక్షాలు ధర్నాలు నిర్వహించాయి. లైంగిక వేధింపులకు పాల్పడిన ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని మైసూరులో సంయుక్త కిసాన్ మోర్చా, సీఐటీయు, సీపీఎం, మహిళా సంఘాలు ధర్నా నిర్వహించారు. రైతు నేత నాగేంద్ర, పెద్ద సంఖ్యలో రైతులు నిరసనలో పాల్గొన్నారు. అలాగే బెంగళూరు ఫ్రీడంపార్క్‌లోనూ పలు సంఘాలు ప్రదర్శన జరిపాయి. క్రీడాకారిణులపై లైంగిక వేధింపులకు పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలని, బాధితులకు న్యాయం చేయాలని ఆందోళనకారులు నినదించారు.

విమాన ప్రమాదం.. కలకలం





ప్రమాదస్థలిలో జన రద్దీ



ప్రమాదానికి గురైంది ఇటువంటి విమానమే





శిథిలాల కుప్పగా మారిన దృశ్యం

ఆకాశంలో వేగంగా దూసుకెళ్తున్న విమానం ఆకస్మాత్తుగా నియంత్రణ తప్పి నేలకూలింది. భారత వాయుసేనకు చెందిన కిరణ్ ఏజేటీ శిక్షణ విమానం నేల మీద పడి తుత్తునియలైంది. గురువారం చామరాజనగర జిల్లా భోగాపుర గ్రామం వద్ద నిర్జన ప్రాంతంలో విమానం కూలిపోయింది. శకలాలకు నిప్పంటుకుని కాలిపోయాయి. ఓ పైలట్, మహిళా పైలట్ ప్రమాదానికి ముందే పారాచూట్ల ద్వారా బయటకు దూకేశారు. సమీప గ్రామాల నుంచి జన సందోహం తరలిరావడంతో అదుపు చేయడం పోలీసులకు కష్టమైంది. – సాక్షి, బెంగళూరు

పెళ్లింట శోకసంద్రం

- రోడ్డు ప్రమాదంలో తండ్రీ, కొడుకు మృతి



టిప్పర్ లారీ,



ధ్వంసమైన బైక్

గౌరిబిదనూరు: కూతురు పెళ్లి పనుల్లో ఉన్న తండ్రీ, కొడుకు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. అప్పటివరకు భాజా భజంత్రీలు మోగిన ఇంట్లో శోకాలు మిన్నంటాయి. ఈ సంఘటన తాలూకాలోని హిరేబిదనూరు వద్ద జరిగింది. వివరాలు.. దారినాయకన పాళ్య హోబళి వద్దేనహళ్లికి చెందిన నంజుండప్ప (65). చిక్కబళ్లాపుర కనుమలో ఉన్న శ్రీనివాససాగరం దేవాలయంలో తన చిన్న కుమార్తె అనూష వివాహాన్ని బుధవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. రాత్రికి కావలసిన సరుకుల కోసం కొడుకు అనిల్‌కుమార్ (28)తో కలిసి సాయంత్రం బైక్ మీద బయలుదేరారు.

హిరేబిదనూరు వద్దకు రాగానే అతి వేగంగా వస్తున్న టిప్పర్ వీరి బైక్‌ను ఢీకొట్టగా తండ్రీ కొడుకులు తీవ్ర గాయాలతో మృతి చెందారు. డ్రైవర్ టిప్పర్‌ను వదిలి పరారయ్యాడు. బంధువులు చేరుకుని గుండెలవిసేలా రోదించారు. టౌన్ ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

చెరువులో మునిగి ఇద్దరు దుర్మరణం



అబ్బాయ్, బాబాయ్ మృతదేహాల వద్ద రోదన

రాయచూరు రూరల్: చెరువులో మునిగి ఇద్దరు దుర్మరణం పాలైన ఉదంతం తాలూకాలోని కుర్ద కుందలో జరిగింది. బుధవారం దేవర చెరువు వద్ద సైకిల్‌ను కడగడానికి సలీం, అతని అన్న కుమారుడు రాజా బకెట్ తీసుకొని వెళ్లి చెరువులో దిగి నీరు నింపుతుండగా కాలు జారి నీటిలో మునుగుతున్న అన్న కుమారుడు రాజా(12)ను రక్షించబోయిన సలీం(32) కూడా నీట మునిగి ఈత రాక మరణించారు. మృతదేహాలను అగ్నిమాపక సిబ్బంది సాయంతో పోలీస్ అధికారులు వెలికితీశారు. ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు యాపలదిన్ని ఎస్ఐ తెలిపారు.

ఒపెక్‌ను జయదేవకు అప్పగించాలి

రాయచూరు రూరల్: నగరంలోని ఒపెక్ ఆస్పత్రిని జయదేవ ఆస్పత్రి యాజమాన్యానికి అప్పగించాలని సీనియర్ కాంగ్రెస్ నేత పారసమల్ సుఖాణి డిమాండ్ చేశారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల నుంచి మూతపడిన ఒపెక్‌కు పునరుత్తేజం కల్పించాలన్నారు.

క్రీడాకారులకు మద్దతుగా ధర్నా



మండ్య: లైంగిక దౌర్జన్యానికి వ్యతిరేకంగా ఢిల్లీలో మహిళా కుస్తీ క్రీడాకారులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా రాష్ట్ర రైతు సంఘం నాయకులు, కార్యకర్తలు మండ్యలో కలెక్టరేట్ ముందు ధర్నా చేశారు. క్రీడాకారిణులను లైంగిక వేధింపులకు గురి చేసిన కుస్తీ సమాఖ్య అధ్యక్షున్ని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. తరువాత అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ఆర్‌టీసీ బస్సు బోల్తా- 40 మందికి గాయాలు

సాక్షి,బళ్లారి: కేకేఆర్‌టీసీ బస్సు బోల్తా పడి 40 మంది గాయపడిన ఘటన బుధవారం రాత్రి 1 గంట సమయంలో కలబుర్గి జిల్లా హొసళ్లి క్రాస్ వద్ద జరిగింది. వివరాలు.. చించోళి డిపోకు చెందిన కేకేఆర్‌టీసీ బస్సు బెంగళూరుకు వెళుతుండగా మార్గమధ్యంలో ప్రమాదవశాత్తు అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ప్రయాణికులకు స్వల్ప గాయాలు మినహా ఎలాంటి ప్రాణాపాయం కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. గాయపడిన వారిని కాళగిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై రటకల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మంత్రి బోసురాజుతో ఎంపీ భేటీ




మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: చిన్న నీటి పారుదల, సైన్స్ టెక్నాలజీ శాఖా మంత్రి బోసురాజును రాయచూరు లోక్‌సభ సభ్యుడు రాజా అమరేశ్వర నాయక్ కలిసి పుష్పగుచ్ఛం అందించారు. గురువారం బెంగళూరులో కలిసి జిల్లా అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. 2002లో జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా పని చేసిన రాజా అమరేశ్వర నాయక్, నాడు మాన్వి ఎమ్మెల్యేగా పని చేసిన బోసురాజు తమ గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

మౌలిక సౌకర్యాలు కల్పించరూ

హొసపేటె: ఆస్పత్రికి వైద్య సేవల కోసం వచ్చే రోగులకు అన్ని విధాలుగా వైద్య సేవలు అందించాలని జెడ్పీ అధికారి సదాశివ ప్రభు తెలిపారు. గురువారం ఆయన ప్రభుత్వ మాతా శిశు ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన అనంతరం మాట్లాడారు. వైద్యులు, నర్సులు, సిబ్బంది ప్రామాణికంగా రోగులకు సేవలందించాలన్నారు. అనంతరం ఆస్పత్రి వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. జిల్లా ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సలీం తదితరులు పాల్గొన్నారు.

బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేయండి



ఆందోళన చేపట్టిన దృశ్యం

రాయచూరు రూరల్: మహిళా రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురి చేసిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌ను అరెస్ట్ చేయాలని కర్ణాటక సంయుక్త పోరాట సమితి ఆందోళన చేపట్టింది. గురువారం జిల్లాధికారి కార్యాలయం వద్ద జిల్లా శాఖ అధ్యక్షుడు రాఘవేంద్ర కుష్టిగి మాట్లాడారు. మహిళా క్రీడాకారులను మానసికంగా, లైంగికంగా వేధింపులకు గురి చేసిన వారిపై భారత దేహదారుఢ్య సమాఖ్య అధికారులు క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు. వీరేష్, శరణబసవ, మారెప్ప, అస్లాం పాషా, పద్మ, విద్యా పాటిల్, శ్రీనివాస్, చెన్నబసవ, ఆంజినేయ, మల్లికార్జున గౌడ, బసవ లింగప్ప, మహేష్‌లున్నారు.

అపారెల్ పార్కు హామీ అమలెన్నడో?

- జీన్స్ దుస్తుల తయారీదారుల ఎదురుచూపులు

సాక్షి,బళ్లారి: జిల్లాలో అపారమైన ఇనుప ఖనిజ నిల్వలతో పాటు తుంగభద్ర డ్యాం నిర్మాణంతో ఇక్కడ నీటిపారుదల రంగం అభివృద్ధి చెందింది. దీంతో పాటు బళ్లారి ఖ్యాతి ఇనుమడింపునకు జీన్స్ దుస్తుల తయారీ దోహదపడింది. జీన్స్ ప్యాంట్ల తయారీతో వేలాది మంది యువత ఉపాధి పొందుతున్నారు. అయితే జీన్స్ దుస్తుల తయారీకి మరింత ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వాలు అపారెల్ పార్కు నిర్మిస్తామని హామీ ఇచ్చారే కాని అమలు కాలేదు. నగరంలో జీన్స్ దుస్తుల తయారీని గమనించిన ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రలో భాగంగా నగరంలో బస చేసినప్పుడు ఆయన స్వయంగా జీన్స్ దుస్తుల తయారీ కేంద్రాల వద్దకు వెళ్లి వారి సమస్యలను ఆలకించి వారు పడుతున్న బాధలను చూశారు.

మరింత ప్రోత్సాహానికి రాహుల్‌గాంధీ హామీ

ఈనేపథ్యంలో రాహుల్ జోడో యాత్రలో ఉన్నప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఇక్కడ అపారెల్ పార్కు నిర్మాణం చేపట్టి జీన్స్ దుస్తుల తయారీకి మరింత ప్రోత్సాహం అందిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన బళ్లారికి విచ్చేసినప్పుడు మోతీ సర్కిల్‌లో జరిగిన ఎన్నికల బహిరంగ సభలో కాంగ్రెస్‌కు ఓటు వేయాలని, జిల్లాలో అన్ని స్థానాల్లో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. జిల్లాలో ఐదు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ అఖండ విజయం సాధించింది. అంతేకాకుండా రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. దీంతో బళ్లారిలో జీన్స్ దుస్తులు తయారు చేస్తూ జీవనం సాగించేవారందరూ రాహుల్ ఇచ్చిన హామీ అమలు కోసం ఎదురు చూస్తున్నారు. నగరంలో అపారెల్ పార్కు నిర్మాణానికి రూ.5 వేల కోట్లు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో జీన్స్ పరిశ్రమ దారులతో పాటు జీన్స్ దుస్తులు తయారు చేస్తున్న వారందరికీ వరంగా మారనుంది.



బళ్లారిలో జీన్స్ దుస్తులను తయారు చేస్తున్న దృశ్యం

పార్కుతో జీన్స్ దుస్తులకు మరింత డిమాండ్

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీతో అపారెల్ పార్కు నిర్మాణం జరిగితే బళ్లారి జీన్స్‌కు దేశ, విదేశాల్లో మరింత గుర్తింపు వచ్చే అవకాశాలు ఉండటంతో పాటు ఇక్కడ నివసిస్తున్న వేలాది మంది జీన్స్ దుస్తుల తయారీదార్లకు ఎక్కువగా మేలు చేకూరే అవకాశం ఉందని జీన్స్ పరిశ్రమ యజమానులు అంటున్నారు. అయితే అపారెల్ పార్కు నిర్మాణంతో పాటు ఇక్కడ తయారు చేసిన జీన్స్ దుస్తుల ఎగుమతికి రైల్వే సదుపాయంతో పాటు విమానాశ్రయ నిర్మాణం కూడా పూర్తయితే పూర్తి ప్రయోజనాలు అందుతాయని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా అపారెల్ పార్కు నిర్మాణం మాటలకే పరిమితం కావడంతో ప్రస్తుతం రాహుల్ ఇచ్చిన హామీ కోసం జీన్స్ దుస్తుల తయారీదార్లు ఎదురు చూస్తున్నారు.

కాంగ్రెస్ గ్యారంటీలే దెబ్బ తీశాయి

- కేఆర్‌పీపీ వల్లనే నేను ఓడిపోయాను
- మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర రెడ్డి. చిత్రంలో ఎంపీ దేవేంద్రప్ప, పార్టీ నాయకులు

సాక్షి,బళ్లారి: రాష్ట్రంలో బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పనులు చేపట్టిందని, డబుల్ ఇంజిన్ సర్కార్‌తో చేసిన అభివృద్ధి పనులను జనం మరిచి కాంగ్రెస్ గ్యారంటీ కార్డులను చూసి ఆ పార్టీని గెలిపించారని నగర మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం నగరంలోని అటల్ బిహారి వాజ్‌పేయి లేఔట్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కరోనా సమయంలో రెండేళ్ల ప్రతి ఒక్కరికి కేంద్రం నుంచి 10 కేజీలు చొప్పున బియ్యం ఉచితంగా పంపిణీ చేశామని గుర్తు చేశారు. అయినా అదంతా జనం మరిచిపోయి కాంగ్రెస్ అసత్యపు హామీలకు లోనై వారికే ఓటు వేశారన్నారు. నగరంలో తాను ఓటమి చెందడానికి, కాంగ్రెస్ గ్యారంటీ కార్డులతో పాటు కేఆర్‌పీపీ ప్రభావం వల్ల కూడా తాను ఓటమి చెందానన్నారు. కేఆర్‌పీపీ బరిలో ఉంటుందని తెలిసినా కాంగ్రెస్ ఓటు బ్యాంకును చీలుస్తుందని భావించామన్నారు. అయితే వారికి పడిన ఓట్లన్నీ బీజేపీవేనన్నారు. దీంతో తాను ఓటమి చెందాల్సి వచ్చిందన్నారు.

గాలి జనార్దనరెడ్డిపై విమర్శలు

తన సోదరుడు, కేఆర్‌పీపీ అధినేత గాలి జనార్దనరెడ్డిపై సోమశేఖరరెడ్డి విమర్శలు గుర్పించారు. ఎవరి వల్ల ఎవరు రాజకీయంగా ఎదిగారో ప్రజలకు, ఆ భగవంతుడికి తెలుసన్నారు. తమను అడ్డం పెట్టుకుని చేసిన అక్రమాలు కూడా ఆయన బయటకు చెప్పాలన్నారు. గతంలో కేజేపీ, బీఎస్ఆర్‌ల మాదిరిగా మళ్లీ కేఆర్‌పీపీ బీజేపీలోకి వస్తే కలిసి పని చేస్తారా? అని విలేకరులు ప్రశ్నించగా, అదంతా తన పరిధిలో లేనిదని, ముందు ఏం జరుగుతుందో ఇప్పుడే ఎలా చెప్పగలం అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన గ్యారంటీలను త్వరలో అమలు చేయకపోతే బీజేపీ ప్రజల పక్షాన నిలబడి పోరాడుతుందన్నారు. ఓటమిపై ఆత్మావలోకనం చేసుకుంటున్నామన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ విజయానికి సమష్టిగా కృషి చేస్తామన్నారు. మళ్లీ దేశానికి మోదీని ప్రధానిని చేయాలన్నది అందరి ఆకాంక్షగా ఉందన్నారు. జనం కూడా బీజేపీకి బ్రహ్మరథం పట్టడం ఖాయమన్నారు. ఎంపీ దేవేంద్రప్ప మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల సమర్థ పాలన గురించి వివరించారు. ఎమ్మెల్సీ వై.ఎం.సతీష్, మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప, పార్టీ నాయకులు డాక్టర్ బీ.కే.సుందర్, అనిల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధిలో దేశం ముందడుగు

- లోక్‌సభ సభ్యుడు కరడి సంగణ్ణ

గంగావతి రూరల్: 7.2 శాతం (స్థూల దేశీయ ఉత్పత్తి(జీడీపీ)ని సాధిస్తూ ఆర్థిక ప్రగతిలో భారతదేశం ముందుకు దూసుకుపోతోందని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశం ప్రపంచంలోనే నెం.1 స్థానం అలంకరిస్తుందని కొప్పళ ఎంపీ కరడి సంగణ్ణ తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ భారత్‌ను ప్రపంచ చాంపియన్‌గా మార్చేందుకు ప్రధాని తీసుకుంటున్న చర్యలతో జీడీపీలో 7.2 శాతానికి ఎగబాకిందన్నారు. మోదీ సాహసోపేత నిర్ణయాలతోనే దేశం ప్రగతి పథంలో దూసుకుపోతోందన్నారు. ఇప్పుడు జీడీపీ వృద్ధితో ప్రపంచం దృష్టిని భారత్ వైపు తిప్పుకునేలా చేశారన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతి రహిత పాలనను అందించిందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనా దృక్పథం, పార్టీ సిద్ధాంతాలతో కేంద్రంలో మళ్లీ బీజేపీకి అధికారం ఇస్తే దేశ ప్రగతి శిఖరాగ్రానికి చేరుకుంటుందన్నారు. బీజేపీ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి బీజేపీ విజయాలను, దేశ ప్రగతిని తెలియజేయాలన్నారు.

జూలైలో ధార్వాడ-బెంగళూరు వందే భారత్ రైలు ప్రారంభం

హుబ్లీ: ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ధార్వాడ-బెంగళూరు మధ్య వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలకు ముహూర్తం దగ్గర పడుతోంది. ఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి గురువారం కలిసి ఈ విషయమై చర్చించారు. ఈ సర్వీసుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. జూలైకు రాష్ట్రంలో రెండో వందే భారత్ రైలుకు శ్రీకారం చుట్టనున్నట్లు రైల్వే మంత్రి హామీ ఇచ్చారని జోషి ఓ ప్రకటనలో తెలిపారు. జంట నగరాల ప్రజలు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ఈ సర్వీసుకు మోక్షం లభించనుంది. దీంతో ప్రయాణికులకు అత్యంత వేగంగా సంచరించే భాగ్యం కలుగుతుంది. గంటకు గరిష్టంగా 160 కి.మీ. వేగంతో సంచరించే సామర్థ్యం కలిగిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో అత్యాధునిక వసతితో పాటు సీట్లను నిర్మించారు. ఎయిర్ కండీషన్, ఎకానమీ, ప్రీమియం క్లాస్‌లు ఉంటాయి. ఆన్ బోర్డు ఫలహారం వ్యవస్థ కూడా ఉంటుంది. రీడింగ్ లైట్ వ్యవస్థ, స్వయం చాలిత వాకిలి, వైఫై, చార్జింగ్ పాయింట్, సీసీ టీవీ, బయో బాత్రూమ్‌లతో ఈ రైలు ప్రయాణికులకు అనుకూలంగా ఉంటుంది.

సమష్టి కృషితోనే పదిలో అగ్రస్థానం

చెళ్లకెరె రూరల్: ఉపాధ్యాయులు, విద్యార్థుల సమష్టి కృషి వల్లే పదో తరగతి పరీక్షల్లో చిత్రదుర్గ జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని, వచ్చే విద్యా సంవత్సరంలో కూడా మొదటి స్థానాన్ని నిలుపుకోవడానికి శ్రమించాలని డీఈఓ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. గురువారం నగరంలోని ఆదర్శ పాఠశాలను సందర్శించిన సమయంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఈ సంవత్సరం పాఠశాలలు ప్రారంభం కాకముందే వంద శాతం పాఠ్య పుస్తకాలను, యూనిఫాంను అందించిందన్నారు. జిల్లాలో పాఠశాలల మరమ్మతుల కోసం రూ.9 కోట్ల ప్రతిపాదనలను జిల్లా కలెక్టర్‌కు పంపామన్నారు. అనంతరం డీఈఓను పాఠశాల సిబ్బంది సన్మానించారు. బీఈఓ సురేష్, జిల్లా ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.



డీఈఓను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ముంగారు ఉత్సవాలకు కౌంట్‌డౌన్

- రేపటి నుంచి మూడు రోజుల పాటు ఎద్దుల పండుగ
- కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎద్దులకు రాతిదూలం లాగే పోటీలు

రాయచూరు రూరల్: నగరంలోని ఏపీఎంసీ మైదానంలో రెండు దశాబ్దాలకు పైగా మున్నూరు కాపు సమాజం ఆధ్వర్యంలో ముంగారు ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. శనివారం నుంచి నగరంలో మూడు రోజుల పాటు ఎద్దుల పండుగలు జరుపుకుంటారు. మాజీ ఎమ్మెల్యే, మున్నూరు కాపు సమాజం అధ్యక్షుడు ఏ.పాపారెడ్డి ఆధ్వర్యంలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాల నుంచి ఎద్దులు వస్తాయి. ఏరువాక పున్నమి సందర్భంగా ఏపీఎంసీ ఆవరణలో రాతి దూలం లాగే పోటీలు, మహిళా, పురుష పైల్వాన్ల కుస్తీ పోటీలు, కళాకారులతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, రాతి గుండ్లు, మున్నూరు కాపు సమాజం ఆధ్వర్యంలో జరిగే ఎద్దుల పోటీలు భావితరాల వారికి గుర్తుండాలనే ఉద్దేశ్యంతో ఈ పోటీలను ఏర్పాటు చేస్తున్నారు. సమాజం ఆధ్వర్యంలో సీబీఎస్ పాఠశాల, ఆస్పత్రి, కళాశాల నిర్మాణానికి సిద్ధమయ్యారు. భవిష్యత్తులో పిల్లలకు గ్రామీణ కళలను మననం చేసుకోవడానికి ఈ ఉత్సవాలను ఏర్పాటు చేశారు.



మాజీ ఎమ్మెల్యే పాపారెడ్డి(ఫైల్)

ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజం



ఎస్ఐ వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న దృశ్యం

హొసపేటె: వృత్తిలో ఉన్నంత వరకు మనం చేసిన సేవలు చిరకాలంగా గుర్తుంటాయని జిల్లా ఎస్పీ శ్రీహరిబాబు తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వృత్తి ఎంతో విలువైనదని, వృత్తికి న్యాయం చేసేందుకు నడుం బిగించాలని కోరారు. ఈరోజు పదవీ విరమణ పొందిన సబ్‌ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు సేవా కాలంలో తన వృత్తికి ఎంతో న్యాయం చేశారన్నారు. అనంతరం వెంకటేశ్వర్లు దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవసరమైన దాఖలాలు సమర్పించండి

కేజీఎఫ్: నగరసభ వ్యాప్తిలో ఇ-తత్రాంశాన్ని సరళీకరణ చేస్తుండడం వల్ల నగరసభ సిబ్బంది ప్రతి ఇంటికి వచ్చినప్పుడు ప్రజలు అవసరమైన దాఖలాలను ఇవ్వాలని కమిషనర్ అంబికా ప్రజలకు మనవి చేశారు. 2002-03 నుంచి 2022-23వ సంవత్సరం వరకు పూర్తి స్థాయిలో ఆస్తి వివరాలను ఆన్‌లైన్‌లో పొందు పరచాలని కాలానుగణంగా ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. ఆస్తుల యజమానులు తమ ఆస్తులకు సంబంధించిన నివాసం ఉంటున్న ఇల్లు, ఖాళీ స్థలాలు, వాణిజ్య సంబంధ పూర్తి దాఖలాలను నగరసభ కార్యాలయానికి లేదా మీ ఇంటి వద్దకు వచ్చే నగరసభ సిబ్బందికి అందించాలని తెలిపారు. ఆస్తి యజమానికి సంబంధించిన క్రయపత్రాలు, దాన పత్రాలు, విభాగ పత్రాలు, వీలునామా తదితర ఆస్తి దాఖలాలతో పాటు ఆస్తి జీపీఎఫ్ చిత్రాలు, గుర్తింపు కార్డులను, మొబైల్ నెంబర్లను అందించాలని కోరారు. ఇ-స్వత్తు అయిన తరువాత ఆస్తి యజమానులు అన్ని దాఖలాలను ఆన్‌లైన్ ద్వారా పొందడానికి సాధ్యమవుతుందని తెలిపారు.

రూ.10 కోట్లతో అంబేడ్కర్ స్మారకం



స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

కేజీఎఫ్: నగరంలో రూ.10 కోట్ల వ్యయంతో అంబేడ్కర్ స్మారకాన్ని నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే రూపా శశిధర్ తెలిపారు. గురువారం అంబేడ్కర్ స్మారకం నిర్మాణంపై ఆమె విలేకరులకు వివరాలు వెల్లడించారు. అంబేడ్కర్ మహా విజ్ఞాని, పుస్తక ప్రియుడు కూడా కావడం వల్ల మొదటి అంతస్తులో సుమారు 150 మంది విద్యార్థులు కూర్చొని చదవడానికి అనుకూలమయ్యేలా అత్యాధునిక గ్రంథాలయాన్ని నిర్మిస్తారన్నారు. మహిళల సురక్షత దృష్టితో అంబేడ్కర్ స్మారకం నిర్మించే స్థలంలో 200 మంది మహిళలకు అవసరమైన వసతి నిలయాన్ని నిర్మిస్తారన్నారు. స్మారకం వద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రతిష్టిస్తారన్నారు. అంబేడ్కర్ స్మారకం నిర్మాణానికి ఇప్పటికే రూ.2 కోట్లు విడుదలయ్యాయన్నారు. స్మారకం కోసం బెమెల్ క్రీడా మైదానం ముందు 5 ఎకరాల స్థలం గుర్తించారని, త్వరలో పనులు ప్రారంభిస్తున్నట్లు ఆమె తెలిపారు.



కేజీఎఫ్ ఎమ్మెల్యే రూపా శశిధర్

కోలారు వార్తలు...

అనుమానం పెనుభూతమై..

- ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ ఆస్పత్రిలో తల్లీ బిడ్డ మృతి

శ్రీనివాసపురం: తరచు భర్త తన శీలాన్ని శంకిస్తున్నాడని జీవితంపై విరక్తి చెందిన ఓ భార్య తన ఇద్దరు పిల్లలకు ఎలుకల మందు ఇచ్చి తాను కూడా తాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన తాలూకాలోని చిక్కపద్మఘట్టలో జరిగింది. ఘటనలో గ్రామానికి చెందిన కావ్య(25), కూతురు చార్మి(3) మరణించగా, మరో కుమారుడు నిఖిల్(5) చికిత్స పొందుతున్నాడు. వివరాలు..భార్య కావ్య శీలంపై భర్త వేణుగోపాల్ తరచు అనుమానం వ్యక్తం చేసేవాడు. తరుచుగా ఈ విషయంపై దంపతుల మధ్య గొడవ జరుగుతుండేది. దీనిపై భార్య కావ్యను వేణుగోపాల్ పుట్టినింటికి కూడా కొద్దికాలం పంపించేశాడు. ఈ మధ్యనే కావ్య తిరిగి పిల్లలతో భర్త ఇంటికి వచ్చింది. సోమవారం రాత్రి ఇదే విషయంపై భార్యాభర్తల మధ్య తీవ్ర గొడవ జరిగింది. దీంతో విసిగిన కావ్య పాలలో ఎలుకల మందు కలిపి తన ఇద్దరు పిల్లలకు తాగించి తాను కూడా తాగింది. రాత్రి 10 గంటల సమయంలో పిల్లలు ఇద్దరు వాంతులు చేసుకోవడం ప్రారంభించారు. గమనించిన భర్త వేణుగోపాల్ అందరినీ ముళబాగిలు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం బెంగళూరు విక్టోరియా ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ కావ్య, ఛార్మి గురువారం మరణించారు. నిఖిల్‌కు ఆస్పత్రిలో చికిత్స కొనసాగిస్తున్నారు. నంగలి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

4న మంత్రి మునియప్పకు సన్మానం

కోలారు: రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కెహెచ్ మునియప్పను ఈ నెల 4న మధ్యాహ్నం 12 గంటలకు నగరంలోని చెన్నయ్య రంగమందిరంలో సన్మానించాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు తీర్మానించారు. గురువారం నగరంలోని డీసీసీ కార్యాలయంలో సమావేశమైన కాంగ్రెస్ నాయకులు ఆరోజు ఉదయం 9 గంటలకు కొండరాజనహళ్లి ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి అక్కడి నుంచి నేరుగా అంబేడ్కర్ సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి మాలార్పణ చేస్తారని తెలిపారు. అనంతరం ఎంజీ రోడ్డులోని మహాత్మాగాంధీ విగ్రహానికి మాలార్పణ చేస్తారని, అనంతరం క్లాక్ టవర్‌లోని మసీదు, మెథడిస్టు చర్చిల్లో ప్రార్థనలను నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు రంగమందిరంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కె.జయదేవ్, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రసాద్ బాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

బాల కార్మిక పద్ధతిని నిర్మూలిద్దాం

కోలారు: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జిల్లా న్యాయ సేవల ప్రాధికార సభ్యుడు, సివిల్ న్యాయమూర్తి సునీల్ ఎస్.హొసమని తెలిపారు. గురువారం నగరంలో బాలకార్మిక పద్ధతి నిర్మూలన అభియాన్‌ను ప్రారంభించి మాట్లాడారు. పిల్లలు గ్యారేజ్, హోటల్, మటన్, చికెన్ దుకాణాల్లో పనికి వెళ్లకూడదన్నారు. బాలకార్మికులను గుర్తించి వారిని పాఠశాలలకు తీసుకు రావాలన్నారు. జిల్లా కార్మిక అధికారి శబానా అజ్మీ మాట్లాడుతూ బాల్యావస్థ, కిశోరావస్థల కార్మిక చట్టం-1986 ప్రకారం అన్ని సంస్థల్లో 14 ఏళ్ల కంటే తక్కువ వయస్సున్న పిల్లలను పనిలో పెట్టుకుంటే శిక్షార్హులవుతారన్నారు. అలాంటి వారికి 6 నెలల నుంచి 2 ఏళ్ల వరకు జైలు, రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు జరిమానా తప్పదని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది శ్రీధర్, ప్రిన్సిపాల్ శృతి పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ



యూనిఫాం, పుస్తకాలను అందిస్తున్న ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి, అధికారులు

గంగావతి: ఉన్నతోద్యోగాల సాధనే లక్ష్యంగా విద్యార్థులు చదవాలని ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి సూచించారు. ఆయన గురువారం నీలకంఠేశ్వర సర్కిల్ సమీపంలోని బాలికల పాఠశాలలో ఉచిత యూనిఫాం, పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఐఏఎస్, ఐపీఎస్ ఇతర ఉన్నత ఉద్యోగాల సాధనే లక్ష్యంగా ఎంచుకొని వాటిని సాధించి మీ తల్లిదండ్రులకు, మీ ఊరుకు పేరు ప్రఖ్యాతులు తేవాలని కోరారు. సామాన్య ఉపాధ్యాయుడిగా పని చేస్తూ దేశ అత్యున్నత రాష్ట్రపతి పదవిని అలంకరించిన సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈఓ సోమశేఖర్‌రెడ్డి, పాఠశాల సభ్యురాలు మంజుల ఐలి, గాయత్రి, హెచ్ఎం రమేష్, విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలే ప్రభువులు: ఎమ్మెల్యే

బాగేపల్లి: డబ్బులు ఉన్నాయి కదా అని అహంకారంతో గెలిచి చూపిస్తామంటే ప్రజలు బుద్ధి చెబుతారని, బాగేపల్లితో పాటు రాష్ట్రంలో అనేక నియోజకవర్గాల్లో ప్రజలు ఇదే చెప్పారని ఎమ్మెల్యే ఎస్.ఎన్.సుబ్బారెడ్డి అన్నారు. పట్టణంలోని కన్వెన్షన్ హాల్లో ఘంటంవారిపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అభినందన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా ప్రభుత్వ వ్యవస్థలో ప్రజలే నిజమైన ప్రభువులని, ఎమ్మెల్యేలు, అధికారులు వారి సేవకులమని అన్నారు. అధికారం, ధనం ఉంది కదా అని వాటి ద్వారా ఎన్నికల్లో గెలుస్తామనుకుంటే ప్రజలు ఒప్పుకోరని అన్నారు. మనం అధికారంలో ఉన్నన్ని రోజులు ప్రజల మనిషిగా పని చేయాలని అన్నారు.

సీఎం మీడియా సలహాదారు కేవీ ప్రభాకర్‌కు సత్కారం



ప్రభాకర్, రుద్రణ్ణలను సన్మానిస్తున్న ప్రముఖులు

గంగావతి: ముఖ్యమంత్రి మీడియా సలహాదారుడుగా నియమితులైన కేవీ ప్రభాకర్‌ను గంగావతికి చెందిన వారు సన్మానించారు. ఈ సందర్భంగా మీడియా క్లబ్ ప్రధాన కార్యదర్శి కే.నింగజ్జ మాట్లాడుతూ ప్రభాకర్ తమకు అత్యంత ప్రియమిత్రుడని, ఆయన ఆ స్థాయికి వెళ్లడంపై తాము ఎంతో గర్వపడుతున్నామన్నారు. ఆయన భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు చేరాలని ఆశిస్తున్నామన్నారు. సీఎం మీడియా సలహాదారు కేవీ ప్రభాకర్‌తో పాటు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రశస్తి విజేత రుద్రణ్ణలను ఈసందర్భంగా సత్కరించారు. టీపీ మాజీ సభ్యులు రమేష్, మల్లికార్జున వెంకటేష్, తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

సహకార యూనియన్ అధ్యక్షుడిగా సురేష్

కోలారు: జిల్లా సహకార యూనియన్ అధ్యక్షుడిగా పెమ్మశెట్టిహళ్లి ఎస్.సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం నగరంలోని సహకార యూనియన్ సభాంగణంలో నిర్వహించిన ఎన్నికల్లో ఎస్ సురేష్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. గత అధ్యక్షుడు మూరాండహళ్లి గోపాల్ రాజీనామాతో ఖాళీ అయిన అధ్యక్ష స్థానానికి ఎస్.సురేష్ ఎన్నికయ్యారు. ఎన్నిక అనంతరం మాట్లాడిన అధ్యక్షుడు సురేష్ తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో సహకార శిక్షణా కార్యక్రమాలను గుణాత్మకంగా పెంచడానికి చర్యలు తీసుకుంటానన్నారు. సహకార యూనియన్ భవనం మరమ్మతు తదితర అన్నింటినీ డీసీసీ బ్యాంకు అధ్యక్షుడు బ్యాలహళ్లి గోవిందగౌడ సహకారంతో పూర్తి చేస్తానన్నారు. నూతన అధ్యక్షుడు సురేష్‌ను డీసీసీ బ్యాంకు అధ్యక్షుడు బ్యాలహళ్లి గోవిందగౌడతో పాటు పలువురు అభినందించారు.

బస్సు సర్వీసును కొనసాగించండి

కోలారు: కోలారు- కోటిగానహళ్లి బస్సు సర్వీసును కొనసాగించాలని కోరుతూ గ్రామస్తులు గురువారం కేఎస్ఆర్టీసీ డివిజనల్ అధికారికి వినతి పత్రం సమర్పించారు. ఈ మార్గంలో గతంలో నిత్యం మూడు సార్లు బస్సు తిరిగేదని, అయితే గత కొంతకాలంగా బస్సు సర్వీసును నిలిపి వేయడం వల్ల ఈ గ్రామానికి వెళ్లే గ్రామస్తులకు, విద్యార్థులకు, వ్యాపారులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందన్నారు. ఈ మార్గంలో ఉన్న ఇంకా అనేక గ్రామాల ప్రజలకు కలుగుతున్న సమస్యను గుర్తించి మళ్లీ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకుడు, హరటి జీపీ అధ్యక్షుడు వి గోపాల్, కెసి గోపాలగౌడ, వి గోవిందగౌడ తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి వైదిక, జ్యోతిష్య పాఠశాల షురూ

కంప్లి: ఎమ్మిగనూరు గ్రామంలోని హంపీ సావిర దేవర మఠంలో ఈ నెల 3 నుంచి వైదిక, జ్యోతిష్య పాఠశాలను ప్రారంభించనున్నట్లు మఠాధిపతి వామదేవ శివాచార్య తెలిపారు. పాఠశాలలో వసతి భవనం ఉచితమని, 12 నుంచి 16 ఏళ్ల లోపు వయస్సు వారు 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు ప్రవేశం పొందవచ్చని, పాఠశాలలో చేరదలచిన విద్యార్థులు జూన్ 20 లోగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు మఠాధిపతి సెల్ నెంబర్-9449821688ను సంప్రదించాలని తెలిపారు.

క్లుప్తంగా

ఎవరూ దోచుకోలేనిది విద్య ఒక్కటే : మంత్రి


విద్యార్థులకు నోటు పుస్తకాలు, యూనిఫాం అందజేస్తున్న మంత్రి రామలింగారెడ్డి

బొమ్మనహళ్లి : ఎవరూ దోచుకోలేనిది విద్య ఒక్కటే అని, విద్యార్థులు కష్టపడి చదవాలని రాష్ట్ర రవాణా, దేవదాయ శాఖ మంత్రి రామలింగారెడ్డి అన్నారు. నగరంలోని బీటీఎం లేఔట్ నియోజకవర్గం ఆడుగోడి, కోరమంగళలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గురువారం ఆయన ఉచితంగా నోటు పుస్తకాలు, యూనిఫాం అందజేసి మాట్లాడారు. ప్రతి విద్యార్థీ ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకొని దానిని చేరుకునేందుకు సాధన చేయాలన్నారు. సమాజ సేవకుడు వెంకటేష్, బీబీఎంపీ మాజీ కార్పొరేటర్ చంద్రప్ప ఆడుగోడి బీ.మోహన్ పాల్గొన్నారు.

పాలు మంచి పోషకాహారం

మండ్య: మండ్య పాల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ పాల దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఆస్పత్రిలోని రోగులకు, ప్రేరణ అంధుల ఆశ్రమంలో బాలలకు ఉచితంగా పాలను అందజేశారు. మన్‌మూల్ అధ్యక్షుడు ఎం.ఎస్. రఘునంద్ మాట్లాడుతూ పాల ప్రాముఖ్యత ప్రతి ఒక్కరికీ తెలియాలన్నారు. పాలలో ఉన్నన్ని పౌష్టికాంశాలు మరొక ఆహారంలో ఉండవని, అలాంటి పాల గురించి అందరికి తెలిసేలా చేయాలనీ అన్నారు. డాక్టర్ మంజేష్, శివకుమార్, సాగర్ పాల్గొన్నారు.

మంత్రిపై మండ్య ప్రజల ఆశలు


దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

మండ్య: రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి చెలువరాయస్వామి గురించి మండ్య జిల్లా ప్రజలు చాలా ఆశలు పెట్టుకున్నారని, ఆయన ఆధ్వర్యంలో జిల్లా అభివృద్ధితో పాటు రైతుల సంక్షేమానికి కృషి చేస్తారని టీపీ మాజీ అధ్యక్షుడు సి.త్యాగరాజు అన్నారు. గురువారం మంత్రి పుట్టినరోజు సందర్భంగా మండ్య గణపతి ఆలయంలో పూజలు, అలాగే రక్తదాన శిబిరాలు నిర్వహించారు. పేద మహిళలకు వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ నెల 3వ తేదీన ఆయన మంత్రి హోదాలో తొలిసారిగా వస్తున్నారని చెప్పారు.

రైల్వే వంతెన పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ

గౌరిబిదనూరు: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో జరుగుతున్న మధుగిరి రోడ్డు రైల్వే వంతెన పనులు తుదిదశలో ఉన్నాయని, త్వరలో పూర్తి చేసి ఎంపీ బచ్చేగౌడతో సంప్రదించి ప్రారంభోత్సవ తేదీని ఖరారు చేస్తామని ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ తెలిపారు. రూ.12 కోట్లతో చేపట్టిన రైల్వే వంతెన పనులను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ నగరంలో రహదారుల విస్తరణకు భవనాలను కూలకొట్టకుండా ప్రత్యామ్నాయ పరిష్కారం కనుగొంటామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం


కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్, అధ్యక్షుడు కేశవరెడ్డి

చిక్కబళ్లాపురం: ప్రజా సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని చిక్కబళ్లాపురం ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ అన్నారు.మినీ విధానసౌధలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు రోజూ నమస్తే చిక్కబళ్లాపుర్ కార్యక్రమం కొనసాగిస్తానని, 10నుంచి 1గంట వరకు కార్యాలయంలో అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. ప్రజలు తమ సమస్యలపై సంప్రదించాలన్నారు. నగరంలో శుక్రవారం నుంచి ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. అవినీతిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, ప్రజలను ఇబ్బందులకు గురిచేసే అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో గస్తీ బృందాలు

- ఆయా గ్రామస్తులతోనే నిఘా విధులు
- యువకులతో బృందాల ఏర్పాటు
- శివమొగ్గ జిల్లా ఎస్పీ కొత్త ప్రయోగం


గ్రామస్తులతో సమావేశమై మాట్లాడుతున్న ఎస్పీ మిథున్‌కుమార్

శివమొగ్గ : నగరాల్లో చీమ చిటుక్కుమన్నా పోలీసులకు తెలిసిపోతుంది. ఎక్కడ అవాంఛనీయ ఘటనలు జరిగినా పోలీసులు క్షణాల్లో వాలిపోతారు. ప్రజలకు పూర్తిస్థాయి భద్రత ఉంటుంది. అయితే గ్రామాల్లో అలాంటి పరిస్థితులు లేవు. దొంగలు, అసాంఘిక శక్తుల సంచారం ఉన్నా ఏమీ చేయలేని దుస్థితి. గ్రామాల్లో ఏం జరిగినా ఆ సమాచారం పోలీసులకు చేరేందుకు చాలా సమయం తీసుకుంటుంది. ఈక్రమంలో పల్లెల్లోనూ పట్టణాలు, నగరాల తరహాలో గస్తీ బృందాలు ఏర్పాటు చేసేందుకు శివమొగ్గ జిల్లా ఎస్పీ మిథున్‌కుమార్ కార్యాచరణ చేపట్టారు. ఆయా గ్రామాలకు చెందిన చురుకైన యువకులు 20 నుంచి 30 మందితో బృందాలు ఏర్పాటు చేస్తున్నారు. పోలీసులు గ్రామాలకు వచ్చిన సమయంలో ఈ యువకుల బృందాలు వారితో కలిసి అవసరమైన సమాచారం సేకరిస్తాయి. స్థానికంగా ఏం జరిగినా తక్షణమే పోలీసులకు సమాచారం అందేలా చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా జిల్లాలోని హాలెహోన్నూరు పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న యడెహళ్లిలో అశోక నగర పోలీసుల ఆధ్వర్యంలో జనస్పందన సమావేశం నిర్వహించి యువకుల బృందాల ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఇదే తరహాలో భవిష్యత్‌లో అన్ని గ్రామాల్లో యువకుల బృందాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు.


మృత్యుఒడికి చేరి పలువురికి ప్రాణదానం

- బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి అవయవదానం

బనశంకరి: అతను మృత్యుఒడికి చేరినా అతనిలోని అవయవాలు మరికొందరు బాధితులకు పునర్జన్మ ఇచ్చాయి. రోడ్డు ప్రమాదంలో కుటుంబ సభ్యుడు గాయపడి బ్రెయిన్ డెడ్ కాగా అతని అవయవాలను దానం చేసి పలువురికి ప్రాణదానం చేశారు. వివరాలు.. నగరంలో ఈనెల 21న రెండు బైక్‌లు ఢీకొని బసవేశ్వరనగరకు చెందిన రోహిత్(26) అనే వ్యక్తికి మూగదెబ్బలు తగిలాయి. దీంతో అతన్ని విజయనగర ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యం సరిగా చేయలేదని భావించి మరో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే బుధవారం రోహిత్‌కు బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు గుర్తించారు. అవయవాలు దానం చేస్తే మరికొందరి ప్రాణాలు నిలబెట్టవచ్చని వైద్యులు రోహిత్ కుటుంబ సభ్యులను ఒప్పించారు. అంతటి దుఃఖంలోనూ అవయవ దానానికి అంగీకరించారు. దీంతో రోహిత్ నుంచి రెండు కళ్లు, కిడ్నీలు, లివర్, లంగ్స్, గుండెను సేకరించి వాటి అవసరం ఉన్న ఇతరులకు అమర్చి వారి ప్రాణాలు నిలబెట్టారు.

గొంతులో ఇరుక్కున్న పూసల దండ


శస్త్రచికిత్సద్వారా నల్లపూసల దండను తొలగిస్తున్న ఈఎన్‌టీ వైద్యులు


నల్లపూసల దండను బయటకు తీసిన దృశ్యం

- మూడు నెలలుగా వ్యక్తి అవస్థలు
- శస్త్రచికిత్స చేసి తీసిన వైద్యులు

అనంతపురం క్రైం: ఇంట్లో గొడవపడి క్షణికావేశంలో ఓ వ్యక్తి (45) ఏకంగా నల్లపూసల దండ మింగేశాడు. మూడు నెలల పాటు ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పలేదు. ఏమైనా మింగడానికి ఇబ్బందిగా ఉండడం, కడుపులో నొప్పిగా ఉందని కుటుంబీకులకు చెప్పడంతో వారు జిల్లా కేంద్రంలోని పలు నర్సింగ్ హోంలకు తిరిగారు. రూ.వేలల్లో ఖర్చు అవుతుందని చెప్పడంతో వారు ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఈఎన్‌టీ వైద్యులను ఆశ్రయించగా హెచ్ఓడీ డాక్టర్ శ్రీధర్ ఆదేశాలతో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుకుమార్, డాక్టర్ కృష్ణసౌమ్య బృందం అరగంట పాటు శ్రమించి నల్లపూసల దండను తీసి సమస్యను పరిష్కరించారు.

ఎక్స్ రేలో తెలిసింది

వివరాల్లోకి వెళితే శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంకు చెందిన రామాంజినేయులు అనే వ్యక్తి తన భార్యకు చెందిన రోల్డ్ గోల్డ్ నల్లపూసల దండను మింగేశాడు. విషయం కుటుంబీకులకు చెప్పగా ఈ నెల 29న జీజీహెచ్‌లోని ఓపీ నెంబర్ 7లో ఉన్న డ్యూటీ వైద్యులు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుకుమార్‌ను కలిశారు. చైన్‌ను మింగానని, మింగడానికి ఇబ్బందిగా ఉందని చెప్పడంతో వైద్యులు నమ్మలేదు. ఎక్స్‌రే తీయగా అన్నవాహిక వద్ద నల్లపూసల దండ డాలర్ ఇరుక్కుని, దండ ఆహార నాళంలో వేలాడుతూ ఉండడం చూసి వైద్యులు ఆశ్చర్యపోయారు. దీంతో హుటాహుటిన అతన్ని వార్డులోకి షిఫ్ట్ చేశారు. గత నెల 30న అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సుకుమార్, డాక్టర్ కృష్ణసౌమ్య, స్టాఫ్‌నర్సులు, అనస్తీషియా వైద్యుడు శస్త్రచికిత్స నిర్వహించారు. ఫ్లెక్సిబుల్ గ్యాస్ట్రో ఎండోస్కోపీ ద్వారా నల్లపూసల దండను ఆహార నాళం నుంచి బయటకు తీశారు. ప్రస్తుతం రామాంజినేయులు ఆరోగ్యంగా ఉన్నాడు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇటువంటి కేసులకు కనీసం రూ.1.50 లక్షలు వసూలు చేస్తారని, తాము పూర్తి ఉచితంగా చేసినట్లు వైద్యులు తెలిపారు.

నగరాభివృద్ధిపై మంత్రి చర్చ

బనశంకరి: డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్ గురువారం బీబీఎంపీ మాజీ మేయర్లతో కీలక సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. బెంగళూరు అభివృద్ధి, చెత్త నిర్వహణ తదితర అంశాలపై మాజీ మేయర్లనుంచి సలహాలు తీసుకున్నట్లు తెలిపారు. ఎక్కడపడితే అక్కడ చెత్త పడేసే వాహనాలకు జరిమానా విధించే విషయంపై చర్చించినట్లు తెలిపారు. సోమవారం బెంగళూరు నగర ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించి వారితో సలహాలు, సూచనలు తీసుకుంటానన్నారు. పన్ను రాయితీ జూన్ 30 వరకు పొడిగించామని, ఈలోపు వార్షిక పన్ను చెల్లించిన వారికి 5 శాతం రాయితీ ఇస్తామన్నారు.

గోదాములో అగ్ని ప్రమాదం

మైసూరు : షామియాన, డెకరేషన్ గోదాములో మంటలు చెలరేగి భారీగా వస్తువులు కాలిబూడిదయ్యాయి. మైసూరులోని చాముండికొండ తప్పలిలో సుంగమ్ షామియానా డెకొరేటెడ్ గోదాము ఉంది. గురువారం గోదామునుంచి పొగలు రావడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సరస్వతీపురం, హెబ్బాళ, బన్నిమంటపం వద్దనుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మూడు గంటలు శ్రమించి మంటలు ఆర్పివేశారు. అప్పటికే గోదాములో ఉన్న షామియానాలు, ఇతర వస్తు సామగ్రి, ఫర్నిచర్ కాలిబూడిదైంది. కృష్ణరాజ పోలీసులు పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

రైతులకు రాయితీతో విత్తనాలు, డ్రిప్

హోసూరు: వ్యవసాయ శాఖ ద్వారా అందజేసే రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని హోసూరు వ్యవసాయ శాఖ ఉప డైరెక్టర్ భువనేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. హోసూరు తాలూకాలో ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయని, ఈ ఖరీఫ్ సీజన్‌లో హోసూరు తాలూకాకు చెందిన రైతుల కోసం 18 టన్నుల మేలురకమైన రాగివిత్తనం, 7 టన్నుల కంది విత్తనాలు సిద్ధంగా ఉంచినట్లు, 50 శాతం రాయితీతో రైతులకు అందజేస్తున్నామని తెలిపారు. అలాగే వేరుసెనగ విత్తనాలు కూడా ఉన్నాయని చెప్పారు. చిన్నసన్నకారు రైతులకు ప్రధాన మంత్రి బిందుసేద్యం ద్వారా 100 శాతం రాయితీతో బిందుసేద్య ఉపకరణాలు, ఇతరులకు 75 శాతం రాయితీతో ఉపకరణాలు, విద్యుత్ మోటార్, డీజిల్ పంప్‌సెట్, పైప్‌లైన్, వర్షపునీటి సేకరణ తొట్టెలు 50 శాతం రాయితీతో లభిస్తాయని చెప్పారు.

నగదుతో ఉడాయించిన దోపిడీదారుడు

- వెంటాడి పట్టుకున్న ట్రాఫిక్ పోలీసులు


దోపిడీదారుడిని పట్టుకున్న దృశ్యం

బనశంకరి: బైకిస్టును బెదిరించి నగదు లాక్కొని ఉడాయిస్తున్న దోపిడీదారుడిని ఉప్పారపేట ట్రాఫిక్ పోలీసులు అరెస్ట్‌చేశారు. గురువారం ప్యాలెస్‌రోడ్డులో ఓ వ్యక్తి బైక్‌పై వెళ్తుండగా దుండగుడు అడ్డుకొని మారణాయుధాలతో దాడిచేశాడు.అనంతరం రూ.10వేలు లాక్కొని ఉడాయించాడు. అక్కడే ప్యాలెస్‌రోడ్డులో విధుల్లో ఉన్న ట్రాఫిక్ ఏఎస్ఐ రవీంద్ర, హెడ్‌కానిస్టేబుళ్లు లక్ష్మణయ్య, మరిస్వామిలు గమనించి దొంగను వెంటాడి స్థానికుల సహాయంతో పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. ట్రాఫిక్ పోలీసులు సమయస్ఫూర్తిని నగర పోలీస్ కమిషనర్ బి.దయానంద్ మెచ్చుకున్నారు.

నదిలోకి జారిపడి బాలుడి మృతి

మైసూరు: కావేరి నదిలోకి జారి పడిన విద్యార్థి మృతి చెందిన ఘటన మూర్నాడు వద్ద కొండంగేరిలో జరిగింది. టెన్త్ చదివే ఆసీమ్ (15) స్నేహితులతో కలిసి నదిలో ఆడుకోవాలని వచ్చాడు. నది ఒడ్డున నిలబడి ఉండగా జారి నీటిలో పడిపోయాడు. ఈత రాక నీట మునిగి చనిపోయాడు. సిద్దాపుర పోలీసులు వచ్చి పరిశీలించి కేసు నమోదు చేశారు.

కర్ణాటకకు వ్యతిరేకంగా నినాదాలు

యశవంతపుర: బెళగావి తాలూకా హిండలగాలో మరాఠీలు మరోమారు కన్నడిగులను రెచ్చగొట్టేలా వ్యవహరించారు. 1986లో జరిగిన సరిహద్దు గొడవలో అసువులుబాసినవారికి గురువారం ఏర్పాటు చేసిన శ్రద్ధాంజలి సభలో ఎంఈఎస్ కార్యకర్తలు పాల్గొని కర్ణాటకకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

పిడుగుపాటుకు దెబ్బతిన్న ఇళ్లు

దొడ్డబళ్లాపురం: తాలూకాలోని కన్నమంగల గ్రామంలో బుధవారం రాత్రి ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈక్రమంలో గ్రామానికి చెందిన కుమార్, నరసింహయ్య, రాజయ్య అనే వ్యక్తులకు చెందిన ఇళ్లపై పిడుగులు పడటంతో గోడలు ధ్వంసమయ్యాయి.

మంత్రి పీఏ పేరుతో వంచనకు యత్నం

బనశంకరి: నామినేటెడ్ పదవులు ఇప్పిస్తామని మంత్రి ప్రియాంక్‌ఖర్గే పీఏ పేరుతో దందాలకు యత్నించిన వ్యక్తిని గురువారం సదాశివనగర పోలీసులు అరెస్ట్‌చేశారు. మైసూరులోని రామకృష్ణనగరకు చెందిన రఘునాథ్ ఇటీవల దాసరహళ్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు గీతశివరామ్‌కు ఫోన్ చేశాడు. డబ్బు ఇస్తే నామినేటెడ్ పదవులు ఇప్పిస్తానని చెప్పాడు. ఆమె ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి పీఏ కేశవమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు రఘునాథ్‌ను అరెస్ట్‌చేశారు.

ప్లాస్టిక్ కవర్ల స్వాధీనం

తుమకూరు: తుమకూరు నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, ఉత్పత్తుల విక్రయాలపై నిషేధం ఉంది. అయినప్పటికీ అనేక దుకాణాల్లో వీటి విక్రయాలు, వినియోగం సాగుతున్నట్లు తెలిసి గురువారం మహానగర పాలికే కమిషనర్ హెచ్.వి. దర్శన్ అధ్వర్యంలో అధికారులు సోదాలు చేశారు. పలు షాపుల్లో సుమారు 1 టన్ను వరకు ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని రూ. 70 వేల వరకూ జరిమానా విధించారు.

హోసూరు వార్తలు..

తాగుడుకు బానిసై కూలీ ఆత్మహత్య

క్రిష్ణగిరి: తాగుడుగు బానిసై పనికి వెళ్లకపోవడంతో ఇంట్లోనివారు తిట్టారని కార్మికుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొన్న ఘటన సూళగిరి వద్ద వెలుగు చూసింది. వివరాల మేరకు సూళగిరి సమీపంలోని పెరియపల్లం గ్రామానికి చెందిన హరీష్‌కుమార్ (33). ఇతనికి తాగుడు అలవాటుండేది. గత కొద్దిరోజులుగా అతిగా మద్యం సేవిస్తూ విధులకెళ్లక తిరుగుతుండడంతో కుటుంబీకులు మందలించారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన అతడు బుధవారం రాత్రి పురుగుల మందు తాగి ప్రాణాలు తీసుకున్నాడు. ఈ ఘటనపై సూళగిరి పోలీసులు కేసు నమోదు చేశారు.

రెండుచోట్ల గుట్కా పట్టివేత

హోసూరు: హోసూరు పారిశ్రామికవాడ జూజువాడి చెక్‌పోస్ట్ వద్ద బుధవారం రాత్రి సిఫ్‌కాట్ పోలీసులు వాహన తనిఖీలు చేయగా కారులో రూ. 1.20 లక్షల విలువ చేసే గుట్కా దొరికింది. గుట్కా, కారుతో పాటు కెలమంగలం గణేష్‌కాలనీకి చెందిన డ్రైవర్ జగదీష్ (29)ని అరెస్టు చేశారు. బెంగళూరు నుంచి క్రిష్ణగిరికి బైక్‌లో గుట్కా తరలిస్తున్న క్రిష్ణగిరి కొత్తపేటకు చెందిన కుమార్(48)ని అరెస్ట్ చేసి అతని రూ. 18 వేల విలువైన 26 కిలోల గుట్కాను సీజ్ చేశారు.

పథకాలను అమలు చేస్తాం

శివాజీనగర: కాంగ్రెస్ ప్రకటించిన గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని క్రీడాశాఖ మంత్రి బి.నాగేంద్ర తెలిపారు. గురువారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం మంత్రి మండలి సమావేశం తరువాత పథకాల అమలుపై ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు.

పెండింగ్ పనులపై కలెక్టర్ సమీక్ష

హోసూరు: జిల్లా కేంద్రం క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో అన్ని శాఖల అధికార్లతో సంయుక్త కమిటీ సమావేశం బుధవారం సాయంత్రం కలెక్టర్ శరయు అధ్యక్షతన జరిగింది. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనులు, అర్థాంతరంగా నిలిచిపోయిన పనులు, ఇకపై చేపట్టవలసిన అభివృద్ధి పనులపై చర్చించారు. జిల్లా వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించి వెంటనే పరిష్కరించేందుకు ఆయా శాఖాధికార్లు కృషి చేయాలని సూచించారు. డీఆర్‌వో రాజేశ్వరి, అధికార్లు వేడియప్పన్, అదనపు కలెక్టర్ వందనకార్గ్, హోసూరు సబ్‌కలెక్టర్ శరణ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, కలెక్టర్ శరయును హోసూరు మేయర్ ఎస్.ఏ.సత్య కలిసి జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలియజేశారు.

బీబీఎంపీ ఎన్నికల్లో సత్తా చాటాలి

దొడ్డబళ్లాపురం : ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కోలుకోలేని దెబ్బతిన్న జేడీఎస్ పార్టీ రానున్న బీబీఎంపీ ఎన్నికలపై దృష్టి సారించింది. మాజీ సీఎం కుమారస్వామి గురువారం రామనగర తాలూకా బిడదిలోని ఫాంహౌస్‌లో బెంగళూరు పరిధిలోని 28 నియోజకవర్గాలకు చెందిన నేతలతో సమావేశమయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో నిర్లక్ష్యం వహించిన కొందరు నేతలకు క్లాస్ తీసుకున్నారు. భిన్నాభిప్రాయాలు మానుకుని బీబీఎంపీ ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని హితవు చెప్పినట్లు తెలిసింది.

బనశంకరీదేవి కుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభం


ప్రత్యేక పూల అలంకరణలో బనశంకరీదేవి

బనశంకరి: భక్తుల కోరికలు తీర్చే కల్పవల్లిగా పేరు పొందిన బనశంకరీదేవి కుంభాభిషేక మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేకువజామున సుప్రభాతసేవ అనంతరం ప్రధాన అర్చకులు ఆర్.సత్యనారాయణశాస్త్రి, చంద్రమోహన్ ఆధ్వర్యంలో బనశంకరీదేవి మూలవిరాట్‌కు అభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం పుష్పాలతో అమ్మవారికి విశేష అలంకరణ చేపట్టారు. తర్వాత ఆలయంపై కలశం ఏర్పాటు చేశారు. కుంభాభిషేక మహోత్సవం సందర్భంగా శుక్ర, శనివారాల్లో భక్తులకు అమ్మవారి దర్శనం ఉండదు. శాకాంబరి దేవీ వద్ద దీపారాధన చేయొచ్చు. మధ్యాహ్నం అన్నదానం ఉంటుంది. శుక్ర, శనివారాల్లో యాగం, హోమాలు, 4న శతచండీయాగం నిర్వహించి ఉదయం 11.30 గంటల అనంతరం బనశంకరీదేవి మూలవిగ్రహ దర్శనానికి భక్తులకు అవకాశం ఇస్తామని అర్చకులు తెలిపారు.

'శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు'

బనశంకరి: సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు తీసుకుంటామని హోంమంత్రి పరమేశ్వర్ తెలిపారు. గురువారం ఆయన విధానసౌధలోని తన కార్యాలయానికి పూజ నిర్వహించారు. అనంతరం పరమేశ్వర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడటం హోంశాఖకు చాలా ముఖ్యమన్నారు. అసాంఘిక శక్తుల పీచమణుచుతామన్నారు. ప్రజలు ప్రశాంతంగా జీవించడమే ముఖ్యమన్నారు. ఐదు గ్యారంటీ పథకాల అమలుపై మంత్రివర్గంలో నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.

4న వైద్య శిబిరం

బనశంకరి: జయనగరలోని డాక్టర్ హెచ్ఎస్ కళాక్షేత్రంలో వైద్యుడు డాక్టర్ హనుమంతమళి నేతృత్వంలో ఈనెల 4న ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు మహావతార్ ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం అయ్యే శిబిరంలో వివిధ రోగాలకు వైద్యులు చికిత్స అందజేస్తారు. సద్గురు సాదుశ్రీ ద్వారా శక్తిచేతన సామర్థ్యం, బెళగావికి చెందిన డాక్టర్ అభినవ బ్రహ్మానందమహాస్వామీజీ నుంచి ధ్యానశక్తి, సస్యాహారంపై ఆధ్యాత్మిక ప్రసంగం ఉంటుంది. చింతలపల్లి శ్రీనాథ్ బృందం ద్వారా సంగీత కార్యక్రమం ఉంటుంది. వివరాలకు 9008532066 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలి.

బైక్‌ను ఢీకొన్న బస్సు

- నలుగురికి గాయాలు

యశవంతపుర: కేఎస్ఆర్‌టీసీ బస్ బైకును ఢీకొని నలుగురు గాయపడ్డారు. ఈ ఘటన బెళగావి జిల్లా ఖానాపుర తాలూకా గోళిహళ్లి వద్ద గురువారం జరిగింది. కడతన బాగేవాడికి చెందిన యల్లప్ప, బీమప్ప, పల్లవి, ఐశ్వర్యలు బైక్‌పై ఆశ్వావవరకు వెళ్తుండగా శిరసినుంచి బెళగావి వెళ్తున్న బస్సు ఢీకొంది. ప్రమాదంలో నలుగురికీ గాయాలయ్యాయి. అంబులెన్స్ రాకపోవడంతో కారులో ఖానపూర ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో లైన్‌మెన్ మృతి


మృతుడు ద్యామణ్ణ(ఫైల్)

యశవంతపుర: విద్యుదాఘాతంతో లైన్‌మెన్ మృతి చెందిన ఘటన గురువారం కడబలో జరిగింది. బాగలకోటెకు చెందిన ద్యామణ్ణ కడబ మెస్కాంలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ముళిమజలు సమీపంలోని కాయరడ్కలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో స్తంభం ఎక్కి రిపేరీ చేస్తుండగా కరెంట్ సరఫరా అయ్యింది. విద్యుత్‌షాక్‌తో కింద పడిన అతనికి తీవ్ర గాయాలు కావడంతో కడబ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

అపరేషన్ థియేటర్‌లో వైద్యుడి కునుకు

యశవంతపుర: అపరేషన్ థియేటర్‌లో వైద్యుడు కునుకు తీసిన ఘటన చిక్కమగళూరు జిల్లా కళసలో జరిగింది. కళసలో సంతాన నియంత్రణ ఆపరేషన్ క్యాంప్ నిర్వహించారు. ఈక్రమంలో వైద్యుడు కునుకు తీయడంతో కు.ని.ఆపరేషన్లకు వచ్చిన మహిళలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయంపై అధికారులు విచారణ చేపట్టగా వైద్యుడు నిర్వాకం నిర్ధారణ అయ్యింది. దీంతో వైద్యుడిని సస్పెండ్ చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావ్ డీహెచ్‌ఓను ఆదేశించారు.

యల్లమ్మదేవికి అలంకరణ



చింతామణి: పట్టణ శివార్లలోని కోలారు రోడ్డులో వెలసిన శ్రీ మాతా యల్లమ్మ దేవి మహా కుంభాభిషేకం గురువారం ఘనంగా జరిగింది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు బట్టి రాజణ్ణ కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రియాంక ఖర్గే, ఎంబీ పాటిల్‌కు అదనంగా శాఖలు

శివాజీనగర: క్యాబినెట్ మంత్రులైన ప్రియాంక ఖర్గే, ఎం.బీ.పాటిల్‌కు అదనంగా శాఖలు కేటాయిస్తూ సీఎం సిద్దరామయ్య నిర్ణయం తీసుకున్నారు. ఈమేరకు మంత్రి మండలి వ్యవహారాలు, సిబ్బంది, పరిపాలనా సచివాలయం ఆదేశాలు జారీ చేసింది. ప్రియాంక ఖర్గేకు గ్రామీణాభివృద్ధి, పంచాయత్ రాజ్‌తో పాటుగా అదనంగా ఐటీ-బీటీ శాఖను కేటాయించారు. ఎం.బీ.పాటిల్‌కు భారీ, మధ్య తరహా పరిశ్రమలతో పాటుగా అదనంగా మౌలిక సదుపాయాల అభివృద్ధి శాఖను అప్పగించారు. ఈ రెండు శాఖలు ముఖ్యమంత్రి సిద్దరామయ్య వద్ద ఉండేవి.

సీఎం ప్రధాన సలహాదారుగా సునీల్ కనుగోలు

శివాజీనగర: విధానసభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడంలో కీలకపాత్ర పోషించిన ఆ పార్టీ ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలుకు అత్యంత ప్రాధాన్యతమైన పోస్టు లభించింది. ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు ప్రధాన సలహాదారుడిగా సునీల్ కనుగోలు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర సిబ్బంది, పరిపాలనా శాఖ ఆదేశాలు జారీ చేసింది. తక్షణమే ఈ ఆదేశాలు అమలులోకి వస్తాయని పేర్కొంది. క్యాబినెట్ హోదాతో ఆయనకు అన్ని సదుపాయాలను కల్పించాలని సిద్దరామయ్య ఆదేశాలు జారీ చేశారు.

విద్యార్థులు రాజ్యాంగాన్ని చదవాలి

బనశంకరి: సాంఘిక సంక్షేమశాఖ మంత్రి హెచ్‌సీ.మహదేవప్ప కీలక సూచన చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలలు, కాలేజీల్లో రోజూ భారత రాజ్యాంగాన్ని విద్యార్థులు చదవాలని సూచించారు. గురువారం వికాససౌధలో ఆయన అధికారులతో సమావేశమై చర్చించారు. అన్ని కళాశాలలు, పాఠశాలలకు ఆదేశాలు పంపాలని సూచించారు.

సగం కాలిన స్థితిలో మృతదేహం

మైసూరు : హోసకోటె గ్రామం వద్ద వృద్ధుడి మృతదేహం సగం కాలిన స్థితిలో ఉండగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు వెళ్లి పరిశీలించారు. మృతుడి వయస్సు 65 నుంచి 70 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఇతన్ని దుండగులు ఇతర ప్రాంతాల్లో హత్య చేసి శవాన్ని ఇక్కడ పడేసి నిప్పు పెట్టారని పోలీసులు తెలిపారు. మృతదేహం సగం కాలిపోయి ఉందన్నారు. అనంతరం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

నకిలీ గిఫ్ట్‌కార్డులపై కోర్టుకెళ్తాం

తుమకూరు: కుణిగల్ కాంగ్రెస్ అభ్యర్థి హెచ్.డీ. రంగనాథ్ ఎన్నికల సమయంలో ఓటర్లకు నకిలీ గిఫ్ట్ కార్డులు ఇచ్చి వారిని ప్రలోభపెట్టి ఓట్లు వేయించుకున్నారని, దీనిపై హైకోర్టును ఆశ్రయిస్తామని బీజేపీ ఎమ్మెల్సీ కేఎస్.నవీన్ వెల్లడించారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. సుమారు 60 వేల మంది ఓటర్లకు గిఫ్ట్‌కార్డులు పంచారని, అయితే అవి నకిలీవని తేలడంతో ప్రజలు ఆయనపై ఆగ్రహంగా ఉన్నారన్నారు.

ఆలయ నిర్మాణానికి నాంది



భూమిపూజ చేస్తున్న దృశ్యం

క్రిష్ణగిరి: తాలూకా కేంద్రం సూళగిరి సమీపంలో షిరిడీ సాయిబాబా ఆలయ నిర్మాణానికి గురువారం భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. సూళగిరి – కుంభళం రోడ్డులో నివాసముంటున్న తిరుమాళ్ సాలియమ్మ కొడుకు రాజగోపాల్ తన పొలంలో ఆలయ నిర్మాణానికి స్థలం విరాళమిచ్చాడు. ఆ స్థలంలో ఆలయ నిర్మాణానికి స్థానిక ప్రజలు షిరిడీ సాయి చిత్రపటాన్ని ఉంచి, అభిషేకం, ఆరాధన, భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు.

అభివృద్ధి పనుల తనిఖీ

కెలమంగలం: డెంకణీకోట తాలూకా కెలమంగలం సమితిలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం జిల్లా అదనపు కలెక్టర్ వందన కార్గ్ పరిశీలించారు. రాయకోట, కరుకనహళ్లి, తిమిజేపల్లి, ఉడేదుర్గం, నాగమంగలం తదితర ప్రాంతాల్లో పాఠశాల తరగతి గదుల నిర్మాణ పనులు, వంటగది నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించి, పనులను వేగవంతం చేసి త్వరగా ముగించి వినియోగానికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బీడీవోలు శాంతలక్ష్మి, ఫయాజ్‌అహ్మద్, మురుగేషన్, సంపంగి, పంచాయతీ అధ్యక్షులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కరెంటు బిల్లు చెల్లించాలన్నందుకు దాడి


చికిత్సపొందుతున్న సంతోష్

యశవంతపుర: కరెంట్ బిల్ చెల్లించాలని కోరిన బిల్‌కలెక్టర్‌పై దాడి చేసిన ఘటన హాసనలో జరిగింది. హాసన జిల్లా అరకలగూడు తాలూకా పాత కోర్టు రోడ్డులో సురేశ్ అనే వ్యక్తి కోళ్లఫారం నిర్వహిస్తున్నాడు. రూ.1,150 బిల్లు బకాయి కోసం చెస్కాం బిల్ కలెక్టర్ సంతోష్ బుధవారం వెళ్లాడు. అయితే కరెంటు బిల్లులు కట్టవద్దని ప్రభుత్వమే చెప్పిందని, బిల్లు కోసం ఎలా వచ్చావని సంతోష్‌పై దాడి చేసి దుర్భాషలాడారు. దీంతో బాధితుడు అరకలగూడు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



డాక్టర్ టెకీ విజయగౌరి, రాజ్ భవన్ ఉద్యోగి

‘ముదితలు నేర్వగరాని విద్య గలదే’ అన్నట్లుగా లక్ష్యం బలంగా ఉంటే ఎన్ని అవాంతరాలు వచ్చినా అధిగమించవచ్చని చాటి చెప్పిన మహిళ కథనం ఇది. ‘అలలు ఎగిసి పడినందుకు కాదు. పడి లేవడం నాకిష్టం’ అన్న విధంగా తాము పడిపోయాం అనుకోకుండా రెట్టించిన శక్తితో పైకి లేవగలమని చేతల్లో చూపిన ధీశాలి గమనం ఇది. విధిని ఎదిరించి ‘విజయ’తీరాలకు చేరిన వనిత గాథ ఇది. ప్రమాదంలో సర్వం కోల్పోయినా.. తానూ మరణపు అంచులకు వెళ్లినా.. లేచి నిలబడి ఉన్నత స్థితికి చేరిన విజయగౌరి జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకం.

– గాంధీనగర్(విజయవాడసెంట్రల్)

పడి లేచిన కెరటం..

విజయతీరాలకు..

విధికి ఎదురొడ్డి పోరాడిన వనిత గాథ

విషాదం నుంచి మొదలై..

కళ్లెదుటే భర్త, కన్నకూతురు, తోడబుట్టిన తమ్ముడు చనిపోతే.. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న కొడుకు అచేతనంగా పడి ఉంటే.. ఎవరైనా ఏం చేస్తారు? జీవితాంతం ఆ విషాద ఘటనను గుర్తు చేసుకుని జీవచ్ఛవంలా మారిపోతారు. గుండెల్ని పిండేసే ఆ ఘటన తలచుకుంటేనే హృదయం ద్రవించిపోతోంది. మరీ. కళ్లారా చూసి ఆ ఘోరాన్ని భరించాలంటే ఆ బాధ వర్ణనాతీతం. కానీ సరిగ్గా అటువంటి విషాద సంఘటనే ఆమె జీవితంలో చోటు చేసుకుంది. కానీ అందరిలా విధి రాత, తలరాత అనుకుంటూ ఆమె కుమిలిపోతూ కూర్చోలేదు. బతికి ఉన్న కొడుకులో భర్త, కూతురు, తమ్ముడిని చూసుకుంటూ జీవిత ప్రయాణాన్ని ప్రారంభించారు. తండ్రి ఇచ్చిన మనోధైర్యంతో విజయతీరాలకు చేరారు టెకీ విజయగౌరి. బాధను దిగి మింగి ఓ వైపు ఉద్యోగం చేస్తూనే మరో వైపు ఉన్నత చదువులు చదివి పీహెచ్‌డీ పూర్తి చేసింది. ప్రస్తుతం రాజ్‌భవన్‌లో ఉద్యోగం చేస్తూ అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఆమె జీవన పోరాటాన్ని ఆమె మాటల్లోనే విందాం..

కుటుంబ నేపథ్యం..

మాది విశాఖపట్నం గాజువాక. నాన్న కృష్ణారావు డాక్ యార్డ్‌లో ఉద్యోగి. అమ్మ లక్ష్మీ గృహిణి, కుటుంబ, ఆర్థిక కట్టుబాట్ల కారణంగా ఇంటర్ పూర్తి కాగానే పెళ్లి చేశారు. 1992లో సూర్యప్రకాష్‌తో వివాహమైంది. భర్త ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు. ఇద్దరు పిల్లలతో జీవితం హాయిగా సాగిపోతోంది. చదువుపై ఉన్న శ్రద్ధతో ఆయన



డాక్టరేట్ సాధించిన విజయగౌరిని అభినందిస్తున్న రాజ్ భవన్ సిబ్బంది

సహకారంతో 2000లో దూరవిద్యలో ఆంధ్ర యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేశాను. 2002లో హిందీ బీఈడీలో సీటు వచ్చినప్పటికీ వదులుకోవాల్సి వచ్చింది. ఎంఏ (పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్) పూర్తి చేశాను. హాయిగా సాగిపోతున్న జీవితంలో ఒక్కసారిగా విషాదం. సంక్రాంతి పండుగ వేళ 2003 జనవరి 16న జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త, కూతురు, తమ్ముడు చనిపోయారు. నేను, ఆరేళ్ల మా బాబు కోమాలోకి వెళ్లాం. అయితే మా అత్తింటి వారు నా భర్త, పాప మృతదేహాలు మా పుట్టింటి వద్దే వదిలివెళ్లిపోయారు. అప్పటి నుంచి మా పుట్టింట్లోనే అమ్మా నాన్న వద్దే ఉంటున్నాను.

2004లో కారుణ్య నియామకం..

నా భర్త ఉపాధ్యాయుడు కావడంతో కారుణ్య నియామకాల్లో 2004 ఏప్రిల్ 3న సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఉద్యోగం వచ్చింది. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం చినరావుపల్లి గ్రామంలో పోస్టింగ్. అయితే జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం కంటే సెకండరీ గ్రేడ్ టీచర్ ఉద్యోగానికి జీతం ఎక్కువ కావడం, కారుణ్య నియామకం కింద టీచర్‌గా పోస్టింగ్ ఇవ్వడం సరికాదని, దీనికి సంబంధించి సెప్టెంబర్ 2002 ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయని, తెలుసుకోకుండా పోస్టింగ్ ఇచ్చారని

నాన్న ఇచ్చిన ధైర్యంతో..

ఒంటరిగా ఉంటే పిచ్చిదానివి అయిపోతావు. నీ కొడుకు కోసమైనా నీవు అన్ని మరిచిపోయి బతికి ఉండాలి. మామూలు మనిషివి కావాలంటూ నాన్న వెన్నుతట్టారు. గుండె ధైర్యం నింపారు. మళ్లీ చదువు బాట పట్టించారు. 2003లో గురజాడ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, శ్రీకాకుళంలో బీఎడ్ జాయిన్ చేశారు. ఇక ప్రతిరోజు తెల్లవారు జామున నాలుగంటలకు నిద్ర లేచి బస్సులో గాజువాక నుంచి శ్రీకాకుళం జిల్లా పెదపాడు గ్రామం వెళ్లడం.. రావడం. ఇంటికి రాగానే ఒంటరిగా బిక్కుబిక్కుమంటూ ఎదురు చూస్తున్న కొడుకు. ఓ వైపు పిల్లాడికి చదువు చెప్పుకుంటూ నేను చదువుకుంటూ బీఎడ్ డిస్టింక్షన్‌లో పాసయ్యాను.

సరెండర్ చేశారు. దీంతో మళ్లీ ఒంటరి పోరాటం ప్రారంభం అయ్యింది. పిల్లాడి చదువు, ఇంటిపోషణ చూసుకుంటూ జీవనం సాగిస్తుండగా.. నవంబర్, 2005లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇచ్చారు. నాన్న ఇచ్చిన ధైర్యంతో ఉద్యోగం చేస్తూనే పట్టు వదలకుండా చదువు కొనసాగించాను. పీహెచ్‌డీ చేయాలనే అభిరుచి, గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఇంగ్లిషు అభివృద్ధి చేసి, సేవ చేయాలనే ఆలోచనతో ఎంఏ ఇంగ్లిష్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాను. ఆ తర్వాత కృష్ణా యూనివర్సిటీలో పీహెచ్‌డీలో జాయిన్ అయ్యాను. 2023 మార్చి 29న డాక్టరేట్ పొందాను.

ఎందరో ప్రోత్సాహం..

నా జీవిత ప్రయాణంలో విజయనగరం నుంచి రాజ్ భవన్ వరకు ఎందరో వెన్నుతట్టి ప్రోత్సహించారు. ప్రత్యేకంగా డాక్టర్ ఎస్.అప్పారావు, డాక్టర్ మోహన్ రావు, సీహెచ్ ప్రసాదరావు, ఎం. కోటేశ్వరరావుకు ధన్యవాదాలు. నా కొడుకు శశిధర్ ఎన్ఐటీలో ఇంజినీరింగ్ పూర్తి చేసి సివిల్స్ ప్రిపేర్ అవుతున్నాడు. మా నాన్నకు డాక్టరేట్ అంకితమిస్తున్నా.

అమ్మకు ప్రేమతో ఐఏఎస్

స్ఫూర్తి దాయకం.. ఐఏఎస్ ప్రశాంత్‌కుమార్ నేపథ్యం

పేరు :	ప్రశాంత్‌కుమార్
పుట్టిన రోజు :	18-11-1994
చదువు :	ఇంజినీరింగ్ (వాసవీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, హైదరాబాద్)
ఐఏఎస్‌కు ఎంపికైన సంవత్సరం :	2021
ర్యాంకు :	498
అలవాట్లు :	మార్షల్ ఆర్ట్స్, తైక్వాండో, తీరిక సమయంలో సినిమాలు చూడడం

తనను చదివించేందుకు తల్లి పడుతున్న కష్టాన్ని ఆ యువకుడు మరువలేదు. ఉన్నత స్థానానికి చేరి మాతృమూర్తి కళ్లలో ఆనందం నింపడమే లక్ష్యంగా అహర్నిశలు కష్టపడి చదివాడు. దేశస్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే పరీక్షలో సత్తా చాటి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. పట్టుదల ఉండాలే గానీ సాధించలేనిదంటూ ఏదీ లేదని చెబుతున్న ఆ యువకుడు మరెవరో కాదు.. అసిస్టెంట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్‌కుమార్. వృత్తి శిక్షణలో భాగంగా ఆత్మకూరు వచ్చిన ఆయన తన అంతరంగాన్ని ‘సాక్షి’తో పంచుకున్నారు. ఆయన మాటల్లోనే..

మాది పార్వతీపురం. నాన్న బాబురావు ఆర్మీలో పని చేసి రిటైర్డయ్యారు. అమ్మ స్వర్ణలత ఏఎన్ఎం. అన్నయ్య ప్రదీప్. ప్రస్తుతం మల్టీ నేషనల్ కంపెనీలో పనిచేస్తున్నాడు. నేను ఒకటో తరగతి నుంచి 7వ తరగతి వరకు పార్వతీపురంలో, 8 నుంచి 10 వరకూ మహారాష్ట్రలోని నాసిక్‌లో చదివా. వైజాగ్‌లో డిప్లొమా చేశా. హైదరాబాదులోని వాసవీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల నుంచి 2017లో ఇంజినీరింగ్ పూర్తి చేశా.

– ఆత్మకూరు

నేను ఆరో తరగతి చదివేటప్పుడు రోడ్డు ప్రమాదంలో నాన్న బాబురావు మరణించారు. మా కోసం అమ్మ ఆ దుఃఖాన్ని దిగమింగి నన్ను, అన్నయ్యను కష్టపడి చదివించింది. తనకు వచ్చే జీతంతోనే మాకు ఏ లోటూ తెలియకుండా పెంచింది. అందుకే అమ్మ కళ్లలో ఆనందం నింపడమే లక్ష్యంగా కష్టపడి చదివా. ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపా. అనుకున్నది సాధించి ఐఏఎస్‌గా ఎంపికై అమ్మకు కానుక అందించా.

మార్కుల కోసం చదవొద్దు..

పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదు. మనపై ఉన్న నమ్మకమే మనల్ని ఉన్నత స్థాయికి చేరుస్తుంది. అనుకున్నది సాధించడానికి మూడు సంవత్సరాలు తీవ్రంగా కష్టపడ్డా. నేను మార్కుల కోసం ఎప్పుడూ చదవలేదు, చదివింది అర్థం అయేటప్పుడు ఆ సంతోషం వేరుగా ఉంటుంది. చాలా మంది డబ్బు ఉంటేనే సివిల్స్‌కు చదవగలం, రాయగలం అనుకుంటారు. కానీ నేను మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన వాడినే. కష్టపడి చదివా. మనం అనుకున్నది సాధించడానికి స్పష్టమైన లక్ష్యం ఉంటే చాలు.

ఆయన ప్రేరణతోనే సివిల్స్‌కు..

పార్వతీపురం మన్యం జిల్లాలోని మన్యం ఐటీడీఏ పీఓగా కొంతకాలం క్రితం ఐఏఎస్ లక్ష్మీష పనిచేశారు. పార్వతీపురం సమీపంలోని ఓ కొండపై కొన్ని గ్రామాలు ఉండేవి. సరైన వైద్య సదుపాయాలు లేక అక్కడి ప్రజలు పడే బాధలు వర్ణనాతీతం. మహిళలు గర్భం ధరిస్తే ప్రసవం కోసం కొండ మీద నుంచి అవస్థలు



పడుతూ కిందకు తీసుకురావాల్సి వచ్చేది. అలా తీసుకొచ్చాక చాలా సార్లు ఆ మహిళనో లేదా పుట్టిన బిడ్డో చనిపోయేవారు. ఆ సమస్యను పరిష్కరించేందుకు ఐఏఎస్ లక్ష్మీష హాస్టళ్లను ఏర్పాటు చేశారు. ప్రసవానికి మూడు నెలలు ఉందనగానే సదరు మహిళను తీసుకువచ్చి అక్కడ ఉంచి.. వారితో యోగా సాధన చేయించడంతో పాటు మంచి ఆహారం అందించేవారు. దీంతో ప్రసవం తర్వాత తల్లీ బిడ్డ క్షేమంగా ఉండేవారు. ఎందుకో తెలియదు ఒకసారి లక్ష్మీష గురించి మా అమ్మ నాకు చెప్పింది. ఒక ఐఏఎస్ తలచుకుంటే సమాజంలో ఎంతో మార్పు తీసుకురావొచ్చని వివరించింది. దీంతో నేనూ ఐఏఎస్ కావాలనిపించింది. నేను ఇంజినీరింగ్ చదువుతున్న సమయంలో శ్రీకాకుళంకు చెందిన గోపాల కృష్ణ అనే వ్యక్తి దేశస్థాయిలో సివిల్స్‌లో 3వ ర్యాంక్ సాధించారు. కష్టపడితే ఎవరైనా ఏదైనా సాధించవచ్చన్న విషయం ఆయన విజయంతో నాకు బోధపడింది.

నెగెటివ్‌గా మాట్లాడేవారిని పట్టించుకోవద్దు..

చాలా మంది విద్యార్థులు పదో తరగతిలో తప్పామనో, ఇంటర్ ఫెయిల్ అయ్యామనో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అలా చేయడం చాలా తప్పు. ప్రతి విషయాన్ని పాజిటివ్‌గా తీసుకోవాలి. నెగెటివ్‌గా మాట్లాడే వారిని పట్టించుకోవద్దు. మన మీద మనకు నమ్మకం ఉండాలి. ఆ నమ్మకమే ఉన్నత స్థాయికి తీసుకెళ్తుంది. నేను మూడో ప్రయత్నంలో సివిల్స్‌కు ఎంపికయ్యా. మొదటి రెండు సార్లు చేసిన తప్పుల్ని సరిదిద్దుకుని సులువుగా గట్టెక్కా.

జిల్లావాసులు చాలా మంచివారు..

అనంతపురంలో కొన్ని నెలలుగా పనిచేస్తున్నా. జిల్లా ప్రజలు చాలా మంచి వారు. ఎలాంటి కల్మషం లేని మనుషులు. ఆత్మీయంగా పలకరిస్తారు. ఈ ప్రాంతంలో ముఖ్యంగా నాకు నచ్చిన విషయం ఏంటంటే ఎటుచూసినా పండ్ల తోటలు ఉండటం.

విపత్తుల వేళ ఆపద్బాంధవులు

- జాతీయ విపత్తు నివారణా సంస్థ ముందస్తు చర్యలు
- ప్రకృతి విపత్తుల ప్రభావమున్న గ్రామాల్లో 150 మందికి శిక్షణ

ముందస్తు హెచ్చరికల కేంద్రాలు	20
మండల ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్స్ (ఎంఈఓసీ)	06
మల్టీ పరపస్ సైక్లోన్ షెల్టర్స్ (ఎంపీసీఎస్)లు	09
ఆపదమిత్రలు	150 మంది
పరికరాల ఏర్పాటుకు వెచ్చించిన నిధులు	రూ 12 కోట్లకు పైగా

పిఠాపురం: ఆపద వచ్చాక ఆదుకునే కంటే ముందు జాగ్రత్త చర్యల ద్వారా మేలుకోవడం మంచిదని ప్రభుత్వం భావించింది. అందుకే జాతీయ విపత్తు నివారణ సంస్థ ద్వారా విపత్తుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టింది. ప్రకృతి వైపరీత్యాలు, తుపాన్ల తాకిడికి గురయ్యే తీర ప్రాంతాలపై దృష్టి పెట్టింది. జిల్లాలో 20 ముందస్తు హెచ్చరికల కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇవి పక్కాగా పని చేసేలా చర్యలు తీసుకుంటోంది. అధునాతన పరికరాలను అమర్చి సమర్థవంతంగా పని చేయించేలా చూస్తోంది.

ముందస్తు హెచ్చరికల కేంద్రాలు

కాకినాడ డివిజన్‌లో గొల్లప్రోలు, పిఠాపురం, యూ కొత్తపల్లి, కాకినాడ రూరల్ కాకినాడ టౌన్, సామర్లకోట, కరప, పెదపూడి, కాజులూరు, తాళ్లరేవు, పెద్దాపురం డివిజన్‌లో కోటనందూరు, తుని, తొండంగి, శంఖవరం, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, జగ్గంపేట, కిర్లంపూడి, పెద్దాపురం, గండేపల్లి, రౌతులపూడి, కాకినాడ అర్బన్ పరిధిలోని సూర్యారావుపేట, కాకినాడ రూరల్ పగడాలపేట, తూరంగి, కొత్తపల్లి మండలంలో మూలపేట, ఉప్పాడ, ఎండపల్లి, తొండంగి మండలం ఏవీనగరం, ఆవులమంద, లక్ష్మణుడిపేట, పైడికొండ, హంసవరంలలో తహహసీల్దారు కార్యాలయాల వద్ద ముందస్తు హెచ్చరికల కేంద్రాలు ఏర్పాటు చేశారు. యూ కొత్తపల్లి, కాకినాడ అర్బన్, కరప, తాళ్లరేవు, తుని, తొండంగిలలో మండల ఎమర్జెన్సీ ఆపరేటింగ్ సెంటర్లు నెలకొల్పారు. వీటిని గతంలోనే ఏర్పాటు చేసినా నిర్వహణ సక్రమంగా ఉండేలమా చర్యలు తీసుకున్నారు.

ఆపదమిత్రలకు శిక్షణ

అనుకోకుండా వచ్చే విపత్తుల నుంచి ప్రజలను అప్రమత్తం చేయడానికి ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో అధికారులు కదిలారు. విపత్తులు ఏర్పడే అవకాశం ఉన్నప్పుడు అధికార యంత్రాంగం చేరుకునే స్థానికంగా అప్రమత్తం చేసేందుకు 150 మందిని ఆపదమిత్రలను ఎంపిక చేశారు. వారికి ఇటీవల ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ముందస్తు హెచ్చరికలు చేయడానికి ప్రత్యేక పరికరాలను అందజేశారు. వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయగానే ప్రజలకు తెలియజేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లేలా చర్యలు తీసుకుంటారు.



కొత్తపల్లి తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల ఎమర్జెన్సీ ఆపరేటింగ్ టవర్. (ఇన్‌సెట్‌లో) ముందస్తు హెచ్చరికల కేంద్రం

కట్టుదిట్టమైన చర్యలు

మండల ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్స్ (ఎంఈఓసీ),మల్టీ పర్పస్ సైక్లోన్ షెల్టర్స్ (ఎంపీసీఎస్)లు సిద్ధం చేశాం. అగ్నిమాపక, పోలీసు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, ఫిసరీష్, మెరైన్ శాఖల అధికారులతో ఆపదమిత్రలకు ప్రత్యేక శిక్షణ ఇప్పించాం. ఆపద రాకమునుపే వీరు గ్రామాల్లో స్పందించి ప్రజలను అప్రమత్తం చేస్తారు. ఆదుకునేలా సంసిద్ధం చేశాం. చేపల వేటకు వెళ్లే మత్స్యకారులకు తగిన సమయంలో హెచ్చరికలు అందేవిధంగా అన్ని చర్యలు తీసుకున్నాం.

– కిరణ్మయి, జాతీయ విపత్తు నివారణా సంస్థ ప్రాజెక్టు మేనేజర్,

తెప్పపై శ్రీ సుందరరాజస్వామివారి అభయం

తిరుచానూరు (తిరుపతి జిల్లా): తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీసుందరరాజస్వామివారు తెప్పపై విహరించారు. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, సహస్రనామార్చన, నిత్యార్చన నిర్వహించారు. మధ్యాహ్నం శ్రీ సుందరరాజ స్వామివారి ముఖ మండపంలో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు తెప్పోత్సవం వైభవంగా జరిగింది. ఇందులో స్వామివారు మూడు చుట్లు తిరిగి భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీసుందరరాజస్వామివారు ఆలయ మాడ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు. తెప్పోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీపద్మావతి అమ్మవారు తెప్పపై విహరించనున్నారు.



దేవేరులతో కలసి పుష్కరిణిలో తెప్పపై విహరిస్తున్న శ్రీసుందరరాజ స్వామి వారు

అలిపిరిలో వాహనాల ఫిట్‌నెస్ తనిఖీ

- డిసెంబర్‌లో చిన్న పిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం
- టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వెల్లడి

తిరుపతి తుడా: తిరుమల ఘాట్ రోడ్‌లో ప్రమాదాల కట్టడికిగాను అలిపిరి చెక్ పోస్ట్ వద్ద వాహనాల ఫిట్‌నెస్‌ను తనిఖీ చేసి కొండపైకి అనుమతించాలని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అధికారులను ఆదేశించారు. అలిపిరి చెక్ పోస్ట్‌తోపాటు శ్రీ పద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి భవనాల నిర్మాణాలు, శ్రీనివాస సేతు నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ..తిరుమలకు వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయడానికి అధునాతన యంత్ర పరికరాలు ఏర్పాటు చేసే అంశంపై నివేదిక అందించాలని సీవీఎస్‌వోను ఆదేశించామన్నారు. అలిపిరి చెక్ పోస్ట్‌లో వాహనాల తనిఖీలో ఆలస్యం



శ్రీనివాస సేత నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వైవీ సుబ్బారెడ్డి తదితరులు

జరిగి భక్తులు అసహనానికి గురి కాకుండా ఉండడం కోసం వాహనాల తనిఖీ క్యూలైన్ల సంఖ్యను పెంచనున్నట్లు చెప్పారు. చెక్‌పోస్ట్‌లో విజిలెన్స్ సిబ్బంది బాగా తనిఖీలు చేస్తున్నారని, తిరుమలకు వాటర్ బాటిల్లు తీసుకుని వెళ్లకుండా పటిష్టంగా తనిఖీలు చేయాలని సూచించారు. చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి భవనాల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఈ ఏడాది చివర్లో సీఎం జగన్ ఈ ఆస్పత్రిని ప్రారంభిస్తారని చెప్పారు.

జూలైలో అందుబాటులోకి శ్రీనివాస సేతు

శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులు, తిరుపతి వాసుల ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించడం కోసం శ్రీనివాస సేతు నిర్మాణానికి టీటీడీ 65% నిధులు అందిస్తోందన్నారు. జూన్ చివరి నాటికి ఫ్లైఓవర్ పనులు పూర్తి చేసి జూలైలో ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. కాగా, గాలిగోపురం వద్ద ఉన్న దివ్య దర్శనం టోకెన్ల స్కానింగ్ కేంద్రాన్ని, గ్లోబల్ ఆసుపత్రి నిర్వహిస్తోన్న వైద్య కేంద్రాన్ని వైవీ పరిశీలించారు.

మ్యాంగోవర్..!

- నిల్వ ఉంచుకుంటే ఎన్నేళ్లయినా రుచికరమే
- ఎండు మామిడి బద్దల తయారీలో ఉద్దానం వాసులు

మూకుడులో పప్పు ఒంటరిగా ఉడకడం అంత మర్యాద కాదు. అందుకే ఓ రెండు ఎండు మామిడి బద్దలు జత చేయాలంటారు ఉద్దానం వాసులు. రుచి కోల్పోయిన జిహ్వకు ఎన్ని రకాలు వండి పెట్టినా లాభం లేదు. ఉప్పుకారం కలిపిన ఎండు మామిడి బద్దలే మహత్తరమైన మందు అంటారు వాళ్లు. అంతేనా.. చద్దన్నంలోకి ఉల్లిపాయలు పాత కాంబినేషను. ఎండు మామిడితో చేసి తీపి ఊరగాయను మిఠాయించి చూడండి నోట్లో బ్లాస్టేనని చెబుతుంటారు. అసలు హ్యాంగోవర్‌లా మ్యాంగోవర్ కలిగించే ఈ ఎండు మామిడి బద్దల కథేంటి అనడిగితే తడుముకోకుండా తయారీ విధానం గురించి వివరిస్తారు. సీజను కూడా ఇదే మరి.

ఇచ్ఛాపురం రూరల్: ఎండు మామిడి బద్దలు. మామిడిని నిలువునా కోసి, ఎండబెట్టి, ఉప్పుకారం రాసి నిల్వ చేసే పదార్థమిది. ఈ బద్దలు తియ్య తియ్యగా.. పుల్లపుల్లగా ఉంటాయి. ఒడిశా మీదుగా ఉద్దానంలోని ఆంధ్రా పల్లెలు వీటిని విరివిగా వాడుతుంటాయి. మామిడి కాయల సీజన్ కావడంతో ప్రస్తుతం ఉద్దానం వాసులంతా ఎండు మామిడి బద్దలు తయారీలో పనిలో నిమగ్నమయ్యారు.

ఎన్నాళ్లయినా..

సాధారణంగా పండ్లతో తయారు చేసిన వస్తువులు కొన్ని రోజుల వరకు మాత్రమే నిల్వ ఉంటాయి. కానీ ఎండు మామిడి మాత్రం ఎన్నేళ్లయినా నిల్వ ఉంటాయి. వీటిని అన్ని రకాల కూరల్లో విరివిగా వాడుతారు ఇదే ఎండు మామిడి బద్దల్లో కారం, ఆవ పిండి, మెంతు పిండి, వెల్లుల్లి, ఉప్పు, వేరు శనగ నూనె మిశ్రమాలతో తీపి, వగరు ఊరగాయలు సైతం తయారు చేస్తుంటారు. ముఖ్యంగా ఉద్దానం ప్రాంతంలో ‘మామిడి బద్దల పప్పు’ ప్రత్యేకం. ఉద్దానంలో తయారు చేసిన ఎండు మామిడి ఇతర రాష్ట్రాలకు కూడా ఎగుమతి అవుతోంది.



మామిడి కాయలపై తొక్కను తీసి నిలువుగా చీల్చుతున్న మహిళా



మండు టెండలో ఆరబెట్టిన మామిడి బద్దలు

తయారీ ఇలా..

- వేసవిలో మామిడి పండ్లను తినడానికే అంతా ఇష్టపడతారు. కానీ ఉద్దానం ప్రాంతీయులు మాత్రం ఎండు మామిడినే ఇష్టపడతారు.
- తమ తోటల్లో ఉన్న మామిడి కాయలు పక్వానికి రాగానే చెట్టు నుంచి దింపు చేస్తుంటారు.
- ఇక మామిడి చెట్లు లేని వారు ఈ సీజన్‌లో గాలులు, వానల వల్ల నేల రాలిన మామిడి కాయలను సేకరించి కాయలపై ఉన్న తొక్కను చాకచక్యంగా తొలగిస్తారు.
- ఇందుకు సముద్రం ఒడ్డున లభించే పెద్ద గుళ్లలను ఉపయోగిస్తారు. లేదంటే కూరగాయలు తురిమే చాకులను ఉపయోగిస్తారు.
- మామిడి కాయను నిలువుగా చీల్చి మధ్యలో ఉన్న టెంకను పారవేస్తారు.
- ముందుగా మంచినీటిలో ఉప్పును కలిపి తయారు చేసుకున్న బాన లేదా బకెట్ వంటి పాత్రల్లో ఈ ముక్కలను వేసి ఒక్క రోజు నిల్వ ఉంచుతారు.
- మరుసటి రోజు జాగ్రత్తగా ఈ మామిడి ముక్కలను ఉప్పు నీటి నుంచి బయటకు తీసి మండుటెండలో ఎండబెడతారు.
- సుమారు 15 రోజుల నుంచి నెల రోజుల వరకు ఎండబెట్టిన మామిడి ముక్కల్లో ఉన్న నీరు పూర్తిగా ఇంకిపోయి ముడతలుగా తయారవుతాయి.

ఫ్యాషన్









పువ్వులతో జత కడదాం...





వేసవి వేళలు పగలు ఉక్కపోత మాత్రమే కాదు... సాయంకాలాలు ఆహ్లాదాన్ని పంచుతాయి. ఆ ఆహ్లాదపు ఆనంద సమయంలో అందాల్ని పరిచయం చేయడానికి ప్లెయిన్ ఫ్లోరల్ కాంబినేషన్ల డ్రెస్‌ల ఎంపిక అనువుగా ఉంటుంది. మగువల మనసెరిగిన డిజైనర్లు... అంతే అందమైన పువ్వుల డ్రెస్సులను రకరకాల మోడల్స్‌లో పరిచయం చేస్తుంటారు. వీటిని ఈవెనింగ్ పార్టీలకే కాదు, క్యాజువల్ వేర్‌గా కూడా కరెక్ట్‌గా సూటయ్యే సెలక్టివ్ డ్రెస్సులు ఇవి.

ఉపాధి



పుట్టగొడుగుల నుంచి వెడ్డింగ్ ప్లానర్ వరకు...

రుద్రప్రయాగ్‌లోని త్రియుగి నారాయణ ఆలయంలో డెస్టినేషన్ వెడ్డింగ్ ద్వారా వివాహాలు జరిపిస్తుంది రంజనా రావత్. ఉత్తరాఖండ్‌లోని పెద్ద నగరాలవైపు వెళ్లకుండా ఉపాధి మార్గానికి తన గ్రామాన్నే ఎంచుకుంది. ముందుగా పుట్టగొడుగుల పెంపకంతో మొదలుపెట్టి, తనతో పాటు మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించింది. ఈ విషయాల గురించి రంజనా రావత్ చెబుతోంది..





‘నెలకు పదిహేను వేల రూపాయలు వచ్చే ఉద్యోగం చేసిన రోజులను మర్చిపోలేను. ఆ జీతంలో నేను నా సొంత ఖర్చులను తీర్చుకోలేకపోయేదాన్ని. ఇంటికి డబ్బులు పంపాలన్నా, నా భవిష్యత్తును మెరుగుపరుచుకోవాలన్నా చాలా కష్టంగా ఉండేది. పైగా నాలాంటి మహిళల జీవితాలను మార్చాలనే ఆలోచన ఉండేది. కానీ, ఎలాగో తెలిసేది కాదు. నేను పుట్టి పెరిగింది రుద్రప్రయోగాలోని భిరి అనే గ్రామంలో. బి.ఫార్మసీ చదివి, ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేసేదాన్ని. వ్యాపారం గురించి ఆలోచనను చెప్పినప్పుడు మా అమ్మనాన్నలు వద్దన్నారు. నేను రిస్క్ తీసుకుంటే తప్ప జీవితంలో ముందుకు సాగలేనని తెలుసు. అందుకే, పీఎఫ్‌లో డబ్బులు 60 వేలు తీసుకుని, వ్యాపారం ప్రారంభించాలనుకున్నాను.

అవగాహనతో ముందుకు...

2016లో ఢిల్లీలో జరిగిన మహిళా శిశు మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఉమెన్ ఆఫ్ ఇండియా ఫెస్టివల్‌కు వెళ్లాను. అక్కడ చాలా మంది మహిళలు, ఇతర మహిళలతో కలిసి పనిచేయడం చూశాను. వాళ్లంతా నాలో చాలా స్ఫూర్తిని నింపారు. వారిలో ఒకరు తమ స్టాల్‌లో పుట్టగొడుగుల పెంపకం సమాచారాన్ని ఉంచారు. అక్కడ పుట్టగొడుగుల పెంపకానికి సంబంధించి ఆసక్తి పెరిగింది. మా ఊరి ప్రజలతో కలిసి నేను అదే పనిచేయాలనుకున్నాను. దీంతో ఉద్యోగం మానేసి, ఇంటికి వెళ్లాను.

గ్రామంలో శిక్షణ

మధ్యప్రదేశ్‌లో పుట్టగొడుగుల పెంపకం గురించి శిక్షణ తీసుకున్నాను. అక్కడే అన్ని పద్ధతులను ముందుగా అర్థం చేసుకుని, మా గ్రామంలోని మహిళలకు శిక్షణ ఇచ్చాను. మా ఊరు వెళుతున్నప్పుడు అక్కడ నేను ఎక్కువ రోజులు ఉండలేనని మా అమ్మనాన్నలు అనుకున్నారు. కానీ, నేను ఈ పనిని ప్రారంభించి, ఏడాది పాటు కష్టపడ్డాను. ఈ సమయంలోనే గ్రామ మహిళలను బృందంగా ఏర్పాటు చేసి, శిక్షణ ఇచ్చాను.

ఇంటి ఆవరణలో పెంపకం...

పుట్టగొడుగులను తమ ఇంటి ఆవరణలోనే పెంచవచ్చని అప్పటి వరకు వారికి తెలియదు. నేను పనిలో ఉపాధిని పొందుతున్నప్పుడు ‘గరిమతి’ అనే పేరుతో ఎన్జీవోను ఏర్పాటు చేశాను. దాని ద్వారా గ్రామీణ మహిళల్లో ఉపాధిని పెంచడానికి వారి సాధికారతకు, వలస ప్రజలకు అవగాహన కల్పించడానికి కృషి చేయడం ప్రారంభించాను.

వెడ్డింగ్ ప్లానర్

త్రియుగి నారాయణ దేవాలయంలో వివాహ వేదిక ఉంది. ఇది డెస్టినేషన్ వెడ్డింగ్‌కు సరైన ప్రదేశం. గ్రామంలోని ఎనిమిది మంది మహిళలతో కలిసి, వెడ్డింగ్ ప్లానర్‌గా మారాను. సోషల్ మీడియా వేదికగా ప్యాకేజీలు తీసుకోవడం మొదలుపెట్టాం. సోషల్ మీడియాలో నేను ఈ ప్రాంతానికి సంబంధించిన కథలను ప్రజలకు చెప్పడం ప్రారంభించాను. దీంతో నెలకు రెండు, మూడు పెళ్ళిళ్ల బుకింగ్స్ వచ్చాయి. గ్రామంలోని మహిళలు వివాహ వేదికను అలంకరించడమే కాదు, పెళ్లిళ్లకు భోజనాలు సమకూర్చుతారు. కొన్నాళ్లకు ముఖ్యమంత్రిని కలిసి నా పని గురించి చెప్పాను. దీంతో ఈ స్థలాన్ని వివాహ వేదికగా అధికారికంగా ప్రకటించారు. ఈ రోజు దేశంలోని దాదాపు ప్రతి రాష్ట్రానికి చెందిన వ్యక్తులు కొందరు ఇక్కడకు వచ్చి, ఆనందంగా వివాహ వేడుకలు జరుపుకుంటున్నారు. క్రమంగా ఈ ప్రదేశం బాగా ప్రసిద్ధి చెందింది. పెద్ద పెద్ద కళ్యాణమండపాలు వదిలి, ఇక్కడకు వచ్చి పెళ్ళిళ్లు చేసుకుంటున్నారు. దీంతో నేను, మా గ్రామ మహిళలు కూడా పూర్తి బిజీగా మారిపోయా. మా అమ్మనాన్నలు, నా భర్త, అత్తమామలు కూడా నా పనిని అర్థం చేసుకోవడం మొదలుపెట్టారు. నాకు పూర్తి మద్దతు ఇస్తున్నారు. ఇప్పుడు మా ఏడాది ఆదాయం 16 నుంచి 20 లక్షల వరకు ఉంటుంది. మా ఊరి మహిళలకు కూడా చాలా ఆనందంగా ఉన్నారు’’ అని వివరిస్తుంది రావత్.

పేరెంటింగ్

దగ్గరగా బడి గంట



సెలవులు ముగింపుకొచ్చాయి. బడిగంట త్వరలో మోగనుంది. తర్వాతి తరగతిలోకి ప్రవేశించడానికి పిల్లలు సిద్ధమవ్వాలి. హఠాత్తుగా వారిని బడి వాతావరణంలోకి ప్రవేశపెట్టకుండా ఇప్పటి నుంచే మెల్లగా సిద్ధం చేసుకుంటూ రావాలి. ధ్యాస తీసుకురావాలి. సుదీర్ఘ విరామం తర్వాత బడి సమయం కోసం తల్లిదండ్రులు, పిల్లలు చేయవలసిన పనులు...

సెలవులు ఐపోవచ్చాయి. దూరాన బడి గంట వినపడబోతోంది. మహా అయితే మరో వారం. ఆ తర్వాత స్కూల్‌కు వెళ్లాల్సిందే పిల్లలు. తల్లిదండ్రులు కూడా పిల్లల గురించి ఆలోచించాల్సిన సమయం. పిల్లలు తమను తాము సిద్ధం చేసుకోవాల్సిన సమయం. అయితే ఇదంతా చాలా స్మూత్‌గా జరిగేలా, పిల్లలు కుతూహలంతో స్కూల్‌లో అడుగు పెట్టేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి.

సెలవుల అవలోకనం

‘తొందరలోనే స్కూళ్లు తెరుస్తారు. మీ గోల తగ్గుతుంది’ లాంటి మాటలు మాట్లాడవద్దు. ‘తొందరలోనే స్కూళ్లు తెరుస్తారు. మీరు మీ ఫ్రెండ్స్‌తో కలిసి మళ్లీ చదువుకునే టైమ్ వచ్చేసింది’లాంటి మాటలు మాట్లాడాలి. ‘సెలవులు ముగిశాయి’ అనే భావన రావడానికి ‘సెలవుల్లో ఏం చేశారో, ఏయే ఊళ్లు తిరిగారో, ఏ పుస్తకాలు చదివారో, సినిమాలు చూశారో, కొత్త హాబీలు నేర్చుకున్నారో ఒక పేజీలో రాయండి. గుర్తు పెట్టుకుని మీ ఫ్రెండ్స్‌తో షేర్ చేయండి. టీచర్‌కు చూపించండి’ అని పిల్లలకు చెప్పాలి. దీని ద్వారా వాళ్లు సెలవులను అవలోకించి సమయాన్ని వృథా చేశారా, సద్వినియోగం చేశారా తెలుసుకుంటారు. ‘టైమంతా జాలిగా గడిపేశాం. ఇంక చదువుకోవాలి’ అనే మూడ్‌కు వస్తారు.

తప్పని భయాలు

కొత్త తరగతి అంటే కొత్త పాఠాలు, కొత్త సిలబస్. కొన్ని స్కూళ్లలో సెక్షన్ మారుస్తారు. క్లాస్ టీచర్లు మారిపోతారు. కొందరు పాత స్నేహితులు స్కూల్ కూడా మారిపోతారు. లేదా ట్రాన్స్‌ఫర్ వల్లో మరో కారణం చేతనో మన పిల్లలే స్కూల్ మారొచ్చు. దాంతో రకరకాల ఆందోళనలు పిల్లల్లో ఉంటాయి. ‘ఇలా నీకొక్కడికే కాదు.. అందరికీ ఉంటాయి. కొన్నాళ్లకు కొత్త ఫ్రెండ్స్ ఏర్పడతారు. కొత్త టీచర్లు కూడా నీకు నచ్చుతారు’ అని చెప్పాలి. వాళ్ల భయాల్ని లెక్క చేయకుండా ఉండరాదు.

కొత్త లక్ష్యాలు

సెలవులకు ముందు పరీక్షలు రాసి ఉంటారు. గత తరగతి మార్కులు వచ్చేసి ఉంటాయి. వాటిని బట్టి ఏ విధంగా గత సంవత్సరం చదివారో ఒక అంచనా ఉంటుంది. తల్లిదండ్రులు అవన్నీ మెల్లగా గుర్తు చేసి ‘అంతకంటే మంచి మార్కులు తెచ్చుకునేలా చదవాలి నాన్నా’ అని పాజిటివ్‌గా లక్ష్యాన్ని ఏర్పరచాలి. స్కూల్ తెరిచే ముందే పిల్లలకు నచ్చిన టీచర్‌తో వీలైతే మాట్లాడించాలి. స్కూల్ చదువుతో పాటు ట్యూషన్ కూడా పెట్టిస్తాము అవసరమైతే అని చెప్పాలి. ‘నువ్వు ఇంకా బాగా ముందుకెళతావ్’ అని ఉత్సాహపరిచి స్కూల్‌కు రెడీ చేయాలి.

ముందస్తు తయారీ

సెలవుల్లో నిద్రా సమయాలు, భోజన సమయాలు, ఉదయాన్నే లేచే సమయం అన్నీ మారిపోయి ఉంటాయి. పిల్లల్ని మళ్లీ గాడిలో పెట్టాలి. అందుకే స్కూల్ తెరిచే రెండు మూడు రోజుల ముందే ‘మాక్ డ్రిల్’ చేయించాలి. అంటే సమయానికి నిద్ర పుచ్చాలి. ఉదయం స్కూల్ ఉన్నట్టుగా భావించేలా చేసి, ఉదయాన్నే లేపి, టిఫిన్ చేయించి, యూనిఫామ్ తొడిగించి బస్సందుకుంటామా లేదా చెక్ చేయించాలి. ఈ మాక్ డ్రిల్ ఆల్మోస్ట్ పిల్లల్ని స్కూల్ వాతావరణంలోకి తీసుకెళుతుంది. అలాగే స్కూల్ తెరిచాక రోజును చదువుకు, ఆటలకు ఎలా విభజించుకోవాలో పిల్లల్ని దగ్గర కూచోబెట్టి టైమ్ టేబుల్ వేయాలి.

సరంజామా సిద్ధం

టెక్స్ట్‌బుక్స్, నోట్‌బుక్స్, కొత్త బ్యాగ్, యూనిఫామ్, షూస్... ఇవన్నీ పిల్లల్లో కొత్త ఉత్సాహం నింపుతాయి. అవన్నీ వారి దగ్గర ఉన్నాయా లేదా చూసి అన్నీ సిద్ధం చేయాలి. పుస్తకాలకు అట్టలు అన్నీ ముగించాలి. కొత్త లంచ్ బాక్స్ కొనడం హుషారే. అలాగే ఇంట్లో వాళ్ల రూమ్‌ను శుభ్రం చేయడం, కొత్త పోస్టర్లు అంటించడం, ఇంట్లో కొత్త హోమ్‌వర్క్ కార్నర్ రెడీ చేయడం, సైకిల్ మీద వెళ్లే పిల్లలైతే ఆ సైకిల్ కండిషన్‌లో ఉండేలా సర్వీస్ చేయించడం తప్పనిసరిగా చేయాలి. అలాగే ఒకరోజు ముందు స్కూల్ వరకూ ఒక రౌండ్ వేసి వచ్చినా బాగుంటుంది.

పిల్లలు సెలవుల మత్తును వదిలి, స్కూల్‌ను ఇష్టపడుతూ పై తరగతిలోకి వెళ్లేలా వారిని ప్రోత్సహించడమే తల్లిదండ్రులు చేయాల్సిన పని.

వంటిల్లు

ఎండలకు దేహంలో నీరు ఆవిరైపోతుంది. ఎండలు ఒంట్లో శక్తిని హరించేస్తాయి. దేహానికి తగినంత నీటిని అందించాలి. కావల్సినంత శక్తిని కూడా తోడు చేయాలి. అందుకే ఈ వారం మన వంటిల్లు... చిరుధాన్యాలతో హెల్తీ డ్రింక్స్‌నిస్తోంది.

చిరు శక్తి

మ్యాంగో రాగి స్మూతీ



కావలసినవి: మామిడిపండు – ఒకటి ; చక్కెర – 2 టీ స్పూన్‌లు ; పాలు – కప్పు ; జీడిపప్పు, బాదం, పిస్తా పలుకులు– టేబుల్ స్పూన్ ; రాగి పిండి– టేబుల్ స్పూన్ ; నీళ్లు – 2 కప్పులు.

తయారీ: ● రాగిపిండిని నీటిలో కలిపి ఐదు నిమిషాల సేపు అలాగే ఉంచాలి. ఉండలు లేకుండా నీటిలో కరిగిపోతుంది. ఆ తర్వాత బాగా కలిపి స్టవ్ మీద పెట్టి అడుగు పట్టకుండా కలుపుతూ ఉడికించాలి. జావ సిద్ధమైన తర్వాత స్టవ్ మీద నుంచి దించేసి పక్కన పెట్టాలి. జావ సరిగ్గా ఉడికిందీ లేనిదీ తెలియాలంటే... జావను గరిటెతో తీసి బొటన వేలు, చూపుడు వేలితో తాకి చూస్తే కొద్దిగా జిగురు తెలుస్తుంది. ● మామిడి ముక్కలు, చక్కెర మిక్సీలో జార్‌లో వేసి గ్రైండ్ చేయాలి. మామిడి ముక్కలు గుజ్జుగా మారిన తర్వాత పాలు పోసి మళ్లీ గ్రైండ్ చేయాలి. చివరగా రాగి జావను కూడా వేసి కలిసేటట్లు ఒకసారి గ్రైండ్ చేస్తే మ్యాంగో – రాగి స్మూతీ రెడీ. ●గ్లాసులో పోసి జీడిపప్పు, బాదం, పిస్తా పలుకులతో అలంకరించి తాగాలి.

ఫాక్స్‌టెయిల్ మిల్లెట్ జ్యూస్



కావలసినవి: కొర్రలు – ఒకటిన్నర కప్పులు ; కొబ్బరి తురుము – ఒకటిన్నర కప్పులు ; చక్కెర– టేబుల్ స్పూన్ రుచిని బట్టి అవసరమైతేనే ; అల్లం తురుము లేదా శొంఠి పొడి – టీ స్పూన్ ; లవంగాల పొడి– టీ స్పూన్; ఖర్జూరాలు – 10 ; నీళ్లు – పది కప్పులు ; యాలకుల పొడి– టీ స్పూన్ ; అరటి పండు – 1 (ముక్కలు తరగాలి) ; డ్రై నట్స్– టేబుల్ స్పూన్.

తయారీ: ● కొర్రలను కడిగి నిండుగా నీటిని పోసి రెండు గంటల సేపు నానబెట్టాలి. ● ఖర్జూరాలను (గింజలను తొలగించి) నీటిలో నానబెట్టాలి. ● నానిన కొర్రలు, ఖర్జూరాలు, అల్లం తురుము, లవంగాల పొడిని మిక్సీ జార్‌లో వేసి కప్పు నీటిని పోసి మెత్తగా పేస్ట్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ఒక గిన్నెలోకి తీసుకుని అందులో ఐదు కప్పుల నీటిని పోసి కలిపి వడపోసి పక్కన ఉంచాలి. ●ఇప్పుడు మిక్సీ జార్‌లో కొబ్బరి తురుము వేసి అర కప్పు నీటిని పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. అందులో మరో మూడు కప్పుల నీటిని పోసి వడపోయాలి. ● ఈ రెండింటినీ కలిపి కుకర్‌లో మూడు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి. చల్లారిన తర్వాత మూత తీసి యాలకుల పొడి కలిపి రుచి చూసుకోవాలి. తీపి తగ్గినట్లనిపిస్తే చక్కెర కలుపుకోవాలి. ఖర్జూరాల తీపితో సరిపెట్టుకోవడమే మంచిది. ● గ్లాసులో పోసి అరటి పండు ముక్కలు, డ్రై నట్స్‌తో అలంకరించి సర్వ్ చేయాలి. ఇష్టమైతే ఫుడ్ కలర్ కలుపుకోవచ్చు.

బాజ్రా కీ రాబ్



కావలసినవి: జొన్న పిండి– 4 టేబుల్ స్పూన్ ; నెయ్యి– 2 టీ స్పూన్‌లు ; వాము – టీ స్పూన్ ; బెల్లం పొడి – టేబుల్ స్పూన్ ; ఉప్పు – అర టీ స్పూన్ ; అల్లం తురుగు లేదా శొంఠి పొడి– టీ స్పూన్ ; నీళ్లు– 2 కప్పులు ; బాదం, పిస్తా, జీడిపప్పు అన్నీ కలిపి – టేబుల్ స్పూన్ (తరగాలి).

తయారీ: ● మందపాటి బాణలిలో నెయ్యి వేడి చేసి వాము గింజలు వేసి చిట్లనివ్వాలి. ఇప్పుడు జొన్న పిండి వేసి సన్నమంట మీద గరిటెతో కలుపుతూ మంచి వాసన వచ్చే వరకు వేయించాలి. ● జొన్న పిండి వేగిన తర్వాత అందులో వరుసగా బెల్లం పొడి, ఉప్పు, అల్లం తురుము లేదా శొంఠి పొడి వేసి కలపాలి. సమంగా కలిసిన తరవాత నీరు పోసి పిండి ఉండలు లేకుండా కలిపి మంట మీడియం మోతాదుకు పెంచాలి. మరగడం మొదలైన తర్వాత మిశ్రమం అడుగు పట్టకుండా ఐదు నిమిషాల సేపు గరిటెతో కలుపుతూ ఉండాలి. ● మిశ్రమంలో కొంచెం జిగురుదనం కనిపిస్తే జొన్న పిండి తగిన మోతాదు నీటితో చక్కగా ఉడికినట్లన్నమాట. ఇప్పుడు స్టవ్ ఆపేసి మూత పెట్టి వేడి అమరేవరకు ఉంచాలి. ● గోరువెచ్చగా ఉన్నప్పుడు గ్లాసులో పోసి నట్స్‌తో అలంకరించి సర్వ్ చేయాలి.

ఇవీ కొలతలు:
కప్పు – 240 మి.లీ
టేబుల్ స్పూన్ – 15 మి.లీ
టీ స్పూన్ – 5 మి.లీ

బ్యూటిప్స్

ముడతల నివారణకు





సగం ముక్క ఆపిల్‌ను తరగాలి. రెండు టేబుల్ స్పూన్ల ఓట్స్, టేబుల్ స్పూన్ కొబ్బరి పాలు కలిపి మెత్తగా నూరి మిశ్రమం తయారుచేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు రాసి మృదువుగా వేళ్లతో రాయాలి. పది నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. కొబ్బరిపాలు లేదంటే మజ్జిగ కలుపుకోవచ్చు. ఈ ప్యాక్ పొడిబారిన చర్మాన్ని మృదువుగా చేస్తుంది.

ఆపిల్ పై తొక్క తీసి, ముక్కలు కోసి, మిక్సర్‌లో వేసి గుజ్జు చేయాలి. దీంట్లో రెండు టీ స్పూన్ల తేనె, విటమిన్–ఇ క్యాప్సుల్ మిశ్రమం కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి ప్యాక్ వేసి, పదిహేను నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి. ఈ ప్యాక్ ముఖ చర్మాన్ని మృదువుగా మార్చుతుంది.

సగం ఆపిల్ ముక్కను ఉడికించి గుజ్జు చేయాలి. అందులో రెండు టేబుల్ స్పూన్ల తేనె కలపాలి. ఈ మిశ్రమాన్ని పదినిమిషాలు ఫ్రిజ్‌లో ఉంచి, తీసి, ముఖానికి ప్యాక్‌లా వేసుకోవాలి. ఇరవై నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి. ఈ ఫేస్‌ప్యాక్ ముడతలను నివారిస్తుంది.

నలుగురు నడిచే దారిలో నడిచేవారికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు. దారి మార్చి వెళ్లే వారికి మాత్రం సవాలక్ష ప్రశ్నలు ఎదురొస్తుంటాయి. వాటికి అదేపనిగా సమాధానాలు చెప్పడం కంటే ఎంచుకున్న దారిలో వేగంగా నడవడానికే కొద్దిమంది ప్రాధాన్యత ఇస్తారు. అంకిత్ అగర్వాల్ ఈ కోవకు చెందిన వ్యక్తి. 'ఇన్సూరెన్స్‌దేఖో' ద్వారా ఇన్సూరెన్స్ సెక్టార్‌లో గెలుపు జెండా ఎగరేశాడు...



పల్లెలో అంకిత్

• సక్సెస్ స్టోరీ

అంకిత భావమే అమోఘ విజయం

'మన చుట్టూ ఉన్న సమస్యలను పరిష్కరించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్‌తో పనిలేదు' అనే అంకిత్ అగర్వాల్ హరియాణా, రాజస్థాన్‌లోని ఎన్నో పట్టణాలు, గ్రామాలు తిరిగాడు. మూడు వేలమందికి పైగా ఇన్సూరెన్స్ ఏజెంట్‌లను కలిశాడు. 'ఇన్సూరెన్స్ దేఖో' ప్రారంభించడానికి ముందు ఊరూవాడా అనే తేడా లేకుండా కాలికి బలపం కట్టుకొని తిరిగాడు అంకిత్.



నా కంపెనీ లాభాలతో దూసుకుపోతుంది అని చెప్పడం నా లక్ష్యం కాదు. నా అసలు సిసలు విజయం ఆరులక్షల గ్రామాల్లోకి ఇన్సూరెన్స్‌ను తీసుకెళ్లడం.
- అంకిత్ అగర్వాల్

'ఇన్సూరెన్స్ దేఖో'కు సంబంధించిన ఆలోచనలను ఇతరులతో, మిత్రులతో పంచుకునేప్పుడు 'పిచ్చి ముదిరింది' అన్నట్లుగా చూసేవాళ్లు. 'హాయిగా ఉద్యోగం చేసుకోక ఏమిటీ కర్మ' అని మందలించేవాళ్లు కొందరు.

'యూనివర్శిటీ ఆఫ్ దిల్లీ'లో ఎంబీఏ(ఫైనాన్స్) చేశాడు అంకిత్. అమెరికాలోని ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ కంపెనీ యూబీఎస్‌లో చేస్తున్న ఉద్యోగానికి అంకిత్ రాజీనామా చేసి, ఇన్సూర్‌టెక్ స్టార్టప్ గురించి ఆలోచిస్తున్నప్పుడు 'తెలివి తక్కువ పనిచేశావు' అన్నవాళ్లే ఎక్కువ.

ఇన్సూరెన్స్ సెక్టార్‌లోకి అడుగు పెట్టిన తరువాత ఆఫ్‌లైన్(ఇన్సూరెన్స్ ఏజెంట్స్) సామర్థ్యాన్ని, ఆన్‌లైన్‌లో తనకు పనికి వచ్చే సాంకేతిక తను బాగా ఉపయోగించుకున్నాడు అంకిత్.

'ఇన్సూరెన్స్ ఏజెంట్‌ల బ్యాగులు ఖాళీగా ఉండాలని మొదటి లక్ష్యంగా నిర్ణయించుకున్నాను' నవ్వుతూ అంటాడు అంకిత్. ఎందుకంటే, సంప్రదాయ ఇన్సూరెన్స్ ఏజెంట్‌ల బ్యాగ్‌లు నోటుబుక్స్, బోలెడు డాక్యుమెంట్స్‌తో నిండిపోయి భారంగా ఉంటాయి!

అందుకే స్మార్ట్‌ఫోన్ ప్లస్ యాప్ ద్వారా ఆ బ్యాగులు తేలికయ్యేలా చేయడంలో అంకిత్ విజయం సాధించాలనుకున్నాడు. అయితే అంకిత్ వేసే ప్రతి అడుగులో ప్రతికూల మాటలు వినిపించేవి. అవేమీ పట్టించుకోకుండా 'మొదటి దశలో ఏజెంట్. ఆ తరువాత టెక్' అంటూ తన దారిలో తాను వెళ్లాడు అంకిత్.

'ఆర్మీ ఆఫ్ ఏజెంట్స్' పేరుతో యువబృందానికి తయారుచేసుకొని గట్టి శిక్షణ ఇచ్చాడు. ఈ బృందంలో ఎక్కువమందికి ఇన్సూరెన్స్‌కు సంబంధించిన విషయాల గురించి పెద్దగా ఏమీ తెలియదు. ప్రసిద్ధ నినాదం 'రోటీ కపడా మకాన్'లో 'బీమా' చేర్చి తన బృందంతో ఊరూవాడా తీసుకెళ్లాడు అంకిత్.

గురుగ్రామ్(హరియాణా) కేంద్రంగా చిన్నగా మొదలైన 'ఇన్సూరెన్స్‌దేఖో' ప్రయాణం పట్టణాల నుంచి పల్లెల వరకు విస్తరించింది. తమ అవసరాలకు సరిపోయే పాలసీలను ఎంచుకోవడంతో పాటు ఎన్నో విధాలుగా వినియోగదారులకు దారి చూపే నేస్తంగా మారింది ఈ ఇన్సూర్‌టెక్ స్టార్టప్.

'పిచ్చి అగర్వాల్' అని చాటుమాటుగా వెక్కిరించినవాళ్లే ఈ విజయం చూసి 'అగార్వల్ మెథడ్' అని గొప్పగా పిలుచుకునేవారు!

'ఇన్సూరెన్స్‌దేఖో అనేది ఇన్సూరెన్స్ సెక్టార్‌లో భారీ మార్పు తీసుకురావడమే కాదు సామాజిక ప్రభావాన్ని కలిగించింది' అంటాడు కార్‌దేఖో గ్రూప్ కో-ఫౌండర్ అమిత్ జైన్.

'ఇన్సూరెన్స్‌దేఖో' ఇటీవల ముంబైకి చెందిన ఎస్‌ఎంఈ ఇన్సూరెన్స్ ప్లాట్‌ఫామ్ 'వెరాక్'ను కొనుగోలు చేయడం ద్వారా వార్తల్లోకి వచ్చింది.

ఎంతోమంది యంగ్‌స్టర్స్ అంకిత్‌ను 'వన్-పాయింట్ అడ్వైజ్' అడుగుతుంటారు. అతడి నోటి నుంచి వచ్చే 'అంకిత భావం' అనే జవాబును ఊహించడం కష్టం కాదేమో!

• టెక్.. టాక్

గూగుల్ పిక్సెల్ 7 ఏ



డిస్‌ప్లే: 6.1 అంగుళాలు రిజల్యూషన్: 1080×2400 పిక్సెల్స్
మెమొరీ: 128జీబి 8జీబిర్యామ్ వోఎస్/సాఫ్ట్‌వేర్: ఆండ్రాయిడ్ 13
బ్యాటరీ: 4385 ఎంఏహెచ్ రిఫ్రెష్ రేట్: 90 హెచ్‌జెడ్
బరువు: 194 గ్రా. ఫ్రంట్ కెమెరా: 13 ఎంపీ • ఫింగర్ ప్రింట్ రీడర్
• డస్ట్ రెసిస్టెంట్ • ఫర్ మూవీ పీ1 పోర్టబుల్ ప్రాజెక్టర్
డైమెన్షన్స్: 150.8×83×24.6 ఎంఎం 300 గ్రా.
ఆప్టికల్ అడ్జస్ట్‌మెంట్: ఆటోమెటిక్ వెర్టికల్ కీస్టోన్ కరెక్షన్ • మాన్యువల్ ఫోకస్
ఆడియో: 0.8 డబ్ల్యు కలర్: బ్లాక్ • సింగిల్ స్పీకర్
బేసిక్ ప్లేయర్స్: వీడియో, ఆడియో, ఫొటో, టెక్స్ట్ ఫైల్

మాబ్‌వోయ్ టిక్ వాచ్ 5 ప్రో



డిస్‌ప్లే: 1.43 అంగుళాలు
బ్యాటరీ: 628 ఎంఏహెచ్
ఇంటర్నల్ స్టోరేజ్: 2జీబి ర్యామ్ 32జీబి
సెన్సర్స్: హార్ట్‌రేట్, ఎస్పీవో2, స్కిన్, టెంపరేచర్ సెన్సర్స్
బ్యాటరీ లైఫ్: 80 గంటలు
మెజర్స్: 50.1×48.0×12.2 ఎంఎం
రిజల్యూషన్: 466 ×466 పిక్సెల్స్
కలర్: అబ్సిడియన్
బ్లూటూత్: 5.2

ఎక్స్‌రియల్ ఏఆర్ గ్లాసెస్

ఏఆర్ సెగ్మెంట్‌లో పేరుగాంచిన ఎన్‌రియల్ 'ఎక్స్‌రియల్'గా రీబ్రాండింగ్‌తో ముందుకు వచ్చింది.



ఈ ఏఆర్ గ్లాసెస్‌లను ఫోన్ లేదా అనుకూలమైన డివైజ్‌లతో ప్లగ్ చేస్తే మన కంటి ముందు మాసివ్ వర్చువల్ స్క్రీన్ ప్రత్యక్షమౌతుంది.

సొంత ప్రైవేటు థియేటర్‌లో ఉన్న అనుభూతి కలుగుతుంది. మన తల కదలికలను బట్టి స్క్రీన్ ఛేంజ్ అవుతుంది. స్పేషియల్ డిస్‌ప్లేను ఎంజాయ్ చేయవచ్చు.

నెట్‌ఫ్లిక్స్ షోలు, ఎక్స్‌బాక్స్ గేమ్ పాస్ గేమ్‌లు, ఇతర కంటెంట్ చూడడానికి అనుకూలంగా ఉంటుంది.

స్పీడ్‌గా వాట్సప్ చాట్‌ను హైడ్ చేయడానికి...



మొదటి పద్ధతి:
1. చాట్‌లోకి వెళ్లాలి.
2. విజిట్ ప్రొఫైల్-స్క్రోల్ డౌన్-ట్యాప్ చాట్ లాక్
రెండో పద్ధతి:
1. చాట్‌ను లాంగ్ ప్రెస్ చేయాలి.
2. టాప్‌రైట్ కార్నర్‌లోని ఆర్కైవ్ ఐకాన్ ట్యాప్ చేయాలి.

• గేమింగ్ - నేడే విడుదల

అడుగు పడితే... ఇక అంతమే!



ఫైటింగ్ గేమ్ స్ట్రీట్ ఫైటర్ 6 నేడు విడుదల అవుతుంది. ఫైటింగ్ గ్రౌండ్, బ్యాటిల్ హబ్, వరల్డ్ టూర్ అనే మూడు రకాల మోడ్స్‌తో కూడిన గేమ్ ఇది. గత సిరీస్‌లలోని గేమ్‌లాగే 2డీ ఫైటింగ్ గేమ్ ప్లే ఉంటుంది. ఈ గేమ్‌లోని ఇద్దరు ఫైటర్లు ప్రత్యర్థిని చిత్తు చేయడానికి తమలోని శక్తిసామర్థ్యాలను పూర్తిగా వినియోగించుకుంటారు.

'స్ట్రీట్ ఫైటర్ 6'లోని మెయిన్ ఫైటింగ్ గేమ్‌ప్లే డ్రైవ్ గేజ్ చుట్టూ అల్లుకొని ఉంటుంది. ప్లేయర్ క్రియేటివిటీకి ఉపయోగపడేలా ఈ సిస్టమ్‌ను డిజైన్ చేశారు. క్లాసిక్, మోడ్రన్, డైనమిక్ అనే మూడు రకాల కంట్రోల్స్ ఉంటాయి.

జానర్: ఫైటింగ్ ఇంజిన్: ఆర్‌యి ఇంజిన్; మోడ్స్: సింగిల్ ప్లేయర్, మల్టీ ప్లేయర్; ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 4, ప్లేస్టేషన్ 5, విండోస్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

• ఇంగ్లిష్ ఇడియమ్స్

కిస్ అండ్ మేకప్

కొందరు పోట్లాడుకున్నా, విభేదాలతో ఒకరిమీద ఒకరు భగ్గుమన్నా అంతలోనే కలిసిపోతారు. ఇలాంటి సందర్భంలో ఉపయోగిస్తారు.

ఉదా: దే ఆర్ ఆర్గ్యూ కాన్‌స్టంట్లీ అండ్ పబ్లిక్‌లీ. బట్ ఆల్వేస్ మ్యానేజ్ టు కిస్ అండ్ మేకప్

ఏ నెసెసరీ ఇవిల్

మనసులో ఇష్టం లేకపోయినా అనివార్యంగా ఒక విషయాన్ని ఆమోదించే సందర్భంలో వాడతారు.

ఉదా: మోస్ట్ అమెరికన్స్ యాక్సెప్ట్ ట్యాక్సెస్ యాజ్ ఏ నెసెసరీ ఇవిల్

• యంగ్ టాలెంట్

ఫస్ట్ టైమ్ విన్నర్

'ఈ ఛాలెంజ్‌లో పాల్గొన్న యంగ్ డెవలపర్‌ల ప్రతిభ చూస్తుంటే అబ్బురం అనిపిస్తుంది' అన్నారు యాపిల్ వైస్-ప్రెసిడెంట్(వరల్డ్ వైడ్ డెవలపర్స్ రిలేషన్స్) సుజన్ ప్రెస్కాట్.



టెక్ దిగ్గజం యాపిల్ ప్రకటించిన 'స్విఫ్ట్ స్టూడెంట్ ఛాలెంజ్' విజేతలలో ఒకరు ఆస్మీ జైన్. ఇండోర్‌లోని 'మెడి-క్యాప్స్' యూనివర్శిటీ స్టూడెంట్ అయిన ఆస్మీ ఫస్ట్ టైమ్ విన్నర్.

వివిధ రకాల కంటి పరిస్థితులను ఎదుర్కొనే వారికి, ఐ మజిల్ ఎక్సర్‌సైజ్‌కు ఉపకరించే యాప్‌కు ఐ-ట్రాకింగ్ టెక్నాలజీని ఉపయోగించి ఆస్మీ డిజైన్ చేసింది. 'ఫీడ్ బ్యాక్ ఆధారంగా యాప్‌ను యూజర్ ఫ్రెండ్లీగా, మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాలనుకుంటున్నాను. నా అంతిమ లక్ష్యం ముఖకండరాలను బలోపేతం చేయడానికి ఉపకరించేలా యాప్‌ను తీర్చిదిద్దడం' అంటుంది ఆస్మీ.

కోడింగ్ ద్వారా హెల్త్‌కేర్ సెక్టార్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఆస్మీ ప్రాధాన్యత ఇస్తుంది. ఛాంపియన్స్ ఈ నెలలో జరగనున్న వరల్డ్ వైడ్ డెవలపర్స్ కాన్ఫరెన్స్(డబ్ల్యూడబ్ల్యూడీసీ)లో పాల్గొంటారు.

సినిమా

ముంబై టు కూనూర్

గోవా టు కూనూర్ వయా ముంబై... ఇది నాని కొత్త సినిమా రూట్ మ్యాప్. నాని హీరోగా శౌర్యువ్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శ్రుతీహాసన్ కీ రోల్ చేస్తున్నారు. తొలుత గోవాలో ఓ లాంగ్ షెడ్యూల్‌ను పూర్తి చేసిన చిత్ర యూనిట్, ఇటీవల ముంబైలో మరో షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. తాజాగా కొత్త షెడ్యూల్ కోసం కూనూర్ వెళ్లనున్నారు. ఇక్కడి లొకేషన్స్‌లో ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తారు. మోహన్ చెరుకూరి (సీవీఎం), డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న ఈ సినిమా డిసెంబరు 21న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్.



• నాని

నిఖిల్ స్వయంభూ



• నిఖిల్

నిఖిల్ హీరోగా నటించనున్న కొత్త సినిమాకు 'స్వయంభూ' అనే టైటిల్ ఖరారు చేశారు. గురువారం (జూన్ 1) నిఖిల్ బర్త్ డే సందర్భంగా ఈ చిత్రం టైటిల్‌ను ప్రకటించి, ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో 'ఠాగూర్' మధు సమర్పణలో భువన్, శ్రీకర్ నిర్మించనున్నారు. "నిఖిల్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ సినిమా రూపుదిద్దుకోనుంది. ఆగస్టులో షూటింగ్ ఆరంభిస్తాం" అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహనిర్మాతలు: విజయ్ కామిశెట్టి, జీటీ ఆనంద్, సంగీతం: రవి బస్రూర్, కెమెరా: మనోజ్ పరమహంస.

ఇంకా.. నిఖిల్ బర్త్ డే సందర్భంగా వేరే చిత్రాల అప్‌డేట్స్ కూడా వచ్చాయి. నిఖిల్‌తో 'స్వామి రారా', 'కేశవ' చిత్రాల తర్వాత దర్శకుడు సుధీర్ వర్మ మరో సినిమా చేయనున్నారు. ఈ చిత్రాన్ని బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించనున్నారు. అలాగే 'ది ఇండియా హౌస్' అనే మరో సినిమా కమిటయ్యారు నిఖిల్. ఇక నిఖిల్ హీరోగా నటించిన 'స్పై' చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది.

కృష్ణ విజయం రెడీ

సూపర్ స్టార్ కృష్ణ లీడ్ రోల్‌లో యశ్వంత్, సుహాసిని జంటగా నటించిన చిత్రం 'ప్రేమ చరిత్ర.. కృష్ణ విజయం'. హెచ్. మధుసూదన్ దర్శకత్వంలో అంబ మూవీపై శ్రీపాద్ హంచాటే నిర్మించారు. 2007లో పూర్తయిన ఈ సినిమాని ఈ నెలలో విడుదల చేయడానికి యూనిట్ రెడీ అవుతోంది. ఈ సందర్భంగా కృష్ణ జయంతిని (మే 31) పురస్కరించుకుని 'ప్రేమ చరిత్ర.. కృష్ణ విజయం' ట్రైలర్‌ని బుధవారం రిలీజ్ చేశారు. హెచ్. మధుసూదన్ మాట్లాడుతూ- "ప్రేమ చరిత్ర కృష్ణ విజయం' 2007లో పూర్తయింది. అయితే పలు కారణాల వల్ల మా చిత్ర నిర్మాత శ్రీపాద్ ఈ సినిమాని విడుదల చేయలేకపోయారు. ఎలాగైనా ఈ మూవీని రిలీజ్ చేయాలనుకుని, సరికొత్త హంగులతో నేనే విడుదల చేస్తున్నాను. ఈ నెలలో రిలీజ్ కానున్న ఈ సినిమాని కృష్ణగారి అభిమానులు, ప్రేక్షకులు ఆదరించాలి" అని అన్నారు.



• కృష్ణ



• అల్లు అరవింద్, 'బన్నీ' వాసు

జూనియర్స్‌కి అవకాశం సృష్టించాలి

- అల్లు అరవింద్

"చాలామంది సీనియర్ నిర్మాతలు చేయాల్సింది ఏంటంటే.. ఇండస్ట్రీలో జూనియర్స్‌కి (నిర్మాతలు) ఒక అవకాశం సృష్టించాలి.. తర్వాతి తరానికి స్థానం కల్పిస్తే చాలా బాగుంటుంది" అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. టోవినో థామస్, అపర్ణా బాలమురళి ప్రధాన పాత్రల్లో నటించిన మలయాళ చిత్రం '2018'. జూడ్ ఆంథోనీ జోసెఫ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని మే 26న 'బన్నీ' వాసు తెలుగులో రిలీజ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా థ్యాంక్స్ మీట్‌లో అల్లు అరవింద్ మాట్లాడుతూ-"2018' చూశాక ఒక మంచి సినిమాకి రొమాన్స్ అవసరం లేదనిపించింది. ఎలాంటి లెక్కలు వేసుకోకుండా తీసిన ఈ చిత్రం మలయాళంలో 160 కోట్లు వసూలు చేయడం చిన్న విషయం కాదు. తెలుగులో నాలుగు రోజుల్లో 6 కోట్లు కలెక్ట్ చేసింది" అన్నారు. 'బన్నీ' వాసు మాట్లాడుతూ- "2018' సినిమాని నేను కచ్చితంగా జడ్జ్ చేయగలిగానంటే దానికి కారణం అరవింద్‌గారు. ఒక సినిమాని ఎలా చూడాలి అని ఆయన దగ్గర్నుంచే నేర్చుకున్నాను" అన్నారు. "బన్నీ' వాసుగారు కేవలం నిర్మాత మాత్రమే కాదు.. మంచి రచయిత కూడా. నా తర్వాతి రెండు మూడు సినిమాలు అరవింద్‌గారి చేతిలోనే పెట్టాను" అన్నారు దర్శకుడు చందు మొండేటి.

యాక్షన్ ఎంటర్‌టైనర్ షురూ



• బెల్లంకొండ శ్రీనివాస్, సాగర్ చంద్ర

శ్రీనివాస్ బెల్లంకొండ హీరోగా కొత్త సినిమా షురూ అయింది. సాగర్ చంద్ర దర్శకత్వంలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న ఈ సినిమా గురువారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి దర్శకుడు పరశురామ్ కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు హరీష్ శంకర్ క్లాప్ కొట్టి, డైరెక్టర్ పరశురామ్‌తో కలసి మేకర్స్‌కి స్క్రిప్ట్‌ను అందించారు. "యూనిక్ సబ్జెక్ట్‌తో కూడిన యాక్షన్ ఎంటర్‌టైనర్ సినిమా ఇది. శ్రీనివాస్ కెరీర్‌లో పదో చిత్రంగా రూపొందుతోంది. ఈ నెల రెండో వారంలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం" అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అనిల్ రావిపూడి పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఛీమ్స్ సిసిరోలియో, కెమెరా: జిమ్షి ఖలీద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరీష్ కట్టా.

పెళ్లి కుదిరిందా?



• వరుణ్



• లావణ్య

హీరో వరుణ్ తేజ్, హీరోయిన్ లావణ్యా త్రిపాఠి ప్రేమలో ఉన్నారని, త్వరలో పెళ్లి చేసుకోనున్నారన్న వార్తలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. కాగా ఈ వార్తలు వాస్తవం కానున్నాయని, మెగా కాంపౌండ్‌లో పెళ్లి బాజాలు మోగనున్నాయని ఫిల్మ్‌నగర్ లేటెస్ట్ టాక్. వరుణ్, లావణ్యల నిశ్చితార్థం ఈ నెల 9న జరగనుందని, ఈ వేడుక కోసం మెగా ఫ్యామిలీలో ఏర్పాట్లు జరుగుతున్నాయని, నిశ్చితార్థం రోజునే వీరి పెళ్లి తేదీని కూడా ప్రకటించే అవకాశం ఉందని నెట్టింట ప్రచారం సాగుతోంది. అయితే వరుణ్, లావణ్యల వివాహం కుదిరిందా? లేదా అనే విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ సంగతి ఇలా ఉంచితే... 2017లో వచ్చిన 'మిస్టర్' చిత్రంలో తొలిసారి స్క్రీన్ షేర్ చేసుకున్న వరుణ్ తేజ్, లావణ్యలు ఆ తర్వాత 'అంతరిక్షం: 9000 కేఎమ్‌పీహెచ్' చిత్రంలో నటించిన విషయం గుర్తుండే ఉంటుంది.

ఆడియన్స్ థ్రిల్ అవుతారు

- బెల్లంకొండ గణేశ్

"నేను స్టూడెంట్ సర్'లోని ఎమోషన్స్‌కు ఎక్కువగా స్టూడెంట్స్, యూత్ కనెక్ట్ అవుతారు. స్క్రీన్ ప్లే క్యూరియాసిటీతో నడుస్తుంది. ఆడియన్స్ థ్రిల్ అవుతారు" అన్నారు బెల్లంకొండ గణేశ్. రాకేష్ ఉప్పలపాటి దర్శకత్వంలో బెల్లంకొండ గణేశ్, అవంతిక దస్సాని జంటగా నటించిన చిత్రం 'నేను స్టూడెంట్ సర్'. 'నాంది' సతీష్ వర్మ నిర్మించిన ఈ చిత్రం నేడు రిలీజవుతోంది. ఈ సందర్భంగా.. "ప్రేక్షకుల టైమ్, డబ్బు వృథా కావు" అన్నారు రాకేష్. "థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉన్న ఈ చిత్రం ప్రేక్షకులకు నచ్చుతుంది" అన్నారు సతీష్ వర్మ. "డబ్బే ఒక ఐడియాలజీ అనేది ఈ సినిమా రూట్ కాన్సెప్ట్" అన్నారు ఈ చిత్రకథారచయిత కృష్ణ చైతన్య.



• రాకేష్, బెల్లంకొండ గణేశ్, సతీష్ వర్మ

వ్యూహం..



• అజ్మల్

రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో రామధూత క్రియేషన్స్ పతాకంపై దాసరి కిరణ్ నిర్మిస్తున్న చిత్రానికి 'వ్యూహం' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ చిత్రంలో ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాత్రలో అజ్మల్ నటిస్తున్నారు. "అహంకారానికి, ఆలోచనకు మధ్య జరిగే యుద్ధం నేపథ్యంలో 'వ్యూహం' రూపొందుతోంది. ఇది బయోపిక్ కాదు.. బయోపిక్ కన్నా లోతైన రియల్ పిక్. బయోపిక్‌లో అబద్ధాలు ఉండొచ్చు కానీ, రియల్ పిక్‌లో నూటికి నూరు పాళ్లు నిజాలే ఉంటాయి" అని మేకర్స్ పేర్కొన్నారు.

అది నా అదృష్టం

- హీరో దీపక్ సరోజ్

"ఆర్య' చిత్రంతో బాల నటుడిగా నా కెరీర్ మొదలైంది. ప్రభాస్, మహేశ్‌బాబు, సుకుమార్, త్రివిక్రమ్‌గార్లతో పని చేసే అవకాశం రావడం నా అదృష్టం. 'సిద్ధార్థ్ రాయ్' వంటి చిత్రంతో హీరోగా పరిచయం అవుతుండటం సంతోషంగా ఉంది" అని హీరో దీపక్ సరోజ్ అన్నారు. దర్శకులు హరీష్ శంకర్, వంశీ పైడిపల్లి వద్ద పని చేసిన వి. యేశస్వి దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'సిద్ధార్థ్ రాయ్'. దీపక్ సరోజ్, తన్వి నేగి జంటగా జయ అడపాక, ప్రదీప్ పూడి, సుధాకర్ బోయిన నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ని దర్శకులు శ్రీరామ్ ఆదిత్య, కార్తీక్ వర్మ దండు, నిర్మాత వంశీ, రైటర్ లక్ష్మీ భూపాల విడుదల చేశారు. వి. యేశస్వి మాట్లాడుతూ- "సిద్ధార్థ్ రాయ్' వంటి మంచి కథని చెప్పడానికి నేనూ నిర్మాణంలో భాగమయ్యాను. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం" అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: రధన్, కెమెరా: శ్యామ్ కె. నాయుడు.



• దీపక్, తన్వి

సస్పెన్స్.. థ్రిల్



• జయరామ్

జయరామ్ తేజ లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'హింట్'. చందూ బిజుగ దర్శకత్వంలో మైత్రీరెడ్డి, రిజ్వాన్ అహ్మద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని నవ్యాంధ్ర ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ఎస్‌వీఎస్ రావు రిలీజ్ చేశారు. 'హారర్ అండ్ సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ ఇది" అన్నారు చందూ. "టీవీ సీరియల్స్‌లో నటిస్తున్న నాకు హీరోగా చాన్స్ ఇచ్చిన దర్శక నిర్మాతలకు థ్యాంక్స్" అన్నారు జయరామ్ తేజ. "సింగిల్ షెడ్యూల్‌లో చిత్రాన్ని పూర్తి చేస్తాం" అన్నారు మైత్రీ రెడ్డి.

అసలేం జరుగుతుంది?



• శరణ్

సూపర్‌స్టార్ కృష్ణ ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ నుంచి హీరోగా వస్తున్న శరణ్‌కుమార్ నటిస్తున్న చిత్రం 'సాక్షి'. శివ కేశనకుర్తి దర్శకత్వంలో ఆర్.యు. రెడ్డి అండ్ బేబీ లాలిత్య సమర్పణలో మునగాల సుధాకర్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కృష్ణ జయంతి (మే 31) సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. 'అసలేం జరుగుతుంది..?' అనే డైలాగ్ టీజర్‌లో ఉంది. "స్మగ్లింగ్ నేపథ్యంలో సాగే యాక్షన్ ఫిల్మ్ ఇది" అని యూనిట్ పేర్కొంది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
194	47
62,429	18,488

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	13,094	▲	159
డోజోన్స్	33,123	▲	215
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,490	▲	44
డాక్స్	15,854	▲	190
షాంఘై	3,205	▲	1
నికాయ్	31,148	▲	260

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	60,157 ▽ 233
బంగారం (99.5 స్వచ్ఛత)	59,916 ▽ 232
వెండి (కిలో)	71,372 ▲ 384

కోల్ ఇండియా ఆఫర్‌కు డిమాండ్

- ఓఎఫ్‌ఎస్ తొలి రోజు భారీ బిడ్స్
- నేడు రిటైల్ ఇన్వెస్టర్లకు సేల్ షురూ
- 3 శాతం ప్రభుత్వ వాటా విక్రయం



న్యూఢిల్లీ: పీఎస్‌యూ దిగ్గజం కోల్ ఇండియా ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్‌ఎస్)కు తొలి రోజు భారీ డిమాండ్ నెలకొంది. సంస్థాగత ఇన్వెస్టర్ల నుంచి గురువారం ఏకంగా రూ. 6,500 కోట్ల విలువైన బిడ్స్ దాఖలయ్యాయి. కంపెనీలో 3 శాతం వాటా విక్రయించేందుకు కేంద్ర ప్రభుత్వం ఓఎఫ్‌ఎస్ చేపట్టింది. ఇందుకు రూ. 225 ఫ్లోర్ ధరను నిర్ణయించింది. గురువారం(1)న సంస్థాగత ఇన్వెస్టర్లకు ప్రారంభమైంది, నేడు(శుక్రవారం) రిటైలర్లకు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్) విండో ఓపెన్ కానుంది. తొలి రోజు ప్రభుత్వం 8.31 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచగా.. 28.76 కోట్ల షేర్ల కోసం బిడ్స్ దాఖలయ్యాయి. అంటే 3.46 రెట్లు అధిక సబ్‌స్క్రిప్షన్ లభించింది. ఓఎఫ్‌ఎస్‌లో భాగంగా కంపెనీ ఈక్విటీలో 3 శాతం వాటాకు సమానమైన మొత్తం 18.48 కోట్లకుపైగా షేర్లను విక్రయించనుంది. ఆఫర్ ధర ప్రకారం ప్రభుత్వానికి రూ. 4,158 కోట్లు అందనున్నాయి. తద్వారా ఈ ఆర్థిక సంవత్సరం (2023-24)లో తొలి పీఎస్‌యూలో డిజిన్వెస్ట్‌మెంట్‌కు తెరలేచింది. ప్రస్తుతం కంపెనీలో ప్రభుత్వానికి 66.13% వాటా ఉంది. ఈ ఏడాది డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా ప్రభుత్వం రూ. 51,000 కోట్ల సమీకరణను లక్ష్యంగా పెట్టుకున్న విషయం విదితమే.

ఓఎఫ్‌ఎస్ నేపథ్యంలో గురువారం కోల్ ఇండియా షేరు బీఎస్‌ఈలో 4.4 శాతం పతనమై రూ. 231 వద్ద ముగిసింది. బుధవారం ధరతో పోలిస్తే 6.7 శాతం డిస్కౌంట్‌లో ప్రభుత్వం ఓఎఫ్‌ఎస్‌ను ప్రకటించింది.

మేలో 'తయారీ' పటిష్టం

పీఎంఐ సూచీ 58.7కు అప్

న్యూఢిల్లీ: తయారీ రంగం మేలో మంచి పురోగతిని కనబరిచినట్లు ఎస్అండ్‌పీ గ్లోబల్ ఇండియా మాన్యుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) స్పష్టం చేసింది. సూచీ 31 నెలల గరిష్ఠ స్థాయిలో 58.7కు చేరినట్లు ఎస్అండ్‌పీ గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్‌లో ఎకనామిక్స్ అసోసియేట్ డైరెక్టర్ పోలియానా డీ లిమా పేర్కొన్నారు. ఏప్రిల్‌లో సూచీ 57.2 వద్ద ఉంది. నిజానికి సూచీ 50పైన వుంటే వృద్ధి ధోరణిగా, ఆ లోపునకు పడిపోతే క్షీణతగా పరిగణించడం జరుగుతుంది. ఈ ప్రాతిపదికన సూచీ 50 పైన కొనసాగడం వరుసగా 23వ నెల కావడం గమనార్హం.



ఎస్‌యూవీలకే డిమాండ్

న్యూఢిల్లీ: ఎస్‌యూవీలకు బలమైన డిమాండ్‌తో దేశీయ ప్యాసింజర్ వెహికిల్స్ రంగంలో మే నెలలో విక్రయాల జోరు సాగింది. మారుతీ సుజుకీ ఇండియా, హ్యుందాయ్ మోటార్ ఇండియా, మహీంద్రా అండ్ మహీంద్రా, టయోటా కిర్లోస్కర్ మోటార్ బలమైన హోల్‌సేల్ అమ్మకాలను నమోదు చేశాయి. టాటా మోటార్స్, కియా, ఎంజీ మోటార్ ఇండియా వంటి ఇతర తయారీ సంస్థలు సైతం విక్రయాల్లో వృద్ధి సాధించాయి. అగ్రశ్రేణి సంస్థ మారుతీ సుజుకీ ఇండియా మొత్తం దేశీయ ప్యాసింజర్ వాహనాల విక్రయాలు 15 శాతం పెరిగి 1,43,708 యూనిట్లుగా నమోదయ్యాయి. ఆల్టో, ఎస్-ప్రెస్సోతో కూడిన మినీ కార్ల అమ్మకాలు 30 శాతం తగ్గి 12,236 యూనిట్లకు పడిపోయాయి. స్విఫ్ట్, సెలెరియో, ఇగ్నిస్, బాలెనో, డిజైర్ వంటి మోడళ్ల విక్రయాలు 5 శాతం పెరిగి



71,419 యూనిట్లకు చేరాయి. బ్రెజ్జా, గ్రాండ్ విటారా, ఎర్టిగాతో సహా యుటిలిటీ వాహనాల సేల్స్ 65 శాతం అధికమై 46,243 యూనిట్లకు చేరాయి. గత నెలలో కంపెనీ రెండంకెల అమ్మకాల వృద్ధికి ఎస్‌యూవీలు క్రెటా, వెన్యూ ఆజ్యం పోశాయని హ్యుందాయ్ ఇండియా సీవోవో తరుణ్ గర్గ్ తెలిపారు. టాటా మోటార్స్ అంతర్జాతీయ వ్యాపారంతో సహా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు 66% వృద్ధితో 5,805 యూనిట్లుగా ఉన్నాయి. గత ఏడాది ఇదే కాలంలో 3,505 యూనిట్లు విక్రయించామని కంపెనీ తెలిపింది.

మే నెలలో అమ్మకాలు ఇలా...

కంపెనీ	2022	2023
మారుతీ సుజుకీ	1,24,474	1,43,708
హ్యుందాయ్	42,293	48,601
టాటా మోటార్స్	43,341	45,878
మహీంద్రా	26,904	32,883
కియా	24,079	24,770
టయోటా	10,216	19,379
ఎంజీ మోటార్	4,008	5,006

జీఎస్‌టీ వసూళ్లు @ రూ.1.57 లక్షల కోట్లు

మే గణాంకాల విడుదల • 12% వృద్ధి

న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు వరుసగా మూడో నెల మేలో కూడా రూ. 1.50 లక్షల కోట్లు దాటాయి. సమీక్షా నెల్లో (2022 మే నెలతో పోల్చి) 12 శాతం వృద్ధితో రూ. 1.57 లక్షల కోట్లకు పైగా వసూళ్లు నమోదయినట్లు గురువారం విడుదల చేసిన అధికారిక గణాంకాలు వెల్లడించాయి. ఆర్థిక వ్యవస్థ పని తీరు బాగున్నట్లు ఈ ఫలితాలు పేర్కొంటున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. మార్చిలో వసూళ్లు రూ.1.60 లక్షల కోట్లుకాగా, ఏప్రిల్‌లో రికార్డు స్థాయిలో (2017 జూలైలో ప్రారంభమైన తర్వాత ఎన్నడూ లేనంతగా) రూ.1.87 లక్షల కోట్ల వసూళ్లు జరిగాయి. ఇక రూ.1.4 లక్షలకోట్ల పైన వసూళ్లు వరుసగా 14వ నెల. తాజా గణాంకాల్లో ముఖ్యాంశాలు చూస్తే...



- మొత్తం వసూళ్లు రూ.1,57,090 కోట్లు.
- సెంట్రల్ జీఎస్‌టీ రూ.28,411 కోట్లు.
- స్టేట్ జీఎస్‌టీ రూ.35,828 కోట్లు.
- ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.81,363 కోట్లు.
- సెస్ రూ.11,489 కోట్లు.

ఈ-టూ వీలర్లు ప్రియం

- ధర పెంచిన టీవీఎస్, ఏథర్, ఓలా
- సవరించడం లేదన్న హీరో ఎలక్ట్రిక్

న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల ధరలకు రెక్కలొచ్చాయి. టీవీఎస్ మోటార్ కంపెనీ, ఏథర్ ఎనర్జీ, ఓలా ఎలక్ట్రిక్ తమ ఉత్పత్తుల ధరలను పెంచాయి. సవరించిన ఫేమ్-2 సబ్సిడీ జూన్ 1 నుండి అమలులోకి రావడమే ఇందుకు కారణం. వేరియంట్‌ను బట్టి ఐక్యూబ్ ధరను రూ.17-22 వేల మధ్య పెంచినట్టు టీవీఎస్ మోటార్ కంపెనీ పేర్కొంది. ఢిల్లీ ఎక్స్‌షోరూంలో గతంలో ఐక్యూబ్ బేస్ రూ.1,06,384, ఎస్ ట్రిమ్ ధర రూ.1,16,886 ఉంది. ఏథర్ 450ఎక్స్ ప్రో ధర సుమారు రూ.8,000 అధికం అయింది. దీంతో ఈ మోడల్ ప్రారంభ ధర బెంగళూరు ఎక్స్‌షోరూంలో రూ.1,65,435లకు చేరింది. 'ఫేమ్-2 సవరణ ఫలితంగా సుమారు రూ.32,000 సబ్సిడీ తగ్గింది. అయినప్పటికీ దేశంలో ఈవీ స్వీకరణను వేగవంతం చేయాలనే ఉద్దేశంతో ఈ ధరల ప్రభావంలో భారీ భాగాన్ని కంపెనీ గ్రహిస్తోంది' అని ఏథర్ ఎనర్జీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ రవ్‌నీత్ ఎస్ ఫోకెలా తెలిపారు. ఓలా ఎలక్ట్రిక్ టూ-వీలర్లు రూ.15,000 వరకు ప్రియం అయ్యాయి. దీంతో ఎస్1-ప్రో రూ.1,39,999, ఎస్1 రూ.1,29,999, ఎస్1 ఎయిర్ ధర రూ.1,09,999 పలుకుతోంది. ప్రభుత్వ సబ్సిడీలలో గణనీయ తగ్గింపు ఉన్నప్పటికీ జూన్ నుండి ఉత్పత్తుల ధరలను స్వల్పంగా పెంచామని ఓలా ఎలక్ట్రిక్ వ్యవస్థాపకుడు, సీఈవో భవీశ్ అగర్వాల్ చెప్పారు.



ధర పెంచడం లేదు..

ఈ-స్కూటర్ మోడల్స్ ధరలను పెంచబోమని హీరో ఎలక్ట్రిక్ ఒక ప్రకటనలో తెలిపింది. ఎలక్ట్రిక్ టూ-వీలర్ల స్వీకరణను ప్రోత్సహించడానికి, వాటి యాజమాన్య ఖర్చుపై ఉన్న అపోహలను తొలగించడానికి అంకితభావంతో ఉన్నట్లు కంపెనీ తెలిపింది. 'ఎలక్ట్రిక్ వాహన కంపెనీలకు రావాల్సిన సబ్సిడీలు భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ వద్ద 15 నెలలకు పైగా నిలిచిపోయాయి. మాపై తీవ్ర ఆర్థిక సంక్షోభం ఏర్పడినప్పటికీ మేము చేయగలిగినంత వరకు మా ప్రస్తుత ధరలను కొనసాగుతాయి. తద్వారా వినియోగదారులకు సరసమైన మొబిలిటీ పరిష్కారాలను అందించడంలో మా వంతు కృషిని కొనసాగిస్తాము' అని హీరో ఎలక్ట్రిక్ సీఈవో సోహిందర్ గిల్ వివరించారు.

లాయల్టీ బెనిఫిట్ ప్రోగ్రామ్..

'రాబోయే కొన్ని త్రైమాసికాలలో ఫేమ్-2 సబ్సిడీ క్రమంగా తగ్గుతుంది. దేశంలోని ద్విచక్ర వాహనాల్లో కాలుష్య రహిత టూ-వీలర్ల వ్యాప్తిని ప్రోత్సహించడానికి కంపెనీ మెరుగైన ఉత్పత్తులు, గొప్ప విలువను అందించడం కొనసాగిస్తుంది' అని టీవీఎస్ మోటార్ కంపెనీ డైరెక్టర్, సీఈవో కేఎన్ రాధాకృష్ణన్ అన్నారు. ఫేమ్-2 సబ్సిడీలో కోత తర్వాత ఖర్చు భారాన్ని తగ్గించడానికి పరిమిత కాలానికి 2023 మే 20 వరకు బుకింగ్స్ చేసిన ఐక్యూబ్ కస్టమర్ల కోసం కంపెనీ లాయల్టీ బెనిఫిట్ ప్రోగ్రామ్‌ను అందిస్తుందని వివరించారు.

ఎక్స్-ఫ్యాక్టరీ ధరలో..

ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలకు డిమాండ్ ప్రోత్సాహకం కిలోవాట్‌కు రూ.10,000 ఉంటుందని భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ నోటిఫై చేసింది. ఈ ప్రోత్సాహకాలపై పరిమితిని ఎక్స్-ఫ్యాక్టరీ ధరలో ప్రస్తుతం ఉన్న 40 శాతం నుండి 15 శాతానికి చేర్చారు. దేశంలో ఎలక్ట్రిక్, హైబ్రిడ్ వాహనాల వినియోగం పెంచేందుకు మూడేళ్ల కాల పరిమితితో ఫేమ్ పథకాన్ని 2019 ఏప్రిల్ 1 నుంచి అమలులోకి తెచ్చారు. ఆ తర్వాత ఈ పథకాన్ని 2024 మార్చి 31 వరకు పొడిగించారు.

ఆటుపోట్ల మధ్య మళ్లీ నష్టాలు

- సెన్సెక్స్ 194 పాయింట్లు డౌన్
- 62,429 వద్ద ముగింపు
- నిఫ్టీ 47 పాయింట్ల క్షీణత



ముంబై: ప్రపంచ మార్కెట్ల బలహీనతల నేపథ్యంలో వరుసగా రెండో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు డీలా పడ్డాయి. సెన్సెక్స్ 194 పాయింట్లు క్షీణించి 62,429 వద్ద ముగిసింది. నిఫ్టీ 47 పాయింట్లు తక్కువగా 18,488 వద్ద స్థిరపడింది. గతేడాదికి అంచనాలను మించి జీడీపీ వృద్ధి నమోదుకావడంతో తొలుత మార్కెట్లు హుషారుగా కదిలాయి. అయితే మిడ్‌సెషన్ నుంచీ అమ్మకాలు అధికంకావడంతో చివరికి నష్టాలతో ముగిశాయి. వెరసి ఇంట్రాడేలో సెన్సెక్స్ 62,762 వద్ద గరిష్టాన్ని, 62,359 వద్ద కనిష్టాన్నీ తాకింది. ఇక నిఫ్టీ 18,580-18,465 పాయింట్ల మధ్య ఆటుపోట్లను చవిచూసింది. మార్కెట్లు వరుసగా 4 రోజుల్లో 1,200 పాయింట్లు పుంజుకోవడంతో బుధవారం ట్రేడర్లు లాభాల స్వీకరణ చేపట్టిన సంగతి తెలిసిందే. దీంతో సెన్సెక్స్ 347 పాయింట్లు నీరసించింది.

బ్యాంకింగ్ వీక్

ఎన్ఎస్ఈలో ప్రధానంగా ప్రయివేట్ బ్యాంక్స్ 0.7 శాతం నీరసించగా.. రియల్టీ, ఫార్మా, పీఎస్‌యూ బ్యాంక్స్, ఐటీ, ఆటో 1-0.4 శాతం మధ్య బలపడ్డాయి. నిఫ్టీ దిగ్గజాలలో కోల్ ఇండియా, కొటక్ బ్యాంక్ 4.5 శాతం చొప్పున పతనంకాగా.. అపోలో హాస్పిటల్స్ 4.4 శాతం జంప్‌చేసింది. ఇతర బ్లూచిప్స్‌లో ఎయిర్‌టెల్, ఎస్‌బీఐ లైఫ్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఐసీఐసీఐ, ఐటీసీ, యూపీఎల్, గ్రాసిమ్, టాటా కన్స్యూమర్, బ్రిటానియా, అదానీ పోర్ట్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.7-0.6 శాతం మధ్య క్షీణించగా.. దివీస్, బజాజ్ ఆటో, టాటా మోటార్స్, హీరో మోటో, ఏషియన్ పెయింట్స్, సిప్లా, సన్ ఫార్మా, డాక్టర్ రెడ్డీస్, టీసీఎస్, విప్రో, హెచ్‌యూఎల్ 2.6-1 శాతం మధ్య ఎగశాయి.

రూపాయి ఖుషీ...

డాలరుతో మారకంలో దేశీ కరెన్సీకి హుషారొచ్చింది. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో రూపాయి 35 పైసలు పుంజుకుంది. 82.40 వద్ద నిలిచింది. జీడీపీ పురోగమనం, స్టాక్స్‌లో విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు వంటి అంశాలు రూపాయికి ప్రోత్సాహాన్నిచ్చినట్లు ఆర్థికవేత్తలు పేర్కొన్నారు.



సాక్షి స్పోర్ట్స్



సెమీఫైనల్లో రష్మిక జోడీ

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక డబుల్స్ విభాగంలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. థాయ్‌లాండ్‌లో గురువారం జరిగిన డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో రష్మిక-వైదేహి (భారత్) ద్వయం 6-3, 6-2తో చిసా హోసోనుమా (జపాన్)-మాన్ యింగ్ మాగీ (హాంకాంగ్) జోడీపై గెలిచింది. సింగిల్స్ విభాగంలో హైదరాబాద్‌కే చెందిన బవిశెట్టి సౌజన్య పోరాటం ముగిసింది. క్వార్టర్ ఫైనల్లో సౌజన్య 0-6, 4-6తో భారత్‌కే చెందిన వైదేహి చేతిలో ఓడిపోయింది.

క్వార్టర్ ఫైనల్లో సహజ

ట్యునీషియాలో జరుగుతున్న ఐటీఎఫ్ టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి సహజ యామలపల్లి క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. గురువారం జరిగిన సింగిల్స్ రెండో రౌండ్‌లో సహజ 6-1, 6-2తో అంజా వైల్డ్‌గ్రుబెర్ (జర్మనీ)పై విజయం సాధించింది.

క్వార్టర్ ఫైనల్లో కిరణ్, లక్ష్య సేన్

- సైనా నెహ్వాల్‌కు నిరాశ
- సాత్విక్ జోడీ నిష్క్రమణ



బ్యాంకాక్: మరోసారి అద్భుత ప్రదర్శన కనబరిచిన భారత యువ షట్లర్ కిరణ్ జార్జి తన కెరీర్‌లో తొలిసారి వరల్డ్ టూర్ సూపర్-500 టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. థాయ్‌లాండ్ ఓపెన్ టోర్నీలో భాగంగా గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 59వ ర్యాంకర్ కిరణ్ 21-11, 21-19తో ప్రపంచ 26వ ర్యాంకర్ వెంగ్ హాంగ్ యాంగ్ (చైనా)పై గెలుపొందాడు. క్వాలిఫయింగ్ ద్వారా మెయిన్ 'డ్రా'కు అర్హత పొందిన కిరణ్ నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో తోమా జూనియర్ పొపోవ్ (ఫ్రాన్స్)తో తలపడతాడు. భారత్‌కే చెందిన మరో స్టార్ ప్లేయర్ లక్ష్య సేన్ కూడా క్వార్టర్ ఫైనల్ చేరాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో లక్ష్య సేన్ 21-17, 21-15తో నాలుగో సీడ్ లీ షి ఫెంగ్ (చైనా)పై నెగ్గాడు. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో క్వాలిఫయర్ లియోంగ్ జున్ హావో (మలేసియా)తో ఆడతాడు.

మహిళల సింగిల్స్‌లో భారత పోరాటం ముగిసింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో సైనా నెహ్వాల్, అష్మిత చాలిహా ఓడిపోయారు. సైనా 11-21, 14-21తో మూడో సీడ్, ప్రపంచ ఐదో ర్యాంకర్ హి బింగ్ జావో (చైనా) చేతిలో... అష్మిత 18-21, 13-21తో మూడుసార్లు ప్రపంచ చాంపియన్ కరోలినా మారిన్ (స్పెయిన్) చేతిలో పరాజయం చవిచూశారు. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) ద్వయం నిష్క్రమించింది. మొహమ్మద్ షోహిబుల్ ఫిక్రి-మౌలానా బగాస్ (ఇండోనేసియా) జోడీతో 62 నిమిషాలపాటు జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో సాత్విక్-చిరాగ్ జంట 26-24, 11-21, 17-21తో ఓడిపోయింది. గతంలో ఫిక్రి-మౌలానాతో ఆడిన మూడుసార్లూ నెగ్గిన సాత్విక్-చిరాగ్ నాలుగో ప్రయత్నంలో మాత్రం తొలిసారి ఓటమి పాలయ్యారు.

భారత్‌దే ఆసియా కప్

ఫైనల్లో పాకిస్తాన్‌పై 2-1తో విజయం • ప్రపంచకప్ టోర్నీకి అర్హత



సలాలా (ఒమన్): ఆద్యంతం తమ ఆధిపత్యాన్ని చాటుకున్న భారత హాకీ జట్టు ఆసియా కప్ జూనియర్ టోర్నమెంట్‌లో టైటిల్‌ను నిలబెట్టుకుంది. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో బరిలోకి దిగిన టీమిండియా గురువారం జరిగిన ఫైనల్లో 2-1 గోల్స్ తేడాతో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్ జట్టును ఓడించింది. భారత్ తరఫున అంగద్‌బీర్ సింగ్ (13వ ని.లో), అరైజీత్ సింగ్ హుండల్ (20వ ని.లో) ఒక్కో గోల్ చేయగా... పాకిస్తాన్ జట్టుకు అలీ బషారత్ (38వ ని.లో) ఏకైక గోల్ అందించాడు. ఓవరాల్‌గా ఆసియా కప్ టైటిల్ నెగ్గడం భారత్‌కిది నాలుగోసారి. గతంలో భారత్ 2004, 2008, 2015లలో విజేతగా నిలిచింది. తాజా టైటిల్‌తో ఆసియా కప్‌ను అత్యధికంగా నాలుగుసార్లు నెగ్గిన జట్టుగా భారత్ గుర్తింపు పొందింది. పాకిస్తాన్ మూడుసార్లు చాంపియన్‌గా నిలిచింది. మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో దక్షిణ కొరియా 2-1తో మలేసియాపై గెలిచింది. ఆసియా కప్ టోర్నీలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన భారత్, పాకిస్తాన్, కొరియా జట్లు ఈ ఏడాది డిసెంబర్‌లో కౌలాలంపూర్‌లో జరిగే జూనియర్ ప్రపంచకప్ టోర్నమెంట్‌కు అర్హత సాధించాయి. తాజా టోర్నీలో భారత్ సంపూర్ణ ఆధిపత్యాన్ని కనబరిచింది. టోర్నీ మొత్తంలో భారత్ 50 గోల్స్ సాధించి... కేవలం నాలుగు గోల్స్ సమర్పించుకుంది. ఈ టోర్నీలో అజేయంగా నిలిచిన భారత హాకీ జట్టుకు హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ అభినందించారు. జట్టులోని ప్రతి సభ్యుడికి రూ. 2 లక్షలు నగదు పురస్కారం ప్రకటించారు.

5 గంటల 26 నిమిషాలు...



- సుదీర్ఘ పోరులో ఎనిమిదో సీడ్ సినర్ పరాజయం
- రెండు మ్యాచ్ పాయింట్లు కాపాడుకొని నెగ్గిన అల్ట్‌మైర్
- మూడో రౌండ్‌లోకి జొకోవిచ్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో గురువారం సంచలన ఫలితం నమోదైంది. ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్, ఎనిమిదో సీడ్ యానిక్ సినర్ (ఇటలీ) రెండో రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. 5 గంటల 26 నిమిషాలపాటు పోరాడిన ప్రపంచ 79వ ర్యాంకర్ డానియల్ అల్ట్‌మైర్ (జర్మనీ) రెండు మ్యాచ్ పాయింట్లను కూడా కాపాడుకొని సినర్‌ను బోల్తా కొట్టించి మూడో రౌండ్‌లోకి ప్రవేశించాడు. గురువారం జరిగిన ఈ మారథాన్ సమరంలో అల్ట్‌మైర్ 6-7 (0/7), 7-6 (9/7), 1-6, 7-6 (7/4), 7-5తో సినర్‌ను ఓడించాడు. ఈ గెలుపుతో గత ఏడాది యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ తొలి రౌండ్‌లో సినర్ చేతిలో ఎదురైన ఓటమికి అల్ట్‌మైర్ బదులు తీర్చుకున్నాడు. హోరాహోరీగా సాగిన ఈ పోరులో నాలుగో సెట్‌లోనే సినర్ విజయం అంచుల్లో నిలిచాడు. నాలుగో సెట్‌లో 5-4తో ఆధిక్యంలో నిలిచి తన సర్వీస్‌లో రెండుసార్లు మ్యాచ్ పాయింట్లు కూడా సంపాదించాడు. అయితే అల్ట్‌మైర్ పట్టుదలతో పోరాడి రెండుసార్లూ మ్యాచ్ పాయింట్లను కాపాడుకున్నాడు. అదే జోరులో సినర్ సర్వీస్‌ను కూడా బ్రేక్ చేసి స్కోరును 5-5తో సమం చేశాడు. ఆ తర్వాత ఇద్దరూ తమ సర్వీస్‌లను కాపాడుకోవడంతో టైబ్రేక్ అనివార్యమైంది. టైబ్రేక్‌లో అల్ట్‌మైర్ పైచేయి సాధించి సెట్‌ను దక్కించుకున్నాడు. నాలుగో సెట్ ఏకంగా 93 నిమిషాలు జరగడం విశేషం. నిర్ణాయక ఐదో సెట్‌లోని 11వ గేమ్‌లో సినర్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన అల్ట్‌మైర్ 12వ గేమ్‌లో తన సర్వీస్‌ను నిలబెట్టుకొని విజయం ఖరారు చేసుకున్నాడు. ఈ గేమ్‌లో సినర్‌కు నాలుగుసార్లు అల్ట్‌మైర్ సర్వీస్‌ను బ్రేక్ చేసే అవకాశం వచ్చినా వృథా చేసుకున్నాడు.

మ్యాచ్ సాగిందిలా...

అల్ట్‌మైర్		సినర్
10	ఏస్‌లు	11
6	డబుల్ ఫాల్ట్‌లు	3
5/9	బ్రేక్ పాయింట్లు	6/21
38/49	నెట్ పాయింట్లు	42/61
70	అనవసర తప్పిదాలు	75
60	విన్నర్లు	62

రూడ్ ముందంజ

పురుషుల సింగిల్స్ ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో మూడో సీడ్ జొకోవిచ్ (సెర్బియా), నాలుగో సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే) మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు. జొకోవిచ్ 7-6 (7/2), 6-0, 6-3తో మార్టన్ ఫచ్‌సోవిచ్ (హంగేరి)పై, రూడ్ 6-3, 6-2, 4-6, 7-5తో జెపెరి (ఇటలీ)పై గెలుపొందారు.

స్వియాటెక్ జోరు

మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) 6-4, 6-0తో క్లెయిరి లియు (అమెరికా)ను ఓడించి మూడో రౌండ్‌కు చేరింది. ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో నాలుగో సీడ్ రిబాకినా (కజకిస్తాన్) 6-3, 6-3తో నొస్కోవా (చెక్ రిపబ్లిక్)పై, ఏడో సీడ్ ఆన్స్ జబర్ (ట్యూనీషియా) 6-2, 6-3తో డోడిన్ (ఫ్రాన్స్)పై గెలుపొంది మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు.

మంజీత్‌కు కాంస్యం

బిష్కెక్ (కిర్గిస్తాన్): యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) ర్యాంకింగ్ సిరీస్ టోర్నమెంట్‌లో భారత్ పతకాల బోణీ చేసింది. గురువారం మొదలైన ఈ టోర్నీలో తొలి రోజు జరిగిన పురుషుల గ్రీకో రోమన్ విభాగంలో భారత్‌కు ఒక కాంస్య పతకం లభించింది. 55 కేజీల విభాగంలో భారత రెజ్లర్ మంజీత్ మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. కాంస్య పతక బౌట్‌లో మంజీత్ 14-9 పాయింట్ల తేడాతో యెర్సిన్ అబీర్ (కజకిస్తాన్)పై విజయం సాధించాడు. అయితే భారత్‌కే చెందిన సుమిత్ (60 కేజీలు), నీరజ్ (67 కేజీలు), సునీల్ కుమార్ (87 కేజీలు), నరీందర్ చీమా (97 కేజీలు), సాహిల్ (130 కేజీలు) విఫలమయ్యారు.



ధోని మోకాలికి శస్త్ర చికిత్స విజయవంతం

ముంబై: భారత మాజీ కెప్టెన్ ధోని ఎడమ మోకాలికి శస్త్రచికిత్స జరిగింది. ముంబైలోని ప్రముఖ కోకిలాబెన్ హాస్పిటల్‌లో స్పోర్ట్స్ ఆర్థోపెడిక్ స్పెషలిస్టు డాక్టర్ దిన్షా పార్ది వాలా గురువారం ధోని మోకాలికి సర్జరీ చేశారు. ఐపీఎల్ ఫైనల్లో ధోని నేతృత్వంలోని చెన్నై సూపర్‌కింగ్స్ ఐదోసారి విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. అహ్మదాబాద్ నుంచి నేరుగా ముంబై చేరుకున్న ధోని హాస్పిటల్‌లో అడ్మిట్ అయ్యారు. 'సర్జరీ తర్వాత ధోని కోలుకుంటున్నాడు. ఒకట్రెండు రోజు లు వైద్యబృందం పర్యవేక్షణలో ఆసుపత్రిలోనే ఉంటాడు. ఆ తర్వాతే డిశ్చార్జిపై నిర్ణయం తీసుకుంటా రు. ధోని కొన్నాళ్లు పూర్తిగా విశ్రాంతి తీసుకున్నాకే... పునరావాస శిబిరంలో పాల్గొంటాడు. వచ్చే సీజన్‌కల్లా కోలుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది' అని చెన్నై ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు.



ఐర్లాండ్ 172 ఆలౌట్

- స్టువర్ట్ బ్రాడ్‌కు 5 వికెట్లు
- ఇంగ్లండ్ 152/1



లండన్: ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌కు ముందు సన్నాహంగా ఐర్లాండ్‌తో ఆడుతున్న ఏకైక టెస్టులో ఇంగ్లండ్ తొలిరోజే అన్ని విభాగాల్లో శాసించింది. టాస్ నెగ్గిన ఇంగ్లండ్ ఫీల్డింగ్ ఎంచుకుంది. ముందుగా తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఐర్లాండ్ 56.2 ఓవర్లలో 172 పరుగులకే కుప్పకూలింది. ఇంగ్లండ్ సీమర్ స్టువర్ట్ బ్రాడ్ (5/51) నిప్పులు చెరిగాడు. దీంతో టాపార్డర్‌లో జేమ్స్ (36; 5 ఫోర్లు), పీటర్ మూర్ (10; 2 ఫోర్లు), కెప్టెన్ బాల్బిర్నీ (0) సహా... టక్టర్ (0), లోయర్ ఆర్డర్‌లో అడెర్ (14; 2 ఫోర్లు)లు బ్రాడ్ పేస్ పదునుకు తలవంచారు. 98 పరుగులకు 5 వికెట్లు కోల్పోగా... ఇందులో 4 వికెట్లు బ్రాడ్‌వే! ఐర్లాండ్ ఇన్నింగ్స్‌లో క్యాంఫర్ (33; 6 ఫోర్లు), పాల్ స్టిర్లింగ్ (30; 5 ఫోర్లు) కాసేపు ఇంగ్లండ్ బౌలింగ్‌కు ఎదురొడ్డి నిలిచారు. స్పిన్నర్ జాక్ లీచ్ 2, మాథ్యూ పాట్స్ 2 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ ఆట నిలిచే సమయానికి 25 ఓవర్లలో వికెట్ నష్టానికి 152 పరుగులు చేసింది. ఓపెనర్లు క్రాలీ (56; 11 ఫోర్లు), డకెట్ (60 బ్యాటింగ్; 8 ఫోర్లు) 16.3 ఓవర్లలోనే వేగంగా 109 పరుగులు జోడించారు. క్రాలీని హ్యాండ్ అవుట్ చేయగా, డకెట్‌తో ఒలీ పోప్ (29 బ్యాటింగ్; 5 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. ఇంగ్లండ్ ఇంకా 20 పరుగుల దూరంలోనే ఉంది. చేతిలో 9 వికెట్లున్నాయి.

క్లుప్తంగా...

నర్సాపూర్-యశ్వంత్‌పూర్ మధ్య వేసవి ప్రత్యేక రైలు



రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): వేసవి నేపథ్యంలో నర్సాపూర్-యశ్వంత్‌పూర్ మధ్య ప్రత్యేక రైలు నడపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం తెలిపారు. నర్సాపూర్-యశ్వంత్‌పూర్ ప్రత్యేక రైలు (07687) ఈ నెల 4న మధ్యాహ్నం 3.10 గంటలకు నర్సాపూర్‌లో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 10.50 గంటలకు యశ్వంత్‌పూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07688) ఈ నెల 5న మధ్యాహ్నం 3.50 గంటలకు యశ్వంత్‌పూర్‌లో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు నర్సాపూర్ చేరుకుంటుంది. 2 మార్గాల్లో ఈ రైలు పాలకొల్లు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, నర్సరావుపేట, దొనకొండ, మార్కాపురం రోడ్డు, గిద్దలూరు, నంద్యాల, డోన్, అనంతపురం, ధర్మవరం, పెనుకొండ, హిందూపురం, యలహంక స్టేషన్లల్లో ఆగుతుంది.

28 మంది మున్సిపల్ కమిషనర్ల బదిలీ

సాక్షి, అమరావతి: రాష్ట్ర పురపాలక శాఖలో పనిచేస్తున్న 28 మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో గ్రేడ్-1 మున్సిపల్ మిషనర్లతో పాటు, డిప్యూటీ, అసిస్టెంట్ కమిషనర్లు కూడా ఉన్నారు. కాగా, వివిధ శాఖలకు చెందిన ఏడుగురు అధికారులకు డిప్యుటేషన్‌పై మున్సిపల్ కమిషర్లుగా పోస్టింగ్ ఇచ్చారు.

నేడు విశాఖలో 'ఫస్ట్ డే ఫస్ట్ షో' లాంచ్

మహారాణిపేట (విశాఖ దక్షిణ): దేశంలో ఎక్కడా లేనివిధంగా సినిమా విడుదల రోజున ఏపీ ఫైబర్ నెట్‌లో కొత్త సినిమాలు చూసే అవకాశాన్ని ఏపీ ప్రభుత్వం కల్పిస్తోంది. సినిమా విడుదలైన రోజే ఇంట్లోనే వీక్షించే అవకాశం ఫైబర్ నెట్ ద్వారా కలుగుతోంది. మారుమూల గ్రామాల్లో సైతం రిలీజ్ రోజే సినిమా చూసేందుకు అవకాశం ఉంటుంది. ఈ లాంచింగ్ కార్యక్రమాన్ని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శుక్రవారం ఉదయం 10.30 గంటలకు విశాఖలోని పార్క్ హోటల్‌లో ప్రారంభించనున్నారు.

మే నెల జీఎస్టీ ఏపీ వసూళ్లు రూ.3,373 కోట్లు

- గతేడాదితో పోలిస్తే 11 శాతం వృద్ధి

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో జీఎస్టీ వసూళ్లు గణనీయంగా పెరిగాయి. ఏపీలో వసూళ్లు గతేడాది రూ.3,047 కోట్లుగా ఉంటే ఈ ఏడాది 11 శాతం పెరిగి రూ.3,373 కోట్లకు చేరింది. తెలంగాణలో గతేడాది జీఎస్టీ వసూళ్లు రూ.3,982 కోట్లు ఉంటే అది 13% పెరిగి ఈ ఏడాది రూ.4,507 కోట్లకు చేరినట్లు కేంద్ర ఆర్థిక శాఖ గురువారం తెలిపింది. అలాగే, గడిచిన మే నెలలో జీఎస్టీ వసూళ్లు రూ.1.57 లక్షల కోట్లు వచ్చినట్లు కేంద్రం పేర్కొంది. ఇది గతేడాది ఇదే నెలతో పోలిస్తే 12 శాతం ఎక్కువగా ఉన్నట్లు వెల్లడించింది.

ప్రొద్దుటూరు పేరు నిలబెడతా

- టీడీపీ నేత నారా లోకేశ్

ప్రొద్దుటూరు క్రైం: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ప్రొద్దుటూరు పేరు నిలబెడతానని టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ చెప్పారు. గురువారం ప్రొద్దుటూరులో పాదయాత్ర అనంతరం శివాలయం సెంటర్లో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. తాను ప్రజల కష్టాలు తెలుసుకొని చంద్రబాబుకు చెబుతున్నానని, అందుకే మహానాడులో మినీ మేనిఫెస్టో ప్రవేశ పెట్టారని అన్నారు. దేశానికి సంక్షేమాన్ని పరిచయం చేసింది టీడీపీనే అని చెప్పారు. ఎన్నికల ముందు జగన్ అనేక హామీలు ఇచ్చారని, వాటిని అమలు చేయలేక జీరోగా మారిపోయారని అన్నారు. మీకు అండగా నిలవడానికి చంద్రబాబు మహాశక్తి పథకాన్ని ప్రకటించారన్నారు. జగన్ అప్పుల అప్పారావు అయితే మా చంద్రన్న సంపద సృష్టికర్త అని అన్నారు. ప్రొద్దుటూరును గ్యాంబ్లింగ్, క్రికెట్ బెట్టింగ్, మట్కా, గుట్కా, ఇసుక అక్రమ రవాణా, భూ దందాలకు అడ్డాగా మార్చారన్నారు. కారు ఈఎంఐ కూడా కట్టలేని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే ఈ రోజు రూ.వేల కోట్లు ఎలా సంపాదించారో చెప్పాలన్నారు. లోకేశ్ సభ ముగించుకొని వెళ్తుండగా జనంలో నుంచి కొందరు కోడి గుడ్లు విసిరారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. గుడ్లు విసిరిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఢిల్లీ మద్యం కేసులో అప్రూవర్‌గా శరత్‌చంద్రారెడ్డి

అనుమతించిన రౌజ్ అవెన్యూ కోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో హైదరాబాద్‌కు చెందిన శరత్ చంద్రారెడ్డి అప్రూవర్‌గా మారారు. ఈ మేరకు రౌజ్ అవెన్యూ కోర్టులో మే 29న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారించిన న్యాయమూర్తి జస్టిస్ ఎంకే నాగ్‌పాల్ అనుమతిస్తున్నట్లు గురువారం ఉత్తర్వులు వెలువరించారు. ఈడీ కేసులో శరత్‌చంద్రారెడ్డికి ఢిల్లీ హైకోర్టు బెయిలు మంజూరు చేసిన విషయం విదితమే.

పోలవరం పూర్తవుతున్నందుకా..
ఈనాడు 'రంకెలు'



వంకర బుద్ధిని ఎప్పటికప్పుడు రుజువు చేసుకుంటున్న రామోజీ

- రాజకీయంగా బాబును బతికించేందుకే ఆయన తాపత్రయం
- అందుకే 'అంకెల రంకెలు'తో వికృతరాతలు
- స్పిల్ వే, స్పిల్ చానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తిచేయకుండానే దయాఫ్రమ్ వాల్ నిర్మించడం బాబు ఘోర తప్పిదం
- చంద్రబాబు కమీషన్ల కక్కుర్తివల్లే వరదల ఉధృతికి దయాఫ్రమ్ వాల్, ప్రధాన డ్యామ్‌ల వద్ద భారీ అగాధాలు
- దయాఫ్రమ్ వాల్ పునరుద్ధరణకు అయ్యే రూ.2,020.05 కోట్ల భారం చంద్రబాబు నిర్వాకమే
- జగన్ హయాంలో ఆర్‌సీసీ ఏర్పాటంటూ అడ్డగోలుగా అబద్ధాలు.. అది టీడీపీ హయాంలోనే ఏర్పాటు
- పోలవరం ఎత్తు తగ్గబోదని అందరూ స్పష్టంచేస్తున్నా ఈనాడు నానాయాగీ



సాక్షి, అమరావతి: కుక్కతోకలా తన బుద్ధి వంకరే అని ఎప్పటికప్పుడు ఈనాడు రామోజీరావు చాటిచెప్పుకుంటున్నారనడానికి మరో నిదర్శనం గురువారం 'ఈనాడు'లో 'అంకెల రంకెలు' శీర్షికతో ప్రచురించిన కథనం. కమీషన్ల కక్కుర్తితో చంద్రబాబు పాల్పడిన పాపాలను సీఎం వైఎస్ జగన్ ప్రక్షాళన చేస్తూ.. ప్రణాళికాబద్ధంగా పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేసే దిశగా అడుగులు వేస్తున్నారు. రాష్ట్ర ప్రజల దశాబ్దాల కల పోలవరాన్ని సీఎం వైఎస్ జగన్ సాకారం చేస్తుంటే.. రాజకీయంగా చంద్రబాబుకు నూకలు చెల్లడం ఖాయమని రామోజీరావు తెగ ఆందోళన చెందుతున్నారు. చంద్రబాబుకు రాజకీయంగా లబ్ధిచేకూర్చడమే లక్ష్యంగా.. పోలవరంపై పూటకో అవాస్తవాన్ని వల్లెవేస్తూ.. వికృత రాతలతో రోజుకో కథనాన్ని అచ్చేయడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించడమే పనిగా పెట్టుకున్నారు. తాజాగా.. 'అంకెల రంకెలు'కు సంబంధించిన వాస్తవాలు ఏమిటంటే..

ఆరోపణ: పోలవరం తొలిదశకు 2022, జనవరిలో రూ.10,911 కోట్లతో కేంద్రానికి అంచనాలు సమర్పించినా కొలిక్కి రాలేదు. తాజాగా.. తొలిదశ అంచనా రూ.16,952 కోట్లకు చేరింది. ఏడాదిన్నరలో కొన్ని అదనపు పనులు, అదనపు భూసేకరణ, అదనపు పునరావాసంతో అంచనాలు భారీగా పెరిగిపోయాయి.

వాస్తవం: సీడబ్ల్యూసీ మార్గదర్శకాల ప్రకారం కొత్తగా నిర్మించే ప్రాజెక్టులో తొలి ఏడాది ఆ ప్రాజెక్టు నిల్వ సామర్థ్యంలో 1/3వ వంతు, మరుసటి ఏడాది 2/3వ వంతు.. ఆ తర్వాత పూర్తిస్థాయిలో నీటిని నిల్వచేయాలి. ఆ మార్గదర్శకాల ప్రకారం పోలవరాన్ని పూర్తిచేసి.. 41.15 మీటర్ల కాంటూరులో నీటిని నిల్వచేసి.. ఆయకట్టుకు నీటిని సరఫరా చేయడం ద్వారా రైతులకు ముందస్తు ఫలాలను అందించాలని సీఎం వైఎస్ జగన్ సంకల్పించారు. అడ్‌హక్‌గా రూ.పది వేల కోట్లు ఇస్తే పోలవరాన్ని త్వరితగతిన పూర్తిచేసి.. ముందస్తు ఫలాలను రైతులకు అందిస్తామని 2022, జనవరి 3న సీఎం వైఎస్ జగన్ చేసిన విజ్ఞప్తికి ప్రధాని మోదీ సానుకూలంగా స్పందించారు. ఆ మేరకు కేంద్ర జల్‌శక్తి శాఖకు దిశానిర్దేశం చేశారు. కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ సూచనల మేరకు పోలవరం తొలిదశ అంటే 41.15 మీటర్ల కాంటూరు వరకూ పూర్తిచేయడానికి రూ.10,911.15 కోట్లతో 2022, జనవరి 10న రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు ప్రతిపాదన పంపారు. కానీ, చంద్రబాబు కమీషన్ల కక్కుర్తితో ప్రణాళికారాహిత్యంతో చేపట్టిన పనులవల్ల 2019లో గోదావరి వరదల ఉధృతికి డయాఫ్రమ్ వాల్, ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఇసుక తిన్నెలు కోతకు గురై భారీ అగాధాలు ఏర్పడ్డాయి. వాటిని సరిచేయడానికి జాతీయ స్థాయిలో నిపుణులు, సీడబ్ల్యూసీ, డీడీఆర్పీలతో సంప్రదింపులు జరుపుతున్నామని.. వాటిని సరిదిద్దేందుకు విధానం ఖరారయ్యాక సవరించిన అంచనా వ్యయ ప్రతిపాదన పంపుతామని అప్పట్లోనే రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. ఇక పోలవరం తొలిదశ వ్యయ ప్రతిపాదనను పరిశీలించిన సీడబ్ల్యూసీ రూ.10,485.38 కోట్లు ఇవ్వాలని కేంద్ర జల్‌శక్తి శాఖకు 2022, ఏప్రిల్ 21న సిఫార్సు చేసింది. ఈ క్రమంలోనే కేంద్ర జల్‌శక్తి శాఖ సూచన మేరకు పోలవరం ముంపుపై రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు లైడార్ సర్వే చేశారు. 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోకి మరో 36 గ్రామాలు వస్తాయని తేలింది. పోలవరం పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన డీడీఆర్పీ, సీడబ్ల్యూసీ అధికారులు డయాఫ్రమ్‌వాల్, ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఏర్పడిన అగాధాలను పూడ్చి, యథాస్థితికి తెచ్చే విధానాన్ని ఖరారుచేశారు. ఆ పనులకు రూ.2,020.05 కోట్లు వ్యయమవుతుందని తేల్చారు. పోలవరం ప్రాజెక్టు పనులపై ఈ ఏడాది ఏప్రిల్ 10న కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ నిర్వహించిన సమీక్షలో ఈ అంశాలను రాష్ట్ర అధికారులు వివరించారు. 41.15 కాంటూర్ పరిధిలోకి అదనంగా చేరే 36 గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించడం, డయాఫ్రమ్ వాల్, ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతాన్ని యథాస్థితికి తెచ్చే పనులతో కలిపి ప్రాజెక్టు తొలిదశ పూర్తికి సవరించిన అంచనాలను పంపాలని రాష్ట్ర అధికారులను కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి ఆదేశించారు. దాంతో 36 గ్రామాల నిర్వాసితులకు పునరావాసం కల్పించడానికి అయ్యే వ్యయం రూ.5,127 కోట్లు.. డయాఫ్రమ్ వాల్, ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతాన్ని యథాస్థితికి తెచ్చే పనులకు అయ్యే వ్యయం రూ.2,020.05 కోట్లతో కలిపి తొలి దశ సవరించిన అంచనా రూ.16,952.07 కోట్లతో మే 4న పీపీఏ ద్వారా కేంద్రానికి రాష్ట్ర అధికారులు ప్రతిపాదనలు పంపారు. వీటిని పరిశీలిస్తే డయాఫ్రమ్ వాల్ పునరుద్ధరణకు అయ్యే రూ.2020.05 కోట్ల భారం చంద్రబాబు పాపమే. ఇక కొత్తగా 41.15 మీటర్ల కాంటూర్‌లోకి చేరిన 36 గ్రామాలు.. గరిష్ట మట్టం 45.72 మీటర్ల పరిధిలోనివే. అంటే.. పునరవాసం కల్పించాల్సిందే. ఇదీ వాస్తవం. కానీ.. రామోజీరావు మాత్రం అవాస్తవాలను పోగేసి నిజాలను పాతరేసి అంచనా వ్యయం భారీగా పెరిగిపోయినట్లు కాకమ్మ కథలు అల్లి.. ప్రభుత్వంపై బురదజల్లేలా తప్పుడు కథనం అచ్చేశారు.

ఆరోపణ: 2017-18 ధరల ప్రకారం పోలవరం సవరించిన అంచనా వ్యయం (డీపీఆర్-2) రూ.55,548.87 కోట్లకు సీడబ్ల్యూసీ టీఏసీ 2019, ఫిబ్రవరిలో ఆమోదం తెలిపింది. దాంతో డీపీఆర్-2 కొలిక్కివచ్చినట్లుగా భావించాలి. అలాంటిది వైఎస్ జగన్ సర్కార్ ఏర్పడ్డాక టీఏసీ ఆమోదించిన అంచనాలపై కేంద్రం రివైజ్డ్ కాస్ట్ కమిటీ (ఆర్‌సీసీ)ని ఏర్పాటుచేసింది. ఆ కమిటీ రూ.47,725 కోట్లకు అంచనా వ్యయాన్ని ఆమోదించింది. ఆ డీపీఆర్‌పై జగన్ సర్కార్ పోరాడి నిధులను సాధించలేకపోయింది. ఈ క్రమంలో 41.15 మీటర్ల కాంటూర్‌లో నీటిని నిల్వచేయడానికి ఎంత వ్యయం అవుతుందో పంపాలని కేంద్ర జల్‌శక్తి శాఖ కోరడం, జగన్ సర్కార్ ఆ కోణంలో ముందుకు సాగడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

వాస్తవం: 2017-18 ధరల ప్రకారం పోలవరం సవరించిన అంచనా వ్యయాన్ని రూ.55,548.87 కోట్లుగా సీడబ్ల్యూసీ టీఏసీ 141వ సమావేశంలో 2019, ఫిబ్రవరి 11న ఖరారుచేసింది. దీనిపై కేంద్రం 2019, ఏప్రిల్ 2న ఆర్‌సీసీని నియమించింది. అప్పుడు రాష్ట్రంలో అధికారంలో ఉన్నది చంద్రబాబు సర్కార్. కానీ, వైఎస్ జగన్ సర్కార్ హయాంలో ఆర్‌సీసీ ఏర్పాటుచేశారంటూ అవాస్తవాలను 'ఈనాడు' అచ్చేసింది. కమీషన్ల కక్కుర్తితో పోలవరం నిర్మాణ బాధ్యతలను దక్కించుకునే క్రమంలో 2013-14 ధరల ప్రకారం రూ.20,398.61 కోట్లతోనే ప్రాజెక్టును పూర్తిచేస్తానని 2016, సెప్టెంబరు 7న నాటి సీఎం చంద్రబాబు అంగీకరించారు. దీనివల్లే 2017-18 ధరల ప్రకారం కేంద్రం నిధులు ఇవ్వడంలేదు. భూసేకరణ చట్టం-2013 ప్రకారం భూసేకరణ, నిర్వాసితుల పునరావాసానికే రూ.33 వేల కోట్లకు పైగా వ్యయం అవుతుందని.. 2013-14 ధరలతో ప్రాజెక్టును పూర్తిచేయడం అసాధ్యమని.. డీపీఆర్-2ను ఆమోదించి.. 2017-18 ధరల ప్రకారం నిధులివ్వాలని ప్రధాని, కేంద్ర జల్‌శక్తి, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రులతో సమావేశమైన ప్రతి సందర్భంలోనూ సీఎం జగన్ కోరుతూ వస్తున్నారు. రూ.55,548.87 కోట్లకు ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్ ఇప్పించి.. కేంద్రమంత్రి మండలితో ఆమోద ముద్ర వేయించి.. నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ క్రమంలోనే డీపీఆర్-2లో అంతర్భాగంగా తొలిదశ 41.15 మీటర్ల కాంటూర్ వరకూ ప్రాజెక్టును పూర్తిచేయడానికి అయ్యే వ్యయాన్ని విడుదల చేసేందుకు కేంద్రం అంగీకరించింది.

ఆరోపణ: 45.72 మీటర్ల స్థాయి వరకూ పునరావాసం, భూసేకరణకు నిధులు ఇచ్చేందుకు కేంద్రం వెనుకంజ వేస్తున్న ప్రస్తుత తరుణంలో అందుకోసం పోరాడకుండా.. తొలిదశ అంచనాలను సమర్పించడం వల్ల రాబోయే రోజుల్లో ఇబ్బందులు సృష్టించే ఆస్కారం ఉందనే భయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

వాస్తవం: పోలవరాన్ని 45.72 మీటర్ల ఎత్తుతో నిర్మిస్తామని.. ఒక్క అంగుళం కూడా ఎత్తు తగ్గదని ఇటు సీఎం వైఎస్ జగన్ శాసనసభలో అటు కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ పార్లమెంట్‌లో స్పష్టంచేస్తూనే ఉన్నారు. బడ్జెట్ సమావేశంలో మార్చి 27న పార్లమెంట్‌లో షెకావత్ అదే అంశాన్ని పునరుద్ఘాటించారు. 45.72 మీటర్ల వరకూ భూసేకరణ, నిర్వాసితులకు పునరావాసం కల్పించి.. ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో అంటే 194.6 టీఎంసీలను నిల్వచేయడం కేంద్రం బాధ్యతని స్పష్టంచేశారు. ఇది వాస్తవం. కానీ, పోలవరం ప్రాజెక్టును సీఎం వైఎస్ జగన్ వడివడిగా పూర్తిచేస్తుండటంతో చంద్రబాబుకు రాజకీయంగా నూకలు చెల్లవనే భయంతోనే రామోజీరావు ప్రజలను తప్పుదోవపట్టించేలా పదేపదే తప్పుడు రాతలు రాస్తున్నారు.

ఆరోపణ: పోలవరంలో నీటిని ఎత్తిపోసే అవసరమే లేదు. అలాంటిది ప్రస్తుతం రూ.వందల కోట్లు వెచ్చించి నీటిని ఎత్తిపోసే పరిస్థితులు ఏర్పడటం చర్చనీయాంశమవుతోంది.

వాస్తవం: ఈ పరిస్థితులు ఏర్పడటానికి మూల కారకుడు చంద్రబాబు. కానీ, చంద్రబాబు తప్పును రామోజీరావు ఒప్పుకోరు. వరదను మళ్లించేలా స్పిల్ వే, స్పిల్ చానల్, ఎగువ కాఫర్ డ్యామ్, దిగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తిచేయకుండానే డయాఫ్రమ్ వాల్‌ను చంద్రబాబు నిర్మించారు. 2019లో గోదావరి వరద ఎగువ కాఫర్ డ్యామ్ ఖాళీ ప్రదేశాల గుండా అధిక ఉధృతితో ప్రవహించడంవల్ల డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఇసుక తిన్నెలు కోతకు గురై నాలుగు చోట్ల భారీ అగాధాలు ఏర్పడ్డాయి. వైఎస్ జగన్ సర్కార్ అధికారంలోకి వచ్చాక స్పిల్ వే, స్పిల్ చానల్, ఎగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తిచేసి 2021, జూన్ 11న గోదావరి ప్రవాహాన్ని స్పిల్ వే మీదుగా మళ్లించింది. ఫిబ్రవరి 15 నాటికి దిగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తిచేసింది. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్య ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో నిల్వఉన్న నీటిని తోడితేనే డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్న చోట కొత్తగా డయాఫ్రమ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టవచ్చు. అగాధాలను పూడ్చి.. వైబ్రో కాంపాక్షన్ ద్వారా ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతాన్ని యథాస్థితికి తెచ్చే పనులు చేపట్టడం సాధ్యమవుతుంది.

అనుమతి లేకుండానే విదేశాలకు మార్గదర్శి ఎండీ



- శైలజా కిరణ్ రాకను మేం అడ్డుకోవడంలేదు
- తెలంగాణ హైకోర్టులో ఏపీ ప్రభుత్వం వాదనలు
- అసలు లుక్అవుట్ సర్క్యులర్ జారీ చేయలేదన్న కేంద్ర ప్రభుత్వం
- ఎల్ఓసీని ఉపసంహరించాలంటూ శైలజా కిరణ్ పిటిషన్

సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎంసీఎఫ్‌పీఎల్)లో వందల కోట్ల రూపాయల చందాదారుల సొమ్మును ఇతర మార్గాలకు మళ్లించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ చెరుకూరి శైలజా కిరణ్ ఎలాంటి అనుమతి లేకుండానే విదేశాలకు వెళ్లారని తెలంగాణ హైకోర్టుకు ఏపీ ప్రభుత్వం వివరించింది. ఆమె తిరిగి రావడానికి ఎలాంటి అభ్యంతరం చెప్పడంలేదని తెలిపింది. తనపై లుక్ అవుట్ సర్క్యులర్ (ఎల్ఓసీ) జారీ చేశారని, దాన్ని ఉపసంహరించుకునేలా కేంద్రాన్ని, ఏపీ సర్కార్‌ను ఆదేశించాలని కోరుతూ శైలజా కిరణ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కాజా శరత్ గురువారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. ఏపీ ప్రభుత్వం తరఫున ఏజీపీ లలితా గాయత్రి వాదనలు వినిపిస్తూ.. వందల కోట్ల రూపాయలు ప్రజల నుంచి వసూలు చేసి అక్రమ మార్గాలకు మళ్లించారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీ శైలజ ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, అనుమతి లేకుండానే విదేశాలకు వెళ్లారన్నారు. విచారణకు హాజరు కావాలని అంతకు ముందు మూడుసార్లు ఆమెకు సీఐడీ నోటీసులు జారీ చేసినా.. హాజరుకాలేదని వెల్లడించారు. ఏపీలో జరిగిన వ్యవహారాలకు సంబంధించి అక్కడి హైకోర్టును ఆశ్రయించాలని, ఈ పిటిషన్‌పై విచారణ పరిధి తెలంగాణ హైకోర్టుకు లేదని చెప్పారు. ఈ అంశం ప్రస్తుతం సుప్రీంకోర్టు వద్ద పెండింగ్‌లో ఉందని, ఆదేశాలు వచ్చే వరకు విచారణను వాయిదా వేయాలని కోరారు. శైలజపై ఎల్ఓసీ జారీ చేయలేదని కేంద్ర ప్రభుత్వ న్యాయవాది అనురాగ్ చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తీర్పు వెల్లడిస్తానని పేర్కొన్నారు. కాగా, లుక్ అవుట్ సర్క్యులరే జారీ చేయనప్పుడు పిటిషన్ ఎందుకు వేయాల్సి వచ్చిందన్నది చర్చనీయాంశం అయ్యింది.

తెలంగాణ

సీబీఐ కోర్టులో భాస్కర్‌రెడ్డి బెయిల్ పిటిషన్

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అరెస్టయిన వైఎస్ భాస్కర్‌రెడ్డి బెయిల్ కోరుతూ సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్నానని.. దాదాపు నెలన్నర రోజులుగా జైలులో ఉంటున్నానని, కస్టడీ విచారణ కూడా ముగిసిందని భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని బెయిల్ ఇవ్వాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. వివేకా హత్య కేసులో ఏప్రిల్ 16న భాస్కర్‌రెడ్డిని అరెస్టు చేసిన సీబీఐ.. ఏప్రిల్ 19 నుంచి 24 వరకు కస్టడీలోకి తీసుకుని విచారణ జరిపింది. ఏప్రిల్ 24 నుంచి చంచల్‌గూడ జైలులో ఉంటున్న భాస్కర్‌రెడ్డి గత వారం అస్వస్థతకు గురవ్వగా.. ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స అందించారు. అక్కడ పరీక్షలు చేసిన వైద్యులు ఆయనకు హృదయ సంబంధ సమస్యలున్నట్లు గుర్తించారు. దీంతో నిమ్స్‌కు తరలించి.. పలు పరీక్షలు చేశారు. అనంతరం మళ్లీ జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో బెయిల్ కోరుతూ ఆయన పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై నేడు సీబీఐ ప్రత్యేక కోర్టు విచారణ చేపట్టనుంది.

'పబ్లిక్ ఆర్డర్'కు విఘాతం కలిగిస్తేనే పీడీ యాక్టు

సాధారణ నేరాలకు పీడీ ప్రయోగం సరికాదు

- హైకోర్టు ధర్మాసనం తీర్పు
- యువకుడి నిర్బంధ ఉత్తర్వులు రద్దు
- తక్షణం విడుదల చేయాలని ఆదేశం



సాక్షి, అమరావతి: ఓ వ్యక్తి 'పబ్లిక్ ఆర్డర్'కు విఘాతం కలిగిస్తున్నప్పుడే అతనిపై ఏపీ ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ) చట్టాన్ని ప్రయోగించాలని హైకోర్టు స్పష్టం చేసింది. సాధారణ చట్టాల పరిధిలోకి వచ్చే నేరాలకు పీడీ యాక్ట్‌ను వర్తింపజేయడాన్ని తప్పుపట్టింది. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ చట్టం పరిధిలోకి వచ్చే నేరాలకు పీడీ యాక్ట్ ప్రయోగించడం సరికాదని హైకోర్టు ధర్మాసనం ఇప్పటికే తీర్పునిచ్చిన విషయాన్ని గుర్తు చేసింది. ఎక్సైజ్ నేరం చేసిన వ్యక్తి నిర్బంధానికి ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది. మరే ఇతర కేసులో ఆ వ్యక్తి అవసరం లేకుంటే తక్షణమే విడుదల చేయాలని అధికారులను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు, జస్టిస్ బీవీఎల్ఎస్ చక్రవర్తి ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది. బాలిన సురేష్‌ను పీడీ చట్టం కింద నిర్బంధించడాన్ని సవాలు చేస్తూ తూర్పు గోదావరి జిల్లా జగన్నాథపురం గ్రామానికి చెందిన అతని తండ్రి సత్యనారాయణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ సోమయాజులు ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున తెన్నేటి బాబూజీ, ప్రభుత్వం తరఫున ప్రభుత్వ న్యాయవాది ఖాదర్ మస్తాన్ వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, పీడీ యాక్ట్ ప్రయోగించాల్సినంత అంశాలేవీ ఈ కేసులో లేవని తెలిపింది. పిటిషనర్‌పై జారీ చేసిన నిర్బంధ ఉత్తర్వుల్లో లోపాలున్నాయంది. అందువల్ల వాటిని రద్దు చేస్తున్నట్లు తెలిపింది.

2025 జూన్‌కు పోలవరం పూర్తి

▶ మొదటి పేజీ తరువాయి

ఈ సమావేశంలో పాల్గొన్నారు. తొలుత ప్రాజెక్టు పనుల పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కేంద్ర మంత్రి షెకావత్‌కు ఈఎన్‌సీ నారాయణరెడ్డి వివరించారు. స్పిల్ వే, స్పిల్ చానల్, కాఫర్ డ్యామ్‌లు పూర్తి చేసి 2021 జూన్ 11న గోదావరి ప్రవాహాన్ని స్పిల్ వే మీదుగా మళ్లించామని చెప్పారు. ప్రధాన డ్యామ్ ప్రాంతంలో కోతకు గురైన ప్రాంతాన్ని ఇసుకతో పూడ్చి, వైబ్రో కాంపాక్షన్ ద్వారా యథాస్థితికి తెస్తున్నామన్నారు. మళ్లీ వరదలు వచ్చేలోగా ఈ పనులు పూర్తవుతాయని, ఆ తర్వాత ప్రధాన డ్యామ్ గ్యాప్-2లో డయాఫ్రమ్ వాల్‌లో దెబ్బతిన్న చోట్ల సమాంతరంగా కొత్తగా డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించి.. పాత దానితో అనుసంధానం చేస్తామన్నారు. ఈలోగా గ్యాప్-1లో ప్రధాన డ్యామ్ పనులు చేపడతామన్నారు. గ్యాప్-2లో డయాఫ్రమ్ వాల్ పూర్తి చేశాక ప్రధాన డ్యామ్ పనులు చేపట్టి గడువులోగా పూర్తి చేస్తామని చెప్పారు. ఆలోగా డిస్ట్రిబ్యూటరీలను పూర్తి చేస్తామన్నారు. డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్న చోట్ల కొత్తగా నిర్మించే వాల్ డిజైన్‌ను తక్షణమే ఖరారు చేయాలని సీడబ్ల్యూసీని కేంద్ర మంత్రి ఆదేశించారు. ప్రధాన డ్యామ్ ప్రాంతంలో రోజుకు 50 వేల క్యూబిక్ మీటర్ల స్థానంలో లక్ష క్యూబిక్ మీటర్ల మేర ఇసుకను పూడ్చి, వైబ్రోకాంపాక్షన్ చేసేలా పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు.

దశల వారీగా నీటి నిల్వ

ప్రాజెక్టులో మూడు దశల్లో గరిష్ట స్థాయిలో నీటిని నిల్వ చేస్తామని ఈఎన్‌సీ చెప్పారు. తొలి ఏడాది 41.15 మీటర్ల స్థాయిలో నిల్వ చేస్తామన్నారు. ఈ స్థాయిలో తొలుత 123 గ్రామాలు ముంపునకు గురవుతాయని తేలిందని.. ఆ గ్రామాల్లోని 20,946 కుటుంబాల్లో ఇప్పటికే 12,060 కుటుంబాలకు పునరావాసం కల్పించామని వివరించారు. గతేడాది నిర్వహించిన లైడార్ సర్వేలో మరో 36 గ్రామాలు 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోకి వస్తాయని తేలిందని.. ఆ గ్రామాల్లోని 16,642 కుటుంబాలకు పునరావాసం కల్పించాల్సి ఉందన్నారు. ఈ గ్రామాలు 45.72 మీటర్ల పరిధిలోకే వస్తాయని వివరించారు. ప్రాజెక్టు పూర్తయ్యాక రెండో, మూడో ఏడాది 45.72 మీటర్ల పరిధిలోని మొత్తం 1,00,006 కుటుంబాలకు పునరావాసం కల్పించి.. గరిష్ట స్థాయిలో నీటిని నిల్వ చేస్తామన్నారు. దీనిపై కేంద్ర మంత్రి షెకావత్ స్పందిస్తూ.. ముంపు గ్రామాల నిర్వాసితులకు పునరావాసం కల్పించాల్సిన బాధ్యత కేంద్రానిదేనని, ఆ మేరకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

తొలి దశ పూర్తికి రూ.17,144 కోట్లు

ప్రాజెక్టును 45.72 మీటర్ల వరకు పూర్తి చేసి, తొలి దశలో 41.15 మీటర్ల వరకు నీటిని నిల్వ చేసి.. ఆయకట్టుకు నీరిచ్చేలా పనులు పూర్తి చేయాలంటే రూ.17,144 కోట్లు అవసరమని జలవనరుల శాఖ కార్యదర్శి శ్యామలరావు, ఈఎన్‌సీ నారాయణరెడ్డి వివరించారు. సమగ్రంగా 45.72 మీటర్ల స్థాయికి పూర్తి చేయడానికి 2017-18 ధరల ప్రకారం రూ.55,548.87 కోట్లు వ్యయం అవుతుందని సీడబ్ల్యూసీ తేల్చిందని, ఆ మేరకు నిధులివ్వాలని కోరారు. దీనిపై కేంద్ర మంత్రి షెకావత్ స్పందిస్తూ.. తొలి దశ పూర్తికి రాష్ట్ర అధికారులు పంపిన ప్రతిపాదనను పరిశీలించి, నిధులు ఎంత అవసరమో నివేదిక ఇవ్వాలని పీపీఏ, సీడబ్ల్యూసీ అధికారులను ఆదేశించారు. ఆ నివేదికను కేంద్ర మంత్రి మండలి ఆమోదం తీసుకోవడం ద్వారా పోలవరానికి నిధుల సమస్య లేకుండా చేస్తామని, తద్వారా షెడ్యూలులోగా ప్రాజెక్టును పూర్తి చేయడానికి సహకరిస్తామని చెప్పారు. బ్యాక్ వాటర్ ప్రభావం వల్ల ముంపు సమస్యపై సంయుక్త అధ్యయనానికి ఒడిశా సహాయ నిరాకరణ చేయడంపై తాము చర్చిస్తామని మంత్రి షెకావత్ చెప్పారు.

అనుమతి లేని ప్రాజెక్టులపై గోదావరి బోర్డులో చర్చ

పట్టిసీమ, పురుషోత్తపట్నం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టులు అనుమతి లేకుండా చేపట్టారని, వాటి డీపీఆర్‌లు పంపి, ఆమోదం తీసుకోవాలని రాష్ట్ర అధికారులను కేంద్ర మంత్రి ఆదేశించారు. దీనిపై రాష్ట్ర అధికారులు స్పందిస్తూ... తెలంగాణ కూడా అనుమతి లేకుండా కాళేశ్వరం, తుపాకులగూడెం, సీతమ్మసాగర్ తదితర ప్రాజెక్టులను చేపట్టిందని, ఈ విషయాన్ని గోదావరి బోర్డు, కేంద్రం దృష్టికి తీసుకొచ్చామని గుర్తు చేశారు. పట్టిసీమ, పురుషోత్తపట్నం తాత్కాలికమైనవేనని, పోలవరం పూర్తయితే ఆ రెండు ఎత్తిపోతలను మూసేస్తామని చెప్పారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకాన్ని ఉమ్మడి రాష్ట్రంలోనే చేపట్టామన్నారు. అప్పట్లోనే భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని పోలవరం కుడి, ఎడమ కాలువల సామర్థ్యాన్ని పెంచామని వివరించారు. దాంతో.. అనుమతి లేని ప్రాజెక్టులపై అపెక్స్ కౌన్సిల్‌లో చర్చిస్తామని కేంద్ర మంత్రి షెకావత్ స్పష్టం చేశారు.

అర్చకుడిపై టీడీపీ నాయకుల దాడి

- గుడి స్థలం కబ్జాకు ఎమ్మెల్యే పయ్యావుల అనుచరుల యత్నం
- అడ్డుకునేందుకు ప్రయత్నించిన అర్చకుడు
- టీడీపీ నాయకుల దాడిలో అర్చకుడికి గాయాలు
- కేసు నమోదు చేసిన పోలీసులు

ఉరవకొండ/ఉరవకొండ రూరల్: అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం లత్తవరంలో ఓ అర్చకుడిపై టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అనుచరులు దాడి చేశారు. గాయపడిన అర్చకుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు... లత్తవరం గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయానికి చెందిన 4 సెంట్ల ఖాళీ స్థలాన్ని కబ్జా చేసేందుకు ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ప్రధాన అనుచరుడు, టీడీపీ నేత బోదపాటి గోవిందు పథకం రచించాడు. ఈ మేరకు గోవిందు బుధవారం గ్రామ టీడీపీ నాయకులతో కలిసి ఆలయానికి చెందిన ఖాళీ స్థలాన్ని ఆక్రమించుకుని షెడ్డు వేసేందుకు ప్రయత్నించాడు. ఆలయ అర్చకుడు పోతురాజుల కోటేశ్వర్ వారిని అడ్డుకున్నారు. ఆలయ భూమిలో షెడ్డు వేయకూడదని అభ్యంతరం తెలిపారు. వెంటనే ఈ విషయాన్ని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆగ్రహించిన టీడీపీ నాయకులు బోదపాటి గోవిందు, వంకలపాటి మోహన్, మహేష్, రాందాసు కలిసి అర్చకుడు కోటేశ్వర్‌పై దాడి చేశారు. గాయపడిన కోటేశ్వర్ వారి నుంచి తప్పించుకుని పారిపోయి బుధవారం రాత్రి బంధువుల ఇంట్లో తలదాచుకున్నాడు. గురువారం బంధువులు, ఆలయ కమిటీ సభ్యుల సహకారంతో ఎస్ఐ వెంకటస్వామికి ఫిర్యాదు చేశారు. నిందితులపై ఐపీసీ సెక్షన్ 341, 323, 506, 34 కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

'యూజీసీ పీఆర్‌సీ అరియర్స్ మంజూరు చేయండి'

సాక్షి, అమరావతి: యూజీసీ పీఆర్‌సీ-2016 అరియర్స్‌ను మెడికల్ ఎడ్యుకేషన్ వైద్యులకు మంజూరు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)డాక్టర్ జవహర్ రెడ్డిని ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం (ఏపీజీడీఏ) కన్వీనర్ డాక్టర్ జయధీర్ కోరారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సచివాలయంలో సీఎస్ జవహర్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. ఇందులో ఏపీజీడీఏ తరఫున తాను పాల్గొని తమ వినతులను సీఎస్‌కు తెలియజేసినట్టు జయధీర్ చెప్పారు. ప్రభుత్వం 2021లో అమలు చేసిన పీఆర్‌సీలో ఉన్నత విద్యాశాఖ యూజీసీని వర్తింపజేశారన్నారు. అదే తరహాలో తమకు వర్తింపజేసి అరియర్స్‌ను మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943